

ఈనాడు




కరీంనగర్ 17-2-2018 శనివారం సిటీ సంపుటి 44 సంచిక 188

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 5-00. పేజీలు 18+16 www.eenadu.net

Karimnagar, Visakhapatnam, Hyderabad, Vijayawada, Tirupati, Ananthapuramu, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi




ప్రతి ముఖంలో సంతోషం
ప్రతి ఇంటికి సంక్షేమం
తెలంగాణ ముఖ్యమంత్రి వర్యులు
శ్రీ కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు గారికి
జన్మదిన శుభాకాంక్షలు
K.P. VIVEKANAND, B.E, Quthbullapur MLA



జన్మదిన శుభాకాంక్షలు
తెలంగాణ రాష్ట్ర ప్రదాత..
బంగారు తెలంగాణ నిర్మాత..
జన హృదయ నేత..
తెలంగాణ జాతిపిత..
మన ప్రియతమ ముఖ్యమంత్రి
శ్రీ కల్వకుంట్ల
చంద్రశేఖర్ రావు గారికి
జన్మదిన శుభాకాంక్షలు
కొలను శ్రీనివాస రెడ్డి
TRS సీనియర్ నాయకులు
నిజాంపేట, కుత్బుల్లాపూర్ నియోజకవర్గం


జననేతకు జన్మదిన శుభాకాంక్షలు
శ్రీ కె.పి. వివేకానంద
MLA, కుత్బుల్లాపూర్
శ్రీ శంబిపూర్ రాజు
MLC, రంగారెడ్డి జిల్లా
తెలంగాణ రాష్ట్ర జాతిపిత,
బంగారు తెలంగాణ నిర్మాణంలో
అహర్నిశలు కృషిచేస్తున్న మన ప్రియతమ ముఖ్యమంత్రి
గౌ॥ శ్రీ కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు గారికి
మా హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు
DRK
INSTITUTE OF SCIENCE & TECHNOLOGY
COLLEGE OF ENGINEERING & TECHNOLOGY
Bowrampet (V), Hyderabad.


జన్మదినోత్సవ
శుభాకాంక్షలు
మీ జననం తెలంగాణ ప్రజల ఆత్మ గౌరవం
మీ జననం తెలంగాణ ప్రజల స్వాభిమానం
మీ జననం తెలంగాణ ప్రజల సంబురం
అపరభగీరథుడు, బంగారు తెలంగాణ
స్ఫూర్తిదాత, తెలంగాణా కోసం
అహర్నిశలు శ్రమిస్తున్న నిత్య శ్రామికుడు,
తెలంగాణ ముద్దుబిడ్డ,
తెలంగాణ తొలి ముఖ్యమంత్రివర్యులు
గౌ॥ శ్రీ కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు గారికి
జన్మదిన శుభాకాంక్షలు
futuristic
Edu Initiatives
A new drive
FUTURISTIC EDUCATIONAL SOCIETY, HYDERABAD

ఈనాడు
THE LARGEST CIRCULATED TELUGU DAILY
కరీంనగర్ 17-2-2018 శనివారం సిటీ సంపుటి 44 సంచిక 188
రూ. 5-00. పేజీలు 18+16 www.eenadu.net
Karimnagar, Visakhapatnam, Hyderabad, Vijayawada, Tirupati, Ananthapuramu, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi

అంతర్రాష్ట్ర నదులు అందరివీ





తమిళనాడులోని మెట్టూరు వద్ద కావేరి

అవి జాతీయ సంపద

- నదీ జలాలపై ఏ రాష్ట్రానికీ ప్రత్యేక హక్కులేదు
- కేటాయింపుల్లో తాగునీటి అవసరాలకే అత్యధిక ప్రాధాన్యం
- కావేరి జల వివాదంలో సుప్రీంకోర్టు కీలక తీర్పు
- కర్ణాటకకు పెరిగిన నీటి వాటా
- భూగర్భ జలాల కేటాయింపు ద్వారా తమిళనాడు నష్టం భర్తీ

కావేరి కేటాయింపులు (టీఎంసీలలో)

2007లో ట్రైబ్యునల్ ప్రకారం

తమిళనాడు	కర్ణాటక	కేరళ	పుదుచ్చేరి
419	270	30	7

సుప్రీంకోర్టు తాజా తీర్పు ప్రకారం

తమిళనాడు	కర్ణాటక	కేరళ	పుదుచ్చేరి
404.25	284.75	30	7

★ మొత్తం కావేరి జలాలు 740 టీఎంసీలు

'అన్ని రాష్ట్రాల జనాభాకు అవసరమయిన తాగునీటి అవసరాలకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలి. నీటిని న్యాయబద్ధంగా పంపిణీ చేయడంలో తాగునీటి అవసరాలకు ప్రాధాన్యం ఇవ్వడం ప్రాథమిక సూత్రం.' - సుప్రీం కోర్టు

దిల్లీ

తమిళనాడు, కర్ణాటక మధ్య దశాబ్దాల పాటు అగ్గి రాజేసిన కావేరి జల వివాదంపై సుప్రీంకోర్టు శుక్రవారం కీలక తీర్పు వెలువరించింది. కర్ణాటక వాటాను 14.75 టీఎంసీలు పెంచింది. తమిళనాడు వాటాను తగ్గించిన కోర్టు.. 10 టీఎంసీల భూగర్భ జలాలను ఆ రాష్ట్రం తోడుకోవడానికి అనుమతించడం ద్వారా ఆ లోటును పూరించింది. నీటి కేటాయింపుల్లో తాగునీటి అవసరాలకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని తీర్పులో స్పష్టం చేసిన ధర్మాసనం.. నదీ జలాల పంపిణీకి సంబంధించి పలు కీలక వ్యాఖ్యలు చేసింది. నది అనేది జాతీయ సంపద అని, ఏ రాష్ట్రమూ నదిపై ప్రత్యేక యాజమాన్యహక్కును ప్రకటించుకోవడానికి వీల్లేదని స్పష్టం చేసింది. తాగునీటి అవసరాలకు ప్రాధాన్యం ఇవ్వాలన్న సూత్రాన్ని, బెంగళూరు అంతర్జాతీయ స్థాయి నగరంగా అవతరించిందన్న అంశాన్ని పరిగణనలోకి తీసుకుంటూ కర్ణాటకకు వాటా పెంచడాన్ని ప్రధాన న్యాయమూర్తులు జస్టిస్ దీపక్ మిశ్ర, న్యాయమూర్తులు జస్టిస్ అమితవ రాయ్, జస్టిస్ ఎ.ఎం.ఖాన్‌విల్కర్‌తో కూడిన ధర్మాసనం సమర్థించింది. కావేరి జలాలపై తాము ఇచ్చిన తీర్పు మరో 15 ఏళ్ల పాటు అమల్లో ఉంటుందని చెప్పింది. 2007లో కావేరి జల వివాద ట్రైబ్యునల్ చేసిన కేటాయింపుల్లో కర్ణాటక, తమిళనాడు వాటాలను సవరించిన సుప్రీంకోర్టు.. కేరళ, పుదుచ్చేరి వాటాలను మాత్రం మార్చలేదు. కేరళకు 30 టీఎంసీలు, పుదుచ్చేరికి 7 టీఎంసీల (మిగతా 2లో)



చీఫ్ జస్టిస్ దీపక్ మిశ్ర



జస్టిస్ ఖాన్‌విల్కర్



జస్టిస్ అమితవరాయ్

ఇక కృష్ణమ్మే తదుపరి!

- గతంలోనే చెప్పిన అత్యున్నత న్యాయస్థానం
- కావేరి ట్రైబ్యునల్ తీర్పులో 'సుప్రీం' మార్పులు
- భవితపై తెలుగు రాష్ట్రాల్లో ఆశలు

ఈనాడు, హైదరాబాద్: కావేరి జల వివాదంపై సుప్రీం కోర్టు తుది తీర్పు ఇవ్వడంతో ఇక కృష్ణా జల వివాదంలో కదలిక వచ్చే అవకాశం ఉంది. కావేరి తీర్పు ముగిసిన వెంటనే కృష్ణాపై దృష్టి పెడతామని గతంలోనే సుప్రీంకోర్టు వెల్లడించింది. పెండింగ్‌లో ఉన్న స్పెషల్ లీవు పిటిషన్లను విచారించడం ఒక ఎత్తైతే, ప్రస్తుతం కావేరి తీర్పు ప్రభావం కృష్ణాపై ఉండే అవకాశం ఉందని నీటి పారుదల రంగ నిపుణులు అంచనా వేస్తున్నారు. రాష్ట్రాల వాదనలు విన్న తర్వాత ట్రైబ్యునల్ ఇచ్చే తీర్పు సుప్రీం తీర్పుతో సమానంగా భావిస్తారు. ట్రైబ్యునల్‌కు సుప్రీంకోర్టు న్యాయమూర్తే ఛైర్మన్‌గా వ్యవహరిస్తారు. అయితే కావేరి ట్రైబ్యునల్ తీర్పులో సుప్రీంకోర్టు కొన్ని మార్పులు చేసి.. ట్రైబ్యునల్ తీర్పే తుది కాదనే సంకేతాలిచ్చింది. ఈ పరిణామాలతో భవిష్యత్తులో తమకు కూడా లాభం చేకూరే అవకాశముందని తెలుగు రాష్ట్రాలు భావిస్తున్నాయి. గతంలో ఎప్పుడూ ట్రైబ్యునల్ తీర్పును సుప్రీంకోర్టు మార్చలేదు. మొదటిసారిగా కావేరిలో తమిళనాడుకు ట్రైబ్యునల్ కేటాయింపులో 14.75 టీఎంసీలు సుప్రీంకోర్టు తగ్గించింది. బెంగళూరు తాగునీటికి 4.75, మరో 10 టీఎంసీలు కర్ణాటకలోని కరవు జిల్లాలకు కేటాయించింది. ఈ ప్రభావం కృష్ణాజలాలకు సంబంధించిన కేసుల్లోనూ, లేదా భవిష్యత్తులో ట్రైబ్యునళ్లు ఇచ్చే తీర్పుపై ఉండవచ్చని నిపుణులు భావిస్తున్నారు. అంతర్ రాష్ట్ర జలవివాద చట్టం (మిగతా 2లో)

దేశంలోని పిల్లలంతా... రాజకీయ నాయకులే!



'మన దేశంలోని పిల్లలంతా.. పుట్టుకతోనే రాజకీయ నాయకుల వంటివారు. తమకు కావాల్సిందేమిటి, దాన్ని సాధించుకోవటమెలాగన్న విద్య వాళ్లకు బాగా తెలుసు!

'మీకు పరీక్షలు ఎప్పుడో ఏడాదికి ఒకసారి వస్తాయి. మాకు అలా కాదు. 24 గంటలూ పరీక్షలే. దేశంలో ఎక్కడో మారుమూల ఉన్న ఒక మున్సిపాలిటీ ఎన్నికల్లో ఓడిపోతే 'మోదీకి ఎదురు దెబ్బ' అంటూ మీడియా మొత్తం బ్రేకింగ్ న్యూసులు వేసేస్తుంటుంది.

'మీరు ఫలితాల గురించి భయపడటం మానేసి.. శక్తి వంచన లేకుండా చదువుకుంటూ ఉండండి. దృష్టి మొత్తం నేర్చుకోవటం మీదే పెట్టండి.. మీలోని అంతశ్శక్తులకు వీలైనంత ఎక్కువగా పదును పెట్టుకోండి. చదువుకోవటమనేదాన్ని ఒక ధర్మంగా పాటించండి. ఈ లక్ష్యంతో ముందుకు సాగుతుంటే.. మార్కులు, ఫలితాల వంటివన్నీ ఆ దారిలో అవే వస్తాయి... నేను రాజకీయాల్లో ఇదే సిద్ధాంతాన్ని ఆచరిస్తా!

దేశవ్యాప్తంగా పరీక్షల కోసం సన్నద్ధమవుతున్న బాలబాలికల్లో ఒత్తిడిని పారదోలి.. ఉత్తేజాన్ని నింపేందుకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఇచ్చిన స్ఫూర్తిమంతమైన సూచనలవి! శుక్రవారం దిల్లీలోని తాల్కటోరా స్టేడియంలో విద్యార్థులతో ఆయన 'పరీక్షా పర్ చర్చా' కార్యక్రమంలో ముచ్చటించారు. వివిధ టీవీ ఛానెళ్లు, మొబైల్ యాప్, మైగావ్ వెబ్‌సైట్‌ల ద్వారా దేశవ్యాప్తంగా ఉన్న వేలాది మంది విద్యార్థులతో ఆయన ముఖాముఖీ మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థులు అడిగిన రకరకాల ప్రశ్నలకు గంటన్నర పాటు ఆయన విపులంగా జవాబులిచ్చారు. సమగ్ర వివరాలు.. 10లో

పురుషోత్తమ్ రెడ్డి లొంగుబాటు

- ఫలించని ముందస్తు బెయిలు యత్నం
- నాటకీయ పరిణామాల నడుమ ఏసీబీ ప్రత్యేక కోర్టులో ప్రత్యక్షం
- ఆదాయానికి మించి ఆస్తుల కేసులో నిందితుడు
- మార్చి 1వ తేదీ వరకూ జ్యుడిషియల్ రిమాండ్ -7లో
- బోయిన్‌పల్లి బ్యాంకు లాకర్‌లో బంగారం, వజ్రాభరణాలు



శుక్రవారం హైదరాబాద్‌లో సిటీ సివిల్ కోర్టు ప్రాంగణంలోని అనిశా న్యాయస్థానంలో లొంగిపోయిన పురుషోత్తంరెడ్డి




శుక్రవారం హైదరాబాద్‌లోని రాజ్‌భవన్‌లో గవర్నర్ నరసింహన్‌తో ముఖ్యమంత్రి కేసీఆర్ భేటీ

కేంద్ర బడ్జెట్‌తో నిరాశే

- ఒక్క అంశంలోనూ సానుకూలత లేదు
- గవర్నర్‌తో సీఎం కేసీఆర్ ఆవేదన
- అభివృద్ధి పనులు చేపడుతున్నా ప్రోత్సాహం లేదని వ్యాఖ్య 2లో

తప్పు ప్రభుత్వాలది.. శిక్ష ప్రజలకా!



- విభజన హామీలపై కేంద్రం, రాష్ట్ర వాదనలు పరస్పర విరుద్ధం
- పార్లమెంటు సాక్షిగా చట్టాలను విస్మరిస్తే దేశ సమగ్రతకే భంగం
- దేశం ఉత్తర.. దక్షిణ ప్రాంతాలుగా విడిపోతుంది
- వాస్తవాలు ప్రజలకు చెప్పేందుకే జేఎఫ్‌సీ
- కమిటీ తొలి రోజు సమావేశంలో జనసేన అధినేత పవన్‌కల్యాణ్

-7లో

ఆయువు తీసిన విషవాయువు

- కోళ్లఫారం వ్యర్థాల ట్యాంకులో ఘోర ప్రమాదం

ఈనాడు డిజిటల్ - చిత్తూరు





ప్రమాదానికి కారణమైన వ్యర్థాల ట్యాంకు ● పోస్టుమార్టం గదిలో కార్మికుల మృతదేహాలు

కోళ్ల పరిశ్రమకు చెందిన వ్యర్థాల ట్యాంకులో దిగి ఏడుగురు అభాగ్యులు మరణించారు. చిత్తూరు జిల్లా పలమనేరు మండలం మొరం గ్రామంలోని వెంకటేశ్వర హేచరీస్‌లో శుక్రవారం ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. సాధారణంగా ఆరు నెలలకోసారి ఈ ట్యాంకులోని వ్యర్థాలను మోటారు సాయంతో పంపింగ్ చేసి శుభ్రం చేస్తారు. శుక్రవారం ట్యాంకును శుభ్రపరిచేందుకు పనులు ప్రారంభించగా.. ట్యాంకులోని మోటారు పనిచేయలేదు. చెత్త ఇరుక్కుని ఉండొచ్చనే భావనతో ముందుగా మ్యాన్‌హోల్ నుంచి కార్మికుడు కేశవ దిగారు. ఎంతసేపటికీ బయటకు రాకపోవడంతో మరొకరు దిగారు. ఇలా ఒకరి తర్వాత ఒకరు మొత్తం ఎనిమిది మంది లోపలికి వెళ్లారు. సమాచారం అందుకున్న తోటి ఉద్యోగులు వెంటనే జేసీబీ సాయంతో ట్యాంకు పైకప్పు పెకిలించారు. స్పృహ తప్పి పడిపోయిన వారిని బయటకు తీశారు. వారిలో ఆరుగురు అప్పటికే మృతి చెందారు. ఇద్దరిని పలమనేరు ప్రభుత్వాసుపత్రికి తరలించేలోగా ఒకరు మరణించారు. మరొకరిని వేలూరు సీఎంసీకి తరలించారు.

పరిస్థితిని అంచనా వేయకుండానే..

సాధారణంగా కోళ్ల పరిశ్రమల్లో వ్యర్థాలు బయటకు పంపేందుకు దూరంగా గుంత తవ్వి అందులోకి వదులుతారు. అదంతా భూమిలోకి ఇంకిపోవడంతో పాటు ఆవిరవుతుంది. అప్పుడప్పుడు పూర్తిగా ఆరబెట్టి వ్యర్థాలను విషరహితంగా మారుస్తారు. ఇదే పద్ధతిలో వెంకటేశ్వర హేచరీస్‌లో సెప్టిక్ ట్యాంకులను ఏర్పాటుచేశారు. ట్యాంకు లోపలి పంపును పరిశీలించేందుకు, పరిస్థితిని అంచనా వేయకుండా ఒకరి వెంట ఒకరు దిగిన ఎనిమిది మందిలో ఏడుగురిని నెల తరబడి పోగయిన విషవాయువు పొట్టనబెట్టుకుంది. దుర్గంధం భరించలేక గుంతలోకి దిగకుండా ఆగిన కార్మికుడు మహేశ్ ఘటనకు ప్రత్యక్షసాక్షిగా మిగిలారు.

రూ.25లక్షల చొప్పున పరిహారం

సంఘటన స్థలాన్ని చిత్తూరు జిల్లా కలెక్టర్ పీఎస్ ప్రద్యుమ్న, ఎస్పీ రాజశేఖర్‌బాబు పరిశీలించారు. మృతుల కుటుంబసభ్యులను ఓదార్చారు. రాష్ట్ర ప్రభుత్వ సూచనల మేరకు కలెక్టర్ ప్రద్యుమ్న మృతుల కుటుంబాలకు చంద్రన్న బీమా కింద రూ. 5లక్షలు, ప్రత్యేక కేసుగా పరిగణించి మరో రూ. 5లక్షలు, పరిశ్రమ యాజమాన్యం తరఫున రూ.15 లక్షల చొప్పున ఒక్కో కుటుంబానికి రూ.25 లక్షల పరిహారం ప్రకటించారు. రాష్ట్ర కోళ్ల పరిశ్రమల సమాఖ్య ప్రతినిధులు యాజమాన్యంతో చర్చించి నష్టపరిహారం అందించడంలో తగిన పాత్ర పోషించారు. రాష్ట్ర పరిశ్రమల మంత్రి అమర్‌నాథరెడ్డి ఫోన్ ద్వారా సమాచారం అందుకుని ప్రగాఢ సానుభూతి ప్రకటించారు. ప్రమాదానికి కారణాలను పరిశీలించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన వీడియోకాల్ ద్వారా విలేకరులకు తెలిపారు. మృతదేహాలను స్వస్థలాలకు తరలించారు. పోస్టుమార్టం నిర్వహించిన పలమనేరు ఆస్పత్రి వద్ద మృతుల బంధువుల రోదనలు మిన్నంటాయి. మృతులంతా పేదలు కావడం, బతుకుదెరువు కోసం కూలి చేసుకుంటూ అకాలమరణం చెందడంతో పెద్దదిక్కును కోల్పోయిన కుటుంబీకుల వేదన వర్ణనాతీతంగా ఉంది. అంత్యక్రియలకు రూ.పది వేల చొప్పున తాత్కాలిక సాయాన్ని అధికారులు అందించారు. 304(ఏ)సెక్షన్ కింద యాజమాన్యంపై పోలీసులు కేసు నమోదు చేశారు.

మృతుల వివరాలు

1. రమేష్(30), మొరం గ్రామం, పలమనేరు
2. వెంకటరాజులు(24), అరిగులవారిపల్లె, చంద్రగిరి
3. గోవిందస్వామి(45), ఎగువ కుర్మాయి, పలమనేరు
4. కేశవ(20), ఆయ్యరెడ్డిపల్లె, పలమనేరు
5. రామచంద్రయ్య(23), కొలమాసనపల్లె, పలమనేరు
6. రెడ్డప్ప(40), మొరం, పలమనేరు
7. బాబు(45), తిమ్మయ్యపల్లె, ముల్‌బాగల్, కర్ణాటక

■ అనంతపురం జిల్లా కదిరికి చెందిన శివకుమార్‌రెడ్డి(46) ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

సీడబ్ల్యూసీని రద్దు చేసిన రాహుల్

దిల్లీ: కాంగ్రెస్ పార్టీ అత్యున్నత నిర్ణయక విభాగం 'కేంద్ర కార్యనిర్వాహక సంఘం (సీడబ్ల్యూసీ)'ను ఆ పార్టీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ రద్దు చేశారు. దీని స్థానంలో 34 మందితో 'స్టీరింగ్ కమిటీ'ని ఏర్పాటుచేసి, త్వరలో నిర్వహించే ప్లీనరీ బాధ్యతలను దీనికి అప్పగించారు. ఈ విషయాన్ని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి జనార్దన్ ద్వివేది శుక్రవారం రాత్రి ఒక ప్రకటనలో వెల్లడించారు. సీడబ్ల్యూసీ సభ్యులందర్నీ రాహుల్‌గాంధీ కొత్త కమిటీలో భాగస్వాములను చేశారు. అదే సమయంలో- అమరీందర్ సింగ్, ఆర్కే దావన్, శివరాజ్ దేశ్‌ముఖ్ వంటి శాశ్వత, ప్రత్యేక ఆహ్వానితులను తొలగించారు. అయితే... ఈ కమిటీలో తెలుగు రాష్ట్రాలకు చెందిన ఒక్క నాయకుడికి కూడా చోటు కల్పించలేదు!

త్వరలో ప్లీనరీ..: స్టీరింగ్ కమిటీ శనివారం సమావేశమై, ప్లీనరీని ఎప్పుడు నిర్వహించాలన్నది నిర్ణయిస్తుంది. మార్చి 5న బడ్జెట్ తదుపరి సమావేశాలు ఉన్నందున... అంతకుముందే ప్లీనరీ జరిగే వీలుంది. ఈ కీలక సమావేశం పూర్తయ్యేవరకూ స్టీరింగ్ కమిటీ ఉంటుంది. ప్లీనరీలోగానీ, ఆ తర్వాతగానీ కొత్త సీడబ్ల్యూసీ ఏర్పాటవుతుంది.

ఇదీ స్టీరింగ్ కమిటీ...: ఈ కమిటీలో పార్టీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ; కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియాగాంధీ; మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్‌లు ఉంటారు. వీరితోపాటు- ఏకే ఆంటోనీ, అహ్మద్ పటేల్, గులామ్ నబీ ఆజాద్, అంబికా సోని, జనార్దన్ ద్వివేది, అశోక్ గహ్లోత్, సుశీల్‌కుమార్ షిండే, చిదంబరం, ఆస్కార్ ఫెర్నాండెజ్, దిగ్విజయ్‌సింగ్, కమల్‌నాథ్, మల్లికార్జున్ ఖర్గే, మోతీలాల్ వోరా, ఆర్కీ కుంతియా, కేసీ వేణుగోపాల్ తదితరులు కమిటీలో భాగస్వాములయ్యారు.

సీఐఎస్ఎఫ్ ఐజీగా సీవీ ఆనంద్

- డిప్యుటేషన్‌పై నియమిస్తూ కేంద్రం ఉత్తర్వులు



ఈనాడు, హైదరాబాద్: కేంద్ర పారిశ్రామిక భద్రత దళం(సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్-సీఐఎస్ఎఫ్) ఇన్‌స్పెక్టర్ జనరల్‌గా సీవీ ఆనంద్‌ను నియమిస్తూ కేంద్ర హోం మంత్రిత్వశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. తెలంగాణ పౌర సరఫరాల శాఖ కమిషనర్‌గా పనిచేస్తున్న ఆయన..1991 బ్యాచ్ ఐపీఎస్ అధికారి. కేంద్రం ఆయనను డిప్యుటేషన్‌పై సీఐఎస్ఎఫ్‌కు ఎంపిక చేసింది. బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి ఐదు సంవత్సరాలపాటు ఆయన డిప్యుటేషన్‌పై విధులు నిర్వహించనున్నారు.

సంస్కరణలతో తనదైన ముద్ర: సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృతంగా వినియోగిస్తూ.. పౌరసరఫరాల శాఖలో అక్రమాలకు అడ్డుకట్ట వేయడం ద్వారా సీవీ ఆనంద్ తనదైన ముద్ర వేశారు. రేషన్ బియ్యం తరలింపులో అక్రమాలను నియంత్రించేందుకు గిడ్డంగుల్లో సీసీ కెమెరాలు అమర్చడంతోపాటు.. తరలింపు వాహనాలను జీపీఎస్‌తో అనుసంధానం చేశారు. ఆయా వాహనాల కదలికలను పర్యవేక్షించేందుకు హైదరాబాద్‌లోని ప్రధాన కార్యాలయంలో కమాండ్ కంట్రోల్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ధాన్యం కొనుగోళ్ల చెల్లింపుల్లో అక్రమాలకు అవకాశం లేకుండా ఆన్‌లైన్ చెల్లింపుల వ్యవస్థను ఏర్పాటుచేశారు..అధిక శాతం రైతులకు 72 గంటల్లోగా ఆన్‌లైన్‌లో చెల్లింపులు చేస్తున్నారు. కస్టం మిల్లింగ్ విధానం కింద ప్రభుత్వం ఇచ్చే ధాన్యాన్ని సొంత అవసరాలకు వినియోగించుకున్న మిల్లర్ల ముక్కు పిండి వాటిల్లో అధిక శాతాన్ని రాబట్టగలిగారు. ఇలాంటి వివిధ రకాల సంస్కరణలు చేపట్టటం ద్వారా 17 నెలల వ్యవధిలో రాష్ట్ర ప్రభుత్వానికి రూ. 1,800 కోట్లను ఆదా చేయగలిగారు.

అంతర్రాష్ట్ర నదులు అందరివీ

(మొదటి పేజీ తరువాయి)

కేటాయింపులను అలాగే ఉంచింది. తాజా తీర్పు అమలయ్యేలా పథకాన్ని రూపొందించేందుకు కేంద్రానికి ధర్మాసనం 6 వారాల గడువు మంజూరు చేసింది. ఈ గడువును ఏ కారణంతోనూ పొడిగించబోమని స్పష్టం చేసింది. కావేరి ట్రైబ్యునల్ 2007లో జరిపిన కేటాయింపులను సవాల్ చేస్తూ కర్ణాటక, తమిళనాడు, కేరళ దాఖలు చేసిన విజ్ఞప్తులపై ధర్మాసనం ఈ తీర్పు వెలువరించింది. కావేరి జల వివాద ట్రైబ్యునల్ నిర్ణయమే తుది నిర్ణయమని, ఈ నిర్ణయానికి వ్యతిరేకంగా దాఖలయిన విజ్ఞప్తులను విచారించే పరిధి సుప్రీంకోర్టుకు లేదని కేంద్రం చేసిన వాదనను తోసిపుచ్చింది. రాష్ట్రాలకు చేసిన కేటాయింపులు కాకుండా పది టీఎంసీల నీటిని పర్యావరణ పరిరక్షణకు ఉపయోగించాలని ధర్మాసనం పేర్కొంది. సముద్రంలోకి అనివార్యంగా కలిసిపోయే నీటిని 4టీఎంసీలుగా లెక్కగట్టింది.

కర్ణాటకకు అదనంగా ఇచ్చిన 14.75 టీఎంసీలలో 10 టీఎంసీలను తమిళనాడులో భూగర్భ జలాల లభ్యతను దృష్టిలో ఉంచుకుని పెంచింది. కావేరి పరివాహక ప్రాంతంలో భూగర్భ జలాల గణాంకాలు ఉజ్జాయింపు లెక్కలేనన్న ట్రైబ్యునల్ అభిప్రాయంతో సుప్రీంకోర్టు అంగీకరించలేదు. అనుభవపూర్వక పరిశీలనతో రూపొందించిన గణాంకాలను బట్టి తమిళనాడులోని కావేరి పరివాహక ప్రాంతంలో 20 టీఎంసీల భూగర్భజలాలు అందుబాటులో ఉన్నాయని స్పష్టం చేసింది. భూగర్భ జలాలను మితిమీరి తోడడం వల్ల కలిగే ముప్పును పరిగణనలోకి తీసుకుని అందులో 10 టీఎంసీలను తమిళనాడుకు కేటాయించవచ్చని పేర్కొంది. తీర్పు ఫలితంగా కర్ణాటక, తమిళనాడు సరిహద్దుల్లోని బిల్లిగుండ్లు ఆనకట్ట వద్ద నుంచి తమిళనాడుకు 177.25 టీఎంసీల నీటిని విడుదల చేయాల్సి ఉంటుంది.

వివిధ దేశాల గుండా ప్రవహించే నదీ జలాలను న్యాయబద్ధంగా పంపిణీ చేయడానికి సంబంధించి అంతర్జాతీయ నిబంధనలైన హెల్సింకీ, కాంపిఒన్‌లను ధర్మాసనం ప్రస్తావించింది.

సుప్రీంకోర్టు తీర్పులోని ముఖ్యాంశాలు

■ బెంగళూరులో మూడింట ఒకవంతు భాగం మాత్రమే కావేరి పరివాహక ప్రాంతం పరిధిలోకి వస్తుందనే కారణంతో కర్ణాటకకు గృహ, పారిశ్రామిక అవసరాల నిమిత్తం ఇవ్వాల్సిన వాటాను ట్రైబ్యునల్ గణనీయంగా తగ్గించింది. తాగునీటి అవసరాల్లో 50శాతాన్ని భూగర్భ జలాల ద్వారా తీర్చుకోవచ్చన్న కారణంతో కూడా వాటాను తగ్గించింది. తాగునీటికి సంబంధించిన ప్రాథమిక సూత్రాన్ని ట్రైబ్యునల్ విస్మరించింది. బెంగళూరు కీలక ముఖ్య నగరంగా రూపాంతరం చెందింది. అద్భుత మేధో నగరంగా ఎదిగింది. ముఖ్యంగా సమాచార సాంకేతిక రంగంలో చాలా పురోగతి సాధించింది. నగర జనాభా రోజురోజుకూ పెరుగుతోంది. అన్ని రకాల పౌర అవసరాలకు డిమాండ్ పెరుగుతోంది. కృత్రిమ సరిహద్దులు గీసి ప్రజల ప్రాథమిక అవసరమయిన తాగునీటిని నిరాకరించడాన్ని ఊహించలేం. బెంగళూరు అంతర్జాతీయ స్థాయి నగరం అన్న సంగతిని దృష్టిలో ఉంచుకుని కర్ణాటకకు అదనంగా 4.75 టీఎంసీలను కేటాయిస్తున్నాం.

■ రాజ్యాంగం అమల్లోకి రావడానికి ముందు చేసుకున్న ఒడంబడికలు, ఒప్పందాలకు సంబంధించి తలెత్తే విభేదాల్లో కోర్టులు జోక్యం చేసుకోకుండా రాజ్యాంగంలోని 363 అధికరణం కింద నిషేధం ఉన్నందున కావేరి జలాల వివాదంపై సుప్రీంకోర్టు ఆదేశాలు ఇవ్వరాదన్న వాదన చెల్లదు. ఈ కేసులోని అంశాలకు, భారత దేశ సార్వభౌమత్వం, సమగ్రత భావనకు సంబంధం లేదు. అందువల్ల ఈ కేసుకు 363 అధికరణం వర్తించదు.

■ తమిళనాడులో సాగు విస్తీర్ణానికి సంబంధించి ట్రైబ్యునల్ తుది నిర్ధారణ తప్పు అని చెప్పలేం. తమిళనాడు గృహ, పారిశ్రామిక అవసరాలకు కేటాయించిన నీటికి సంబంధించి ట్రైబ్యునల్ గణాంకాల్లో తప్పులు లేవు.



సుప్రీంకోర్టు తీర్పునకు వ్యతిరేకంగా కోయంబత్తూరులో నిరసనకు దిగిన వారిని అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

'కాళేశ్వరం'పై విచారణ వాయిదా

ఈనాడు, దిల్లీ : కాళేశ్వరం ప్రాజెక్టు అటవీ పర్యావరణ అనుమతుల గురించి జాతీయ హరిత ట్రైబ్యునల్ (ఎన్జీటీ)లో దాఖలైన పిటిషన్‌పై విచారణ మార్చి 21కి వాయిదా పడింది. జస్టిస్ రఘువేంద్ర ఎస్. రాథోడ్‌తో కూడిన ధర్మాసనం శుక్రవారం ఈ పిటిషన్‌ను విచారించింది. తెలంగాణ ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ ప్రకాశ్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ ప్రాజెక్టుకు అటవీ పర్యావరణ అనుమతులు వచ్చిన నేపథ్యంలో కేసును విచారించాల్సిన అవసరం లేదని ధర్మాసనానికి తెలిపారు. దీనిపై అభిప్రాయం చెప్పాలని పిటిషనర్ హయతుద్దీన్ తరఫు న్యాయవాదిని ధర్మాసనం ప్రశ్నించింది. కొన్ని అభ్యంతరాలు ఉన్నాయని, సీనియర్ న్యాయవాది అందుబాటులో లేరని విచారణ వాయిదా వేయాలని కోరగా అంగీకరించిన ధర్మాసనం మార్చి 21కి వాయిదా వేసింది.

ఆ నాటి ఒప్పందాలకు సర్వాధికార సిద్ధాంతం వర్తించదు

దిల్లీ: బ్రిటిష్ ప్రభుత్వ సర్వాధికార నిర్ణయం కారణంగా కావేరి జలాల పంపిణీలో తమకు సరైన న్యాయం జరగలేదన్న కర్ణాటక వాదనను సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. మైసూరు సంస్థానం, మద్రాస్ ప్రెసిడెన్సీ మధ్య 1892, 1924లో జరిగిన ఒప్పందాల్లో తమకు బేరసారాలాడే శక్తి లేకపోయిందని కర్ణాటక చేసిన వాదనతో ధర్మాసనం ఏకీభవించలేదు. ఆనాటి ఒప్పందాలకు సర్వాధికార సిద్ధాంతం వర్తించదని స్పష్టం చేసింది. ఆ ఒప్పందాలు రాజకీయ ఒప్పందాలు కావని, ప్రజా ప్రయోజనాలు దృష్టిలో ఉంచుకుని చేసుకున్నవని ధర్మాసనం తేల్చి చెప్పింది. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత బ్రిటిష్ సర్వాధికార సిద్ధాంతానికి అవకాశం లేనే లేదని తేల్చి చెప్పింది. ఆ రెండు ఒప్పందాలు తప్పని స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత, రాజ్యాంగం వచ్చిన తర్వాత, లేదంటే రాష్ట్రాల పునర్విభజన చట్టం వచ్చిన తర్వాతయినా ఎందుకు ప్రకటించలేదని ప్రశ్నించింది. 1924 నాటి ఒప్పందం గడువు 1974లో ముగిసిపోయిందని గుర్తు చేసింది. ప్రస్తుతం అంతర్రాష్ట్ర నదీ జలాల కేటాయింపులు న్యాయబద్ధ పంపిణీ సూత్రాల ద్వారా జరుగుతున్నాయని స్పష్టం చేసింది.

- 1881లో మైసూరు పాలకులు కావేరిపై ఆనకట్ట నిర్మించాలనుకున్నారు. అందుకు మద్రాస్ ప్రెసిడెన్సీ అభ్యంతరం తెలియజేసింది.
- 1892, 1924లో బ్రిటిష్ ప్రభుత్వం రెండింటి మధ్య రాజీ కుదిర్చింది. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కావేరి జలవివాద పరిష్కారానికి 1990లో ట్రైబ్యునల్ ఏర్పాటయింది.

కృష్ణమ్మే తదుపరి!

(మొదటి పేజీ తరువాయి)

సెక్షన్5(2) ప్రకారం 2010లో బ్రిజేష్‌కుమార్ ట్రైబ్యునల్ తీర్పు ఇచ్చింది. దీనిని సవాలు చేస్తూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌తో పాటు కర్ణాటక సుప్రీంకోర్టును ఆశ్రయించాయి. తదుపరి విచారణపై స్టేకు నిరాకరించిన సుప్రీంకోర్టు తుది తీర్పును గెజిట్‌లో ప్రచురించవద్దని సూచించింది. సెక్షన్5(3) ప్రకారం తదుపరి విచారణ జరిగి తుది తీర్పు కూడా వచ్చింది. దీనిని సవాలు చేస్తూ మళ్లీ రాష్ట్రాలు సుప్రీంను ఆశ్రయించాయి. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన తర్వాత తెలంగాణ కూడా సుప్రీం తలుపు తట్టింది. త్వరలోనే కృష్ణాకు సంబంధించిన కేసు సుప్రీంలో విచారణకు వచ్చే అవకాశం ఉంది.

బెంగళూరు పద్ధతిలోనే హైదరాబాద్‌కు అంటున్న తెలంగాణ: బేసిన్ అవసరాలు తీరకుండా పక్కబేసిన్‌లో అవసరాలకు నీటిని కేటాయించడంపైన కూడా ట్రైబ్యునళ్ల ఎదుట వాదనలు జరుగుతున్నాయి. అయితే ప్రస్తుత కావేరి తీర్పులో బెంగళూరు నగర నీటి కేటాయింపు అంశాన్ని కూడా కోర్టు వివరంగా పేర్కొంది. బెంగళూరు తాగునీటి అవసరాలను 2011 వరకు ఒకసారి, 2025 వరకు మరోసారి ట్రైబ్యునల్‌కు కర్ణాటక నివేదించింది. వాస్తవానికి బెంగళూరు నగరంలో మూడో వంతు భాగం మాత్రమే కావేరి ప్రాంత పరిధిలోకి వస్తుందని ట్రైబ్యునల్ పేర్కొంది. దీని ప్రకారం బెంగళూరు అవసరాలను మొత్తం 24 టీఎంసీలుగా పరిగణనలోకి తీసుకొని ఇందులో మూడో వంతు లెక్కగట్టింది. తాగునీటికింద కేటాయించిన నీరు 20 శాతం మినహా మిగిలింది మళ్లీ నీటిలో కలిసి వినియోగంలోకి వస్తుంది కాబట్టి 20 శాతం నీటిని కేటాయిస్తే సరిపోతుందని 1.75 టీఎంసీలు కేటాయించింది. అయితే సుప్రీం కోర్టు బెంగళూరు మొత్తం అవసరాలు, ప్రాధాన్యతను పరిగణనలోకి తీసుకొని 20 శాతం కిందనే అదనంగా 4.75 టీఎంసీలు కలిపి మొత్తం 6.5 టీఎంసీలు కేటాయించింది. దీనికి ఐదు రెట్లు అంటే సుమారు 33 టీఎంసీలు వినియోగించుకోవచ్చు. కానీ ఆరున్నర టీఎంసీలే పరిగణనలోకి తీసుకుంటారు. హైదరాబాద్ నగరానికి, మిషన్‌భగీరథ కింద తాగునీటి వినియోగాన్ని ఇదే పద్ధతిలో లెక్కించాలని తెలంగాణ కొంతకాలంగా కోరుతుంది. అంతర్ రాష్ట్ర నది జాతీయ సంపద అని, ఏ ఒక్క రాష్ట్ర హక్కు కాదని కూడా సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. కావేరిలో తమ రాష్ట్రంలో లభ్యమయ్యే నీటిని ఎక్కువ భాగం తమిళనాడుకు ఎందుకు వదలాలన్న కర్ణాటక వాదనను దృష్టిలో ఉంచుకొని ఈ వ్యాఖ్య చేసినట్లు నిపుణులు భావిస్తున్నారు. సుప్రీంకోర్టు ఇలా పేర్కొనడం పట్ల తమిళనాడు రైతులు కూడా హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రభావం ఇతర ట్రైబ్యునళ్ల తీర్పులపై కూడా పడే అవకాశముంది.

గ్రహం అనుగ్రహం

17-2-2018 శనివారం

శ్రీ హేవళంబి నామ సం॥రం॥ ఉత్తరాయణం
శిశిర రుతువు; ఫాల్గుణ మాసం; శుక్ల పక్షం
విదియ: తె. 3-53 తదుపరి తదియ
శతభిషం నక్షత్రం: ఉ. 11-01 తదుపరి పూర్వాభాద్ర
అమృత ఘడియలు: తె. 3-43 నుంచి 5-23 వరకు
వర్జ్యం: సా. 5-41 నుంచి 7-21 వరకు
దుర్ముహూర్తం: ఉ. 6-29 నుంచి 8-01 వరకు
రాహుకాలం: ఉ. 9-00 నుంచి 10-30 వరకు
సూర్యోదయం: ఉ.6-30; సూర్యాస్తమయం: సా.5-57
చంద్రదర్శనం

చలి - పులి

ప్రాంతం	కనిష్ఠ	గరిష్ఠ
ఆదిలాబాద్	10.0	31.5
రామగుండం	14.4	32.4
మెదక్	14.4	34.6
నిజామాబాద్	16.0	30.0
హన్మకొండ	16.5	32.0
హైదరాబాద్	16.7	32.5
కరీంనగర్	18.0	34.0
రాజమహేంద్రవరం	18.0	34.5
విశాఖపట్నం	18.4	30.8
తిరుపతి	19.6	32.4
మహబూబ్‌నగర్	19.8	34.2
సూర్యాపేట	23.0	34.0
ఖమ్మం	23.0	36.0

కేసీఆర్ పుట్టిన రోజుకు భారీ సన్నాహాలు

- ఆస్ట్రేలియా, బహ్రెయిన్‌లలోనూ కార్యక్రమాలు

ఈనాడు, హైదరాబాద్: ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకొని శనివారం పెద్దఎత్తున ఉత్సవాలకు తెరాస నేతలు, అనుబంధ సంఘాలు ఏర్పాట్లు చేస్తున్నారు. శుక్రవారం రోజునే ఆస్ట్రేలియా, బహ్రెయిన్‌లలో తెరాస, తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరిగాయి. సీఎం కేసీఆర్‌పై రూపొందించిన గీతాన్ని తెరాస ఎంపీ కల్వకుంట్ల కవిత శుక్రవారం ఉదయం ఆవిష్కరించారు. జాగృతి రాష్ట్ర ఉపాధ్యక్షుడు మేడే రాజీవ్‌సాగర్ ఆధ్వర్యంలో హైదరాబాద్ దోమల్‌గూడలోని భారత్ స్కౌట్స్,గైడ్స్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు గైడ్లు, నమూనా ప్రశ్నపత్రాలను పంపిణీ చేశారు.

తెరాస నేత నాగేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆస్ట్రేలియాలో కార్యక్రమం జరగ్గా, బహ్రెయిన్‌లో తెలంగాణ జాగృతి గల్ఫ్ దేశాల అధ్యక్షుడు హరిప్రసాద్ నాయకత్వంలో సన్మానియా ఆసుపత్రిలో రక్తదానం చేశారు. హైదరాబాద్‌లోని జలవిహార్‌లో మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ ఆధ్వర్యంలో శనివారం జరిగే ఉత్సవాలకు కవిత ముఖ్య అతిథిగా హాజరు కానున్నారు.

కేసీఆర్ జన్మదినం సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజా ప్రతినిధుల ఆధ్వర్యంలో దేవాలయాల్లో పూజలు, రెండు పడకగదుల ఇళ్లకు, ఇతర అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, మెగా సర్వేక్షణ నిర్వహణకు పార్టీ శ్రేణులు సన్నాహాలు చేస్తున్నాయి. శుక్రవారం రాత్రి ఉస్మానియా విశ్వవిద్యాలయంలో దూదిమెట్ల బాలరాజ్ యాదవ్ ఆధ్వర్యంలో కేసీఆర్ జన్మదిన ఉత్సవాలు జరిగాయి. శనివారం ఓయూలో ఎస్సీఎస్టీ కమిషన్ అధ్యక్షుడు ఎర్రోళ్ల శ్రీనివాస్, టీఎస్‌టీఎస్ ఛైర్మన్ రాకేశ్, తుంగతుర్తి ఎమ్మెల్యే గాదరి కిశోర్ ఆధ్వర్యంలో రక్తదానం, నేత్ర వైద్య చికిత్సల శిబిరాన్ని నిర్వహించనున్నారు.

కేంద్ర బడ్జెట్‌తో నిరాశే

- గవర్నర్‌తో సీఎం కేసీఆర్ ఆవేదన

ఈనాడు - హైదరాబాద్

కేంద్ర బడ్జెట్ తమను తీవ్రంగా నిరాశపరిచిందని తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్.. గవర్నర్ నరసింహన్ ముందు ఆవేదన వ్యక్తం చేసినట్లు తెలిసింది. పెద్దఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నా కేంద్రం నుంచి సరైన చేయూత రాకపోవడం బాధాకరమని పేర్కొన్నట్లు సమాచారం. శుక్రవారం రాత్రి దిల్లీ నుంచి వచ్చిన తర్వాత కేసీఆర్ రాజ్‌భవన్‌లో గవర్నర్‌ను కలిశారు. దాదాపు గంటపాటు భేటీ అయి దిల్లీ పర్యటన, ఇతర అంశాలపై చర్చించారు. కేసీఆర్ కేంద్ర బడ్జెట్ గురించి ప్రస్తావించారు. కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు ఒక్కటీ సానుకూలత లేదని పేర్కొన్నట్లు తెలిసింది. "పన్నుల్లో వాటా మినహాయిస్తే అదనంగా ఒక్క రూపాయి కూడా కేంద్రం కేటాయించలేదు. విభజన హామీలపైనా దృష్టి సారించలేదు. భారీ ఎత్తున నీటిపారుదల ప్రాజెక్టులను చేపట్టాం. ఇంటింటికీ నీరందించేందుకు మిషన్ భగీరథను తెస్తున్నాం. మిషన్ కాకతీయ సహా ఎన్నో నిర్మాణాత్మక ప్రాజెక్టులున్నాయి. వీటిని పూర్తిగా తెలంగాణ వనరులనే వినియోగిస్తున్నాం. బ్యాంకుల నుంచి రుణాలు తెస్తున్నాం. తెలంగాణ అభివృద్ధి చెందితే దేశానికే మేలు అని కేంద్రం గుర్తించాలి. పెద్దనోట్ల రద్దు, జీఎస్టీ అమలు తదితర సందర్భాల్లో కేంద్ర నిర్ణయాలకు తెలంగాణ మద్దతు తెలిపింది. అదే రీతిలో తెలంగాణకు కేంద్రం సాయం అందించాల్సి ఉన్నా అది జరగడం లేదు' అని కేసీఆర్ పేర్కొన్నట్లు తెలిసింది. ప్రధాని, కేంద్ర మంత్రులు, ఉన్నతాధికారులు పథకాలను, కార్యక్రమాలను ప్రశంసిస్తున్నా దానికి అనుగుణంగా చేయూత అందడం లేదని సీఎం అసంతృప్తి వక్తం చేసినట్లు సమాచారం. ఎర్రజొన్నకు కేంద్రం మద్దతు ధర ప్రకటించాల్సి ఉన్నా పట్టించుకోలేదని, రైతులు ఆందోళన చేయడంతో తామే చొరవ తీసుకొని మద్దతు ధర ప్రకటించామని కేసీఆర్ చెప్పారు. దిల్లీ పర్యటన సందర్భంగా తాను ప్రధానిని కలిసేందుకు యత్నించినా వీలు కాలేదని, దీంతో కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీని కలిసి ఎయిమ్స్ ఇతర హామీలను ఆయనకు గుర్తు చేశానని వివరించారు. తమ ఆవేదనను కేంద్రం అర్థం చేసుకుంటుందని భావిస్తున్నామని చెప్పారు. కేంద్ర బడ్జెట్‌తో పాటు రాష్ట్రంలోని అంశాలపై కొంతసేపు గవర్నర్, ముఖ్యమంత్రి మాట్లాడుకున్నారు. రాష్ట్రంలో ఈ నెల 19 నుంచి జరిగే ప్రపంచ ఐటీ సదస్సుకు హాజరుకావాలని గవర్నర్‌ను కేసీఆర్ ఆహ్వానించారు. శనివారం కేసీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకొని గవర్నర్ ఆయనకు ముందస్తు శుభాకాంక్షలు తెలిపారు.

అరవింద్ సుబ్రహ్మణ్యానికి ఆహ్వానం

అంతకు ముందు అయిదు రోజుల దిల్లీ పర్యటన ముగించుకొని శుక్రవారం రాత్రి కేసీఆర్ హైదరాబాద్ చేరారు. శుక్రవారం మధ్యాహ్నం దిల్లీలో కేంద్ర ఆర్థిక సలహాదారు అరవింద్ సుబ్రహ్మణ్యం ఇచ్చిన విందుకు ఆయన హాజరయ్యారు. తెలంగాణకు వచ్చి రాష్ట్రాభివృద్ధిని వీక్షించాలని, తమ ఆతిథ్యం స్వీకరించాలని అరవింద్ సుబ్రహ్మణ్యంను కేసీఆర్ ఆహ్వానించారు.

సైనిక సంక్షేమానికి ఉపాధ్యాయుల విరాళం

ఈనాడు, హైదరాబాద్: సైనికుల సంక్షేమం, వారి కుటుంబాల శ్రేయస్సును కాంక్షిస్తూ పలు ఉపాధ్యాయ సంఘాలు సీఎం సహాయ నిధికి ఒకరోజు వేతనాన్ని విరాళంగా ప్రకటిస్తూ శుక్రవారం మంత్రి హరీశ్‌రావుకు లేఖలు అందజేశాయి. పలు సంఘాలతో కూడిన ఉపాధ్యాయ సంఘాల సంయుక్త కార్యాచరణ సమితి(జాక్టో) సారధ్య సంఘ నాయకులు బి.భుజంగరావు, సదానందం గౌడ్, రఘునందన్, అంజిరెడ్డి, చెన్నయ్య, వేణుగోపాలస్వామి తదితరులు ప్రభుత్వ చీఫ్‌విప్ పాతూరి సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో మంత్రికి లేఖ అందజేశారు. ఎమ్మెల్సీలు జనార్దన్‌రెడ్డి, పూల రవీందర్ ఆధ్వర్యంలో తెలంగాణ ఉపాధ్యాయుల ఐకాస(టీటీజాక్) పక్షాన హరీశ్‌కు లేఖ ఇచ్చారు.

రాష్ట్రపతితో ఉపముఖ్యమంత్రి కడియం భేటీ

ఈనాడు, దిల్లీ: రాష్ట్రపతి కోవింద్‌తో తెలంగాణ ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి శుక్రవారమిక్కడ మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఎంపీ సీతారాంనాయక్‌తో కలిసి రాష్ట్రపతిని కలిశారు. విద్యాశాఖ పరంగా రాష్ట్రంలో చేపడుతున్న పథకాలు, కార్యక్రమాలు కోవింద్‌కు వివరించారు. అనంతరం కడియం శ్రీహరి మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణలో కొత్తగా 470 గురుకుల పాఠశాలలు, 52 రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాలలను ఎస్సీ, ఎస్టీ మహిళల కోసం ఏర్పాటు చేశామన్నారు. అన్ని రాష్ట్రాలు కూడా బాలికావిద్యపై దృష్టి సారించాలని, బాలికల నమోదును(ఎన్‌రోల్ మెంట్) పాఠశాల నుంచి కళాశాల స్థాయి వరకు పెంచాలని రాష్ట్రపతి సూచించారన్నారు.

ఇదీ సంగతి!



అదే నన్ను డబ్బు అడుగుతోంది. ఏం చేద్దాం?

కొనసాగిన సీబీఐ, ఈడీ సోదాలు

- పీఎన్‌బీ కేసులో నిందితులకు చెందిన మరిన్ని ఆస్తుల జప్తు

ముంబయి: ప్రముఖ వజ్రాల వ్యాపారి నీరవ్ మోదీ, అతడి భాగస్వామి మెహుల్ చోక్సీలు.. పంజాబ్ నేషనల్ బ్యాంకు (పీఎన్‌బీ)కు రూ.11,400 కోట్ల మేర కుచ్చుటోపీ పెట్టిన కేసులో కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ), ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) సోదాలు కొనసాగిస్తున్నాయి. చోక్సీకి చెందిన గీతాంజలి గ్రూప్‌పై తాజాగా సీబీఐ మరో ఎఫ్ఐఆర్ (ప్రాథమిక దర్యాప్తు నివేదిక)ను నమోదు చేసింది. ముంబయి, పుణె, సూరత్, జైపుర్, హైదరాబాద్, కోయంబత్తూర్‌ల్లో దాని అనుబంధ సంస్థలకు చెందిన 26 ప్రాంతాల్లో సోదాలు జరిపింది. రూ.4,886 కోట్ల మేర అక్రమాలకు సంబంధించి పీఎన్‌బీ చేసిన ఫిర్యాదుపై ఈ ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు సీబీఐ అధికారులు తెలిపారు. 143 భరోసా పత్రాలు (లెటర్స్ ఆఫ్ అండర్‌టేకింగ్)ల ద్వారా ఈ మొత్తాన్ని నిందితులు దోచుకున్నట్లు పేర్కొన్నారు. మరోవైపు నిందితులకు చెందిన మరో రూ.549 కోట్లను ఈడీ శుక్రవారం జప్తు చేసింది. నీరవ్, చోక్సీలకు సమన్లు జారీ చేసింది. వారం రోజుల్లోగా తమ ముందు హాజరుకావాలని ఆదేశించింది. ఈ మేరకు నిందితులకు చెందిన సంస్థల డైరెక్టర్లకు శుక్రవారం నోటీసులు అందజేసింది. దోచుకున్న సొమ్మును తరలించి.. నిందితులు అక్రమాస్తులు, నల్లధనం కూడబెట్టారా అన్నదానిపై ఈడీ విచారణ జరుపుతోంది. ఇటు నీరవ్‌కు చెందిన సంస్థలేవీ విదేశాల్లోనూ వ్యాపార కార్యకలాపాలు నిర్వహించకుండా ఆంక్షలు విధించింది. గురువారం సోదాల్లో రూ.5,100 కోట్ల విలువైన వజ్రాభరణాలు, విలువైన లోహాలు, ఇతర వస్తువులను ఈడీ స్వాధీనం చేసుకున్న సంగతి తెలిసిందే.

బ్యాంకు అధికారులను విచారించిన సీబీఐ

తన పేరుతోనే సంస్థను నెలకొల్పిన నీరవ్, 'గీతాంజలి జెమ్స్' ప్రమోటర్ చోక్సీ పీఎన్‌బీని రూ.11,400 కోట్ల మేర మోసగించిన సంగతి తెలిసిందే. పీఎన్‌బీ అధికారుల సాయంతో నగదేమీ జమ చేయకుండానే కొన్నేళ్లుగా బ్యాంకు నుంచి భరోసా పత్రాలను పొందిన వీరు.. వాటి ద్వారా విదేశాల్లో ఇతర బ్యాంకుల నుంచి రూ.వేల కోట్ల మేర నగదును పొందారు. 'కోర్ బ్యాంకింగ్ వ్యవస్థ'లో ఈ లావాదేవీలు నమోదు కాకుండా అక్రమాలకు పాల్పడి.. పీఎన్‌బీకి డబ్బు ఎగ్గొట్టారు. మొత్తం 293 భరోసా పత్రాలు పొందినట్లు పీఎన్‌బీ తన ఫిర్యాదులో పేర్కొంది. వీటిలో గీతాంజలి జెమ్స్‌కు సంబంధించిన 143 పత్రాల అభియోగాలను సీబీఐ తాజా ఎఫ్ఐఆర్‌లో నమోదు చేసింది. చోక్సీతోపాటు పీఎన్‌బీ విశ్రాంత డిప్యూటీ జనరల్ మేనేజర్ గోకుల్‌నాథ్ శెట్టి, పీఎన్‌బీ అధికారులు మనోజ్ ఖారత్, గీతాంజలి జెమ్స్, గిల్లీ ఇండియా, నక్షత్ర బ్రాండ్ లిమిటెడ్, ఆయా సంస్థల డైరెక్టర్లను నిందితులుగా చేర్చింది. పీఎన్‌బీకి చెందిన నలుగురు అధికారులను సీబీఐ ప్రశ్నించింది.



శుక్రవారం థానేలోని వివియానా మాల్‌లో తనిఖీలు చేస్తున్న ఈడీ అధికారులు

ఆచూకీ కోసం ఇంటర్‌పోల్‌కు అభ్యర్థన

దేశం విడిచి పారిపోయిన నీరవ్, చోక్సీల ఆచూకీ కోసం.. 'డిఫ్యూషన్' నోటీసు జారీ చేయాలని ఇంటర్‌పోల్‌ను సీబీఐ అభ్యర్థించినట్లు అధికారులు వివరించారు. ఓ వ్యక్తి జాడను కనిపెట్టేందుకు గానీ, అరెస్టు కోసం అభ్యర్థించేందుకు గానీ.. ఈ నోటీసు ఉపయోగపడుతుంది. ఇంటర్‌పోల్‌లోని సభ్యదేశాలన్నింటికిగానీ, తాము ఎంచుకున్న దేశాలకు గానీ ఈ నోటీసును సీబీఐ నేరుగా జారీ చేసేందుకు అవకాశం ఉంటుంది. నీరవ్, అతడి కుటుంబ సభ్యుల ఆచూకీ ఒకట్రెండు రోజుల్లో లభ్యమయ్యే అవకాశాలున్నాయని సీబీఐ అధికారులు విశ్వాసం వ్యక్తం చేశారు. జనవరి 1 నుంచి 6 మధ్య నీరవ్, అతడి భార్య అమీ, సోదరుడు నిశాల్, మామయ్య చోక్సీ భారత్ నుంచి పారిపోయినట్లు అధికారులు తెలిపారు. నీరవ్ కుటుంబం న్యూయార్క్‌లో మాన్‌హటన్‌లోని ఓ అపార్టుమెంటులో ఉన్నట్లు వార్తలు వచ్చాయి.

పాస్‌పోర్టులు తాత్కాలికంగా రద్దు

నీరవ్ మోదీ, మెహుల్ చోక్సీల పాస్‌పోర్టులను విదేశీ వ్యవహారాలశాఖ తాత్కాలికంగా రద్దు చేసింది. నాలుగు వారాలపాటు వాటిని చెల్లుబాటు కాకుండా చేసింది. పాస్‌పోర్టులను ఎందుకు ఉపసంహరించుకోకూడదో తెలియజేసేందుకు నీరవ్, చోక్సీలకు వారం రోజుల గడువును ఇచ్చింది. ఈలోగా వారు స్పందించకపోతే.. ఉపసంహరణ చర్యలు తీసుకుంటామని పేర్కొంది. సీబీఐ, ఈడీ అభ్యర్థనల మేరకు ఈ చర్య తీసుకున్నట్లు వెల్లడించింది. ఇటు తమ అధికారులెవరికీ నీరవ్ అందుబాటులోకి రాలేదని.. అతడి జాడపై ఇంకా సమాచారం లేదని విదేశీవ్యవహారాల శాఖ అధికార ప్రతినిధి రవీశ్‌కుమార్ వ్యాఖ్యానించారు. దావోస్‌లో వ్యాపారవేత్తల బృందంతో కలిసి ప్రధాని మోదీ దిగిన ఫోటోలో నీరవ్ ఉండటం కాకతాళీయంగా జరిగిందేనని పేర్కొన్నారు. ప్రధాని అధికారిక ప్రతినిధుల బృందంలో అతడు భాగం కాదని స్పష్టం చేశారు.

ఆస్తులను జప్తు చేసిన ఐటీ

నీరవ్ మోదీ, అతడి కుటుంబ సభ్యులకు చెందిన 29 ఆస్తులను, 105 బ్యాంకు ఖాతాలనూ ఆదాయపు పన్ను విభాగం (ఐటీ) జప్తు చేసింది. పన్ను ఎగవేత ఆరోపణలకు సంబంధించి ఈ చర్యలు తీసుకుంది. విదేశాల్లో అక్రమాస్తులను కూడబెట్టినందుకుగానూ.. కొత్తగా తీసుకువచ్చిన నల్లధన వ్యతిరేక చట్టం కింద ఈ కేసులు పెట్టింది. సింగపూర్‌లో ఈ ఆస్తులు ఉన్నట్లు సమాచారం. కొత్త చట్టం కింద విదేశీ ఆస్తులు వెల్లడించని పక్షంలో 120% పన్ను, జరిమానాలతోపాటు 10 ఏళ్ల వరకూ జైలుశిక్ష విధించే అవకాశముంది. నీరవ్‌పై ముంబయిలోని ప్రత్యేక కోర్టులో అభియోగపత్రాన్ని కూడా ఐటీ దాఖలు చేసింది. ఫిబ్రవరి 27న దీనిపై కోర్టు విచారణ చేపట్టనుంది. ముంబయి, సూరత్, జైపుర్, దిల్లీల్లోని నీరవ్ కుటుంబ ఆస్తులను జప్తు చేసినట్లు ఐటీ అధికారులు తెలిపారు.

నీరవ్.. విలాస పురుషుడు!



దిల్లీ: పంజాబ్ జాతీయ బ్యాంకుకు టోపీ పెట్టిన నీరవ్‌మోదీ విలాసా జీవితం గురించి తెలిస్తే కళ్లు బైర్లు కమ్మాల్సిందే. దీనిపై దర్యాప్తు అధికారులు ప్రస్తుతం కూపీ లాగుతున్నారు. నీరవ్ పలు నగరాల్లో అత్యంత ప్రముఖులతో కూడిన విందులతో ప్రముఖ మేగజైన్లలో తరచూ దర్శనమిస్తుంటారు. ప్రియాంక చోప్రా, రోసీ హంటింగ్టన్ విట్లే వంటి నటులు, మోడల్స్ ఆయన ఆభరణాలకు బ్రాండ్ అంబాసిడర్లుగా పనిచేశారు. తన బ్రాండ్ అంబాసిడర్లకూ ఖరీదైన పార్టీలు ఇవ్వడం నీరవ్‌కు అలవాటు. దేశం విడిచి వెళ్లడానికి రెండు నెలల ముందు గత ఏడాది నవంబర్‌లో ముంబయి ఫోర్‌సీజన్స్‌లో భారీ విందు ఇచ్చారు. అతిథుల్లో బాలీవుడ్ నటి సోనమ్ కపూర్ తదితరులున్నారు. ప్రపంచ ప్రఖ్యాత ఇటలీ చెఫ్ మాసిమో బోటురా అతిథులకు పసందైన వంటకాలు వండివడ్డించారు. ఈ చెఫ్ ఎంత ప్రముఖుడంటే.. ఇటలీలోని మోడెనా నగరంలో ఉండే ఓస్టెరియా ఫ్రానాస్కానా రెస్టారెంట్ ఈయన సొంతం. ఇది ప్రపంచంలోని అత్యుత్తమ 50 రెస్టారెంట్లలో ఒకటిగా నిలిచింది. అక్కడ భోజనం చేయాలంటే రిజర్వేషన్ చేసుకోవడానికే నెలలపాటు వేచి ఉండాల్సి ఉంటుంది. నీరవ్ ఖరీదైన బెంట్లే కార్లు, ఇటాలియన్ సూట్లను బాగా ఇష్టపడతారు. 2010లో నీరవ్‌మోదీ బ్రాండ్‌ను నెలకొల్పి.. లండన్, బీజింగ్, హాంకాంగ్ సహా ప్రపంచంలోని ప్రముఖ నగరాల్లో గొలుసు దుకాణాలు నిర్వహిస్తున్నారు.

ఏడేళ్లుగా 'స్విఫ్ట్' బాధ్యతల్లోనే పీఎన్‌బీ అధికారి

ముంబయి: పీఎన్‌బీలో ఘరానా మోసం కేసులో ప్రధాన కుట్రదారుల్లో ఒకడైన బ్యాంకు అధికారి గోకుల్‌నాథ్ శెట్టి.. ఏడేళ్లపాటు 'స్విఫ్ట్' బాధ్యతల్లోనే కొనసాగడంపై అనుమానాలు రేకెత్తుతున్నాయి. ఈ కుంభకోణం చోటుచేసుకున్న ముంబయి బ్యాంకులో 2010 మార్చి నుంచి 2017 మేలో పదవీవిరమణ చేసేవరకూ.. అతడు విదేశీ మారకద్రవ్య విభాగంలో డిప్యూటీ మేనేజర్‌గా పనిచేశాడు. విదేశీ నగదు లావాదేవీలకు సంబంధించిన ఎలక్ట్రానిక్ చెల్లింపు సందేశ మార్పిడి వ్యవస్థ 'స్విఫ్ట్' కార్యకలాపాలను అతడే నిర్వర్తించాడు. నీరవ్ మోదీ, మెహుల్ చోక్సీల సంస్థలకు అక్రమంగా అతడే భరోసా పత్రాలు (లెటర్స్ ఆఫ్ అండర్‌టేకింగ్) జారీ చేసినట్లు ఆరోపణలున్నాయి. సాధారణంగా ఇలాంటి సున్నితమైన వ్యవహారాల బాధ్యతల్లో ఉన్న అధికారులను.. బ్యాంకు మూడేళ్లకు బదిలీ చేస్తుంటుంది. ఐదేళ్లకు మించి కొనసాగేందుకు అసలు అవకాశమే ఇవ్వదు. అయితే శెట్టి అదే బాధ్యతల్లో ఏడేళ్లు కొనసాగాడు. అతడిని బదిలీ చేస్తూ.. మూడుసార్లు ఉత్తర్వులు రాగా వాటిని కొందరు అధికారులు రద్దు చేశారు. సంక్లిష్ట వ్యవహారాలుండే స్విఫ్ట్ విభాగంలో పనిచేసేందుకు చాలా మంది ఉద్యోగులు ఆసక్తి చూపించట్లేదని వారు కారణంగా చూపించినట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. జోనల్ మేనేజర్‌కు ప్రాంతీయ మేనేజర్ సరైన కారణాలు చూపితేనే ఇలాంటి మినహాయింపు సాధ్యమవుతుందన్నాయి. ఇటు విచారణలు కొనసాగుతున్నందున.. ఈ అంశంపై స్పందించలేమని బ్యాంకు అధికార ప్రతినిధి తెలిపారు.

పీఎన్‌బీ మోసం.. యూపీఏ కుంభకోణమే: భాజపా

దిల్లీ: పీఎన్‌బీ మోసం.. యూపీఏ కుంభకోణమేనని భాజపా స్పష్టం చేసింది. డైరెక్టర్లలో ఒకరు వ్యతిరేకించినా మెహుల్ చోక్సీ, నీరవ్‌మోదీలది భావిస్తున్న రుణాన్ని అలహాబాద్ బ్యాంకు ఎందుకు మంజూరు చేసిందనీ, బ్యాంకుపై ఎవరు ఒత్తిడి తెచ్చారని ప్రశ్నించింది. 2013, సెప్టెంబర్ 13న దిల్లీలోని ఒక హోటల్‌లో నీరవ్ మోదీ నిర్వహించిన ఆభరణాల ప్రదర్శనకు రాహుల్‌గాంధీ హాజరయ్యారనీ, ఆ మరుసటి రోజే అలహాబాద్ బ్యాంకు రుణం మంజూరు చేసిందని భాజపా సీనియర్ నేత, కేంద్ర మంత్రి ప్రకాష్ జావడేకర్ ఆరోపించారు. రాహుల్ హాజరుకూ, రుణం మంజూరుకూ సంబంధం ఏమిటో వెల్లడించాలన్నారు. బ్యాంకు అధికారులపై నాటి యూపీఏ ప్రభుత్వం నుంచి ఒత్తిడి వచ్చి ఉంటుందని అనుమానం వ్యక్తం చేశారు. మొత్తం బ్యాంకింగ్ వ్యవస్థను ప్రక్షాళన చేసేందుకు ప్రస్తుత ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో యూపీఏ కాలంనాటి కుంభకోణం వెలుగులోకి వచ్చిందన్నారు. నిరర్థక ఆస్తులు, రుణాల తప్పుడు పంపిణీ వంటివన్నీ యూపీఏ ప్రభుత్వం నుంచే బదిలీ అయ్యాయన్నారు. యూపీఏ హయాంలో బ్యాంకింగ్ వ్యవస్థ మొత్తం విఫలమైందనీ, ఈ కుంభకోణం 2011 నుంచి 2014 మధ్య నిగూఢంగా ఉందనీ, ఎన్డీఏ సర్కారు వచ్చాక బ్యాంకింగ్ నిబంధనల్ని కఠినతరం చేయడంతో వెలుగులోకి వచ్చిందన్నారు. నాడు రుణ మంజూరుకు అభ్యంతరం తెలిపిన అలహాబాద్ బ్యాంకు డైరెక్టర్ దినేష్‌దూబేను యూపీఏ ప్రభుత్వం తొలగించిందని భాజపా వర్గాలు పేర్కొన్నాయి

హైదరాబాద్‌లోనూ నీరవ్ మోదీ సామ్రాజ్యం

- రావిర్యాల సెజ్‌లో ఐదు జ్యుయెలరీ కంపెనీలు
- శంకుస్థాపన చేసింది నాటి ముఖ్యమంత్రి వైఎస్

ఈనాడు, హైదరాబాద్ - మహేశ్వరం, న్యూస్‌టుడే: పంజాబ్ నేషనల్ బ్యాంకును రూ. వేల కోట్లకు మోసం చేసి దేశం వీడి పరారైన వజ్రాల వ్యాపారి నీరవ్‌మోదీ వ్యాపార సామ్రాజ్యం హైదరాబాద్‌లో కూడా భారీగానే విస్తరించి ఉన్నట్లు బయటపడుతోంది. అప్పటి ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖరరెడ్డి హయాంలో ఇక్కడో జెమ్స్ పార్కును ఏర్పాటు చేశాడు. దీనికి వైఎస్ శంకుస్థాపన చేశారు. నీరవ్ వ్యాపార సంస్థలపై దేశవ్యాప్తంగా జరుగుతున్న దాడుల్లో భాగంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు శుక్రవారం రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం రావిర్యాల పరిధిలో ఉన్న హార్డ్‌వేర్ పార్కులోని అతడి సంస్థల్లో తనిఖీలు నిర్వహించారు. ప్రస్తుతం ఇక్కడ నీరవ్‌మోదీకి ఐదు జ్యుయెలరీ కంపెనీల పేరిట పది యూనిట్లు ఉన్నట్లు గుర్తించారు. గీతాంజలి జెమ్స్ అండ్ జుయెలర్స్, బిలియన్ జుయెలర్స్, బెజిల్ జుయెలర్స్, నక్షత్ర జుయెలర్స్‌తో పాటు మరో కంపెనీ సీబీఐ గుర్తించిన వాటిలో ఉన్నాయి. ఈ యూనిట్లలో వందలాదిమంది పనిచేస్తున్నారు. విదేశాల నుంచి రత్నాలు, వజ్రాలను దిగుమతి చేసుకుని ఈ సెజ్‌లో ప్రాసెసింగ్ చేస్తున్నారు. ఈ మెటీరియల్ బుక్‌వ్యాల్యూ రూ. 3,400 కోట్లుగా నీరవ్‌మోదీ చూపించగా.. వాస్తవానికి వాటివిలువ రూ. 300 కోట్లు కూడా లేదని కేంద్ర దర్యాప్తు సంస్థలు గుర్తించాయి. హైదరాబాద్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు గురువారం రాత్రే మోదీ కార్యాలయాల్లో సోదాలు నిర్వహించి ఆస్తుల్ని సీజ్ చేయగా శుక్రవారం సీబీఐ కూడా దాడులు చేసింది. పలు రికార్డుల్ని ట్యాంపరింగ్, ఫోర్జరీ చేశాడని, ఆస్తుల విలువ ఎక్కువ చేసి చూపాడని దర్యాప్తు సంస్థలు గుర్తించాయి. తదుపరి దర్యాప్తు కోసం ఆ రికార్డుల్ని స్వాధీనం చేసుకున్నాయి. ఈడీకి చెందిన ప్రత్యేక బృందాలు రాత్రి పొద్దుపోయే వరకు రావిర్యాలలో క్షుణ్ణంగా సోదాలు చేపట్టాయి. నీరవ్ మొదట రాజీవ్ జెమ్స్ పేరుతో 2005లో 250 ఎకరాల్లో ఓ వ్యాపార సంస్థను ఏర్పాటుచేశారు. అప్పటి సీఎం రాజశేఖరరెడ్డి శంకుస్థాపన చేశారు. 2007లో ఈ సంస్థ సేవలు అందుబాటులోకి వచ్చాయి. వైఎస్ స్థలం కేటాయించినప్పుడు రాజీవ్ జెమ్స్ పార్క్‌గా నెలకొల్పిన దీనిని ఆ తర్వాత గీతాంజలి జెమ్స్ అండ్ జ్యుయెలరీగా మార్చారు. విదేశాలనుంచి, దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన వజ్రాలను, విలువైన రాళ్లను కటింగ్ చేసి, డిజైన్ చేసి ఇతర ప్రాంతాలకు పంపిస్తుంటారు. ప్రారంభంలో ఇక్కడ 1800 మందికి వరకు కార్మికులు పనిచేసేవారు. ప్రస్తుతం 400 మందితో ఈ సంస్థ కార్యకలాపాలు సాగిస్తుంది. దాడుల నేపథ్యంలో రావిర్యాల గీతాంజలి జెమ్స్ పార్కు వద్ద లోపలికి ఎవరూ వెళ్లకుండా గట్టి భద్రతను ఏర్పాటు చేశారు. ఇందులో పనిచేస్తున్న కార్మికులను శుక్రవారం మధ్యాహ్నం ఒంటిగంటకే ఇంటికి పంపించేశారు.



రాజీవ్ జెమ్స్ పార్కులోని గీతాంజలి జెమ్స్ పార్కు భవనం





శుక్రవారం హైదరాబాద్‌లోని కుతుబ్‌షాహీ సమాధులను సందర్శించిన ఇరాన్ అధ్యక్షుడు హసన్ రౌహానీకి వాటి చారిత్రక ప్రాధాన్యతను తెలుపుతున్న అధికారులు ★ మక్కామసీదులో పవిత్ర ప్రార్థనలో పాల్గొన్న ఇరాన్ అధ్యక్షుడు హసన్ రౌహానీ. ఉపముఖ్యమంత్రి మహమూద్ అలీ, ముస్లిం మతపెద్దలు

పర్యావరణ హామీలకు మేం నిబద్ధులం

ప్రపంచ సుస్థిరాభివృద్ధి సదస్సులో ప్రధాని మోదీ

దిల్లీ: భారత దేశం అభివృద్ధిని విశ్వసిస్తుందని, అదే సమయంలో పర్యావరణ పరిరక్షణకూ కట్టుబడి ఉంటుందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ విస్పష్టం చేశారు. భావి తరాలకు స్వచ్ఛమైన, సురక్షితమైన పర్యావరణాన్ని అందించటం కోసం అవసరమైన అన్ని చర్యలను తీసుకుంటున్నామని తెలిపారు. ఇతర దేశాలు కూడా 2015 పారిస్ సదస్సులో తీసుకున్న నిర్ణయాల అమలుకు కలసికట్టుగా ముందుకు రావాలని, తమ వంతు బాధ్యతలను అవి నెరవేర్చాలని సూచించారు. శుక్రవారం దిల్లీలో ప్రపంచ సుస్థిరాభివృద్ధి సదస్సులో ఆయన ప్రసంగించారు. ఐక్యరాజ్య సమితి నిర్దేశిత సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను 2030నాటికి చేరుకోవటానికి భారత్ శతథా యత్నిస్తుందన్నారు. కర్బన ఉద్గారాలను కట్టడి చేయటం ఒకప్పుడు అసాధ్యమైన లక్ష్యంగా ఉండేదని, కానీ భారత్ ఆ పనిలో నిలకడైన పురోగతిని సాధిస్తోందని వెల్లడించారు. 2020నాటికి ఉద్గారాల ఘాడతను క్రమంగా తగ్గించుకుంటూ 2005నాటి స్థాయికి తీసుకురావాలన్న కొపెనెహాగెన్ వాగ్దానాన్ని అమలుచేయటంలో భారత్ సరైన తోవలోనే పయనిస్తుందన్న యూఎన్‌ఈపీ నివేదికను ప్రధాని ప్రస్తావించారు. "ప్రపంచ సంపదకు మనం ధర్మకర్తలం మాత్రమే"నన్న మహాత్మాగాంధీ తాత్వికతను మోదీ గుర్తుచేశారు. జల లభ్యత సమస్యను ప్రస్తావిస్తూ దేశంలోని ప్రతి చేనుకు సాగునీరందించాలన్నది తమ అభిమతమన్నారు. సుమారు 2వేల మంది ప్రతినిధులు హాజరయ్యారు.

భారత్ ఆర్థికాభివృద్ధికి పూర్తి సహకారం

- ఇక్కడ భిన్నమతాలు కలిసిమెలిసి జీవిస్తున్నాయి
- హైదరాబాద్‌కు ఇరాన్‌కు పోలికలు
- మక్కామసీదులో ఇరాన్ అధ్యక్షుడు హసన్ రౌహానీ ప్రసంగం

ఈనాడు, హైదరాబాద్: విశ్వవ్యాప్తంగా భారత్ ఆర్థికాభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తామని ఇరాన్ అధ్యక్షుడు హసన్ రౌహానీ చెప్పారు. ఇరాన్‌కు ఉన్న గ్యాస్, పెట్రోలియం వనరులను భారత్‌తో పంచుకోవాలనుకుంటున్నామన్నారు. తమ ఓడరేవు చాహబాహర్‌ను భారత ప్రయోజనాల కోసం ఉపయోగిస్తున్నామని వెల్లడించారు. శతాబ్దాలుగా ఇరాన్, భారత్‌ల మధ్య స్నేహపూర్వక సంబంధాలున్నాయని. . సాంస్కృతిక, ఆర్థిక, తదితర రంగాల్లో కలిసిమెలిసి పనిచేస్తున్నాయని వివరించారు. ముస్లింలు శాంతిదూతలుగా ఉండాలని పిలుపునిచ్చారు. హైదరాబాద్‌కు ఇరాన్‌కు చాలా అంశాల్లో దగ్గరి పోలికలున్నాయని, హైదరాబాద్‌లో జీవిస్తున్న ఇరానీయులు తమ సొంతింట్లో ఉన్నట్లే భావిస్తారన్నారు. రాష్ట్ర పర్యటనకు వచ్చిన రౌహానీ శుక్రవారం మక్కామసీదును సందర్శించి ప్రార్థనల్లో పాల్గొన్నారు. అనంతరం ముస్లింలను ఉద్దేశించి మాట్లాడారు. 'ప్రపంచవ్యాప్తంగా శాంతి, సామరస్యాలే గొప్ప సంపదగా అలరారుతున్నాయి. ఆసియాతోపాటు యూరప్, ఆఫ్రికాలోనూ శాంతి విలసిల్లాలి. ఇస్లాం శాంతికి చిహ్నం. ఖురాన్‌లో చెప్పినట్లుగా మహ్మద్ ప్రవక్తను అనుసరించేవారు ప్రపంచ శాంతికి, మానవాళి మేలుకు కృషి చేయాలి. ముస్లింలు ఐక్యంగా ఉంటే జెరూసలెంను అమెరికా ఇజ్రాయెల్ రాజధానిగా ప్రకటించేదే కాదు. ముస్లింల్లోని షియాలు, సున్నీలు తదితర వర్గాలు ఒకరినొకరు గౌరవించుకోవాలి. భారత్‌లోని అత్యధిక ప్రజలు భిన్నమతాలకు చెందినవారైనా పరస్పర నమ్మకం, అభిమానంతో జీవిస్తున్నారు. కొన్ని పాశ్చాత్య దేశాలవారు ఇస్లాం మతం, ముస్లింలు అంటే హింస, ఉగ్రవాదమని ఆరోపిస్తున్నారు. వాస్తవానికి పాశ్చాత్య దేశాల్లోనే హింసాత్మక ధోరణులున్నాయి. అమెరికాలోని కళాశాలల్లో, పాఠశాలల్లో అక్కడివారే అక్కడి వారిని హతమారుస్తున్నారు. మహ్మద్ ప్రవక్త బోధనలను పాటిస్తూ భవిష్యత్తును ఉజ్వలంగా చేసుకుందాం' అన్నారు.

భారత్ జిందాబాద్.. ఇరాన్ జిందాబాద్: ప్రసంగం ముగింపులో రౌహానీ.. ఇరాన్ జిందాబాద్, భారత్ జిందాబాద్, ఇరాన్ వర్ధిల్లాలి, భారత్ వర్ధిల్లాలి అనే నినాదాలు చేయడంతో కరతాళధ్వనులు మార్మోగాయి. ప్రార్థనల్లో ఉపముఖ్యమంత్రి మహమూద్ అలీ, వక్ఫ్‌బోర్డు ఛైర్మన్, ఎమ్మెల్సీ సలీం, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ, మైనారిటీ కమిషన్ ఛైర్మన్ ఖమురుద్దీన్ పాల్గొన్నారు.

కుతుబ్‌షాహీ సమాధుల నిర్మాణంపై ప్రశంస: రౌహానీ తన బృందంతో కలిసి గోల్కొండలోని కుతుబ్‌షాహీ సమాధులను సందర్శించారు. వాటి నిర్మాణాలు గొప్పగా ఉన్నాయని ప్రశంసించారు. పర్యాటకశాఖ కమిషనర్ సునీతాభగవత్, పురావస్తు సంచాలకురాలు విశాలాక్షి ఆయనకు స్వాగతం పలికి సమాధుల చరిత్రను వివరించారు. రెండు రోజుల రాష్ట్ర పర్యటన ముగించుకున్న రౌహానీ శుక్రవారం రాత్రి దిల్లీకివెళ్లారు. బేగంపేట విమానాశ్రయంలో ఆయనకు గవర్నర్ నరసింహన్, కేంద్ర విద్యుత్ మంత్రి ఆర్‌కే సింగ్, ఉపముఖ్యమంత్రి మహమూద్ అలీ ఘనంగా వీడ్కోలు పలికారు.

ఇక బోగీలపై రిజర్వేషన్ జాబితాలుండవు!

దిల్లీ: రైలు బోగీలపై మార్చి 1 నుంచి రిజర్వేషన్ జాబితాలను అతికించరు. ఏ1, ఏ, బి శ్రేణి స్టేషన్లలో ప్రయోగాత్మకంగా ఈ ప్రక్రియను విరమించుకోవాలని నిర్ణయించినట్లు రైల్వేశాఖ శుక్రవారం ప్రకటించింది. అన్ని జోన్లకు ఆదేశాలిచ్చింది. ఆర్నెల్లపాటు అధికారులు ప్రయోగాత్మకంగా అమలుచేస్తారు. ఆయా స్టేషన్లలో ప్లాస్మా తెరలపై రిజర్వేషన్ చార్టులను ప్రదర్శిస్తున్నందున- ప్రత్యేకంగా బోగీలపై జాబితాలను అతికించాల్సిన అవసరం ఉండదని రైల్వేశాఖ భావిస్తోంది.

మణిశంకర్ అయ్యర్‌పై రాజద్రోహం కేసు

కోటా (రాజస్థాన్): కాంగ్రెస్ బహిష్కృత నేత మణిశంకర్ అయ్యర్‌పై దేశద్రోహం, పరువునష్టం ఆరోపణలతో కేసు నమోదైంది. ఈనెల 11న కరాచీలో జరిగిన ఓ కార్యక్రమంలో భారత్‌ను అవమానపరుస్తూ, పాకిస్థాన్‌ను పొగుడుతూ ఆయన మాట్లాడారన్నది అభియోగం. కోటా జిల్లా భాజపా ఓబీసీ విభాగ అధ్యక్షుడు అశోక్ చౌదరి జిల్లా కోర్టులో వ్యాజ్యం వేశారు.

ఐదుగురు సైనికులను హతమార్చాం!: పాక్

ఇస్లామాబాద్: నియంత్రణ రేఖ వెంబడి తమ బలగాలు ఓ భారత సైనిక శిబిరాన్ని ధ్వంసం చేశాయని.. ఐదుగురు సైనికులను హతమార్చాయని పాక్ సైన్యం ప్రకటించుకుంది. దీన్ని భారత్ తోసిపుచ్చింది. దీనిపై దిల్లీలోని భారత సైనికాధికారి ఒకరు గట్టిగా జవాబిచ్చారు.

త్రిపురలో ప్రచారాలు ఇంతటితో సమాప్తం!

అగర్తలా: ప్రతిష్ఠాత్మకంగా మారిన త్రిపుర అసెంబ్లీ ఎన్నికల్లో ప్రచారహోరుకు శుక్రవారంతో తెరపడింది. భాజపా, వామపక్ష ఫ్రంట్, కాంగ్రెస్‌లు ప్రచారాలు సాగించాయి. 60స్థానాలకు ఈనెల 18న ఎన్నికలు జరగనున్నాయి.

పార్టీల ప్రచార సరళి..

భాజపా: ప్రధాని మోదీ, పార్టీ అధ్యక్షుడు అమిత్ షా వంటి ప్రముఖులు పాల్గొన్నారు. ఈసారి సీపీఎం-భాజపాల మధ్యే పోటీ ఉంటుందని ముఖ్యమంత్రి మాణిక్ సర్కారే చెబుతున్నారు. ఐపీఎఫ్‌టీతో పొత్తు పెట్టుకుని బరిలోకి దిగిన భాజపా.. 20 ఎస్టీ స్థానాల్లో లబ్ధి పొందవచ్చన్న ఆశాభావంతో ఉంది. కేంద్ర మంత్రి అరుణ్‌జైట్లీ త్రిపురపై దార్శనిక పత్రాన్ని విడుదల చేశారు.

వామపక్షం: పశ్చిమ బెంగాల్‌లో పట్టు కోల్పోయిన నేపథ్యంలో త్రిపురనైనా నిలబెట్టుకోవాలన్న లక్ష్యంతో ప్రచారం చేపట్టింది. సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరితో పాటు బృందా కారాట్, ప్రకాశ్ కారాట్, పశ్చిమ బెంగాల్ వామపక్ష ఫ్రంట్ కన్వీనర్ బిమన్ బోస్ తదితరులు పాల్గొన్నారు. ముఖ్యమంత్రి మాణిక్ సర్కార్ ఏకంగా 35 ర్యాలీల్లో పాల్గొన్నారు. ఆయన ధన్‌పుర్ నుంచి ఐదోసారి గెలవాలన్న లక్ష్యంతో బరిలోకి దిగారు.

కాంగ్రెస్: ఇంతవరకు త్రిపురలో వామపక్ష ఫ్రంట్‌కు ప్రధాన ప్రత్యర్థిగా ఉన్న కాంగ్రెస్ ఈసారి భాజపా నుంచి గట్టి పోటీ ఎదుర్కొంటోంది. శుక్రవారం కైలాసహర్‌లో రాహుల్ గాంధీ ప్రచారం నిర్వహించారు.

ఈనాడు

సమన్యాయానికి ఎత్తుపీట

నూట యాభయ్యేళ్లకు పైగా రగులుతున్న కావేరీ జల వివాదాన్ని పరిష్కరిస్తూ సుప్రీంకోర్టు త్రిసభ్య ధర్మాసనం ఇచ్చిన తాజా తీర్పు ఎంతో విలక్షణమైనది. కావేరి జీవనదే కాని, దానిపై వ్యాజ్యం చిరంజీవి కానక్కర్లేదంటూ నీటి వాటాల ప్రక్రియలో మౌలిక మార్పులకు చొరవ చూపాలన్న తమిళనాడు వాదనను మన్నిస్తున్న రీతిగా- దాని కేటాయింపులకే కోత పెట్టిన తీర్పు తమిళ తంబిని దిగ్భ్రాంతపరుస్తోంది. కరవు ఉరుముతున్న రోజుల్లో కూడా దిగువ రాష్ట్రానికి నిర్దిష్ట పరిమాణంలో నీటి సరఫరాలు సాగించాల్సిందేనన్న సుప్రీం ఆదేశాల్ని తరచూ బేఖాతరు చేసి మొట్టికాయలు వేయించుకొన్న కర్ణాటకకు తాజా న్యాయనిర్ణయంతో రొట్టె విరిగి నేతిలో పడ్డట్లయింది. ఎనుబోతుల న్యాయ వివాదంలో పిల్ల కక్షిదారులుగా తమకూ ఏ కొంచెమైనా మేలు జరగకపోతుందా అని ముందడుగు వేసిన కేరళ, పుదుచ్చేరి ఆశలపై నీళ్లు చల్లిన తీర్పు ఇది. దేశ సమగ్రత, సార్వభౌమత్వాలకు సంబంధించిన ఎలాంటి అంశాలూ ఈ వ్యాజ్యంలో లేనందున- స్వాతంత్ర్యానికి ముందు కాలానికి చెందినదైనప్పటికీ కావేరి వివాదాన్ని విచారించే న్యాయాధికారం తనకు ఉందని ధర్మాసనం స్పష్టీకరించింది. రాష్ట్రాలకు సమాన హోదా, సమన్యాయ సూత్రాల ఆధారంగానే కేసు పరిష్కారం సాగాలంటూ అంతర్రాష్ట్ర నదులు జాతి సంపదేనని, ఏ ఒక్క రాష్ట్రమూ నీటిపై ప్రత్యేక యాజమాన్య హక్కును ప్రకటించుకోజాలదని తీర్మానించింది. ఏ రాష్ట్రంవారైనా ప్రజల తాగునీటి అవసరాలకే తొలి ప్రాధాన్యం దక్కితీరాలంటూ కేరళ జలవిద్యుత్ ఆకాంక్షల్ని తోసిపుచ్చిన ధర్మాసనం- కావేరీ ట్రైబ్యునల్ ఆదేశాల్ని సవరించి మరీ బెంగళూరు మహానగరం దాహార్తి తీర్చేందుకు మరో 4.75 శతకోటి ఘనపుటడుగు(టీఎమ్‌సీ)ల వాటాను కేటాయించింది. తమిళనాట కావేరీ బేసిన్‌లో ట్రైబ్యునల్ పరిగణనలోకి తీసుకోని 20 టీఎమ్‌సీల భూగర్భ జలాల్లో 10 టీఎమ్‌సీల్ని ఆ రాష్ట్రం వాడుకోగల వీలుందంటూ, మొత్తం 14.75 టీఎమ్‌సీల్ని కర్ణాటకకు అదనంగా కేటాయించింది. తమకు అన్యాయం జరిగిందని తమిళనాడు ఆక్రోశిస్తుంటే, ఇప్పటికి న్యాయం దక్కిందని కన్నడసీమ ఆనందంతో కదం తొక్కుతోంది!

మునుముందు నీటికోసం యుద్ధాలు తప్పవన్న భవిష్యవాణిని కొన్నేళ్లుగా కర్ణాటక-తమిళనాడు కళ్లకు కడుతూనే ఉన్నాయి. దశాబ్దాలుగా తమిళనాడు కోరుతున్న కావేరి జలవివాద ట్రైబ్యునల్ ఏర్పాటు చెయ్యాలని 1990 మే నెలలో సుప్రీంకోర్టు కేంద్రాన్ని ఆదేశించింది. అదే సంవత్సరం జూన్‌లో ఏర్పాటైన ట్రైబ్యునల్ 17 ఏళ్ల సుదీర్ఘ విరామం తరవాత 2007 ఫిబ్రవరిలో అవార్డు ప్రకటించింది. 1892, 1924 సంవత్సరాల్లో ఇరు రాష్ట్రాల మధ్య కుదిరిన ఒప్పందాలకు విలువ ఉందంటూ, కావేరిలోని 740 టీఎమ్‌సీల జలరాశిలో తమిళనాడుకు 419 టీఎమ్‌సీలు, కర్ణాటకకు 270 టీఎమ్‌సీలు, కేరళకు 30, పుదుచ్చేరికి ఏడు టీఎమ్‌సీల కేటాయింపుల్ని ట్రైబ్యునల్ ఖరారు చేసింది. స్వాతంత్ర్యానికి పూర్వం జరిగిన ఒప్పందాలకు చెల్లుబాటు లేదు పొమ్మన్న సుప్రీంకోర్టు- పర్యావరణ పరిరక్షణ నిమిత్తం కర్ణాటకకు కేటాయింపులు పెంచి, తాజా సర్దుబాటు వచ్చే పదిహేనేళ్ల కాలానికి వర్తిస్తుందని వెల్లడించింది. తమ పరగణాలో రెండు పంటలు సాగవుతున్నా ఒక్క పంటనే పరిగణనలోకి తీసుకొని ట్రైబ్యునల్ నీటి కేటాయింపులు జరిపిందని వాదించిన తమిళనాడు, తన కోటాను పెంచడంతోపాటు నీటి యాజమాన్య బోర్డును ఏర్పాటుచేసి తమ వాటా సక్రమంగా విడుదల చేసేలా చూడాలని గట్టిగా కోరింది. ట్రైబ్యునల్ అవార్డును గెజిట్‌లో ప్రచురించడానికే ఆరేళ్ల సమయం తీసుకొన్న కేంద్రంపై తమకు విశ్వాసం లేదంటూ నిర్వహణ బోర్డును అవతరింపజేయాలని ధర్మాసనానికి పదేపదే విన్నవించింది. దిగువ రాష్ట్రం నీటి దిగులు తీర్చేలా నిర్వహణ యంత్రాంగానికి 'సుప్రీం' తథాస్తు పలకడంతో- ఇకపై రాజకీయ కోలాటాలకు తెరపడనుంది!

'రైతులు తమిళులా, కన్నడిగులా అన్నది కాదు; సమస్త రైతాంగ ప్రయోజనాలు ముఖ్యం' అని కావేరి జలవివాద వ్యాజ్యంలోనే పదిహేనేళ్ల క్రితం సుప్రీంకోర్టు జాతీయతాస్ఫూర్తికి ఎత్తుపీట వేసింది. తాజాగా సమన్యాయ సూత్రాన్ని ఔదలదాలుస్తూ ధర్మాసనం వెలువరించిన నిర్ణయం- నీటితో నిప్పును రాజేసే నికృష్ట రాజకీయాలకు చెల్లుకొట్టడంతోపాటు, యావత్ సేద్య ప్రణాళికల్లోనూ శాస్త్రీయ మార్పునకు ప్రోది చేసేది కావాలి! కావేరి బేసిన్‌లో క్షేత్రస్థాయి స్థితిగతుల్ని అధ్యయనం చేసేందుకు కేంద్ర జల సంఘం అధ్యక్షుడి సారథ్యంలో 'సుప్రీం' ఏర్పాటు చేసిన కమిటీ 2016 అక్టోబరులో ఆందోళనకర నివేదిక సమర్పించింది. పంట కాలంలో పొలాల్ని నీటితో నింపడం అనే కాలంచెల్లిన అశాస్త్రీయ విధానాన్ని రైతులు అనుసరిస్తున్నారని, పర్యవసానంగా కాటక పరిస్థితుల్లో దిక్కుతోచక ఆత్మహత్యలకూ పాల్పడుతున్నారని ఆ కమిటీ నిర్ధారించింది. పొలాలకు నీరు అందించే కాల్వల వ్యవస్థ శతాబ్ద కాలంనాటిదని, నీటిని గరిష్ఠ స్థాయి వినియోగానికి వీలుగా వాటిని ఆధునికీకరించడం, గొట్టాల ద్వారా నీటి పంపిణీ, సూక్ష్మ సేద్యాలపై దృష్టి పెట్టాలనీ సూచించింది. వివాదాలు మాని వినియోగంపై దృష్టిపెడితే నీటికొరత ఎదుర్కొంటున్న రాష్ట్రాలకు నిజంగా మేలు జరుగుతుందనడంలో మరోమాట లేదు. నిర్వహణ సరిగ్గా లేక భారీ రిజర్వాయర్ల సామర్థ్యమూ గణనీయంగా కోసుకుపోయిన నేపథ్యంలో కేంద్రం ప్రతిపాదిస్తున్న దిద్దుబాటు చర్యలు సత్వరం పట్టాలకెక్కక తప్పదు. ఈలోగా రైతుల్లో శాస్త్రీయ దృక్పథం పెంచి, పరిమిత నీటి వినియోగంతోనే గరిష్ఠ దిగుబడులు ఒడిసిపట్టే మెలకువల్ని మప్పాలి. దుర్రాజకీయాల్ని పక్కనపెట్టి జాతీయతా స్ఫూర్తితో రాష్ట్రాలు కలిసి సాగితే జీవనదులు జాతి సౌభాగ్య ప్రదాతలవుతాయి!

పారు బాకీల జోరుతో బేజారు



తుమ్మల కిశోర్

ప్రభుత్వరంగ బ్యాంకు (పీఎస్‌బీ)ల మొండిబాకీల సమస్య నానాటికీ తీవ్రరూపం దాల్చుతోంది. ఒకవైపు ప్రభుత్వం, రిజర్వు బ్యాంకు మరోవైపు వాణిజ్య బ్యాంకులు నిరర్థక ఆస్తుల భారాన్ని తగ్గించేందుకు శతవిధాల ప్రయత్నిస్తున్నప్పటికీ- మొండిబాకీలు ఆందోళనకర స్థాయికి చేరుతున్నాయి. సమీప భవిష్యత్తులో పీఎస్‌బీల మొండిబాకీలు మరింతగా పెరిగే సూచనలు కనిపిస్తున్నాయి. మొండి బాకీలపై అధిక 'ప్రొవిజనింగ్'(కేటాయింపులు) చేయాల్సి రావడంతో అధికశాతం పీఎస్‌బీలు నష్టాలబాట పడుతున్నాయి. కొన్ని బ్యాంకులు అత్తెసరు లాభాలతో సరిపెట్టుకోవలసి వస్తోంది. ఇటీవల కొన్ని ప్రముఖ ప్రభుత్వ రంగ బ్యాంకులు ప్రకటించిన మూడో త్రైమాసిక (అక్టోబరు-డిసెంబర్) ఆర్థిక ఫలితాలను పరిశీలించినట్లయితే- మున్ముందు అవి మరింత గడ్డు పరిస్థితి ఎదుర్కోవాల్సి వస్తుందని అర్థమవుతుంది.

పెచ్చరిల్లుతున్న నష్టాలు

దేశంలో అతిపెద్ద వాణిజ్య బ్యాంకైన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్థూల నిరర్థక ఆస్తులు మూడో త్రైమాసికంలో రూ.1,99,141 కోట్లకు పెరిగాయి. మొత్తం రుణాల్లో నిరర్థక ఆస్తుల శాతం 10.35 శాతానికి చేరింది. రెండో త్రైమాసికంలో స్థూల నిరర్థక ఆస్తులు 9.83 శాతం ఉన్నాయి. మొండిబాకీలపై భారీగా ప్రొవిజనింగ్ చేయడంవల్ల ఎస్‌బీఐ నష్టాల బాట పట్టింది. గడచిన త్రైమాసికంలో మొండిబాకీలపై రూ.17,760 కోట్ల కేటాయింపులు చేయాల్సి రావడంతో రూ.2,416 కోట్ల భారీ నికర నష్టాన్ని చవిచూసింది. అదే విధంగా బ్యాంక్ ఆఫ్ బరోడా స్థూల నిరర్థక ఆస్తులు రూ.46,307 కోట్ల నుంచి రూ.48,480 కోట్లకు పెరిగాయి. ఈ మొండిబాకీలపై చేసిన కేటాయింపులు ఏకంగా రూ.1,638 కోట్ల నుంచి రూ.3,155 కోట్లకు ఎగబాకడంతో బ్యాంకు నికరలాభం 56 శాతం మేర క్షీణించింది. బ్యాంక్ ఆఫ్ ఇండియా స్థూల నిరర్థక ఆస్తులు సైతం రూ.49,307 కోట్ల నుంచి రూ.64,248 కోట్లకు చేరుకున్నాయి. వీటిపై రూ.4,373 కోట్ల దాకా కేటాయింపులు జరపడంతో గడచిన త్రైమాసికానికి ఈ బ్యాంకు రూ.2,341 కోట్ల నికర నష్టం చవిచూడాల్సి వచ్చింది. పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) స్థూల నిరర్థక ఆస్తులు 13.31 శాతం నుంచి 12.11 శాతానికి తగ్గడంతో రూ.230 కోట్ల నికర లాభం ఆర్జించింది. ఇప్పటిదాకా దాదాపు 16 పీఎస్‌బీలు వాటి త్రైమాసిక ఆర్థిక ఫలితాలను ప్రకటించగా వాటిలో మూడు (పీఎన్‌బీ, బ్యాంక్ ఆఫ్ బరోడా, ఇండియన్ బ్యాంక్) మినహా మిగిలిన బ్యాంకులు నష్టాల బాటపట్టాయి. వాటి మొండిబాకీలు అనూహ్యంగా పెరగడంవల్లే భారీ నష్టాలు చవిచూడాల్సి వచ్చింది. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్యాంక్ ఆఫ్ ఇండియా గడచిన ఆర్థిక సంవత్సరంలో ప్రకటించిన స్థూల, వాస్తవ నిరర్థక ఆస్తులకు మధ్య వ్యత్యాసాన్ని ఆర్‌బీఐ గుర్తించడంతో ఈ బ్యాంకులు మొండిబాకీలపై భారీ కేటాయింపులు చేయాల్సివచ్చింది. ఫలితంగా అవి నష్టాల పాలయ్యాయి. యూకో బ్యాంకు, కార్పొరేషన్ బ్యాంకు, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఓబీసీ, సిండికేట్ బ్యాంక్, ఆంధ్రా బ్యాంకులూ నష్టాలు మూటకట్టుకోవాల్సిన పరిస్థితి నెలకొంది.

మొండిబాకీలు అదుపు తప్పి మరింత పెరిగినట్లయితే గతంలో ప్రభుత్వం పీఎస్‌బీలకు ప్రకటించిన రూ.2.11లక్షల కోట్ల మూలధన ప్యాకేజీ కూడా సరిపోకపోవచ్చు. గడచిన సెప్టెంబర్ 30 నాటికి పీఎస్‌బీల మొండి బకాయిలు రూ.7.33 లక్షల కోట్లుండగా 2018 మార్చినాటికి ఆ మొత్తం ఎనిమిది లక్షల కోట్ల రూపాయలను దాటే ప్రమాదముంది. మొత్తం బ్యాంకుల 'స్ట్రెస్డ్ అసెట్స్' (మొండిబాకీలు +పునర్వ్యవస్థీకరించిన ఖాతాలు) రూ.10 లక్షల కోట్లకు చేరే అవకాశం ఉంది. ముఖ్యంగా విద్యుత్, మౌలికరంగాలు, టెలి కమ్యూనికేషన్, స్థిరాస్తి సహా పలు రంగాల్లో మొండిబాకీలు మరింత పెరిగే సూచనలున్నాయి.



రైతన్న నిజాయతీ



కార్పొరేట్ సంస్థలు, దిగ్గజ పారిశ్రామికవేత్తలు మొండి బాకీల చట్రం నుంచి బయటపడేందుకు పలు పథకాలను అమలు చేస్తూ రాయితీలను అందిస్తున్న బ్యాంకులు, పంట రుణాలు తీసుకున్న చిన్న, సన్నకారు రైతుల విషయంలో మాత్రం పెద్దగా వెసులుబాటు కల్పించడం లేదు. దశాబ్దాలుగా భూమినే నమ్ముకొని వ్యవసాయంపైనే ఆధారపడి అర్ధాకలితో అష్టకష్టాలు పడుతూ దేశజనాభాకు వ్యవసాయోత్పత్తులు అందిస్తున్న అన్నదాతకు ఏటికేడు రుణభారం పెరుగుతోంది. ఒకవైపు ప్రకృతి వైపరీత్యాలు, మరోవైపు నకిలీ విత్తనాల ఉత్పాతం, గిట్టుబాటు కొరత వంటి పలు సమస్యలతో దేశ రైతాంగం అప్పుల ఊబిలో కూరుకుపోతోంది. రిజర్వు బ్యాంక్ గణాంకాల ప్రకారం 2016 నాటికి వ్యవసాయ రంగ రుణాల్లో రూ.48 వేల కోట్ల మేర మొండి బాకీలున్నాయి. 2017 మార్చి నాటికి ఆ మొత్తం రూ.60వేల కోట్లకు పెరిగింది. అయినప్పటికీ మొత్తం వ్యవసాయరంగ రుణాల్లో నిరర్థక ఆస్తులు కేవలం ఆరు శాతమే. కార్పొరేట్ రంగ రుణాల్లో అది 21 శాతం పైగా ఉంది. రుణ చెల్లింపుల విషయంలో దేశ రైతాంగం ఎంత నిజాయతీగా వ్యవహరిస్తోందో వెల్లడిస్తున్న గణాంకాలివి.

ప్రభుత్వ రంగ బ్యాంకుల నికర నష్టాలు

బ్యాంకు	రూ.కోట్లలో
స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా	2,416
బ్యాంక్ ఆఫ్ ఇండియా	2,341
అలహాబాద్ బ్యాంక్	1,264
యూకో బ్యాంక్	1,016
కార్పొరేషన్ బ్యాంక్	1,240
సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా	1,664
ఓరియంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్	1,969
ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్	971
సిండికేట్ బ్యాంక్	870
యునైటెడ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా	638
బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర	597
సిండికేట్ బ్యాంక్	870
ఆంధ్రాబ్యాంక్	532
దేనా బ్యాంక్	380

(31-12-2017 నాటికి)

గత ఆర్థిక సంవత్సరంలో రద్దు చేసిన ఎన్‌పీఏల విలువ

	రూ.కోట్లలో
ఎస్‌బీఐ	20,339
పీఎన్‌బీ	9,205
బీఓఐ	7,346
కెనరాబ్యాంకు	5,545
బ్యాంక్ ఆఫ్ బరోడా	4,348
కార్పొరేషన్ బ్యాంకు	3,574
ఐఓబీ	3,066
ఐడీబీఐ	2,868

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో సెప్టెంబర్ 30 నాటికి అన్ని పీఎస్‌బీలు మొత్తంగా రద్దు చేసిన మొండిబాకీల విలువ రూ.53,625 కోట్లు

మొండిబాకీల భారాన్ని తగ్గించుకొనేందుకు ప్రభుత్వ రంగ బ్యాంకులు శతవిధాలుగా ప్రయత్నిస్తున్నాయి. ప్రభుత్వం పలు సంస్కరణలు చేపట్టింది. నిరంతర పర్యవేక్షణతో ఆర్‌బీఐ ఎప్పటికప్పుడు దిద్దుబాటు చర్యలు చేపడుతూనే ఉంది. అయినా మొండిబాకీల సమస్య కార్చిచ్చులా విస్తరిస్తూనే ఉంది. కార్పొరేట్ రంగంలో మొండిబాకీలు తగ్గించేందుకు గతంలో బ్యాంకులు పలు పథకాలు అమలుచేశాయి. రుణ ఖాతాల పునర్వ్యవస్థీకరణతోపాటు ఎస్‌డీఆర్ (వ్యూహాత్మక రుణ పునర్వ్యవస్థీకరణ), ఎస్4ఏ (స్కీమ్ ఫర్ సస్టెయినబుల్ స్ట్రక్చరింగ్ ఆఫ్ స్ట్రెస్డ్ అసెట్స్) వంటి పథకాల అమలుద్వారా మొండిబాకీల తీవ్రతను తగ్గించుకొనే ప్రయత్నం చేశాయి. కొన్నింటిని ఏఆర్‌సీ(అసెట్ రీకన్‌స్ట్రక్షన్ కంపెనీ)లకు అమ్మి నిరర్థక ఆస్తులను తగ్గించుకొనే ప్రయత్నాలు చేశాయి. ఇంకా చేస్తున్నాయి. దివాలా చట్టం (ఇన్‌సాల్వెన్సీ అండ్ బ్యాంక్రప్టసీ కోడ్) అమలుతో బ్యాంకులు వాటి మొండిబాకీలను నిర్దిష్ట కాలపరిమితిలోపు ఎన్‌సీఎల్‌టీ (నేషనల్ కంపెనీ లా ట్రైబ్యునల్) ద్వారా వసూలు చేసుకొనే వెసులుబాటు కలిగింది. అయినప్పటికీ బ్యాంకుల మొండిబాకీల పెరుగుదలకు అడ్డుకట్ట పడకపోగా మరింత జటిలమవుతోంది.

మరింత గడ్డుకాలం

గతంలో బ్యాంకులు సామదాన దండోపాయాలను ప్రయోగించినా వసూలుకాని కొన్ని కార్పొరేట్ మొండిబాకీలను రద్దు చేశాయి. ఏటా రద్దులపర్వం కొనసాగుతూనే ఉంది. గతంలో కొన్ని బ్యాంకులు ఇష్టానుసారంగా పద్దులు రద్దు చేసి కొన్ని కార్పొరేట్ సంస్థలకు లబ్ధి చేకూర్చే విధంగా వ్యవహరించాయి. వాస్తవానికి బకాయిల రద్దు అరుదైన సందర్భాల్లోనే జరగాలి. సాంకేతికంగా రద్దు చేసినప్పటికీ వసూళ్ల ప్రయత్నాలు కొనసాగుతూనే ఉంటాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఈ పద్దుల రద్దు మరింత పెరిగే అవకాశం ఉంది. బ్యాంకులు చేసిన బకాయిల రద్దులో అధిక శాతం కార్పొరేట్ రంగానికి చెందినవే. పీఎస్‌బీలు వాటి మొండిబాకీలను తగ్గించుకొనే లక్ష్యంతో పెద్దయెత్తున బకాయిల రద్దును చేపట్టాయి. అయినా ఆశించిన ఫలితాలు రాలేదు. ఆర్‌బీఐ గణాంకాల ప్రకారం గడచిన అయిదేళ్లలో బ్యాంకులు రూ.2.49 లక్షల కోట్ల మొండిబాకీలను రద్దు చేశాయి. గడచిన ఆర్థిక సంవత్సరంలో మొత్తం రూ.81,683 కోట్లను రద్దు చేశాయి.

ఇప్పటికే నష్టాల బాటపట్టిన బ్యాంకులతోపాటు మరిన్ని బ్యాంకులు మొండి బాకీల ఊబిలో కూరుకుపోయే ప్రమాదం ఉంది. గతంలో ఈ బ్యాంకులు పెద్దయెత్తున పునర్వ్యవస్థీకరించిన రుణఖాతాలు క్రమంగా మొండిబాకీలుగా మారుతుండటం ఆందోళన కలిగిస్తోంది. మూడో త్రైమాసికంలో పలు బ్యాంకుల మొండి బాకీలు పెరగడానికి ఇదీ ఒక కారణం. ఇకపోతే బాండ్లపై వడ్డీ రేట్లు హెచ్చడం వల్ల బ్యాంకుల ట్రెజరీ కార్యకలాపాలపై వచ్చే ఆదాయం గణనీయంగా తగ్గనుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో చాలా బ్యాంకులు వాటి ట్రెజరీ కార్యకలాపాలపైన నష్టాలు చవిచూడాల్సిన పరిస్థితి రావచ్చు. ముఖ్యంగా మొండిబాకీల వసూళ్ల ప్రక్రియను మరింత వేగవంతంచేసే దిశలో తాజాగా రిజర్వుబ్యాంకు కఠిన నిబంధనలు రూపొందించిన దృష్ట్యా- పీఎస్‌బీల మొండిబాకీలు మరింత పెరిగే అవకాశం ఉంది. ప్రస్తుతం మొండిబాకీలు తగ్గించేందుకు బ్యాంకులు అమలు చేస్తున్న పలు రుణ పునర్వ్యవస్థీకరణ పథకాలకు రిజర్వుబ్యాంకు ముగింపు పలికింది. అంతేకాక పెద్ద కార్పొరేట్ రుణాలపై ఆర్‌బీఐ పర్యవేక్షణ అధికం కానుంది. ఆర్‌బీఐ విడుదల చేసిన తాజా నిబంధనలు దీర్ఘకాలంలో బ్యాంకుల మొండిబాకీలను అరికట్టేందుకు దోహదపడతాయి!


(రచయిత- బ్యాంకింగ్ రంగ నిపుణులు)

పరీక్షా సమయం

'పరీక్ష' అనే మూడక్షరాలు విద్యార్థుల జీవితాల్ని శాసిస్తున్నాయి! వాటిని ధిక్కరించే ధోరణులూ దేశంలో ప్రబలుతున్నాయి. ఉత్తర్ ప్రదేశ్ పరిస్థితే దీనికి తాజా ఉదాహరణ. ఆ రాష్ట్రంలో కొనసాగుతున్న పది, పన్నెండు తరగతుల పరీక్ష తొలి నాలుగు రోజుల్లో వాటికి డుమ్మాకొట్టిన వారి సంఖ్య పది లక్షలు దాటింది! అక్రమాల నిరోధానికి గట్టి చర్యలు చేపడుతున్నట్లు ప్రభుత్వం ప్రకటించడమే దీనికి కారణమని ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ చెబుతున్నారు. 'పరీక్షలనేవి అభ్యర్థుల్ని అదే పనిగా భయపెట్టకూడదు. చూచిరాతల సంస్కృతిని అవి పెంచి పోషించడమూ తగదు. ప్రధాని నరేంద్ర మోదీ ఆశించే పోరాట యోధులు (ఎగ్జామ్ వారియర్స్) కావాలే కానీ- భయాందోళనతో పరీక్ష ఎగ్గొట్టేవారు, ఏదోవిధంగా గట్టెక్కాలని ప్రయత్నించేవారు కాదు' అని ఆయన వ్యాఖ్యానించడం వెనక ఎంతో అంతరార్థముంది. యూపీలో అభ్యర్థుల మూకుమ్మడి గైర్హాజరు ఇదే ప్రథమం కాదు. నిరుడు అయిదు లక్షలమంది, అంతకుముందు ఏడాది దాదాపు ఆరున్నర లక్షలమంది అక్కడ పరీక్షలు రాయలేదు. ముఖ్యంగా ఆంగ్ల, గణిత పాఠ్యాంశాలంటే వారికి గుండెదడ. పరీక్షలకు మొహం చాటేసినవారిలో ఎక్కువమంది, తరగతుల్లో ఎప్పుడో తప్ప కనిపించని అతిథులు! పరీక్షల్లో దండయాత్రలు వారికి ఓ అలవాటు. ఉత్తీర్ణత కోసం ఎన్ని చట్టవిరుద్ధ పనులకైనా పాల్పడేవారున్నారు. 'అసలు ఈ పరీక్షల వ్యవస్థే ఆసాంతం మారి తీరాలి. లేకుంటే భవిష్యత్తులో ఏమవుతుందో...' అన్నది ఒక్క యూపీ సీఎంనే కాదు- అందరి మదినీ తొలుస్తున్న ప్రశ్న!

మాఫియా విజృంభణ

'ఈ చదువులేమిటో, ఈ పరీక్షలెందుకో' అంటూ పెదవి విరిచేవారే అంతటా కనిపిస్తారు. పరీక్షలు అనగానే 'భారతరత్న' ఆచార్య సీఎన్ఆర్ రావు గుర్తుకొస్తారు. పదేళ్లు నిండక ముందే సెకండరీ పరీక్షల్లో ప్రథములుగా ఉత్తీర్ణులైన మేధావి ఆయన. పదిహేడేళ్లకే డిగ్రీ పట్టా సాధించి, మైసూరు విశ్వవిద్యాలయంలో సరికొత్త రికార్డు సృష్టించారు. ప్రపంచవ్యాప్తంగా 63 వర్సిటీల నుంచి గౌరవ డాక్టరేట్లు అందుకున్న రావు దృష్టిలో- ఇండియాలో పరీక్షల వ్యవస్థే తప్ప విద్యావ్యవస్థ లేదు. అదీ 'నానాటికీ తీసికట్టు' బాపతు! భ్రష్టుపట్టడం అంటే ఏమిటో, మన పరీక్షల విధానాన్ని చూస్తే ఇట్టే అర్థమవుతుంది. ఆ తరహా మాఫియాకు పెట్టింది పేరు- బిహార్. అక్కడ రెండేళ్లనాడు ప్రభుత్వం పట్టు బిగించడంతో, పరీక్షల్లో మూడింట రెండొంతుల మంది వైఫల్యం బయటపడింది. ఆ రాష్ట్రంలో ముందుగానే కాసుల వేట మొదలవుతుంది. ప్రశ్నపత్రాలు అంగడి సరకుగా మారతాయి. పరీక్ష కేంద్రాల ఎంపికలో అడ్డగోలు వ్యవహారాలన్నీ చోటుచేసుకుంటాయి. ఆయా చోట్ల 'పర్యవేక్షకులు'గా ఎవరెవర్ని ఉంచాలో ముందుగానే నిర్ణయించుకుంటారు. అదను చూసి, మూడో కంటికి తెలియకుండా అభ్యర్థులకు సమాధానాల్ని చేరవేస్తారు. ఆ పత్రాల్ని దిద్దే సమయం (మూల్యాంకనం)లోనూ మార్కుల ప్రదానాలు అలవోకగా జరిగిపోతాయి. వీటన్నింటికీ పై యెత్తున 'సహాయ సహకారాలు' ఉండనే ఉంటాయి. బిహార్‌లో పరీక్షల నిర్వహణ సవాలుగా మారిందని మూడేళ్ల క్రితం ప్రభుత్వమే పేర్కొంది. 'చూచిరాతల పోటీల'ను అరికట్టలేకపోతున్నామని నాటి విద్యాశాఖ మంత్రే అంగీకరించడం వ్యవస్థ దురవస్థను చాటుతోంది. గతేడాది నకిలీ ధ్రువపత్రాలతో పన్నెండో తరగతి పరీక్షలకు హాజరైన విద్యార్థే సంబంధిత విభాగంలో టాప్ ర్యాంకర్‌గా నిలవడం మరీ ఘోరం. యూపీ, బిహార్‌లతో పాటు మధ్యప్రదేశ్, రాజస్థాన్, హరియాణా, పశ్చిమ్ బంగ రాష్ట్రాల్లో కాపీల మాఫియా వ్యాపార



చూచిరాతల పోటీ!

పరిమాణం వేలాది కోట్ల రూపాయలకు విస్తరించింది.

ఉభయ తెలుగు రాష్ట్రాల్లో చూచిరాతల వంటి పరీక్షల అక్రమాలకు లెక్కే లేదు. పదో తరగతి, ఇంటర్ పరీక్షల్లో సామూహిక కాపీల వల్ల విద్యాప్రమాణాలు పూర్తిగా దిగజారుతున్నాయని ఉమ్మడి ఉన్నత న్యాయస్థానం ఇటీవల వ్యాఖ్యానించింది. కాపీరాయుళ్లపై కేసులు నమోదు చేయకుండా, పరీక్షల అవకతవకల్ని ఎలా అరికట్టగలరని ప్రభుత్వాల్ని సూటిగా ప్రశ్నించింది. నిరుడు పదో తరగతి పరీక్షలకు సంబంధించి తెలంగాణలో నాలుగు, ఆంధ్రప్రదేశ్‌లో ఒకే ఒక కేసు నమోదు కావడం పట్ల ధర్మాసనం విస్మయం వ్యక్తపరచింది. 'చూచిరాతల్ని అరికట్టే చట్టం ఒకటి ఉందని తెలుసా' అంటూ హైకోర్టు అప్పట్లోనే నిలదీసింది. పరీక్ష గదుల్లో సీసీ కెమెరాల ఏర్పాటు ప్రక్రియ ఇప్పటికీ ఆశించినంతగా పుంజుకోలేదు. వాటి నిర్వహణ వ్యయాన్ని ఎవరు భరించాలన్న అంశంపైనే ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల మధ్య నేటికీ చర్చలు సాగుతున్నాయి. కాపీయింగ్‌కు అవకాశమే లేని విధానాన్ని ప్రవేశపెడుతున్నామని రెండు రాష్ట్రాలూ చెప్పినప్పటికీ, అటువంటివేవీ ఇంకా ఆచరణకు రాలేదు. ఎంపిక చేసిన పాఠశాలల్లో- పరీక్షల నిర్వహణ ప్రక్రియ అంతటినీ ప్రయోగాత్మకంగా వీడియో రికార్డింగ్ చేయాలన్నదీ కార్యరూపం ధరించలేదు. గుజరాత్‌లో అమలవుతున్న ఆ పద్ధతిని అనుసరించడంలో తాత్సార ధోరణి కనిపిస్తోంది. తెలంగాణలో ప్రభుత్వ గుర్తింపు లేని పాఠశాలల యాజమాన్యాలు కొన్ని- తమ విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాసేలా తప్పుడు పత్రాలు సృష్టించాయి. దీని వెనక విద్యాశాఖలోని కొందరి హస్తం ఉందని తేలడం వ్యవస్థ వైఫల్యానికి సూచిక. 'విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటే ఖబడ్దార్' అని ఏపీ ప్రభుత్వం గతంలోనే హెచ్చరించింది. నెల్లూరులో గత సంవత్సరం పదో తరగతి ప్రశ్నపత్రం వాట్సాప్‌లో ప్రత్యక్షమైంది. దోషుల్ని వదిలిపెట్టేది లేదని ఎవరేమి చెప్పినా ఆచరణలో ఆ వేగం కనిపించలేదు. మైక్రో ఫోన్, బ్లూటూత్ వంటి ఆధునిక పద్ధతుల వినియోగంతో 'హైటెక్ కాపీయింగ్' రెండు రాష్ట్రాల్లోనూ కొన్నిచోట్ల సాగుతోంది. ఆయా పరికరాలతో పరీక్ష గదిలోకి వెళ్లేందుకు కొందరు ప్రత్యేకంగా తయారు చేయించిన చొక్కాల్ని నాలుగేళ్ల క్రితం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అలాంటి చొక్కాలే మొన్నీమధ్య బయటపడటం 'పరిస్థితి'లో ఎటువంటి మార్పూ రాలేదని స్పష్టీకరిస్తోంది.

అక్రమాలపై ఉక్కుపాదం

పరీక్షల సంస్కరణలు ప్రశ్నపత్రాల తయారీ దశ నుంచి మొదలు కావాలి. పేపర్లు బయటకు పొక్కాయంటే, అదంతా ఇంటిదొంగల పనే! ఆ గుట్టు రట్టు కావాలంటే, కొత్త చట్టాలు అవసరం లేదు. ప్రస్తుతం ఉన్న నిబంధనలకు పదును పెడితే, అక్రమాల పని పట్టగల వీలుంది. పరీక్ష కేంద్రాలు గల చోట్ల ఎత్తుగా ఉండే ప్రహరీలు నిర్మించడం, వివిధ సేవాసంస్థల భాగస్వామ్యంతో విరివిగా సీసీ కెమెరాలు ఏర్పాటుచేయడం- అక్రమాల్ని ఎంతో కొంత నిరోధిస్తాయి. నేలమీద, చెట్లకింద కూర్చొని పరీక్షలు రాయాల్సిన దుస్థితిని తొలగిస్తే తప్ప వ్యవస్థ బాగుపడదు. గదుల కేటాయింపులో జాగ్రత్తలు, నిరంతర పర్యవేక్షణ, ఎక్కడికక్కడ కేసుల నమోదు, చేపట్టే చర్యలపై ముందస్తు ప్రచారాల వల్ల లోటుపాట్ల పరిహరణకు అవకాశముంది. సొంత పాఠశాల లేదా కళాశాలలో కాకుండా వేరేచోట పరీక్ష రాయడానికి ఉద్దేశించిన జంబ్లింగ్ విధానమూ ఆచరణ లోపాలతో నీరుగారుతోంది. వీటన్నింటినీ చక్కదిద్దాలన్న సంకల్పం ప్రభుత్వాలకు ఉండాలి. అక్రమాలు చేసి పట్టుబడితే శిక్ష తప్పదన్న భయం అభ్యర్థుల్లో కలగాలి. ఈ రెండూ జతకూడినప్పుడే, చూచిరాతకు చెల్లుచీటీ!

- శరత్

రామకృష్ణ పరమహంస


ఆధ్యాత్మిక జాతీయోద్యమ రథసారథుల్లో అగ్రగామి రామకృష్ణ పరమహంస. ఆయన గురు అవతార పరంపరకు చెందిన మహోపదేశికులు. ప్రతి మతానికీ సత్యనిరూపణ చేసిన ఆత్మజ్ఞాన శోభితులు. రామకృష్ణుల చిన్ననాటి పేరు- గదాధరుడు. అమ్మవారి ఆలయంలో అర్చకత్వ విధి నిర్వర్తిస్తూ, గంటల తరబడి భజన గీతాలతో పాటు దేవీస్తోత్రం చేసేవారు. దైవం, భక్తి, జ్ఞానం అనే మూలాల మీద నిర్మితమైన భారతీయ సంస్కృతిని ప్రేరకంగా భావించారు. సమాజంలో మూఢనమ్మకాల్ని రూపుమాపేందుకు కంకణబద్ధులయ్యారు.

ఆయన జీవితం భగవంతుణ్ని ప్రత్యక్షంగా దర్శింపజేసే దర్పణం. భగవత్ తత్వం మూర్తీభవించిన మహామనీషిగా ఆయనను బాపూజీ ప్రస్తుతించారు. గాంధీజీ ప్రసంగాలకు రామకృష్ణుల తాత్విక ప్రేరణ ఎంతగానో ఉపయోగపడింది. 'తత్వబోధ ఆ గురుదేవులదే' అనేవారు స్వామి వివేకానంద.

భక్తి రహస్యాలు తెలుసుకున్న పరమహంస, ఆ తరవాత అద్వైత ఉపదేశం పొందారు. నిర్వికల్ప సమాధి స్థితిలో 'మాయ, భగవంతుడు' మధ్య గల అభేద స్థితిని అభివర్ణించారు. గార్హస్థ్యం, సన్యాసం- ఈ రెండూ ఆయన జీవితంలో సంభవించాయి. 'సంసారికైనా, సన్యాసికైనా త్యాగమనేది ఓ సులక్షణం. అప్పుడే ముక్తి సాధ్యమవుతుంది' అని భావించేవారు. ఏ బంధాలకు, ప్రలోభాలకు ప్రభావితం కాకుండా తన విధుల్ని తాను ధర్మబద్ధంగా నిర్వర్తించడమే మానవుడి కర్తవ్యమని ప్రబోధించారు.

ప్రతి స్త్రీనీ జగన్మాతగా భావించాలని రామకృష్ణులు చెబుతుండేవారు. మానవ జీవితానికి లక్ష్యం ధనార్జన కాదని, ధర్మార్జన అని చాటారు. 'నేను' అన్నది మానవుణ్ని భ్రమలోకి నెడుతుంది. అతడికి, దేవుడికి మధ్య ఉండే అడ్డుగోడ అదే... అంటూ సరళమైన, సుబోధకమైన కథల ద్వారా పరమ సత్యాల్ని వివరించారాయన.

శ్రద్ధ, ఏకాగ్రత వల్ల ధార్మిక సాధన సాధ్యమవుతుంది. మానవులందర్నీ నారాయణ స్వరూపులుగా భావించడమే నిజమైన జ్ఞానం. ప్రతి సాధకుడూ తన మనసును భగవంతుడికి అర్పించాలని రామకృష్ణులు సులభగ్రాహ్య రీతిలో ఉద్బోధించారు.



అంతర్యామి

నరేంద్రుణ్ని వివేకానందుడిగా తీర్చిదిద్దిన ఆయన, అందుకు తన శక్తినంతా ధారపోశారు. ప్రపంచానికి నవనవోన్మేషమైన మహావరాన్ని ప్రసాదించి లోకారాధ్యులయ్యారు. తన శిష్యుల్ని మంచి మాటలతో ఆకట్టుకొంటూ కర్తవ్యోన్ముఖం చేసేవారు. సత్ప్రవర్తన, ఆధ్యాత్మిక దృష్టి మనిషికి ఉచ్ఛ్వాస నిశ్వాసల వంటివి. ఆ పారమార్థిక జ్ఞాన గంగాప్రవాహంలో స్వార్థం, సంకుచితత్వం వాటంతట అవే కొట్టుకుపోతాయన్నది ఆయన బోధల సారాంశం.

కేశవచంద్ర సేన్, ఈశ్వర చంద్ర విద్యాసాగర్ వంటి మహనీయులెందరో పరమహంస ప్రబోధాలకు ప్రభావితులయ్యారు. ఆయన తనకు తాను ఏ గొప్పదనాన్ని, కీర్తిని ఆపాదించుకోలేదు. ఎవరు నమ్మిన సత్యాన్ని వారు అనుసరించాలని సలహా ఇచ్చేవారు. కనుమరుగవుతున్న ధర్మాన్ని తిరిగి పూర్వ వైభవంతో లోకమంతటా పరివ్యాప్తం చేయాలన్న తృష్ణ ఆయనలో పుష్కలంగా ఉండేది.

రామకృష్ణ పరమహంస గొంతువ్యాధితో బాధపడుతున్నప్పుడు, శారదామాత అపారమైన శుశ్రూష చేసేవారు. ఆయనకు ఆమె ప్రథమ శిష్యురాలు. ఆమెకు పతి, గురువు, మార్గ నిర్దేశకుడు, సర్వస్వం ఆయనే. ఆమె సూచన మేరకే వివేకానందులు అమెరికాకు వెళ్లి, తన వాగ్ధాటితో అక్కడివారిని మంత్రముగ్ధుల్ని చేశారు. రామకృష్ణుల సూక్తి 'వసుధైక కుటుంబం' ప్రపంచ వ్యాప్తమైంది.

మానవీయ విలువల్ని దేశభక్తి అనే సరోవరంలో కలువల్లా పూయించాలన్నదే రామకృష్ణుల సందేశం. ఆయన నిర్దేశనంలో దేశవిదేశాల్లో మఠాలు స్థాపితమయ్యాయి. ఆ అలౌకిక సాహిత్యాన్ని, సిద్ధాంతాల్ని అవి నేటికీ అంకితభావంతో ప్రచారం చేస్తున్నాయి.

- వేదప్రియ

డీసీసీబీలపై మల్లగుల్లాలు?

- పాలకవర్గాల పదవీకాలం నేటితో పూర్తి
- విచారణలు, ఆరోపణలున్న వారికి ఇవ్వరాదని గతంలో ఉత్తర్వు
- దాన్ని పక్కన పెట్టాలని రాజకీయ ఒత్తిళ్లు

ఈనాడు, హైదరాబాద్: జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) పాలకవర్గాల పదవీకాలం పొడిగింపు కోసం పెద్దయెత్తున రాజకీయ పైరవీలు సాగుతున్నాయి. కొందరు మంత్రులు ప్రత్యేక శ్రద్ధతో తమ జిల్లా పాలకవర్గాలకు పొడిగింపు ఉత్తర్వులిప్పించేందుకు తీవ్రంగా ఒత్తిడి తెస్తున్నారు. ఈ పాలకవర్గాల పదవీకాలం శనివారంతో ముగియనుంది. వీటిని మరో ఆరునెలలు పొడిగించాలని ఉత్తర్వులిచ్చిన రాష్ట్ర ప్రభుత్వం అవినీతి ఆరోపణలు, విచారణ ఎదుర్కొంటున్న వాటిని పొడిగించవద్దని షరతు పెట్టింది. దీంతో పొడిగింపు ఉత్తర్వుల జారీకి సహకార శాఖ వెనుకంజ వేస్తోంది. ఈ ప్రక్రియ వెనుక పకడ్బందీగా పైరవీల కథ సాగుతోంది. డీసీసీబీ పాలకవర్గానికి ఎన్నికైనవారంతా సదరు జిల్లా పరిధిలోని ఏదో ఒక 'ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం'(ప్యాక్స్) ఛైర్మన్‌గా ఉన్నవారే. ప్యాక్స్ పాలకవర్గాల పదవీకాలం ఈ నెల 3తోనే ముగిసింది. వాటికీ ఆరునెలల పొడిగింపునిస్తూ జారీచేసిన ఉత్తర్వులోనే డీసీసీబీ, జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ(డీసీఎంఎస్)ల పాలకవర్గాల పొడిగింపు విషయాన్ని ప్రభుత్వం తెలిపింది. అంటే ప్యాక్స్ పాలకవర్గానికి పొడిగింపు వస్తే ఆటోమేటిక్‌గా డీసీసీబీ పాలకవర్గంలో ఉన్నవారికీ వస్తుందని అందరూ ఆశించారు. కానీ అవినీతి ఆరోపణలు, విచారణలు ఎదుర్కొంటున్న 72 ప్యాక్స్ పాలకవర్గాలకు సహకార శాఖ పొడిగింపు ఇవ్వలేదు. రాజకీయ ఒత్తిళ్లతో కొన్నింటికి మాత్రం పొడిగింపునిచ్చింది. ఉదాహరణకు మెదక్ జిల్లా వెల్దుర్తి ప్యాక్స్‌లో నిధుల దుర్వినియోగంపై విచారణ జరగాల్సి ఉన్నా పొడిగింపు ఇచ్చేశారు. సూర్యాపేట జిల్లా కాపుగల్లు ప్యాక్స్‌దీ అదే పరిస్థితి. దీనికి పొడిగింపు ఉత్తర్వులివ్వడంతో నల్గొండ డీసీసీబీ పాలకవర్గం పదవీకాలం పొడిగింపునకు లైన్ క్లియర్ అయినట్టేనని భావిస్తున్నారు. ఖమ్మం డీసీసీబీ, కొన్ని జిల్లాల డీసీఎంఎస్‌ల పాలకవర్గాలకూ పొడిగింపు ఇవ్వడం ప్రభుత్వ ఉత్తర్వులకు విరుద్ధమంటున్నారు అధికారులు. ఎన్నికలొస్తున్న తరుణంలో ఇబ్బందులు రాకుండా ప్రస్తుత పాలకవర్గాలకే పొడిగింపు ఇప్పించేందుకు రంగం సిద్ధం చేసినట్లు తెలుస్తోంది.

రూ.5 వేలతో జీవనం ఎలా?

ఈనాడు, హైదరాబాద్: విద్యుత్ ప్రమాదంలో కుడిచేయి పూర్తిగా కోల్పోయిన ఓ 'కార్మికునికి' ఆఫీసు సబార్డినేట్ తాత్కాలిక పోస్టు కేటాయిస్తూ నెలకు వేతనం రూ.5 వేలుగా తెలంగాణ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఎస్పీడీసీఎల్) అధికారులు నిర్ణయించడంపై హైకోర్టు అభ్యంతరం తెలిపింది. ఆ కార్మికుడు ఓ గుత్తేదారు కింద పనిచేసేవారు. అతడి కుటుంబం నెలకు రూ.5 వేలతో ఎలా జీవనం సాగిస్తుందని హైకోర్టు ప్రశ్నించింది. కనీస వేతనం ఇచ్చే వ్యవహారమై పునఃపరిశీలన చేయాలని ఎస్పీడీసీఎల్ సీఎండీ, తదితరులకు స్పష్టంచేసింది. విచారణను మూడు వారాలకు వాయిదా వేసింది. ఉమ్మడి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సి.వి.నాగార్జునరెడ్డి, జస్టిస్ జి.శ్యాంప్రసాద్‌తో కూడిన ధర్మాసనం శుక్రవారం ఈ మేరకు ఆదేశాలు జారీచేసింది. నాగర్‌కర్నూల్ జిల్లా రాచూర్ గ్రామానికి చెందిన పి.వెంకటేశ్వర్లు 2011లో విద్యుత్ ప్రమాదానికి గురై కుడిచేయి కోల్పోయారు. ఈ వ్యవహారంపై విచారణ జరిపిన ధర్మాసనం.. పిటిషనర్ విద్యార్హతల ఆధారంగా తాత్కాలిక ఉద్యోగం ఇచ్చే వ్యవహారాన్ని మానవతా దృక్పథంతో పరిశీలించాలని అధికారులను ఆదేశించింది. ఉద్యోగం కల్పించే విషయంలో అధికారులు వెనుకాడటంతో వెంకటేశ్వర్లు కోర్టుధిక్కరణ వ్యాజ్యం దాఖలు చేశారు. శుక్రవారం ఈ వ్యాజ్యం మరోసారి విచారణకు వచ్చింది. పిటిషనర్ తరఫు న్యాయవాది డి.ఎల్.పాండు వేతనం రూ.5 వేలతో పిటిషనర్ కుటుంబ సభ్యులు బతకలేరని తెలపడంతో ధర్మాసనం ఈ ఆదేశాలు జారీ చేసింది.

ఇండియన్ ఆయిల్

IndianOil

మార్కెటింగ్ డివిజన్ — తెలంగాణ & ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యాలయం

రిటైల్ అవుట్ లెట్ (పెట్రోల్/డీజెల్ పంప్) కొరకు స్థలం కావలెను

ఈ దిగువ ప్రదేశములలో రిటైల్ అవుట్ లెట్లను నెలకొల్పుటకు ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ కు ఏకమొత్త విక్రయం/లీజు (కనీసం 20 సంవత్సరములు రెన్యూవల్ ఆప్షన్ తో సహా) విధానం ద్వారా స్థలమును బదిలీ చేయుటకు ఈ ప్రకటన వెలువడిన తేదీనాడు తమ స్వాధీనంలో చెల్లుబాటు అయ్యే మరియు స్పష్టమైన విక్రయించదగిన భూమిని కలిగివున్న ఆసక్తిగల పార్టీల నుండి రెండు విడివిడి కవర్లలో (ఒకదానిలో స్థలం యొక్క సాంకేతిక వివరాలు మరియు మరొకదానిలో ఫైనాన్షియల్ ఆఫర్ వున్న) సీల్డ్ ఆఫర్లు కోరబడుచున్నవి:

క్రమ సంఖ్య	స్థలం పేరు	రెవెన్యూ జిల్లా	స్థలం యొక్క కనీస కొలతలు (మీటర్లలో)	
			ముందు ప్రవేశం	లోతు
	డివిజనల్ ఆఫీస్: వరంగల్			
1	మంచిర్యాల పట్టణం మున్సిపల్ పరిధిలో	మంచిర్యాల	25	25
2	మంచిర్యాల RTO కార్యాలయం నుండి గుడిపేట వరకు NH పై	మంచిర్యాల	45	45
3	మందమర్రి పట్టణం	మంచిర్యాల	25	25
4	మందమర్రి నుండి బెల్లంపల్లి SH పై	మంచిర్యాల	30	30
5	బెల్లంపల్లి పట్టణం	మంచిర్యాల	25	25
6	బెల్లంపల్లి పట్టణం – తాండూర్ SH పై తాండూర్ నుండి 3 కి.మీ. లోపులో	మంచిర్యాల	30	30
7	గోలేటి X రోడ్ నుండి రెబ్బెన	కొమరం భీమ్	30	30
8	కాగజ్ నగర్ పట్టణం మున్సిపల్ పరిధిలో	కొమరం భీమ్	25	25
9	వాంకిడి పట్టణం	కొమరం భీమ్	25	25
10	కొత్వాల పట్టణం	కొమరం భీమ్	25	25
11	దహేగావ్	కొమరం భీమ్	20	20
12	బెజ్జూర్	కొమరం భీమ్	20	20
13	ఆదిలాబాద్ పట్టణం మున్సిపల్ పరిధిలో	ఆదిలాబాద్	25	25
14	ఇంద్రవెల్లి	ఆదిలాబాద్	20	20
15	ఇంధన్‌పల్లి	మంచెరియాల్	20	20
16	బాదన్ కుర్తి	నిర్మల్	20	20
17	కడెం	నిర్మల్	20	20
18	మామడ	నిర్మల్	20	20
19	నిర్మల్ పట్టణం భైంసా రోడ్‌పై మున్సిపల్ పరిధిలో	నిర్మల్	25	25
20	నిర్మల్ పట్టణం మంచిర్యాల్ రోడ్‌పై	నిర్మల్	25	25
21	కుబేర్	నిర్మల్	20	20
22	నేరేడికొండ NH 44 పై	ఆదిలాబాద్	45	45
23	భైంసా పట్టణం NH పై కాకుండా	నిర్మల్	20	20
24	ఆదిలాబాద్ నుండి సీతగొంది NH 44 పై ఎడమవైపు హైదరాబాద్ వైపు	ఆదిలాబాద్	45	45
25	గుడిహత్నూర్ నుండి సీతగొంది NH 44 పై ఎడమవైపు నాగపూర్ వైపు	ఆదిలాబాద్	45	45
26	సోనాల	నిర్మల్	20	20
27	ముధోల్ గ్రామం	నిర్మల్	20	20
28	జైనాథ్	ఆదిలాబాద్	20	20
29	ఉట్నూర్ X రోడ్ నుండి జైనూర్	ఆదిలాబాద్	20	20
30	ఇచ్చోడ పట్టణం	ఆదిలాబాద్	20	20
31	పాల్వంచ పట్టణ పరిధిలో కొత్తగూడెం–భద్రాచలం రోడ్‌పై NH 30 పై	కొత్తగూడెం భద్రాద్రి	45	45
32	కొత్తగూడెం పట్టణం పట్టణ పరిధిలో	కొత్తగూడెం భద్రాద్రి	25	25
33	ఎల్లందు పట్టణం మున్సిపల్ పరిధిలో	కొత్తగూడెం భద్రాద్రి	25	25
34	సారపాక జంక్షన్ నుండి నాగినేనిప్రోలు NH 30 పై	కొత్తగూడెం భద్రాద్రి	45	45
35	బూర్గంపహాడ్ పాల్వంచ నుండి సారపాక రోడ్ పై	కొత్తగూడెం భద్రాద్రి	25	25
36	పాల్వంచ పట్టణం కిన్నెరసాని రోడ్ పై NH పై కాకుండా	కొత్తగూడెం భద్రాద్రి	25	25
37	మణుగూరు (బండారుగూడెం) అశ్వాపురం నుండి ఎద్దుల బయ్యారం రోడ్‌పై	కొత్తగూడెం భద్రాద్రి	25	25
38	రామవరం గ్రామం కొత్తగూడెం నుండి చంద్రగూడెం రోడ్ పై	కొత్తగూడెం భద్రాద్రి	45	45
39	చర్ల గ్రామం పరిధిలో భద్రాచలం నుండి వెంకటాపురం రోడ్	కొత్తగూడెం భద్రాద్రి	25	25
40	కొత్తగూడెం న్యూపాల్వంచ కొత్త బైపాస్ రోడ్ పై	కొత్తగూడెం భద్రాద్రి	45	45
41	భద్రాచలం గ్రామపరిధిలో పర్ణశాల నుండి నెల్లిపాక రోడ్ పై	కొత్తగూడెం భద్రాద్రి	25	25
42	జూలూరుపాడు గ్రామం పరిధి ఎంకూర్ నుండి కొత్తగూడెం రోడ్ పై	కొత్తగూడెం భద్రాద్రి	25	25
43	కారేపల్లి గ్రామం పరిధిలో మెయిన్ రోడ్ పై	కొత్తగూడెం భద్రాద్రి	25	25
44	ఎద్దుల బయ్యారం గ్రామం పరిధిలో మణుగూరు నుండి–ఏటూరునాగారం రోడ్‌పై	కొత్తగూడెం భద్రాద్రి	25	25
45	గుత్తమల్లారం గ్రామ పరిధిలో అశ్వాపురం నుండి మణుగూరు రోడ్‌పై	కొత్తగూడెం భద్రాద్రి	25	25
46	మయూరి సెంటర్ & ఖమ్మం బైపాస్ జంక్షన్ మధ్యలోని బస్ డిపో రోడ్‌పై	ఖమ్మం	25	25
47	విశ్వనాథపల్లి గ్రామ పరిధిలో ఖమ్మం –ఎల్లందు రోడ్ పై	ఖమ్మం	25	25
48	బేతుపల్లి గంగారామ్ గ్రామం పరిధిలో ఖమ్మం – అశ్వారావుపేట SH42 పై	ఖమ్మం	35	45
49	వరంగల్ X రోడ్స్ నుండి తిరుమలాయపాలెం మధ్యలో ఖమ్మం–వరంగల్ రోడ్ పై	ఖమ్మం	25	25
50	రఘునాథపాలెం వైపుగా NTR సర్కిల్ నుండి 1 కి.మీ. లోపు	ఖమ్మం	25	25
51	SH42 పై కిస్తారం & వియం బంజర్ మధ్యలో ఎడమవైపు	ఖమ్మం	35	45
52	తనికెళ్ల గ్రామం పరిధిలో SH42 పై	ఖమ్మం	35	45
53	పాలేరు గ్రామం పరిధిలో ఖమ్మం–సూర్యాపేట రోడ్‌పై	ఖమ్మం	25	25
54	రఘునాథపాలెం గ్రామం పరిధిలో ఖమ్మం–ఎల్లందు రోడ్‌పై	ఖమ్మం	25	25
55	మధిర పంచాయితీ పరిధిలో మీనవోలు వైపునుండి మధిర సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్ మధ్యలో	ఖమ్మం	25	25
56	ముత్తగూడెం గ్రామం పరిధిలో NH30 (పాత 221) పై	ఖమ్మం	45	45
57	రెబ్బవరం గ్రామం పరిధిలో వైరా–బోనకల్ రోడ్ పై	ఖమ్మం	25	25
58	VM బంజర్ గ్రామం పరిధిలో NH30 (పాత 221) పై	ఖమ్మం	45	45
59	వల్లభి గ్రామం పరిధిలో జగ్గయ్యపేట్ రోడ్ పై	ఖమ్మం	25	25
60	చెరువు మాధవరం గ్రామం పరిధిలో వల్లభి–నేలకొండపల్లి రోడ్ పై	ఖమ్మం	25	25
61	కరీంనగర్ పట్టణం(మునిసిపల్ పరిధిలో)	కరీంనగర్	20	20
62	కరీంనగర్ బైపాస్ (SH 1 పై రామగుండం రోడ్)	కరీంనగర్	35	45
63	కరీంనగర్– సిరిసిల్ల బైపాస్	కరీంనగర్	30	30
64	ముస్తాబాద్ గ్రామం	సిర్సిల్ల	20	20
65	వెంకట్రావ్ పేట SH 11 పై	కరీంనగర్	35	45
66	తిమ్మాపూర్ SH 1 పై (కరీంనగర్–హైదరాబాద్ మధ్యలో ఎడమవైపు)	కరీంనగర్	35	45
67	మానకొండూర్ నుండి తాడికల్ NH 563 పై (కరీంనగర్–వరంగల్ మధ్యలో ఎడమవైపు)	కరీంనగర్	35	45
68	బోయినపల్లి గ్రామం	సిర్సిల్ల	20	20
69	బొమ్మక్కల్ దుబ్బాపేట SH 1 పై	కరీంనగర్	35	45
70	సిరిసిల్ల సిద్ధిపేట బైపాస్	సిర్సిల్ల	30	30
71	జ్యోతి నగర్ – కరీంనగర్	కరీంనగర్	20	20
72	రేకుర్తి NH 563 పై	కరీంనగర్	35	45
73	జమ్మికుంట పట్టణం	కరీంనగర్	20	20
74	నాగునూర్ SH 7 పై	కరీంనగర్	35	45
75	జిల్లెల్ల గ్రామం	సిర్సిల్ల	20	20
76	వీణవంక గ్రామం	కరీంనగర్	20	20
77	కమాన్ నుండి రామగుండం బైపాస్ రోడ్	కరీంనగర్	20	20
78	హుజూరాబాద్– జమ్మికుంట రోడ్	కరీంనగర్	30	30
79	పరకాల– హుజూరాబాద్ రోడ్	కరీంనగర్	30	30
80	పెంచికల్ పేట NH563పై (కరీంనగర్– వరంగల్ మధ్యలో ఎడమవైపు)	కరీంనగర్	45	45
81	NH–163 పై కొత్తపల్లి నుండి గంగాధర మధ్యలో	కరీంనగర్	45	45
82	వెలగటూర్ SH – 7 పై	జగిత్యాల	35	45
83	NH – 63 పై జగిత్యాల నుండి పొలస మధ్యలో	జగిత్యాల	45	45
84	NH – 63 పై కోరుట్ల నుండి మెట్‌పల్లి మధ్యలో	జగిత్యాల	45	45
85	మెట్‌పల్లి, NH – 63 పై	జగిత్యాల	45	45
	డివిజనల్ ఆఫీస్: వరంగల్			
86	ధర్మారం, SH – 7 పై	పెద్దపల్లి	35	45
87	మేడిపల్లి నుండి మోహనరావుపేట NH–63 పై	జగిత్యాల	45	45
88	కొయ్యూరు	భూపాలపల్లి	20	20
89	ముత్తారం	పెద్దపల్లి	20	20
90	తాడిచర్ల	భూపాలపల్లి	20	20
91	జూలపల్లి	పెద్దపల్లి	35	35
92	కొడిమియాల్	జగిత్యాల	25	25
93	సుల్తానాబాద్ SH–1 పై (పెద్దపల్లి నుండి కరీంనగర్ మధ్యలో ఎడమవైపు)	పెద్దపల్లి	35	45
94	కాళేశ్వరం (గ్రా) మహదేవ్‌పూర్ మండలంలో	భూపాలపల్లి	20	20
95	రాయికల్	జగిత్యాల	25	25
96	పెంబట్ల (గ్రా)	జగిత్యాల	25	25
97	మాల్యాల్ (మండల కేంద్రం)	జగిత్యాల	25	25
98	పెద్దపల్లి నుండి బొంపల్లి (బైపాస్ తరువాత)	పెద్దపల్లి	25	25
99	అల్లూరు	పెద్దపల్లి	25	25
100	కామారెడ్డి పట్టణం	కామారెడ్డి	20	20
101	బాన్స్‌వాడ పట్టణం	కామారెడ్డి	20	20
102	బోధన్ పట్టణం	నిజామాబాద్	20	20
103	మచ్చారెడ్డి గ్రామం	కామారెడ్డి	20	20
104	లింగంపేట గ్రామం	కామారెడ్డి	20	20
105	నిజామాబాద్ బైపాస్ రోడ్ కంఠేశ్వర్ నుండి హైదరాబాద్ రోడ్ లో ఎడమవైపు	నిజామాబాద్	30	30
106	నిజామాబాద్ మున్సిపల్ పరిధిలో	నిజామాబాద్	20	20
107	ఆర్మూర్ పట్టణంలో బస్ స్టాండ్ దగ్గర వున్న అంబేద్కర్ చౌరాస్తా నుండి	నిజామాబాద్	20	20
108	పెర్కిట్ X రోడ్స్ వరకు రెండు వైపులా కాజీపేట్ (మున్సిపల్ పరిధిలో)	వరంగల్ అర్బన్	20	20
109	భీమవరం నుండి హసన్ పర్తి	వరంగల్ అర్బన్	20	20
110	మధ్య ఎడమవైపు హంటర్ రోడ్ – అదాలత్ సర్కిల్ నుండి కాకతీయ నేచర్ కేర్ హాస్పిటల్	వరంగల్ అర్బన్	20	20
111	హంటర్ రోడ్ – SR జూనియర్ కాలేజ్ నుండి రైల్వే గేట్	వరంగల్ అర్బన్	20	20
112	హనుమకొండ పట్టణం	వరంగల్ అర్బన్	20	20
113	మాదికొండ చౌరాస్తా V–సిటీ మాదికొండ వరకు	వరంగల్ అర్బన్	20	20
114	జనగాం – సిద్దిపేట్ రోడ్ జనగాం చౌరాస్తా నుండి 1 కి.మీ. లోపు	జనగాం	20	20
115	తరిగొప్పుల గ్రామం పరిధిలో	జనగామ	20	20
116	100 ఫీట్ రోడ్, వడ్డేపల్లి	వరంగల్ అర్బన్	35	35
117	NH–563 రాయపర్తి నుండి మైలారం	వరంగల్ రూరల్	45	45
118	వరంగల్ మున్సిపల్ పరిధిలో	వరంగల్ అర్బన్	20	20
119	తాడ్వాయి, NH 163 పై	భూపాలపల్లి	45	45
120	నరక్కపేట్, NH 365 పై	వరంగల్ రూరల్	45	45
121	పర్వతగిరి	వరంగల్ రూరల్	20	20
122	బయ్యారం గ్రామం మహబూబాబాద్ నుండి ఎల్లందు రోడ్ పై	మహబూబాబాద్	20	20
123	గంగారామ్ గ్రామ్ నర్సంపేట్ నుండి ఎల్లందు రోడ్ పై	మహబూబాబాద్	30	30
124	భూపాలపల్లి పట్టణం మున్సిపల్ పరిధిలో	భూపాలపల్లి	20	20
125	ఏటూరు నాగారం పట్టణ పరిధిలో	భూపాలపల్లి	20	20
126	మహబూబాబాద్ పట్టణం మున్సిపల్ పరిధిలో	మహబూబాబాద్	20	20
127	పరకాల పట్టణం మున్సిపల్ పరిధిలో	వరంగల్ రూరల్	20	20
128	రేగొండ పరకాల భూపాలపల్లి రోడ్ పై	వరంగల్ రూరల్	20	20
129	ఆరేపల్లి NH 163 పై	వరంగల్ అర్బన్	45	45
130	బొల్లోనిపల్లి NH 365 పై	వరంగల్ రూరల్	45	45
131	ఇటికలపల్లి NH 365 పై	వరంగల్ రూరల్	45	45
132	నర్సంపేట పట్టణ పరిధిలో	వరంగల్ రూరల్	20	20
133	డోర్నకల్ పట్టణ పరిధిలో	మహబూబాబాద్	20	20
134	గిర్నిబావి వరంగల్ నర్సంపేట రోడ్ పై	వరంగల్ రూరల్	35	45
135	చెన్నారావుపేట నర్సంపేట నెక్కొండ రోడ్ పై	వరంగల్ రూరల్	20	20
136	నెక్కొండ పట్టణ పరిధిలో	వరంగల్ రూరల్	20	20
137	ములకలపల్లి	మహబూబాబాద్	20	20
138	ములుగు NH 163 పై	భూపాలపల్లి	45	45
139	పెద్దనాగారం స్టేజ్ నుండి ఎల్లంపేట వరకు	మహబూబాబాద్	25	25
140	తానంచర్ల స్టేజ్ నుండి బుర్హాన్‌పురం	మహబూబాబాద్	25	25
141	బచ్చన్నపేట మండలం పరిధిలో	జనగామ	25	25
142	పెద్ద వంగారం గ్రామ పరిధిలో	జనగామ	25	25
	డివిజనల్ ఆఫీస్: సికింద్రాబాద్			
143	రైల్ నిలయం నుండి ఉప్పల్ జంక్షన్ వరకు	హైదరాబాద్/రంగారెడ్డి	20	20
144	JNTU మెట్రో స్టేషన్ నుండి కూకట్‌పల్లి మెట్రో స్టేషన్ మధ్యలో ఎడమవైపు కూకట్ పల్లి Y జంక్షన్ వైపు	మేడ్ చల్ మల్ కాజ్ గిరి	20	20
145	TSPA జంక్షన్ నుండి లంగర్ హౌజ్ ఫ్లై ఓవర్ వరకు	హైదరాబాద్/రంగారెడ్డి	20	20
146	నిజాంపేట X రోడ్స్ నుండి మల్లంపేట X రోడ్స్ నేరేడ్ మెట్ X రోడ్స్	మేడ్ చల్ మల్ కాజ్ గిరి	20	20
147	నుండి ECIL X రోడ్స్ ఎడమవైపు ECIL X రోడ్స్ వైపు	మేడ్ చల్ మల్ కాజ్ గిరి	20	20
148	లిబర్టీ చౌరాస్తా, హిమాయత్ నగర్ నుండి 3 కి.మీ. లోపు	హైదరాబాద్	20	20
149	ఇస్కాన్ టెంపుల్ నుండి C M క్యాంప్ ఆఫీస్ మధ్యలో ఎడమవైపు పంజగుట్ట వైపు	హైదరాబాద్	20	20
150	హైదర్‌గూడ	హైదరాబాద్	20	20
151	నేరేడ్ మెట్ X రోడ్స్ నుండి రాధికా X రోడ్స్ మధ్యలో కుడివైపు ECIL X రోడ్స్ వైపు	మేడ్ చల్ మల్ కాజ్ గిరి	20	20
152	ఉప్పల్ X రోడ్స్ నుండి అంబర్‌పేట్ శ్రీ రమణ థియేటర్ మధ్యలో ఎడమవైపు అంబర్‌పేట వైపు	హైదరాబాద్/రంగారెడ్డి	20	20
153	బోయిన్ పల్లి X రోడ్ నుండి బాలానగర్ Y జంక్షన్	మేడ్ చల్ మల్ కాజ్ గిరి	20	20
154	R P రోడ్	హైదరాబాద్	20	20
155	RTC X రోడ్స్ నుండి నారాయణగూడ్ YMCA	హైదరాబాద్	20	20
156	RTC X రోడ్స్ నుండి చిలకలగూడ X రోడ్స్ వైపు	హైదరాబాద్	20	20
157	బాలానగర్ మెట్రో స్టేషన్ నుండి JNTU జంక్షన్ మధ్యలో ఎడమ వైపు	మేడ్ చల్ మల్ కాజ్ గిరి	20	20
158	JNTU వైపు రాధికా X రోడ్స్ నుండి దమ్మాయిగూడ X రోడ్స్ వరకు	మేడ్ చల్ మల్ కాజ్ గిరి	20	20
159	ఖైరతాబాద్ జంక్షన్ నుండి 3 కి.మీ. వ్యాసార్థంలోపు	హైదరాబాద్	20	20
160	శ్రీ రమణ థియేటర్ జంక్షన్ నుండి మూసారంబాగ్ జంక్షన్ మధ్యలో ఎడమవైపు మూసారంబాగ్ వైపు	హైదరాబాద్	20	20
161	రేతిబౌలి జంక్షన్ నుండి గచ్చీబౌలీ ఫ్లై ఓవర్, కుడివైపు, గచ్చీబౌలీ వైపు	హైదరాబాద్	20	20
162	ఇనార్బిట్ మాల్, హైటెక్ సిటీ నుండి 5 కి.మీ. వ్యాసార్థంలోపు	రంగా రెడ్డి	20	20
163	జూబ్లీ బస్‌స్టాండ్ నుండి హకీమ్‌పేట్ RTC	మేడ్ చల్ మల్ కాజ్ గిరి	20	20
164	సుచిత్రా X రోడ్స్ నుండి ఆల్వాల్ X రోడ్స్ మధ్యలో ఎడమవైపు ఆల్వాల్ వైపు	మేడ్ చల్ మల్ కాజ్ గిరి	20	20
165	కంటోన్మెంట్ బోర్డ్, సికిందరాబాద్ నుండి 3 కి.మీ. వ్యాసార్థంలోపు	హైదరాబాద్	20	20
166	బాలానగర్ మెట్రో స్టేషన్ నుండి మైత్రివనం మధ్యలో కుడివైపు మైత్రివనం వైపు	మేడ్‌చల్ మల్‌కాజ్ గిరి/హైదరాబాద్	20	20
167	L B నగర్ జంక్షన్ నుండి ఉప్పల్ జంక్షన్ మధ్యలో ఎడమవైపు ఉప్పల్ వైపు	రంగా రెడ్డి/మల్‌కాజ్‌గిరి	20	20
168	M G రోడ్	హైదరాబాద్	20	20
169	కొంపల్లి ఫ్లై ఓవర్ నుండి బోయిన్‌పల్లి ఫ్లై X రోడ్స్ మధ్యలో ఎడమవైపు బోయిన్‌పల్లి వైపు	మేడ్‌చల్ మల్‌కాజ్‌గిరి	20	20
170	లోయర్ ట్యాంక్ బండ్	హైదరాబాద్	20	20
171	రాజ్ భవన్ రోడ్ పై గ్రీన్ ల్యాండ్స్ నుండి ఖైరతాబాద్ వైపు, ఎడమవైపు, ఖైరతాబాద్ వైపు	హైదరాబాద్	20	20
172	అమీర్‌పేట్ గురుద్వారా నుండి 3 కి.మీ. వ్యాసార్థంలోపు	హైదరాబాద్	20	20
173	రేతి బౌలి జంక్షన్ నుండి గచ్చీబౌలీ ఫ్లై ఓవర్, ఎడమవైపు, గచ్చీబౌలీ వైపు	హైదరాబాద్	20	20
174	జూబ్లీ హిల్స్ చెక్ పోస్ట్ నుండి సైబర్ టవర్	హైదరాబాద్/రంగా రెడ్డి	20	20
175	యూసుఫ్‌గూడ చెక్ పోస్ట్ నుండి 3 కి.మీ. వ్యాసార్థంలోపు	హైదరాబాద్/రంగా రెడ్డి	20	20
176	సైబర్ టవర్, హైటెక్ సిటీ నుండి 5 కి.మీ. వ్యాసార్థంలోపు	రంగా రెడ్డి	20	20
177	గచ్చీబౌలీ ఫ్లై ఓవర్ నుండి 5 కి.మీ. వ్యాసార్థంలోపు	రంగా రెడ్డి	20	20
178	ఆరామ్‌ఘర్ చౌరాస్తా నుండి పురానాపూల్ వరకు	హైదరాబాద్	20	20
179	M J మార్కెట్, నాంపల్లి నుండి 3 కి.మీ. వ్యాసార్థంలోపు	హైదరాబాద్	20	20
180	లింగంపల్లి Xరోడ్స్ నుండి 3 కి.మీ. వ్యాసార్థంలోపు	రంగా రెడ్డి	20	20
181	రాయదుర్గం పియస్ సర్కిల్ నుండి మైక్రోసాఫ్ట్ సర్కిల్ వరకు వయా ల్యాంకో హిల్స్	రంగా రెడ్డి	20	20
182	కూకట్‌పల్లి వై జంక్షన్ నుండి హైటెక్ సిటీ ఫ్లై ఓవర్ వరకు	మేడ్‌చల్ మల్‌కాజ్‌గిరి/రంగా రెడ్డి	20	20
183	సౌత్ ఇండియా మాల్, ఉషా ముళ్లపూడి కమాన్, కూకట్‌పల్లి నుండి షాపూర్ నగర్ సిగ్నల్ వరకు	మేడ్‌చల్ మల్‌కాజ్‌గిరి/రంగా రెడ్డి	20	20
184	రేతిబౌలీ జంక్షన్ నుండి రంగారెడ్డి కలెక్టరేట్ వరకు	హైదరాబాద్	20	20
185	ఆల్విన్ X రోడ్స్ నుండి గచ్చిబౌలీ ఫ్లై ఓవర్ వరకు	రంగా రెడ్డి	20	20
186	ఆరామ్‌ఘర్ చౌరాస్తా నుండి రేతీబౌలీ వరకు ఎడమవైపు రేతీబౌలీ వైపు	హైదరాబాద్/రంగా రెడ్డి	20	20
187	ఆరామ్‌ఘర్ చౌరాస్తా నుండి రేతీబౌలీ వరకు కుడివైపు రేతీబౌలీ వైపు	హైదరాబాద్/ రంగా రెడ్డి	20	20
188	ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ నుండి 3 కి.మీ. వ్యాసార్థం లోపు	రంగా రెడ్డి	20	20
189	పురానాపూల్ నుండి క్లాసిక్ PVNR ఫ్లైఓవర్ సమీపం లోని గార్డెన్ ఫంక్షన్ హాల్ (వయా కార్వన్ రోడ్–గోల్కొండ ఫోర్ట్ రోడ్)	హైదరాబాద్	20	20
190	శేరిలింగంపల్లి నుండి 3 కి.మీ. లోపు	రంగా రెడ్డి	20	20
191	ఇందిరాపార్క్ సమీపంలోని మైసమ్మ గుడి నుండి విద్యానగర్ జంక్షన్ వరకు	హైదరాబాద్	20	20
192	హిమాయత్‌నగర్ నుండి బర్కత్‌పురా చౌరాస్తా వరకు	హైదరాబాద్	20	20
193	CP ఆఫీస్, బషీర్‌బాగ్ నుండి 3 కి.మీ. వ్యాసార్థంలోపు	హైదరాబాద్	20	20
194	ECIL X రోడ్ నుండి రాంపల్లి X రోడ్ వరకు	మేడ్‌చల్ మల్‌కాజ్‌గిరి	20	20
195	మినిస్టర్ రోడ్ (NTR సర్కిల్ నుండి ఎంజి రోడ్ వరకు)	హైదరాబాద్	20	20
196	బోరబండ నుండి హైటెక్ సిటీ వరకు (విజేత థియేటర్ రోడ్)	హైదరాబాద్/రంగా రెడ్డి	20	20
197	ఆల్విన్ చౌరాస్తా నుండి కొండాపూర్ వరకు	రంగా రెడ్డి	20	20
198	కొండాపూర్ జంక్షన్ నుండి గచ్చీబౌలీ జంక్షన్ వరకు	రంగా రెడ్డి	20	20
199	నల్లగండ్ల నుండి ఫైనాన్షియల్ డిస్ట్రిక్ వరకు	రంగా రెడ్డి	20	20
200	వివేకానంద స్టాట్యూ నుండి పైప్ లైన్ రోడ్ జంక్షన్ వరకు, వివేకానంద నగర్, మెయిన్ రోడ్ పైన	మేడ్‌చల్ మల్‌కాజ్‌గిరి	20	20
201	టివి టవర్ మలక్‌పేట జంక్షన్ నుండి ఎల్.బి.నగర్ రింగ్ రోడ్ వరకు (ఎడమచేతివైపు)	హైదరాబాద్/రంగా రెడ్డి	20	20
202	టివి టవర్ మలక్‌పేట జంక్షన్ నుండి ఎల్.బి.నగర్ రింగ్ రోడ్ వరకు (కుడిచేతివైపు)	హైదరాబాద్/రంగా రెడ్డి	20	20
203	నార్సింగి ORR నుండి 10 కి.మీ. లోపు CBIT వైపు ఎడమచేతివైపు	రంగా రెడ్డి	35	45
204	శంకర్‌పల్లి చౌరాస్తా నుండి 2 కి.మీ.లోపు	రంగా రెడ్డి	20	20
205	చేవెళ్ల SH 4 పైన	రంగా రెడ్డి	35	45
206	చిల్కానగర్ మెయిన్ రోడ్, ఉప్పల్ మండలం	మేడ్‌చల్–మల్‌కాజ్‌గిరి	20	20
207	ఉప్పల్ జంక్షన్ నుండి ORR, NH 163 పై ఎడమచేతివైపు	మేడ్‌చల్–మల్‌కాజ్‌గిరి	45	45
208	నాగోల్ నుండి బండ్లగూడ మెయిన్ రోడ్	మేడ్‌చల్–మల్‌కాజ్‌గిరి	20	20
209	నాగోల్ జంక్షన్ నుండి కొత్తపేట మెయిన్ రోడ్	మేడ్‌చల్–మల్‌కాజ్‌గిరి/రంగా రెడ్డి	20	20
210	తెల్లాపూర్	రంగా రెడ్డి	20	20
211	కోఠీ ఉమన్స్ కాలేజ్ నుండి 4 కి.మీ. లోపు	హైదరాబాద్	20	20
212	భూత్‌పూర్ నుండి బాలానగర్ వరకు – ఎడమవైపు, హైదరాబాద్ వైపు(NH–44)	మహబూబ్ నగర్	45	45
213	భూత్‌పూర్ నుండి నాగర్‌కర్నూల్ – రెండువైపులా (SH–20)	మహబూబ్ నగర్/నాగర్‌కర్నూల్	35	45
214	జడ్చర్ల నుండి బిజినేపల్లి – రెండువైపులా (SH–21)	మహబూబ్ నగర్/నాగర్‌కర్నూల్	35	45
215	జడ్చర్ల బస్ స్టాప్ కు రెండు కి.మీ.ల వ్యాసార్థంలో	మహబూబ్ నగర్	45	45
216	దమ్మాయిగూడ నుండి నగరం	మేడ్‌చల్–మల్‌కాజ్‌గిరి	35	35
217	బంజారాహిల్స్ రోడ్ నెం. 10 – జహీరానగర్ నుండి ఇండో అమెరికన్ కేన్సర్ హాస్పిటల్	హైదరాబాద్	20	20
218	జింఖానా రోడ్, మడ్ ఫోర్ట్, సికిందరాబాద్	హైదరాబాద్	20	20
219	మన్నెగూడ నుండి పూడూరు.	వికారాబాద్	45	45
220	పెద్ద గోల్కొండ ORR నుండి పాలమాకుల వయా JVIMS హాస్పిటల్	రంగా రెడ్డి	30	30

దయచేసి ఈ క్రిందివాటిని నోట్ చేసుకోండి:

1. జాతీయ రహదారిపై ఆఫర్ చేయబడిన స్థలం టోల్ బ్రిడ్జ్/NH–SH–MDR క్రాసింగ్ నుండి 1 కి.మీ. వ్యాసార్థంలో వుండకూడదు మరియు అది తప్పనిసరిగా సమీపంలో రోడ్డుకు అదే వైపు ఇప్పుడువున్న మరొక రిటైల్ అవుట్ లెట్ కు కనీసం 1 కి.మీ. దూరంలో వుండడానికి ప్రాధాన్యత యివ్వబడును.
2. **హైవే మార్కెట్లు మినహా, రిటైల్ అవుట్‌లెట్ నెలకొల్పడానికి యోగ్యంగా వున్న చిన్న కొలతలు వున్న ప్లాట్లను కూడా ఇండియన్ ఆయిల్ పరిగణన లోనికి తీసుకుంటుంది.**
3. GHMC క్రింద లొకేషన్ కై , మొత్తం సైట్ జాగా కనీసం 500 చ. మీ. ఉండితీరాలి.
4. స్థలం యొక్క ముందు ప్రదేశం తప్పనిసరిగా హైవే/మెయిన్ రోడ్ కు ఆనుకుని వుండాలి, స్థలానికి సరైన అప్రోచ్ రోడ్ వుండాలి.
5. బిడ్డర్ అర్బన్ ల్యాండ్ సీలింగ్, నాన్– అగ్రికల్చరల్ కన్వర్షన్, వెట్ ల్యాండ్ & ప్యాడీ ఫీల్డ్ కన్వర్షన్, ఇన్‌కంట్యాక్స్ క్లియరెన్స్, నాన్–ఇన్‌కంబరెన్స్ సర్టిఫికెట్ వగైరాల వంటి అన్ని చట్టబద్ధమైన క్లియరెన్సుల కొరకు ఏర్పాటు చేయవలెను.
6. భూమి గనక జాతీయ రహదారిపై వున్నట్లయితే ఆఫర్ చేయబడిన భూమి NHAI యొక్క ఆవశ్యకతలకు అనుగుణంగా వున్నదని బిడ్డర్ నిర్ధారించాలి.
7. స్థలాన్ని ఆనుకుని వున్న ఒకే భాగంగా ఇంచుమించు రోడ్ లెవల్ కి సమానంగా లెవల్ చేయడం ప్రాధాన్యంగా వుండాలి.
8. స్థలంలో ఓవర్ హెడ్ హై టెన్షన్ పవర్ లైన్, ప్రొడక్ట్/వాటర్ పైప్ లైన్/కాలువలు/డ్రైనేజీ నల్లాలు/ పబ్లిక్ రోడ్/రైల్వే లైన్ వగైరాలేవీ వుండకూడదు.
9. స్థలంపై అన్నిరకాల ఋణభారాలు/ఆక్రమణలు/మతపరమైన నిర్మాణాలు మొదలైనవేవీ వుండకూడదు. అలా వుందని తెలియజేసే అవసరమైన దస్తావేజులను విధిగా నోటరీ చేసి ఆఫర్‌తో బాటు తప్పనిసరిగా అందజేయాలి.
10. అవసరమైన మొత్తం భూభాగం ఒకే యజమానికి చెందినది కానట్లయితే, అప్పుడు, ఒకదానినొకటి ఆనుకునివుండి మా అవసరానికి అనుగుణంగా వున్న ప్లాట్లు కలిగివున్న యజమానుల బృందం ఒక రిజిస్టర్డ్ పవర్ ఆఫ్ అటార్నీ హక్కుదారు ద్వారా కోట్ చేయవచ్చు. అయితే, ఇండియన్ ఆయిల్ పవర్ ఆఫ్ అటార్నీ హక్కుదారుతోనే డీల్ చేస్తుంది. ఆఫర్‌తో బాటు ప్రతి యజమాని నుండి విధిగా ఆమోదించబడిన అవసరమైన పవర్ ఆఫ్ అటార్నీ యొక్క కాపీని జతపరచాలి.
11. వ్యవసాయ భూమిని ఆఫర్ చేసేవారు అదే భూమిని రిటైల్ అవుట్‌లెట్/మౌలిక సదుపాయాలు మరియు ఇతర అనుబంధ అవసరాల వినియోగం కొరకు తమ స్వంత ఖర్చులు మరియు వ్యయంతో వ్యవసాయేతర భూమిగా మార్చాలి, మరీ ముఖ్యంగా వాణిజ్యపరమైనదిగా మార్చాలి.
12. జిల్లా అధికారులు మరియు ఇతర ప్రభుత్వ అంగాలు కూడా ఈ ప్రకటనపై దరఖాస్తు చేసుకోవచ్చు. తగినట్లుగా వున్నట్లయితే ప్రభుత్వ భూమికి ప్రాధాన్యత ఇవ్వబడుతుంది.
13. ఇండియన్ ఆయిల్ చే అంచనావేయబడినట్లుగా, బిడ్ల యొక్క వాణిజ్యపరమైన మదింపు కొరకు ఈ క్రింది అదనపు వ్యయం కూడా పరిగణించబడుతుంది (i) భూమి ఫిల్లింగ్/ఏకీకరణ/కటింగ్ లకు అయ్యే వ్యయం, ఆఫర్ చేయబడిన స్థలాన్ని రోడ్ లెవల్‌కు తేవడానికై రిటైనింగ్ వాల్/హ్యూమ్ పైప్స్ వగైరాలకయ్యే వ్యయం, అంతేగాక ప్రవేశ/ నిష్క్రమణ మార్గాల వృద్ధికి అయ్యే వ్యయంతో సహా (ii) టెలిఫోన్/ఎలక్ట్రికల్ లైన్ల బదిలీ/వేయడం వంటి ఇతర భౌతిక పరామితుల వ్యయం
14. బ్రోకర్లు/ప్రాపర్టీ డీలర్లు దరఖాస్తు చేయనవసరంలేదు.
15. పోస్ట్/ఫ్యాక్స్ ద్వారా పంపబడిన దస్తావేజుల ఆలస్యానికి, నష్టానికి లేదా అందకపోవడానికి ఇండియన్ ఆయిల్ బాధ్యత వహించదు. స్వీకరించబడిన కొటేషన్లు కేవలం ఆఫర్లు మాత్రమే మరియు వాటికి ఏ విధంగానూ ఇండియన్ ఆయిల్ కట్టుబడి వుండదు.
16. ఇండియన్ ఆయిల్ ఏదైనా లేదా అన్ని ఆఫర్లను ఏ విధమైన కారణాలవల్లనైనను తిరస్కరించే సర్వహక్కులను కలిగివున్నది.

ఆఫర్లను ఈ క్రింది వివరాలతో సహా సమర్పించాలి:

ఈ క్రింద యివ్వబడిన విధంగా, ఆఫర్ చేయబడిన స్థలం యొక్క వివరాలను విధిగా సంతకం చేయబడిన దస్తావేజుల కాపీలతో బాటు వివరాలతో సహా సమర్పించాలి:

1) భూమి యొక్క యజమాని(లు) పేరు(ర్లు)
2) ప్లాట్ యొక్క ఆస్తి పరిస్థితి యొక్క వివరాలను చూపే కీ ప్లాన్
3) ప్లాట్ యొక్క కొలతలతో బాటు అమ్మకం/లీజ్ కొరకు ఆఫర్ చేయబడిన ప్రదేశం
4) '7/12' ఎక్స్ ట్రాక్ట్స్ లేదా తత్సమానం అనగా పట్టాదారు పాస్ పుస్తకం, కటోని, జమాబంది, ఖస్రా, గిర్ద్వారీ వగైరా మరియు టైటిల్ డీడ్ అనగా సేల్ డీడ్ వగైరాలతో భూమి యాజమాన్య హక్కును తెలిపే విధిగా జతపరచబడిన/సర్టిఫై చేయబడిన పత్రాల యొక్క ట్రూ కాపీ
5) పవర్ ఆఫ్ అటార్నీ హోల్డరు రిజిస్టర్ పవర్ ఆఫ్ అటార్నీ యొక్క కాపీని సమర్పించవలెను.

పై దస్తావేజులను ఒక కవర్లో వుంచి, విధిగా సీలు వేసి, ఆ కవరు పై భాగమున ''..................(స్థలం వున్న ప్రదేశం యొక్క పేరు) వద్ద భూమి యొక్క ఆఫరు కొరకు **టెక్నికల్ బిడ్**'' అని వ్రాయవలెను.

పైన నిర్దేశంచిన దస్తావేజులు/వివరాలు లేకుండా చేరిన ఆఫర్లు ఆమోదించబడవు.

అదనంగా, ఆఫర్లు ఈ క్రింది వివరాలను కూడా కలిగివుండాలి:

i) ఈ ఆఫర్ అమ్మకం కొరకు లేదా లీజు కొరకు లేదా అమ్మకం కొరకుగాని లేదా లీజ్ కొరకుగాని
ii) అమ్మకం సందర్భంలో, ఆశిస్తున్న అమ్మకపు విలువ రూపాయలలో
iii) లీజ్ సందర్భంలో, నెలకు ఆశిస్తున్న లీజ్ అద్దె రూపాయలలో మరియు లీజ్ కాలవ్యవధి

పై దస్తావేజులను ఒక కవర్లో వుంచి, విధిగా సీలు వేసి, ఆ కవరు పై భాగమున ''..................(స్థలం వున్న ప్రదేశం యొక్క పేరు) వద్ద భూమి యొక్క ఆఫరు కొరకు **ఫైనాన్షియల్ బిడ్**'' అని వ్రాయవలెను.

సీల్డ్ కవర్స్ రెండూ (టెక్నిక్ బిడ్ మరియు ఫైనాన్షియల్ బిడ్) కూడా మరొక కవర్ లో ఉంచి దాన్ని సీల్ చేసి ఆపై దానిమీద "ఆఫర్ ఫర్ లాండ్ ఎట్....... (లొకేషన్ పేరు) వ్రాయాలి

ఆసక్తి గల పార్టీలు క్రింద యివ్వబడిన గడువు తేదీ & సమయం లోగా దిగువ చిరునామాకు దరఖాస్తు చేసుకోవచ్చు:

ఎస్. నం. 1 నుండి 142 కొరకు:	ఎస్. నం. 143 నుండి 220 కొరకు:
ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్,	ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్
వరంగల్ డివిజనల్ ఆఫీస్	సికింద్రాబాద్ డివిజనల్ ఆఫీస్
ఇంటి నెంబరు: 5–11–503 & 504, 4వ ఫ్లోర్,	9–1–83 & 83, సరోజిని దేవి రోడ్,
"కందకట్ల గేట్ వే" KU క్రాస్ రోడ్స్, నయీమ్ నగర్,	సికిందరాబాద్ – 500 003
హనుమకొండ, వరంగల్– 506 009	ఫోన్. 040 – 27802129
ఫోన్. 0870 – 2455997	

బిడ్ సమర్పించడానికి చివరి తేదీ 19.03.2018 న 17.00 గంటల ముందు. గడువు తేదీ మరియు సమయం తరువాత స్వీకరించబడిన ఆఫర్లు పరిగణించబడవు. సమర్పించబడిన ఆఫర్ గడువు తేదీ నుండి 150 రోజుల పాటు లేదా పరస్పరం అంగీకరించిన విధంగా అలాంటి పొడిగించిన కాలవ్యవధి పాటు చెల్లుబాటు అవుతుంది. అన్ని నవీకరణలు, సవరణలు, తప్పొప్పుల పట్టిక, గడువు తేదీ పొడిగింపు (ఏదైనా వున్నట్లయితే) మా కంపెనీ వెబ్ సైట్ www.iocl.com లో మాత్రమే పోస్ట్ చేయబడతాయి.

ఈ ప్రకటన ఇండియన్ ఆయిల్‌చే భూమి యొక్క ప్రొక్యూర్‌మెంట్ కొరకు మాత్రమే ఉద్దేశించినది. ఇది ఏదేని డీలర్‌షిప్ ఇచ్చుటకు ఉద్దేశించినది కాదు. వివాదం ఏర్పడిన సందర్భంలో ఈ ప్రకటన యొక్క ఆంగ్ల వెర్షన్ అంతిమంగా పరిగణించబడుతుంది.

ఫిబ్రవరి 16

అంతర్రాష్ట్ర బిలిగుండ్లు డ్యామ్ నుంచి 177.25 టీఎంసీల మేర నీటిని తమిళనాడుకు విడుదల చేయాలని కర్ణాటక ప్రభుత్వానికి సుప్రీం కోర్టు ఆదేశం.

జల జగడం
కావేరీ నది వివాదం

వివాదానికి బీజాలు 1891లో

అక్టోబర్ 18, 2016: తదుపరి ఆదేశాలిచ్చే వరకూ తమిళనాడుకు రోజుకు 2వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేయాలని కర్ణాటకకు సుప్రీం కోర్టు ఆదేశం.





అక్టోబర్ 1: తీర్పును సమీక్షించాలంటూ సుప్రీం కోర్టును ఆశ్రయించిన కర్ణాటక ప్రభుత్వం. సర్వోన్నత న్యాయస్థానం లోగడ ఆదేశించిన రీతిలో 6వేల క్యూసెక్కులను ఎట్టిపరిస్థితుల్లోనూ విడుదల చేయరాదని కర్ణాటక ప్రభుత్వంపై విపక్షాల ఒత్తిడి.

కావేరి సంగతులు

పుట్టుక: కర్ణాటకలోని కొడగు జిల్లాలోని తల కావేరిలో.

ప్రవాహం: కర్ణాటక, తమిళనాడులో 800 కిలోమీటర్ల మేర ప్రవహిస్తోంది. తమిళనాడులోని పూంపుహార్ వద్ద బంగాళాఖాతంలో కలుస్తోంది.

కావేరి బేసిన్: 81155 (చదరపు కిలోమీటర్లు అంచనా) తమిళనాడు 43856, కర్ణాటక 34273 కేరళ 2866, పుదుచ్చేరి 160

నేపథ్యం

1970లు: కర్ణాటకలోని కొడగు జిల్లాలో హరంగి డ్యామ్ నిర్మాణం ఆరంభం. వ్యతిరేకిస్తూ కోర్టును ఆశ్రయించిన తమిళనాడు. అంతర్రాష్ట్ర నదీవివాదాల చట్టం-1956 కింద ట్రైబ్యునల్ ఏర్పాటుకు విజ్ఞప్తి.

1980లు: కేసును ఉపసంహరించుకున్న తమిళనాడు. రెండు రాష్ట్రాల మధ్య చర్చలు ప్రారంభం. ఫలితం: చిక్కుముడి. 1986: ట్రైబ్యునల్ ఏర్పాటుకు సుప్రీం కోర్టును ఆశ్రయించిన తమిళనాడు.

2002: హరంగి డ్యామ్ నిర్మాణాన్ని నిలిపివేయాలంటూ మళ్లీ కోర్టును ఆశ్రయించిన తమిళనాడు.

2003-06: ట్రైబ్యునల్ పదవీకాలం 2006 వరకూ పొడిగింపు. ముసాయిదా నివేదిక మీడియాకు లీక్. 2007 ఫిబ్రవరి 5: కావేరి నదీ వివాదాల ట్రైబ్యునల్ తీర్పు. పంపకాలు (టీఎంసీల్లో).. తమిళనాడు: 419; కర్ణాటక: 270; కేరళ: 30; పుదుచ్చేరి: 7

2011-12 రోజూ 9వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేయాలని కావేరి ప్రాధికార సంస్థ ఛైర్మన్ హోదాలో నాటి ప్రధాని మన్మోహన్ సింగ్.. కర్ణాటకను ఆదేశించారు.

2016లో

- సెప్టెంబర్ 30: తన ఆదేశాలను పదేపదే ఉల్లంఘిస్తున్న కర్ణాటకపై సుప్రీం కోర్టు ఆగ్రహం. చివరి అవకాశాన్ని ఇస్తూ.. అక్టోబర్ 1 నుంచి 6 వరకూ 6వేల క్యూసెక్కులను విడుదల చేయాలని ఆదేశం.
- అక్టోబర్ 4 కల్లా కావేరి నదీ నిర్వహణ బోర్డును ఏర్పాటు చేయాలని కేంద్రానికి ఆదేశం.
- సెప్టెంబర్ 29: రెండు రాష్ట్రాల మధ్య ఒప్పందం కోసం కేంద్రం ప్రయత్నాలు. ఫలితం శూన్యం.
- సెప్టెంబర్ 27: రాష్ట్ర శాసనసభ తీర్మానం చేసినప్పటికీ.. 3 రోజుల పాటు కర్ణాటకకు 6వేల క్యూసెక్కులు విడుదల చేయాలని కర్ణాటకకు సుప్రీం కోర్టు ఆదేశం.
- సెప్టెంబర్ 5: తదుపరి 10 రోజుల పాటు రోజుకు 15వేల క్యూసెక్కులను తమిళనాడుకు విడుదల చేయాలని ఆదేశం.

నాలుగేళ్లలో నీళ్లొచ్చేది రెండేళ్లే!

- తక్కువ వచ్చినప్పుడు రాష్ట్రాలు తగ్గించుకొని వాడాలి
- సుప్రీం పరిష్కారం సూచించినా.. పర్యవేక్షక కమిటీ పాత్రే కీలకం
- వాస్తవాన్ని రైతులకు చెప్పకపోతే ఎప్పటికీ సమస్యే
- కావేరీ జలాలపై రాష్ట్రాల మధ్య సహకారం తప్పనిసరి

ఈనాడు, హైదరాబాద్: సుదీర్ఘకాలంగా అంతర్ రాష్ట్ర సమస్యగా ఉన్న కావేరి నదీ జలాల వివాదానికి సర్వోన్నత న్యాయస్థానం ఓ పరిష్కారాన్ని సూచించినా, నిర్వహణ కోసం ఏర్పాటయ్యే అథారిటీ లేదా పర్యవేక్షక కమిటీ పాత్ర కీలకం కానుంది. తమిళనాడును నొప్పించకుండానే కర్ణాటకకు కొంత అదనపు ప్రయోజనం కల్పించడం ద్వారా సుమారు మూడుదశాబ్దాల సమస్యకు ఆమోదయోగ్యమైన పరిష్కారాన్ని ఇవ్వగలిగినా, నీటి లభ్యత అంచనా కంటే తక్కువగా ఉండే సంవత్సరాలు కావేరిలో ఎక్కువ కాబట్టి ఆచరణలో ప్రతి ఏడాది ఎదురయ్యే సమస్యలను అధిగమించడం కీలకం కానుంది.

50శాతం నీటి లభ్యత ఆధారంగా కేటాయించిన ట్రైబ్యునల్

ట్రైబ్యునళ్లు నీటి కేటాయింపులు చేసేటప్పుడు 75 శాతం నీటి లభ్యతను పరిగణనలోకి తీసుకొంటాయి. ప్రతి నాలుగేళ్లలో ఒక సంవత్సరం కేటాయించిన మేరకు రాకపోవచ్చు. వరుసగా ఆరేడేళ్ల అంచనా ప్రకారం వచ్చి రెండు, మూడు సంవత్సరాలు వరుసగా తక్కువ రావచ్చు. ఇలా తక్కువ వచ్చినపుడు ఏ రాష్ట్రం ఎలా వినియోగించుకోవాలో ట్రైబ్యునళ్లు తమ తీర్పులో సూచిస్తున్నాయి. అయితే కావేరి జల వివాద ట్రైబ్యునల్ యాభైశాతం నీటి లభ్యత ఆధారంగా కేటాయింపులు చేసింది. నాలుగు రాష్ట్రాలు తమ అవసరాలు సుమారు 1200 టీఎంసీలుగా పేర్కొన్నాయి. ఇందులో తమిళనాడులోని కావేరిడెల్టా అతి పురాతనమైంది. కొన్ని ప్రాంతాల్లో మూడు పంటలు కూడా పండే పరిస్థితి. వీటన్నింటిని రక్షించడంతోపాటు కొత్త అవసరాలు కూడా పరిగణనలోకి తీసుకొని తమిళనాడు 566 టీఎంసీలు కోరితే, కర్ణాటక 465, కేరళ 100, పాండిచ్చేరి 9 టీఎంసీలు కోరాయి. బేసిన్‌లో రాష్ట్రాల అవసరాలు, ఆయకట్టు, నీటి లభ్యతను పరిగణనలోకి తీసుకొని యాభై శాతం నీటి లభ్యత కింద 740 టీఎంసీలు అందుబాటులో ఉంటాయని ట్రైబ్యునల్ లెక్కకట్టింది. అంటే ప్రతి నాలుగేళ్లలో రెండేళ్లు ఈ మేరకు ఉంటాయి. మిగిలిన సంవత్సరాల్లో తక్కువగా ఉంటాయి. తక్కువ వచ్చినప్పుడు దీనికి తగ్గట్లుగా ఆయా రాష్ట్రాలు తగ్గించుకొని వాడాలి. నీటి లభ్యత మెట్టూరు రిజర్వాయర్ వరకు 508 టీఎంసీలు ఉంటుందని, మెట్టూరుకు ఎగువన తమిళనాడు ప్రాంతంలో 25 టీఎంసీలు, దిగువన 232 టీఎంసీలు లభిస్తాయని ఇందులో కేరళ, పాండిచ్చేరి వినియోగం, అనివార్యంగా సముద్రంలోకి పోయేవి మినహాయిస్తే తమిళనాడుకు 237 టీఎంసీలు అందుబాటులో ఉంటాయి. మొత్తం కేటాయింపు 419 టీఎంసీలలో తమిళనాడులో లభించే 237 టీఎంసీలు పోనూ మిగిలిన నీటిని కర్ణాటక సరిహద్దులోని బిల్లిగుండులు వద్ద విడుదల చేయాల్సి ఉంటుంది. 182 టీఎంసీలు తమిళనాడుకు, పది టీఎంసీలు పర్యావరణానికి కలిపి 192 టీఎంసీలు విడుదల చేయాల్సి ఉండగా, ప్రస్తుతం సుప్రీం కోర్టు నిర్ణయం వల్ల కర్ణాటక 177.25 టీఎంసీలు వదలాల్సి ఉంటుంది. ఏ నెల ఎంత వదలాలో కూడా ట్రైబ్యునల్ తీర్పులో ఉండటంతో పాటు, కృష్ణరాజసాగర్, కబిని రిజర్వాయర్ల నుంచి ఎంత విడుదల చేయాలో కూడా స్పష్టం చేసింది. దిగువన తమిళనాడులో, ఎగువన కర్ణాటకలో నీటి లభ్యత తక్కువగా ఉన్నా ఈ ప్రభావం మొత్తం కావేరిపై పడుతుంది. ఎగువన కర్ణాటకలో అధిక నీటిని తీసుకొనే చెరకు విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. దిగువన వరిసాగు.. అదీఎక్కువ రోజుల వ్యవధి పంట దశాబ్దాలుగా సాగులో ఉంది. తమిళనాడులో 21.38 లక్షల ఎకరాల ఆయకట్టును గుర్తించిన ట్రైబ్యునల్ కర్ణాటకలో 18.85 లక్షల ఎకరాలు గుర్తించింది. తక్కువ రోజుల వ్యవధి పంటల వైపు మళ్లాలని ట్రైబ్యునల్ తీర్పులో పేర్కొంది కూడా. 2016లో కావేరి ప్రాంతంలో ఉద్రిక్తతలు నెలకొన్నప్పుడు సుప్రీం కోర్టు నిపుణుల కమిటీని నియమించింది. ఈ కమిటీ అధ్యయనం ప్రకారం 1991నుంచి 2015వరకు 25 సంవత్సరాల్లో సరాసరి నీటి లభ్యతలో 51.35శాతం తక్కువ ఉంది. ఇదే సమయంలో తాగునీటి అవసరాలు మరింత పెరిగాయి. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం కేటాయించిన నీళ్లు కూడా ప్రతినాలుగేళ్లలో రెండేళ్లలో రావన్న వాస్తవాన్ని రైతులకు చెప్పకపోతే సమస్య నిరంతరాయంగా మిగిలిపోయే అవకాశం ఉంది.

2013లోనే ట్రైబ్యునల్ తీర్పును గుర్తించిన కేంద్రం

1991లో ఏర్పడిన కావేరి ట్రైబ్యునల్ 2007 ఫిబ్రవరి ఐదున తీర్పు ఇచ్చింది. అంతర్ రాష్ట్ర జలవనరుల చట్టంలోని సెక్షన్ 5(2) ప్రకారం మొదట ట్రైబ్యునల్ తీర్పు వచ్చిన తర్వాత దీనిపై రాష్ట్రాలు తమ అభిప్రాయాలు, అభ్యంతరాలు చెప్పడం, వీటిపై వాద ప్రతివాదనలు జరగడం, చివరకు సెక్షన్ 5(3) ప్రకారం తుది తీర్పు ఇస్తారు. దీనిని కేంద్రం గెజిట్‌లో ప్రచురిస్తే అమలులోకి వస్తుంది. అయితే కావేరిలో సెక్షన్ 5(2) ప్రకారం తీర్పు రాగానే కోర్టులకు వెళ్లడం, కేంద్రం పర్యవేక్షక కమిటీలు ఏర్పాటు చేయడం జరిగింది. ఈ జాప్యాన్ని పరిగణనలోకి తీసుకొని సెక్షన్ 5(2) ప్రకారం ఇచ్చిన తీర్పునే తుది తీర్పుగా 2013 ఫిబ్రవరి 19న కేంద్రం గుర్తించింది. ఇందులోనే తీర్పు అమలుకు పర్యవేక్షక కమిటీని ఏర్పాటు చేసింది. కేంద్రజలవనరుల శాఖ కార్యదర్శి, నాలుగు రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులు, కేంద్ర జలసంఘం ఛైర్మన్, జలసంఘం చీఫ్ ఇంజినీర్ సభ్యులుగా ఉన్నారు. నీటి లభ్యత తక్కువగా ఉన్నప్పుడు దీనికి తగ్గట్లుగా ఆయా రాష్ట్రాల కేటాయింపులో తగ్గించి వినియోగించుకొనేలా చూడాల్సిన బాధ్యత ఈ కమిటీదే. 2016లో నీటి కొరత తీవ్రంగా ఉన్నప్పుడు మళ్లీ వివాదం నెలకొంది. దీనిపై రాష్ట్రాలు సుప్రీంకోర్టును ఆశ్రయించాయి. 2007లో తీర్పు వచ్చిన తర్వాత దాఖలైన ఎస్ఎల్‌పీలు, తర్వాత దాఖలైనవి అన్నీ కలిపి ప్రస్తుతం సుప్రీం కోర్టు తుది తీర్పు వచ్చింది. రాష్ట్రాల మధ్య పరస్పర సహకారం లేకుంటే మళ్లీ వివాదాలు తలెత్తే అవకాశం ఉంది.

కన్నడిగులకు కావేరి కబురు

- సుప్రీంతీర్పుపై నదీ పరీవాహక ప్రాంత ప్రజల్లో ఆనందం
- ఎవరి గెలుపూ కాదు.. ఎవరి ఓటమీ కాదు: సిద్ధరామయ్య

ఈనాడు - బెంగళూరు


సుప్రీంతీర్పు నేపథ్యంలో శుక్రవారం మండ్యలో వీధుల్లోకి వచ్చి హర్షం ప్రకటిస్తున్న కన్నడ రైతులు

కర్ణాటక- తమిళనాడు మధ్య దాదాపు నాలుగు దశాబ్దాలుగా నలుగుతున్న కావేరి నదీ జలాల పంపిణీ వివాదంపై అత్యున్నత న్యాయస్థానం శుక్రవారం ఇచ్చిన తీర్పు కన్నడిగులకు సంతోషాన్నిచ్చింది. ప్రత్యేకించి గొంతెండిపోతున్న రాజధాని నగరం బెంగళూరుతో పాటు కావేరి ఆయకట్టులోని మండ్య, మైసూరు, చామరాజనగర జిల్లాల రైతులు ఆనందంతో వేడుకలు చేసుకున్నారు. తమిళనాడుకు విడుదల చేసే కావేరి నదీ జలాల పరిమాణాన్ని తగ్గించటమే కాకుండా బెంగళూరు దాహాన్ని తీర్చేందుకు కావేరి జలాల్ని కేటాయించటం గమనార్హం. సుప్రీంకోర్టు త్రిసభ్య ధర్మాసనం శుక్రవారం ఇచ్చిన తీర్పును కర్ణాటకవాసులు తీపికబురుగా భావిస్తున్నారు. పొరుగు రాష్ట్రం తమిళనాడుతో చాన్నాళ్లుగా సాగుతున్న న్యాయపోరాటంలో తుదకు ఒకింత ఉపశమనం దక్కినట్లయింది. రాజధాని నగరంతో పాటు మైసూరు, మండ్య, చామరాజనగర జిల్లాల రైతులు పురవీధుల్లో విజయోత్సవాల్ని నిర్వహించారు. కనిపించిన వారందరికీ మిఠాయిల్ని పంచి సంతోషించారు. తీర్పు కర్ణాటక ప్రయోజనాలకు ముప్పుగా పరిణమించిన పక్షంలో ఆందోళనల్ని నిర్వహించేందుకు సన్నద్ధమైన రైతులు, కన్నడ యువజన సంఘాల కార్యకర్తలు.. తీర్పు వెలువడిన వెంటనే సంతోషం వ్యక్తం చేశారు.

- బెంగళూరుకు నీటి కేటాయింపు, తమిళనాడుకు విడుదల చేయాల్సిన నీటి పరిమాణంలో కోత కర్ణాటకకు ఊరట కలిగించింది. ఆరు వారాల్లోగా తుంగభద్ర బోర్డు మాదిరి కావేరి నదీ జలాల నిర్వహణ మండలిని ఏర్పాటు చేయాలని అత్యున్నత న్యాయస్థానం త్రిసభ్య ధర్మాసనం కేంద్రాన్ని ఆదేశించటం మాత్రం.. కన్నడిగులకు నిరాశ కలిగించినట్లు తెలుస్తోంది.
- కావేరి జలాల వివాదాల్ని ఇప్పటి వరకూ మండ్య, మైసూరు జిల్లాల్లో రాజకీయ లబ్ధి పొందేందుకు కొన్ని పార్టీలు సాధనంగా వినియోగించుకున్నాయి. నిర్వహణ మండలి ఏర్పాటైతే కావేరి నీటితో రాజకీయ ఆటలు సాగవనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

కర్ణాటకకు పరిమిత లబ్ధి వేకూరింది: సీఎం

న్యాయస్థానం తీర్పు 'ఎవరి గెలుపూ కాదు. ఎవరి ఓటమీ కాదు' అని కర్ణాటక సీఎం సిద్ధరామయ్య వ్యాఖ్యానించారు. శుక్రవారం సాయంత్రం ఆయన విధానసౌధలో మాధ్యమాల ప్రతినిధులతో మాట్లాడారు. 'కావేరి ట్రైబ్యునల్ ఇచ్చిన తీర్పు వల్ల కర్ణాటకకు అన్యాయం జరిగింది. దీని పరిహారానికి అత్యున్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించాం. తమిళనాడులోని కావేరి పరీవాహక ప్రాంతంలో ఇరవై టీఎంసీ అడుగుల భూగర్భ జలాలు పునరుత్పత్తి అవుతాయని చేసిన వాదనల్ని న్యాయస్థానం పూర్తిగా అంగీకరించలేదు. కేవలం పది మాత్రమే ఉత్పత్తవుతుందని లెక్కగట్టింది. ఆ మేరకు కర్ణాటకకు పరిమిత లబ్ధి చేకూరింది' అని వివరించారు. బెంగళూరువాసుల దాహాన్ని తీర్చేందుకు 4.75 టీఎంసీ అడుగుల నీరు కేటాయించటం కాస్త ఊరట అని సంతృప్తి వ్యక్తం చేశారు. కరవు కాలంలో తమిళనాడుకు వాటా జలాల విడుదల గురించి ప్రశ్నించినపుడు సంక్షోభ సూత్రాన్ని అమలు చేయటం అనివార్యమని పేర్కొన్నారు.

- తీర్పు ప్రతి అందాక న్యాయ నిపుణులతో చర్చించి కార్యాచరణ రూపొందిస్తామని కావేరి నదీ జలాల పరిరక్షణ సమితి నేత జి.మాదేగౌడ మండ్యలో వెల్లడించారు.

సయోధ్యతో ముందుకెళ్లాలి..

"కావేరీ జలాల విషయంలో తమిళనాడు, కర్ణాటకలు సయోధ్యతో ముందుకెళ్లాలి. ఇది నదుల జాతీయం వంటి ఆలోచనలను ముందుకు తీసుకెళ్లడానికి దోహదపడుతుంది. తమిళనాడుకు తక్కువ వాటా దక్కడం అసంతృప్తిని కలిగించింది. అయితే నదులను జాతీయ సంపదగా సుప్రీంకోర్టు పేర్కొనడం ఊరటనిస్తోంది. జాతీయ ప్రయోజనాలను మరచి కొందరు రాజకీయ నాయకులు ఓట్ల కోసం మాట్లాడుతున్నారు. రెండు రాష్ట్రాల మధ్య సయోధ్య దెబ్బతింటే అందరిపైనా ఆ ప్రభావం పడుతుంది." - కమల్ హాసన్

రివ్యూ పిటిషన్ వేయాలి..

"సుప్రీం తీర్పుతో తీవ్రఅసంతృప్తికి లోనయ్యా. నీటివాటా తగ్గడం తమిళనాడులోని రైతుల జీవితాలపై ప్రభావం చూపుతుంది. ఈమేరకు రివ్యూ పిటిషన్ దాఖలు చేసేందుకు తమిళనాడు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరుతున్నా.."

- రజనీకాంత్

రాష్ట్ర ప్రజలకు ఉపశమనం

'మా ఆందోళనలను సుప్రీంకోర్టు పాక్షికంగా పరిగణనలోకి తీసుకుంది. ఇది రాష్ట్ర ప్రజలకు కాస్త ఉపశమనం కలిగించే విషయమే. వ్యవసాయం, తాగునీటి అవసరాలు కొంతమేరకు తీరుతాయి. తీర్పును సమగ్రంగా అధ్యయనం చేశాక వివరంగా మాట్లాడతాం'

- కర్ణాటక భాజపా అధ్యక్షుడు బి.ఎస్.యడ్యూరప్ప

చరిత్రాత్మక తీర్పు

'సుప్రీం తాజా తీర్పు చరిత్రాత్మకం. తీర్పు కోసం ఆతృతగా ఎదురుచూస్తున్న కర్ణాటక ప్రజలకు ఉపశమనం లభించింది. మా అంచనాలు ఇంతకంటే ఎక్కువగానే ఉన్నా.. బెంగళూరుకు అదనంగా 4.75 టీఎంసీల నీరు దక్కడం సంతృప్తికర విషయం'

- కేంద్ర మంత్రి అనంత్ కుమార్


కర్ణాటక-తమిళనాడు మధ్య బస్సు సర్వీసులు నిలిపివేయడంతో హోసూరులో కాలినడకన ఇరు రాష్ట్రాల సరిహద్దు దాటుతున్న ప్రయాణికులు

నీటి తగ్గింపుతో తమిళనాడుకు అన్యాయం

- రాష్ట్ర నాయకుల అసంతృప్తి

ఈనాడు డిజిటల్, చెన్నై: దశాబ్దాలుగా సాగుతున్న కావేరి నదీజలాల వివాదంపై సుప్రీంకోర్టు ఇచ్చిన తాజా తీర్పుపై తమిళనాడులోని అన్ని పార్టీల నాయకులూ అసంతృప్తి వ్యక్తం చేశారు. అధికార అన్నాడీఎంకేతోపాటు విపక్షాలు డీఎంకే, ఎండీఎంకే, పీఎంకే, సీపీఐ, కాంగ్రెస్‌లు పెదవి విరిచాయి. కావేరి జలాల వ్యవహారంలో సుప్రీంతీర్పు అసంతృప్తికి గురి చేసిందని ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కావేరి జలాల్లో తమిళనాడు వాటా తగ్గించినా తీర్పులో పేర్కొన్న ఇతర అంశాలు హర్షించదగినవేనన్నారు. అంతకుముందు ఆయన చెన్నై నగర పోలీసు కమిషనర్ విశ్వనాథన్‌తో సమావేశమై అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాల్సిందిగా సూచించినట్లు తెలిసింది. ఉపముఖ్యమంత్రి పన్నీర్‌సెల్వం కూడా తీర్పుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. భాజపా రాష్ట్ర అధ్యక్షురాలు తమిళిసై సౌందరరాజన్ స్పందిస్తూ.. నీటి శాతం తగ్గడం బాధాకరమని, ఆ నీరు వెంటనే విడుదల అవడానికి ప్రయత్నించాలన్నారు. డీఎంకే కార్యనిర్వాహక అధ్యక్షుడు ఎంకే స్టాలిన్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. వెంటనే అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలన్నారు. పుదుచ్చేరి ముఖ్యమంత్రి నారాయణస్వామి మాత్రం తీర్పును స్వాగతించారు.

తమిళనాడు, కర్ణాటకల మధ్య బస్సులు తిరిగి ప్రారంభం

తమిళనాడు: తీర్పు నేపథ్యంలో తమిళనాడు, కర్ణాటకల మధ్య రద్దు చేసిన అంతర్ రాష్ట్ర బస్సు సర్వీసులను తిరిగి ప్రారంభించినట్లు కలెక్టర్ సి.కత్తిరావన్ తెలిపారు. బస్సు సేవల్ని క్రమంగా సాధారణ స్థితికి పునరుద్ధరిస్తామని పేర్కొన్నారు. లారీలు, ఇతరత్రా వాహనాలు ఉదయం వేళల్లో కొద్దిసేపు నిలిపోయినా తర్వాత సాధారణంగానే తిరుగుతున్నాయన్నారు. కర్ణాటక సరిహద్దులు, ఇతర కీలక ప్రాంతాల్లో పోలీసులను మోహరించినట్లు పోలీసు అధికారులు వెల్లడించారు. బెంగళూరు వెళ్లే బస్సులకు పోలీసు గస్తీ ఏర్పాటు చేసినా, పరిస్థితి ప్రశాంతంగా ఉండటంతో ఉపసంహరించుకున్నారు.



మాట్లాడుతున్న ఐకాస ఛైర్మన్ రమణారెడ్డి. పక్కన పాపిరెడ్డి, సతీష్, నారాయణగౌడ్, నరేందర్‌రెడ్డి తదితరులు

ఇంటర్, డిగ్రీ పరీక్షలకు సహాయ నిరాకరణ

కేజీ టూ పీజీ విద్యాసంస్థల ఐకాస

ఈనాడు, హైదరాబాద్: తమ ప్రధాన సమస్యలను పరిష్కరిస్తూ వారం, పది రోజుల్లో ప్రభుత్వం ఉత్తర్వులు ఇవ్వకుంటే ఇంటర్, డిగ్రీ, పీజీ వార్షిక పరీక్షలను బహిష్కరిస్తామని తెలంగాణ కేజీ టూ పీజీ విద్యాసంస్థల ఐకాస ప్రకటించింది. బోధనా రుసుముల బకాయిలు వెంటనే చెల్లించాలని, ఇంటర్, డిగ్రీ, పీజీ కోర్సులకు రుసుములు పెంచాలని.. విద్యాసంస్థలకు ఆస్తి పన్ను, విద్యుత్తు ఛార్జీల్లో రాయితీ ఇవ్వాలని కొన్నాళ్లుగా ఐకాస ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తోంది. పిలిచి మాట్లాడతామని చెప్పిన పెద్దలంతా మొహం చాటేయడంతో సహాయ నిరాకరణకు పూనుకుంటున్నామని ఐకాస తెలిపింది. శుక్రవారం ఇక్కడ ఐకాస సమావేశం నిర్వహించారు. అనంతరం ఐకాస ఛైర్మన్ గింజాల రమణారెడ్డి, కన్వీనర్లు గౌరి సతీష్, ఎస్ఎన్‌రెడ్డి, నారాయణగౌడ్ తదితరులు విలేకర్లతో మాట్లాడారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి కేసీఆర్ నిలబెట్టుకోవాలని కోరారు. ఇంటర్ విద్యార్థులకు రూ.85 కోట్లు, డిగ్రీ, పీజీ విద్యార్థులకు రూ.340 కోట్లు బోధన రుసుములు చెల్లించాల్సి ఉందన్నారు. లక్షన్నర కోట్ల బడ్జెట్ ఉన్న రాష్ట్రంలో 10 లక్షల మంది విద్యార్థులకు 425 కోట్లు కూడా సకాలంలో చెల్లించలేరా అని ప్రశ్నించారు. తమ సమస్యలను వారం పది రోజుల్లో పరిష్కరించకపోతే ఈ నెల 28 నుంచి ప్రారంభమయ్యే ఇంటర్, మార్చి 6 నుంచి మొదలయ్యే డిగ్రీ పరీక్షలను బహిష్కరిస్తామన్నారు. పరీక్షా కేంద్రాలకు కూడా కళాశాలలు ఇవ్వబోమన్నారు.

ఆదాయ మూలాలూ వెల్లడించాలి

- ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు, వారి కుటుంబ సభ్యులు
- తమ ఆస్తులతో పాటు వాటినీ ప్రకటించాల్సిందే
- సుప్రీంకోర్టు ధర్మాసనం కీలక తీర్పు

దిల్లీ: ప్రజాస్వామ్య మనుగడకు అత్యంత కీలకమైన ఎన్నికల నిర్వహణలో పారదర్శకతను తీసుకురావటానికి, ఎన్నికల్లో ధన బలానికి అడ్డుకట్ట వేయటానికి సుప్రీంకోర్టు అత్యంత కీలకమైన తీర్పును ఇచ్చింది. చట్టసభలకు పోటీ చేసే అభ్యర్థి తనతో పాటు అతని/ఆమె కుటుంబ సభ్యుల ఆస్తులను, ఆదాయ మూలాలను వెల్లడించాలని స్పష్టం చేసింది. అంతేకాకుండా ఎన్నికైన తర్వాత వారి ఆస్తుల వృద్ధి ఏ క్రమంలో సాగుతుందో నిర్దేశిత సమయం ప్రకారం సమాచారాన్ని సేకరించి, తగిన చర్యను సిఫార్సు చేసేందుకు ఓ యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వానికి సూచించింది. ఎన్నికైన ప్రజాప్రతినిధులు, వారి కుటుంబ సభ్యుల ఆస్తులు అసాధారణంగా వృద్ధి చెందినట్లు తేలితే ఆ ఎంపీ లేదా ఎమ్మెల్యేను అనర్హుడిగా ప్రకటించేలా ప్రజాప్రాతినిధ్య చట్టంలో నిబంధనలు చేర్చాలని జస్టిస్ జాస్తి చలమేశ్వర్, జస్టిస్ ఎస్. అబ్దుల్ నజీర్ తమ తీర్పులో స్పష్టంచేశారు. ఆస్తులను, ఆదాయ మూలాలను వెల్లడించకపోవటాన్ని ప్రజాప్రాతినిధ్యచట్టం (1951) ప్రకారం 'అవినీతికి పాల్పడటం'గానే భావించాలని ధర్మాసనం పేర్కొంది. చట్టసభ సభ్యులు, వారి కుటుంబ సభ్యుల ఆస్తులు, ఆదాయ మూలాలు వెల్లడించటాన్ని తప్పనిసరిచేస్తూ నామినేషన్ దాఖలు పత్రంలో మార్పులు చేయాలని ధర్మాసనం తన తీర్పులో సూచించింది. ప్రకటిత ఆదాయానికి మించి ప్రజాప్రతినిధుల ఆస్తులు అమితంగా పెరిగిపోతుండటంపై దర్యాప్తు చేయటానికి శాశ్వత యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై ధర్మాసనం ఈ తీర్పును వెలువరించింది. స్వచ్ఛంద సంస్థ లోక్ ప్రహరి ఈ పిటిషన్ వేసింది.

అడ్డుకోకపోతే అరాచకమే: చట్టసభల సభ్యులు తమ హోదాలను దుర్వినియోగం చేస్తూ విపరీతంగా ఆస్తులను కూడబెట్టుకోవటాన్ని నిరోధించకపోతే అది ప్రజాస్వామ్య విధ్వంసానికి, మాఫియా పాలనకు దారితీస్తుందని సుప్రీంకోర్టు ధర్మాసనం హెచ్చరించింది. ఇలాంటి సమస్యలను పరిష్కరించుకోవటానికి పరిణితి చెందిన ప్రజాస్వామ్య దేశాలు కొన్ని ఏర్పాట్లు చేసుకున్నాయని తెలిపింది. దురదృష్టవశాత్తు మన దేశంలో పార్లమెంటు కానీ, ఎన్నికల సంఘం కానీ ఈ సమస్యపై దృష్టి సారించలేదని అసంతృప్తి వ్యక్తం చేసింది. ప్రజాప్రతినిధుల అక్రమార్జనను అవినీతి నిరోధక చట్టం ప్రకారం విచారణ జరపటం కాలం చెల్లిన విధానంగా అభిప్రాయపడింది. అక్రమాలకు పాల్పడిన వారిని అవినీతి నిరోధక చట్టం ప్రకారం విచారించక ముందే అనర్హులుగా ప్రకటించేలా ప్రజాపాతినిధ్య చట్టంలో నిబంధనను చేర్చాలని సూచించింది. ఎన్నికైన ప్రజాప్రతినిధుల ఆస్తులు అసాధారణంగా పెరిగిపోతున్నాయని తెలిస్తే పౌరులు, ఓటర్లు అప్రమత్తమవుతారు. అలా తెలుసుకోవటం పౌరుల ప్రాథమిక హక్కు కూడా. తద్వారా సరైన అభ్యర్థులను ఎంచుకునే అవకాశం వారికి కలుగుతుందని పేర్కొంది. ప్రజాప్రాతినిధ్య చట్టం (1951)కు సవరణ చేయాలా వద్దా అనేది ప్రభుత్వ అధికార పరిధిలోని అంశమని, ఏ న్యాయస్థానమూ సవరణ/చట్టం చేయాలని బలవంతం చేయలేదని ధర్మాసనం స్పష్టం చేసింది. సుప్రీం కోర్టు తీర్పుపై భాజపా, కాంగ్రెస్, జేడీ(యు) తదితర పార్టీల నేతలు హర్షం వ్యక్తంచేశారు.

నేటి నుంచి యాదాద్రీశుని బ్రహ్మోత్సవాలు

ఈనాడు, నల్గొండ: పదకొండు రోజులపాటు అంగరంగ వైభవంగా జరగనున్న యాదాద్రీశుడి వార్షిక బ్రహ్మోత్సవాలు శనివారం ప్రారంభం కానున్నాయి. ఈ ఏడాది కూడా బాలాలయంలోనే ఉత్సవాలు జరపాలని ఆలయ పాలకవర్గం నిర్ణయించింది. స్వామి తిరు కల్యాణం, రథోత్సవాలను ఈ సారీ రెండు సార్లు నిర్వహిస్తారు.

కల్యాణోత్సవానికి గవర్నర్, ముఖ్యమంత్రి

వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా జరిగే అత్యంత విశేషమైన శ్రీ స్వామి, అమ్మవార్ల కల్యాణ మహోత్సవంలో గవర్నర్ నరసింహన్, ముఖ్యమంత్రి కేసీఆర్ పాల్గొంటారని ఆలయ వర్గాలు వెల్లడించాయి. ఈ నెల 24న ఆస్థాన పరంగా జరిగే కల్యాణోత్సవంలో రాష్ట్ర ప్రభుత్వ పక్షాన ముఖ్యమంత్రి కేసీఆర్ దంపతులు పాల్గొని పట్టువస్త్రాలను అందజేస్తారు. అదే రోజు రాత్రి కొండ కింద నిర్వహించే కల్యాణంలో గవర్నర్ నరసింహన్ దంపతులు పాల్గొంటారు. బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేశామని, ఆలయ పునర్నిర్మాణం దృష్ట్యా భక్తులకు ఇబ్బందులు లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నామని ఆలయ ఈవో ఎన్.గీతారెడ్డి తెలిపారు.

నీట్ పీజీ ఫలితాల విడుదల

ఈనాడు-హైదరాబాద్: నీట్ పీజీ వైద్యవిద్య ఫలితాలు శుక్రవారం వెల్లడయ్యాయి. దేశవ్యాప్తంగా నీట్ పీజీ ఫలితాలను ప్రకటించారు. వీటి ఆధారంగానే పీజీ సీట్లను భర్తీ చేస్తారు. త్వరలోనే రాష్ట్రాలవారీగా ర్యాంకులను వెల్లడించనున్నట్లు వైద్యవర్గాలు తెలిపాయి.

పట్నాలో మధుసూదనాచారి, స్వామిగౌడ్

ఈనాడు, హైదరాబాద్: పట్నాలో జరుగుతున్న కామన్వెల్త్ పార్లమెంటరీ సంఘం(సీపీఏ) సమావేశానికి తెలంగాణ శాసనసభాపతి మధుసూదనాచారి, మండలి ఛైర్మన్ స్వామిగౌడ్, శాసనసభ కార్యదర్శి నర్సింహాచార్యులు శుక్రవారం హాజరయ్యారు. అనంతరం వారిరువురూ బుద్ధగయను సందర్శించారు.

అలిపిరిలో తుపాకీ స్వాధీనం.. అదుపులో నిందితుడు

తిరుపతి(తితిదే), న్యూస్‌టుడే: తిరుపతి అలిపిరి తనిఖీ కేంద్రంలో శుక్రవారం తనిఖీలు చేస్తున్న తితిదే విజిలెన్స్, ఎస్‌పీఎఫ్ సిబ్బంది శుక్రవారం ఒక తుపాకీ, రెండు తూటాలు స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటనకు సంబంధించి తితిదే ముఖ్యనిఘా, భద్రతాధికారి ఆకె రవికృష్ణ విలేకరులకు వివరాలు తెలిపారు. తిరుమలకు వెళ్ళే వాహనాలను అలిపిరి తనిఖీ కేంద్రం వద్ద శుక్రవారం ఉదయం 7.45గంటల ప్రాంతంలో ఒడిశాకు చెందిన ఓడీ 33 5554 అనే స్కోడా వాహనంలో స్టీరింగ్ కింద దాచి ఉంచిన అనుమతిలేని(లైసెన్సులేని) 7.65ఎంఎం పిస్టల్.. రెండు తుపాకీ గుండ్లు కనిపించాయి. వాటిని స్వాధీనం చేసుకుని అలిపిరి ఏవీఎస్‌వో గంగరాజుకు అందించారని రవికృష్ణ తెలిపారు. వాహన చోదకుడు ఒడిశాలోని భువనేశ్వర్‌కు చెందిన రామన్ పాణిగ్రహి(36)గా గుర్తించామన్నారు. అతడిపై గతంలో ఒడిశాలో పలు కేసులు ఉన్నట్లు ప్రాథమిక విచారణలో వెల్లడవడంతో.. విచారణ నిమిత్తం రామన్‌ను తిరుమల టూటౌన్ పోలీసులకు అప్పగించామని చెప్పారు.


రామన్ పాణిగ్రహి

నేరెళ్ల బాధితులకు న్యాయం జరిగే వరకు పోరాటం: కోదండరాం

హైదరాబాద్, న్యూస్‌టుడే: నేరెళ్ల ఘటన బాధ్యులపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ ఐకాస, వామపక్ష పార్టీలు డిమాండ్ చేశాయి. ఈ మేరకు శుక్రవారం మంత్రుల నివాస సముదాయంలో రాష్ట్ర హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డిని కలిసి ప్రతినిధులు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఐకాస ఛైర్మన్ కోదండరాం బాధితులకు న్యాయం జరిగే దాక.. బాధ్యులైన పోలీసులపై చర్యలు తీసుకునే వరకు పోరాటం ఆగదని స్పష్టం చేశారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ..నేరెళ్ల బాధితులకు న్యాయం చేయమని హోంమంత్రిని కోరామని చెప్పారు.


ఫ్లోరిడాలోని మర్జోరీ స్టోర్‌మన్ డగ్లస్ పాఠశాలలో పూర్వ విద్యార్థి నికోలస్ క్రూజ్ జరిపిన కాల్పుల్లో 17 మంది మృతి చెందిన విషయం తెలిసిందే. మృతుల సంస్మరణ కార్యక్రమంలో విద్యార్థులు కొవ్వొత్తులతో ఇలా కన్నీటి నివాళి అర్పించారు.

తప్పు ప్రభుత్వాలది.. శిక్ష ప్రజలకా!

- జేఎఫ్‌సీ తొలి రోజు సమావేశంలో జనసేన అధినేత పవన్‌కల్యాణ్

ఈనాడు, హైదరాబాద్, ఈనాడు డిజిటల్, అమరావతి: పాలకులు చేసిన తప్పుతో ప్రజలు శిక్ష అనుభవిస్తున్నారని జనసేన అధినేత పవన్‌కల్యాణ్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన చట్టంలోని హామీల అమలుపై రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం చెబుతున్న విషయాలు పరస్పర విరుద్ధంగా ఉన్నాయని... ప్రజల్ని, పార్టీలను అయోమయంలో పడేస్తున్నాయని అన్నారు. వాస్తవాలను ప్రజలకు చెప్పాలనే సదుద్దేశంతో సంయుక్త నిజనిర్ధారణ కమిటీ (జేఎఫ్‌సీ) ద్వారా ప్రయత్నం చేస్తున్నామన్నారు. ప్రత్యేకహోదా ఇస్తారా? ఇవ్వరా? లేదా దానికి ప్రత్యామ్నాయం ఏదైనా చూపిస్తారా? అనేది స్పష్టం చేయాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన మాటకు కట్టుబడి బాధ్యతగా వ్యవహరించకపోతే దేశ సమగ్రతకే భంగమన్నారు. పౌరులకు తాము ద్వితీయశ్రేణి ప్రజలమా అన్న భావన కలిగితే దేశం దక్షిణ, ఉత్తర ప్రాంతాలుగా విడిపోవాలనే వేర్పాటువాదానికి దారి తీస్తుందని అన్నారు. జేఎఫ్‌సీ తొలిరోజు సమావేశం శుక్రవారం హైదరాబాద్‌లో జరిగింది. పవన్‌కల్యాణ్ ట్యాంక్‌బండ్ వద్ద డా. బి. ఆర్. అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించి సమావేశానికి వెళ్లారు. లోక్‌సత్తా వ్యవస్థాపక అధ్యక్షుడు జయప్రకాశ్ నారాయణ్ దీనికి నేతృత్వం వహించారు. కేంద్ర హోంశాఖ మాజీ కార్యదర్శి పద్మనాభయ్య, ఏపీ మాజీ సీఎస్ ఐ. వై. ఆర్. కృష్ణారావు, మాజీ ఐఏఎస్ అధికారి చంద్రశేఖర్, సీపీఎం ఏపీ రాష్ట్ర కార్యదర్శి మధు, సీనియనేత వై. వెంకటేశ్వర్లు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, సీనియర్‌నేత గఫూర్, కాంగ్రెస్ ప్రతినిధులు గౌతం, గిడుగు రుద్రరాజు, మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్, మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ, ఆర్థికవేత్త అమీర్‌ఖాన్, న్యాయవాది ప్రమోద్‌రెడ్డి, సామాజికవేత్తలు తారా కృష్ణస్వామి, ఎ. శ్రీనివాస్ సహా పలువురు పాల్గొన్నారు. శనివారం కూడా సమావేశం ఉంటుంది. సమావేశం అనంతరం ప్రతినిధులు మీడియాతో మాట్లాడారు.



శుక్రవారం హైదరాబాద్‌లో జరిగిన జేఎఫ్‌సీ సమావేశం అనంతరం విలేకరులతో మాట్లాడుతున్న జనసేన అధినేత పవన్‌కల్యాణ్. చిత్రంలో లోక్‌సత్తా పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు జయప్రకాశ్‌నారాయణ, సీపీఎం ఏపీ కార్యదర్శి మధు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ తదితరులు

పవన్ ఇంకా ఏమన్నారంటే...

- ఎన్నికల అజెండాలో మత్స్యకారులను ఎస్టీల్లో చేరుస్తామని తెదేపా హామీ ఇచ్చింది. నేడు దానిని పట్టించుకోని పర్యవసానంగా మత్స్యకారులకు.. గిరిజనులకు మధ్య ఘర్షణలు జరుగుతున్నాయి.
- ఆక్వా ఫుడ్ పార్కు వచ్చినపుడు.. స్థానిక ప్రజల సమస్యల్ని పట్టించుకోకపోతే అక్కడి ప్రజలు నిరసన వ్యక్తం చేశారు. దీనిపై అక్కడున్న యువత ప్రశ్నిస్తే... ప్రభుత్వం మా మాట వినదు ఏం చేయాలో తెలియక తీవ్రవాదం వైపు వెళ్లాలని ఉంది అని నాతో అన్నారు.
- ఉద్దానంలో ప్రజల సమస్యలను పట్టించుకునేవారు లేరు. వారు నిత్యం సుదూర ప్రాంతానికి వెళ్లి చికిత్స చేయించుకోవాలి. ఇచ్చిన హామీలు నెరవేర్చకపోవడం వల్ల ప్రజల్లో అభద్రతా భావం ఏర్పడుతుంది. అశాంతితో కూడిన పరిస్థితులు ఏర్పడతాయి.

కమిటీలో ఉన్నది వీరే..

విభజన హామీల అమలుపై వాస్తవాలపై అధ్యయనం చేసేందుకు కేంద్ర హోంశాఖ మాజీ కార్యదర్శి పద్మనాభయ్య, ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి, ఐ. వై. ఆర్. కృష్ణారావు, మహారాష్ట్ర కేడర్‌కు చెందిన మాజీ ఐఏఎస్ అధికారి చంద్రశేఖర్‌తో కమిటీ పనిచేస్తుంది.

అధ్యయనం చేసే అంశాలు...

1. రెవిన్యూ రాబడులు
2. వెనుకబడ్డ ప్రాంతాల అభివృద్ధి
3. పోలవరం ప్రాజెక్టు
4. పన్ను రాయితీలు
5. వివిధ సంస్థల ఏర్పాటు
6. మౌలిక సదుపాయాలు
7. నగరాలకు మెట్రో రైళ్లు
8. ఓడరేవులు
9. రైల్వే జోన్
10. ప్రత్యేక ప్రతిపత్తి లేదా ప్రత్యేక హోదా
11. రాజధాని నిర్మాణం

బాధ్యత కేంద్రానిదే

- జయప్రకాశ్ నారాయణ్

రాష్ట్ర విభజన సమయంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కేంద్రానికి పంపిన లేఖను అందజేసింది. దాన్ని విశ్లేషిస్తాం. కేంద్రం నుంచి అధికారిక సమాచారం తీసుకునేందుకు ప్రయత్నిస్తున్నాం.

ఐదులోపు పరిష్కరించాలి

-మధు, సీపీఎం ఏపీ కార్యదర్శి

మార్చి ఐదో తేదీన పార్లమెంట్ సమావేశం ప్రారంభమయ్యేలోపు సమస్యలను పరిష్కరించాలి. రాష్ట్రంలో తీవ్రమైన ఆగ్రహావేశాలు ఉన్నాయి. ప్రజలు ఆవేదనతో ఉన్నారు. ప్రత్యేక హోదా కన్నా ప్యాకేజీ గొప్పదని నాలుగేళ్లు రాష్ట్ర ప్రభుత్వం కాలయాపన చేసింది.

ప్రతిహామీని నెరవేర్చేదాకా పోరాటం

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, రామకృష్ణ

ఏపీకి ఇచ్చిన ప్రతిహామీని నెరవేర్చేదాకా పోరాడుతాం. కేంద్రం ఏపీపై వ్యతిరేక వైఖరిని ప్రదర్శిస్తోంది. కేంద్ర బడ్జెట్‌లో కూడా రాష్ట్రానికి అన్యాయం చేశారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే కారణం

- గౌతమ్, కాంగ్రెస్ ప్రతినిధి

విభజన హామీలు నాలుగేళ్లుగా అమలు కాకపోవడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే కారణం. రాష్ట్ర విభజనలో తెదేపా, వైకాపా కూడా లేఖలు ఇచ్చాయని గుర్తించాలి.

- చట్టం అమలు చేయాలని పోరాటం చేయాల్సి రావడం దారుణమని మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ అన్నారు. పవన్‌కళ్యాణ్ తీసుకున్న ఈ నిర్ణయం గొప్పదని ఇది శుభపరిణామమని ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి ఐ. వై. ఆర్. కృష్ణారావు అన్నారు. కేంద్రం నుంచి వస్తున్న నిధులు.. వాటిని రాష్ట్రప్రభుత్వం ఏవిధంగా ఖర్చు చేసిందో చర్చించాలని ఆయన అభిప్రాయపడినట్లు తెలుస్తోంది.

సమస్యలకు పరిష్కారం దొరికిన తర్వాతే రండి: షబ్బీర్‌అలీ

హైదరాబాద్, న్యూస్‌టుడే: దిల్లీ పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి కేసీఆర్ విభజన హామీలు, ముస్లింలకు 12 శాతం, గిరిజనులకు 10 శాతం రిజర్వేషన్లు సహా ఇతర సమస్యల పరిష్కారానికి కేంద్రం నుంచి కచ్చితమైన హామీ పొందిన తర్వాతే రాష్ట్రానికి తిరిగి రావాలని మండలిలో విపక్ష నేత షబ్బీర్‌అలీ డిమాండ్ చేశారు. ఉపనేత పొంగులేటి సుధాకర్‌రెడ్డితో కలిసి ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. దిల్లీకి వెళ్లే ముందు తెలంగాణకు రూ. 40 వేల కోట్లు కావాలని అడిగిన సీఎం.. అక్కడికి వెళ్లి కేవలం రూ. 450 కోట్లు కావాలని కేంద్ర ఆర్థికమంత్రికి వినతిపత్రం ఇవ్వడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. మిషన్ భగీరథలో జరుగుతున్న అవినీతిపై కేంద్రం వద్ద ఆధారాలు ఉన్నందునే ప్రధానికి ఆయన భయపడుతున్నారని విమర్శించారు. పొంగులేటి సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రయోజనాల కోసం కాకుండా సొంత రాజకీయ ఎజెండాతో తెరాస పని చేస్తుందన్నారు.

టీపీసీసీ ప్రక్షాళన ఇప్పట్లో లేనట్టే!

- ఇతర రాష్ట్రాల ఎన్నికలతో తీరికలేని రాహుల్
- ప్రస్తుత పరిస్థితిపై శ్రేణుల్లో అసంతృప్తి

హైదరాబాద్, న్యూస్‌టుడే: 'సంక్రాంతి తర్వాత పార్టీని ప్రక్షాళన చేస్తాం.. పని చేసే వారికే పదవులు ఇస్తాం. కొత్తగా పార్టీలో చేరిన వారికి సముచిత స్థానం కల్పిస్తాం' ..ఇదీ గతంలో టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వివిధ సందర్భాల్లో చెప్పిన మాటలు. దీంతో ఆశావాహులు, ఇతర పార్టీల నుంచి కాంగ్రెస్‌లో చేరిన వారు కొత్తకమిటీలో తమకు పదవులువస్తాయని ఎదురు చూశారు. సంక్రాంతి.. శివరాత్రి పోయినా ఇంత వరకు కొత్త కమిటీ ప్రస్తావనే లేదని పలువురు నేతలు వాపోతున్నారు. తాజా పరిస్థితులను గమనిస్తే కొత్త కమిటీ ఇప్పట్లో వేసే పరిస్థితే కనిపించడం లేదంటున్నారు. టీపీసీసీ కొత్త కమిటీ ఏర్పాటులో జాప్యానికి గల కారణాలను విశ్లేషిస్తే...కాంగ్రెస్ జాతీయ అధ్యక్షునిగా రాహుల్‌గాంధీ బాధ్యతలు చేపట్టగానే ఏఐసీసీ కమిటీని వేయాల్సివుంది. ఆ తర్వాత టీపీసీసీ కొత్త కమిటీ వేయాల్సి ఉంటుంది. కానీ రాహుల్ అధ్యక్షునిగా బాధ్యతలు తీసుకున్న తర్వాత. .గుజరాత్, హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాల ఎన్నికలు, రాజస్థాన్‌లో లోక్‌సభ స్థానాలకు ఉప ఎన్నికలు జరిగాయి. ఆ తర్వాత ఇప్పుడు త్వరలో జరుగబోయే త్రిపుర, కర్ణాటక ఎన్నికల ప్రక్రియలో తీరికలేకుండా ఉన్నారు. టీపీసీసీ కొత్తకమిటీ ఏర్పాటుకు సంబంధించి ప్రతిపాదిత జాబితా సహా ఏఐసీసీలో రాష్ట్ర నేతలకు పదవులపై ఇప్పటికే అధిష్ఠానానికి రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ ప్రతిపాదనలు పంపించినట్లు తెలిసింది. అయితే ఏఐసీసీ కమిటీ ఏర్పాటు తర్వాతే టీపీసీసీ కొత్త కమిటీకి అవకాశం ఉంటుంది. మరోవైపు కొత్త కమిటీలో స్థానం కోసం సీనియర్లు, పార్టీలో చేరిన వారు.. కమిటీ ఏర్పాటులో జాప్యంపై అసంతృప్తితో ఉన్నారు. ప్రధానంగా తెదేపా నుంచి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యే రేవంత్‌రెడ్డి, ఆయన వర్గం.. పార్టీలో ఎలాంటి పదవులూ లేకపోవడంతో మిన్నకున్నారు. పార్టీలో పదవి లేకున్నా రేవంత్‌రెడ్డి ఒక్కరే అప్పుడప్పుడు మీడియా ముందుకు వస్తూ.. అధికార పార్టీపై విమర్శలు సంధిస్తున్నారు. మాజీ ఎంపీ, సినీనటి విజయశాంతి సైతం అధిష్ఠానం తనకు బాధ్యతలు అప్పగిస్తే పార్టీలో క్రియాశీలకంగా వ్యవహరించేందుకు సిద్ధంగా ఉన్నట్లు ఆమె ప్రకటించారు. ఎన్నికల సమయం ముంచుకొస్తున్న తరుణంలో.. నూతన కమిటీతో దూకుడుగా జనంలోకి వెళ్లాల్సిన సమయంలో.. ఇలాంటి పరిస్థితిపై పార్టీ శ్రేణులు, కార్యకర్తలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

పురుషోత్తమ్‌రెడ్డి లొంగుబాటు

- ఆదాయానికి మించి ఆస్తుల కేసులో నిందితుడు

ఈనాడు - హైదరాబాద్,
న్యూస్‌టుడే - చంచల్‌గూడ

ఆదాయానికి మించి ఆస్తులున్నాయంటూ అభియోగాలు ఎదుర్కొంటున్న హెచ్ఎండీఏ ప్రణాళిక విభాగం సంచాలకుడు పురుషోత్తమ్ రెడ్డి ఏసీబీ ప్రత్యేక కోర్టులో శుక్రవారం అత్యంత నాటకీయ పరిణామాల నడుమ లొంగిపోయాడు. పదిహేను రోజుల నుంచి అతడి ఆచూకీ కోసం ఏసీబీ ప్రత్యేక బృందాలు గాలిస్తున్నా దొరక్కుండా ముందస్తు బెయిల్ ప్రయత్నాలు చేస్తూనే ఉన్నాడు. ఈ నేపథ్యంలో పాతబస్తీలోని ఏసీబీ ప్రత్యేక కోర్టులో ఉదయం 11గంటలకు ఆయన ప్రత్యక్షమయ్యాడు. పురుషోత్తమ్ రెడ్డి లొంగిపోతున్నట్లు ఆయన తరపు న్యాయవాది ఒకటో అదనపు ప్రత్యేక జడ్జికి వివరించారు. అనంతరం ఈ సమాచారాన్ని కోర్టు ప్రతినిధులు ఏసీబీ అధికారులకు అందించగా హుటాహుటిన వారు అక్కడికి చేరుకున్నారు. ఇరువర్గాల వాదనలను విన్నాక.. న్యాయమూర్తి మార్చి 1వ తేదీ వరకూ పురుషోత్తమ్ రెడ్డికి జ్యుడిషియల్ రిమాండ్ విధించారు. ఏసీబీ అధికారులు అతడికి వైద్య పరీక్షలు నిర్వహించి సాయంత్రం చంచల్‌గూడ జైలుకు తరలించారు. అక్కడ విచారణ ఖైదీ 2251 నంబరును కేటాయించారు. పురుషోత్తమ్ రెడ్డిని విచారించేందుకు అనుమతివ్వాలంటూ న్యాయమూర్తిని అభ్యర్థించారు. ఈ అభ్యర్థన సోమవారం విచారణకు వచ్చే అవకాశాలున్నాయని ఏసీబీ అధికారులు భావిస్తున్నారు.

కోర్టు గదిలో చిద్విలాసం.. ముఖం కనిపించకుండా టోపీ

ఏసీబీ కేసులో నిందితుడైన పురుషోత్తమ్ రెడ్డి గురువారం రాత్రి వరకూ అజ్ఞాతంలో ఉన్నాడు. శుక్రవారం ఉదయం ఏసీబీ కోర్టు ప్రారంభం కాగానే న్యాయవాదితో సహా కోర్టుకు చేరుకున్నాడు. కోర్టు గదిలోకి వెళ్లి బెంచీపై కూర్చున్నాడు. విచారణ, వాదనలు కొనసాగుతున్నంత వరకూ చిద్విలాసంగా ఉన్నాడు. రిమాండ్ విధిస్తున్నట్టు కోర్టు ప్రకటించినా కంగారు పడలేదు. జైలుకు తరలిస్తున్నప్పుడు ప్రసారమాధ్యమాలు, పత్రికల వారికి కనిపించకుండా టోపీ పెట్టుకుని బయటకు వచ్చాడు.





బ్యాంకు లాకర్‌లో లభ్యమైన నగలు ★ యాదవరెడ్డి, నిశాంత్‌రెడ్డిలను కస్టడీకి తరలిస్తున్న పోలీసులు

బ్యాంకు లాకర్‌లో రూ.80 లక్షల వజ్రాభరణాలు, 1.5 కిలోల బంగారం

బ్యాంకు లాకర్లపై దృష్టి సారించిన ఏసీబీ అధికారులు పురుషోత్తమ్ రెడ్డి వియ్యంకుడు రాధాచరణ్ రెడ్డి భార్యకు చెందిన బ్యాంకు లాకర్‌ను శుక్రవారం తెరిచారు. బోయిన్‌పల్లిలోని కోటక్ మహీంద్ర బ్యాంకుకు వెళ్లిన ఇద్దరు డీఎస్పీలు బ్యాంకు అధికారుల సమక్షంలో లాకర్ పరిశీలించారు. అందులో బంగారు, వజ్రాభరణాలను లెక్కపెట్టారు. రూ. 80లక్షల విలువైన రెండు వజ్రాల హారాలు, 1.5కిలోల బంగారు ఆభరణాలను గుర్తించామని డీఎస్పీ అశోక్‌కుమార్ తెలిపారు. వీటిని తాము సీజ్ చేయలేదని, ఇందులో పురుషోత్తమ్ రెడ్డికి చెందిన బంగారు, వజ్రాభరణాలుంటే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని వివరించారు. మరోవైపు పురుషోత్తమ్ రెడ్డి కుమార్తెకు రెండు వజ్రాల హారాలు ఇచ్చామని, తమ ఇంట్లో పాత బంగారమేనని రాధాచరణ్ రెడ్డి ఏసీబీ అధికారులకు వివరించినట్టు తెలిసింది. పురుషోత్తమ్ రెడ్డి అక్రమాల చిట్టాలను వెలికితీస్తున్న ఏసీబీ అధికారులు ఆయన బినామీలు యాదవ్‌రెడ్డి, నిశాంత్‌రెడ్డిలను శుక్రవారం మరిన్ని ప్రశ్నలు సంధించారు. మరో మూడురోజులు వీరిని విచారించి విలువైన సమాచారం రాబట్టే దిశగా ప్రశ్నావళి రూపొందించారు.

ఇద్దరు ఇన్‌స్పెక్టర్లపై చర్యలు

విధినిర్వహణలో పేలవమైన పనితీరు కారణంగా అవినీతి నిరోధక శాఖలో ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న ఇన్‌స్పెక్టర్ పి. శ్రీధర్‌ను ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. ఇదే కారణంతో ఈయనతో పాటు ప్రధాన కార్యాలయంలో ఎంటీవో విభాగం ఇన్‌స్పెక్టర్ కిష్టయ్యపై బదిలీ వేటు వేశారు. కొద్దిరోజుల క్రితమే వీరిద్దరికీ అధికారిక ఉత్తర్వులు అందినా శుక్రవారం ఈ సంఘటన వెలుగులోకి వచ్చింది. అక్రమాస్తుల కేసులో అభియోగాలు ఎదుర్కొంటున్న హెచ్ఎండీఏ అధికారి పురుషోత్తమ్ రెడ్డికి వీరిద్దరూ అంతర్గతంగా సహకారమందించారన్న ఆరోపణలు రావడంతో ఉన్నతాధికారులు ఈ నిర్ణయం తీసుకున్నట్టు సమాచారం. శ్రీధర్‌ను సస్పెండ్, కిష్టయ్యను బదిలీ చేసిన మాట వాస్తవమేనని ఇది కేవలం వారి పేలవమైన పనితీరువల్లేనని ఏసీబీ డీజీ పూర్ణచంద్రరావు శుక్రవారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు.

మావోయిస్టులపై సంయుక్త వ్యూహరచన

తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ పోలీసు ఉన్నతాధికారుల రహస్య భేటీ

కొత్తగూడెం నేరవార్తలు, న్యూస్‌టుడే: మావోయిస్టు కార్యకలాపాల నియంత్రణకు తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల పోలీసు ఉన్నతాధికారులు సంయుక్త వ్యూహరచన చేపట్టారు. అందులో భాగంగా రెండు రాష్ట్రాల పోలీసు ఉన్నతాధికారులు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ కార్యాలయంలో శుక్రవారం రహస్యంగా సమావేశమయ్యారు. ఛత్తీస్‌గఢ్‌నుంచి అధికారుల బృందం ప్రత్యేక హెలికాప్టర్ ద్వారా కొత్తగూడెం చేరుకుంది. ఛత్తీస్‌గఢ్‌ను ఆనుకుని ఉన్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, జయశంకర్ భూపాలపల్లి జిల్లా సరిహద్దుల్లో ఇటీవల మావోయిస్టు కార్యకలాపాలు పెరుగుతున్నాయి. ఇన్‌ఫార్మర్ల పేరుతో హతమార్చడం, భారీ వాహనాల దహనం లాంటి ఘటనలు జరిగాయి. తాజాగా ఛత్తీస్‌గఢ్‌లోని సుకుమా జిల్లాలో సైతం ఇద్దరు మావోయిస్టులు మృతి చెందారు. ఈ నేపథ్యంలో రెండు రాష్ట్రాల సరిహద్దుల్లో ఉమ్మడి కార్యాచరణకు ప్రణాళికలు రచించాలనినిర్ణయించారు. ఛత్తీస్‌గఢ్ ఐజీ వివేకానంద్, గ్రేహౌండ్స్ ఐజీ శ్రీనివాస రెడ్డి, వరంగల్ రేంజ్ ఐజీ నాగిరెడ్డి, ఎస్ఐబీ ఐజీలు సజ్జనార్, నర్సింగరావు, భద్రాద్రి జిల్లా ఎస్పీ అంబర్ కిశోర్ ఝా, జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పీ భాస్కరన్, పలువురు శిక్షణఐపీఎస్‌లు సమావేశంలోపాల్గొన్నారు.

తీవ్రవాద ప్రభావిత ప్రాంతాల అభివృద్ధికి రూ.547 కోట్లు

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణలోని తీవ్రవాద ప్రభావిత ప్రాంతాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం రూ. 547 కోట్లు మంజూరు చేసిందని రాష్ట్ర రహదారులు, భవనాలశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 6న దిల్లీ వెళ్లి కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్‌సింగ్, నరేంద్ర తోమర్‌లను కలిసి నిధులు కేటాయించాల్సిందిగా కోరినట్లు తెలిపారు. దీంతో నిధులు మంజూరు చేస్తున్నట్లు కేంద్రం నుంచి లేఖ వచ్చిందన్నారు.

ప్రతి పాఠ్య పుస్తకానికీ ఓ సంఖ్య

- ఉచిత పుస్తకాలపై వరుస సంఖ్య ముద్రణ
- తెలంగాణ పాఠశాల విద్యాశాఖ నిర్ణయం


ఈనాడు, హైదరాబాద్ : సర్కారు బడుల్లో చదివే విద్యార్థులకు ఉచితంగా అందజేస్తున్న పాఠ్య పుస్తకాలు పక్కదారి పట్టకుండా ఉండేందుకు ఈసారి వాటిపై వరుస సంఖ్యను ముద్రించనున్నారు. ఒక్కో పుస్తకానికి ఒక్కో వరుస సంఖ్యను పుస్తక ముఖచిత్రంపై ముద్రిస్తారు. ఈ మేరకు తెలంగాణ పాఠశాల విద్యాశాఖ నిర్ణయించింది. రాష్ట్రంలోని ప్రభుత్వ బడుల్లో 1-10 తరగతులు చదివే సుమారు 25 లక్షల మంది విద్యార్థులకు పాఠ్య పుస్తకాలను ప్రభుత్వం ఉచితంగా సరఫరా చేస్తున్న విషయం తెలిసిందే. విద్యార్థుల సంఖ్యకు మించి కొద్ది మొత్తంలో ఎక్కువే ముద్రించినా ఇంకా వేలాది మందికి అందని పరిస్థితి తలెత్తుతోంది. హైదరాబాద్‌లోని కోఠి లాంటి ప్రాంతాలకు వేల పుస్తకాలు చేరుతున్నాయన్న ఫిర్యాదులు కూడా అందాయి. అందుకే 2017-18 విద్యా సంవత్సరానికి ప్రభుత్వం సరఫరా చేసే పుస్తకాలపై ఉచితం(ఫ్రీ) అని, మార్కెట్లో విక్రయించే వాటిపై విక్రయానికి (సేల్) అని ముద్రించారు. ఒకవేళ ఏదైనా పుస్తకం కనిపిస్తే అది ప్రభుత్వం ఇచ్చిందా? విక్రయ పుస్తకమా? అని సులభంగా తెలిసిపోతుందన్నది విద్యాశాఖ ఆలోచన. పుస్తకాలు పక్కదారి పట్టినా ఏ జిల్లాకు, ఏ మండలానికి, ఏ బడికి పంపినవి అనేది తెలుసుకోవడం కష్టంగా మారింది. దీన్ని గమనించిన విద్యాశాఖ కమిషనర్ కిషన్ ఈసారి ప్రతి పుస్తకానికీ ఒక వరుస సంఖ్యను ముద్రించాలని నిర్ణయించారు. మొత్తం 1.71 కోట్ల పుస్తకాలను పంపిణీ చేయనున్నారు. ఈ సంఖ్య ఎలా ఇవ్వాలన్న దానిపై కసరత్తు చేస్తున్నారు. ఏప్రిల్ చివరి వరకు పుస్తకాలను మండలాలకు సరఫరా చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈసారి విక్రయ పుస్తకాల ధరలు 15 శాతం వరకు పెరగనున్నాయి. ఒక్కో పుటకు 5.95 పైసల చొప్పున ధర నిర్ణయించినట్లు సమాచారం.

ఆ రెండు జిల్లాల ఎస్జీటీ ఫలితాల్ని వెల్లడించొద్దు

- టీఆర్‌టీపై హైకోర్టు ఆదేశాలు

ఈనాడు, హైదరాబాద్: ఉపాధ్యాయ నియామక పరీక్ష (టీఆర్‌టీ)కి సంబంధించి ఖమ్మం, వరంగల్ జిల్లాల ఎస్జీటీ ఫలితాల్ని ప్రకటించొద్దని తెలంగాణ సాధారణ పరిపాలనాశాఖ ప్రధాన కార్యదర్శి, విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి, టీఎస్‌పీఎస్సీ కార్యదర్శిని హైకోర్టు ఆదేశించింది. త్వరలో జరగనున్న టీఆర్‌టీ పరీక్ష నిర్వహణ ప్రక్రియను నిలుపుదల చేయడానికి నిరాకరించింది. ప్రతివాదులను ప్రమాణపత్రాలు దాఖలు చేయాలని ఆదేశిస్తూ విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది. ఉమ్మడి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎమ్మెస్ రామచంద్రరావు శుక్రవారం ఈ మేరకు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు.

ఉపాధ్యాయ నియామకాలను సంబంధించి గతంలో జారీ చేసిన ప్రకటనల్లో భర్తీ కాకుండా మిగిలిపోయిన దివ్యాంగుల ఎస్జీటీ పోస్టులను తాజా ప్రకటనలో చేర్చకుండా (క్యారీఫార్వర్డ్) టీఆర్‌టీ ప్రకటన జారీ చేయడాన్ని సవాలు చేస్తూ దివ్యాంగులైన ఖమ్మం జిల్లాకు చెందిన



ఎస్. మురళి, వరంగల్ జిల్లాకు చెందిన డి. మల్లికార్జున్ హైకోర్టులో వ్యాజ్యం దాఖలు చేశారు. పిటిషనర్ల తరపు న్యాయవాది వాదనలు వినిపిస్తూ ఉద్యోగ ప్రకటనలో ఖమ్మం జిల్లా దివ్యాంగులకు (ఎస్‌జీటీ పోస్టు) ఒకటి, వరంగల్ జిల్లా దివ్యాంగులకు పది పోస్టులు కేటాయించారన్నారు. 2012లో నిర్వహించిన డీఎస్సీలో ఖమ్మం జిల్లాలో దివ్యాంగులకు కేటాయించిన ఐదు పోస్టులు, వరంగల్ జిల్లాలో తొమ్మిది పోస్టులు భర్తీకాకుండా మిగిలిపోయాయన్నారు. ఆ పోస్టులను కలుపుకొని తాజాగా టీఆర్‌టీ ప్రకటన ఇవ్వలేదన్నారు. కాబట్టి ఈ నెలలో నిర్వహించనున్న టీఆర్‌టీ పరీక్షలను నిలుపుదల చేయాలని కోరారు. వాదనలు విన్న న్యాయమూర్తి పరీక్షలను నిలుపుదల చేయడానికి నిరాకరించారు. ఖమ్మం, వరంగల్ జిల్లాల ఎస్జీటీ ఫలితాలను ప్రకటించొద్దని మాత్రం ఆదేశించారు.

టీఆర్టీ అభ్యర్థులకు ప్రత్యేక హెల్ప్ డెస్క్

ఈనాడు, హైదరాబాద్: టీఆర్టీ అభ్యర్థుల కోసం ప్రత్యేక హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్, సెంటర్‌ఫర్ గుడ్ గవర్నెన్స్ తెలిపాయి. ఉదయం 9.30 నుంచి సాయంత్రం 6.30 వరకు ఈ కేంద్రం పనిచేస్తుంది. టీఎస్‌పీఎస్సీ ఛైర్మన్ ఘంటా చక్రపాణితో సెంటర్‌ఫర్ గుడ్ గవర్నెన్స్ (సీజీజీ) డీజీ రాజేంద్ర నిమ్జె టీఎస్‌పీఎస్సీ కార్యాలయంలో శుక్రవారం సమావేశమయ్యారు. టీఆర్టీ అభ్యర్థుల నుంచి వస్తున్న ఫిర్యాదులను, డేటా అప్‌డేషన్‌లో నమోదవుతున్న తప్పుల్ని, హాల్‌టికెట్ డౌన్‌లోడ్‌లో ఎదురవుతున్న సమస్యల్ని సీజీజీ డీజీ వివరించారు. అభ్యర్థులు హాల్‌టికెట్ డౌన్‌లోడ్ చేసుకునే సమయంలో ఎడిట్ ఆప్షన్ ఉపయోగించుకుని 31 జిల్లాలకు బదులుగా 10 జిల్లాలుగా మార్చుకోవాలని అభ్యర్థులకు టీఎస్‌పీఎస్సీ సూచించింది. ఇది మినహా హాల్‌టికెట్ డౌన్‌లోడ్‌లో మరో ఎడిట్ ఆప్షన్ ఉండదని స్పష్టం చేసింది. 83339 23740 నెంబరుతో హెల్ప్‌డెస్క్‌ను ఏర్పాటుచేస్తూ టీఎస్‌పీఎస్సీ, సీజీజీ నిర్ణయించాయి. helpdesk@tspsc.gov.in ద్వారా కూడా సంప్రదించవచ్చని తెలిపాయి.

ఏ హోదాలో ఉన్నా పంచ కట్టే ఇష్టం

ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు వెల్లడి

తిరువనంతపురం: ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు సంప్రదాయ వస్త్రధారణ అయిన పంచ కట్టుపై మరోసారి తన మక్కువను చాటుకున్నారు. తాను ఏ హోదాలో ఉన్నా సూటు-కోటు ధరించటం కన్నా పంచ కట్టునే ఇష్టపడతానన్నారు. ఉపరాష్ట్రపతి పదవిని చేపట్టిన తర్వాత కొందరు తనతో మాట్లాడుతూ "రాజ్యాంగ పదవిలో ఉంటూ కోటు(బంద్‌గాలా) ధరించకపోతే ఎలా"అంటూ ప్రశ్నించారని తెలిపారు. అయితే తాను "మారింది దుస్తులు కాదు...చిరునామా మాత్రమే"నని జవాబిచ్చానని వెల్లడించారు. శుక్రవారం ఆయన తిరువనంతపురంలో శ్రీ చితిర తిరునాల్ స్మారక ఉపన్యాస కార్యక్రమంలో మాట్లాడుతూ ఈ విషయం చెప్పారు.

రిజిస్ట్రేషన్లలో అవినీతిపై నివేదిక పంపండి

కలెక్టర్లకు మంత్రి ఆదేశం.. 'ఈనాడు' కథనానికి స్పందన

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలో స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ అవినీతిపై 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి ప్రభుత్వం స్పందించింది. సమగ్ర విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని రెవెన్యూ శాఖ మంత్రి మహమూద్ అలీ జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు. ప్రతి రిజిస్ట్రేషన్‌కు విధిగా డబ్బులు ఇచ్చుకోవాల్సి రావడం సహా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అవినీతిపై 'ఈనాడు'లో గురువారం 'పైసలిస్తేనే ఫైలు కదిలేది' పేరిట కథనం ప్రచురితమైంది. దీనిపై మంత్రి సమీక్షించారు. ఈ అంశంపై జిల్లా కలెక్టర్లు తగు చర్యలు తీసుకోవాలని, వాస్తవ పరిస్థితిని వివరిస్తూ ప్రత్యేక నివేదికను పంపాలని ఆదేశించారు. సాధ్యమైనంత త్వరగా నివేదిక పంపాలని స్పష్టం చేశారు.

ఎగవేతదారుల నుంచి పన్ను వసూలుకు కార్యదళం

ఏర్పాటు చేసిన ఆదాయపన్నుశాఖ

హైదరాబాద్: తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో ఆదాయపన్ను చెల్లించకుండా తప్పించుకు తిరుగుతున్న వారి నుంచి పన్ను రాబట్టేందుకు ఆ శాఖ 12 మంది అధికారులతో కార్యదళాన్ని(టాస్క్‌ఫోర్స్) ఏర్పాటు చేసింది. ఇందులో కొందరు పోలీసు అధికారులు కూడా ఉన్నారు. దీనికి అదనపు కమిషనర్ ర్యాంకు అధికారి నేతృత్వం వహిస్తారని ఆదాయపన్ను శాఖ శుక్రవారం ఓ ప్రకటనలో వెల్లడించింది. ఈ కార్యదళం హైదరాబాద్‌లోని సెంట్రల్ క్రైం స్టేషన్(సీసీఎస్)తో సమన్వయంతో పనిచేస్తుందని, తప్పించుకు తిరుగుతున్న పన్ను ఎగవేతదారులను గుర్తించి, వారి నుంచి బకాయిలను వసూలు చేస్తుందని ఆ ప్రకటనలో తెలిపింది.

మీ వల్లే మద్దతు ధర

మంత్రులకు, ఎంపీకి రైతుల కృతజ్ఞతలు

ఈనాడు, హైదరాబాద్: ఎర్రజొన్నకు మద్దతు ధర కల్పనకు కృషి చేశారని మార్కెటింగుశాఖ మంత్రి హరీశ్‌రావు, నిజామాబాద్ ఎంపీ కల్వకుంట్ల కవితలకు రైతులు కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం రైతులు పెద్దసంఖ్యలో హైదరాబాద్‌కు వచ్చారు. ముందుగా వారు కవితను కలిశారు. ధరలపై ఆందోళన నెలకొన్న తరుణంలో సకాలంలో స్పందించి, సమస్యను సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి తమను ఆదుకున్నారని తెలిపారు. గతంలో ఆమె కృషి వల్లనే ఎర్రజొన్న బకాయిలు అందాయని తెలిపారు. కవిత మాట్లాడుతూ, సీఎం కేసీఆర్ రైతు బాంధవుడని, వారికి సంబంధించిన ప్రతీ అంశంలోనూ నూటికి నూరుశాతం న్యాయం చేస్తున్నారని చెప్పారు. అనంతరం రైతులు హరీశ్‌రావును కలిశారు. తమ సమస్యను అత్యవసరంగా పరిష్కరించారని, ఆయన మేలు మరిచిపోలేమని చెప్పారు.

కడప, ఖమ్మం స్టీల్‌ప్లాంట్లపై మెకాన్ ముసాయిదా నివేదిక సిద్ధం

రాష్ట్ర ప్రభుత్వాలతో సంప్రదించి త్వరలో ప్రాజెక్టు నివేదిక తయారీ: కేంద్ర ఉక్కుశాఖ

ఈనాడు, దిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లోని కడప, తెలంగాణలోని ఖమ్మం జిల్లాల్లో ఉక్కు కర్మాగారాల ఏర్పాటుపై మెకాన్ సంస్థ ముసాయిదా సాధ్యాసాధ్యాల నివేదికలను తయారుచేసినట్లు కేంద్ర ఉక్కుశాఖ మంత్రి శుక్రవారం ఒక ప్రకటనలో వెల్లడించింది. రెండు జిల్లాల్లో కర్మాగారాల ఏర్పాటుకున్న ఉత్తమ లాభదాయక మార్గాల గురించి అందులో పేర్కొన్నట్లు తెలిపింది. నివేదికపై తాము రాష్ట్ర ప్రభుత్వంతో చర్చిస్తామంది. తద్వారా విభజన చట్టంలోని 13వ షెడ్యూల్‌లో చెప్పినట్లుగా స్టీల్‌ప్లాంట్ ఏర్పాటు లక్ష్యాన్ని చేరుకోవడానికి ఇది దోహదపడుతుందని తెలిపింది. మెకాన్‌తో కలిసి సంబంధిత రాష్ట్ర ప్రభుత్వాలు వాస్తవ అంచనాలపై కసరత్తు చేస్తాయంది. ఇరు రాష్ట్రాల నుంచి సమాచారం వచ్చాక మెకాన్ ప్రాజెక్టు నివేదికను పూర్తిచేస్తుందని కేంద్ర ఉక్కుశాఖ వెల్లడించింది.

నాలుగైదు రోజుల్లో డైట్‌సెట్ ప్రకటన

ఈనాడు, హైదరాబాద్: ఇంటర్ విద్యార్హతతో వచ్చే విద్యా సంవత్సరానికి(2018-19) రెండేళ్ల డీఈడీ కోర్సులో ప్రవేశాలకు నిర్వహించే డైట్‌సెట్ ప్రకటన మరో నాలుగైదు రోజుల్లో వెలువడనుంది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ కసరత్తు పూర్తి చేసింది. మే నెలలో ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారు. గతేడాది మాదిరిగా ఈసారి కూడా ఆన్‌లైన్ విధానంలోనే పరీక్ష జరగనుంది.

ఆన్‌లైన్‌లో టెట్ నిర్వహణ!

ఈనాడు, హైదరాబాద్: ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్)ను సైతం ఆన్‌లైన్‌లోనే నిర్వహించే అవకాశం కనిపిస్తోంది. తెలంగాణ ఏర్పాటు అనంతరం తొలిసారిగా గతేడాది జులై 23న టెట్ నిర్వహించారు. ఏడాదికి కనీసం ఒకసారి టెట్ నిర్వహించడం తప్పనిసరి. అంటే జూన్‌లో ప్రకటన ఇచ్చి జులై 23వ తేదీలోపు మళ్లీ పరీక్ష జరపాలి. ఇంటర్ విద్యార్హతతో జరిపే డైట్‌సెట్‌ను గతేడాది ఆన్‌లైన్ విధానంలో జరపగా... డీఈడీ, బీఈడీ పూర్తయిన వారికి టెట్‌ను ఆఫ్‌లైన్‌లో నిర్వహించడంపై విమర్శలు వచ్చాయి. ఈ క్రమంలో వచ్చే ఏడాది కచ్చితంగా టెట్ ఆన్‌లైన్‌లోనే ఉంటుందని ఆనాడే అధికారులు అంతర్గతంగా తెలిపారు. ఈసారి అది అమలవుతుందని అధికార వర్గాలు చెబుతున్నాయి. టెట్‌కు రాష్ట్రవ్యాప్తంగా 3.40 లక్షల మంది హాజరవుతారు.

ఫార్మా-డి పట్టభద్రులకు ఉద్యోగాల కల్పనపై మీ వైఖరేమిటి?

అధికారులను ప్రశ్నించిన హైకోర్టు

ఈనాడు, హైదరాబాద్: ఫార్మా-డి, ఫార్మా-డి(పీబీ) కోర్సుల్లో పట్టభద్రులైన వారికి తెలంగాణలోని ప్రైవేటు, ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉద్యోగాల సృష్టి, కెరీర్ అవకాశాలు కల్పించడంలేదని పేర్కొంటూ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. 'ఫార్మా-డి వైద్యుల సంక్షేమ సంఘం' అధ్యక్షుడు బి. చంద్రశేఖర్ ఈ వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. శుక్రవారం ఈ వ్యాజ్యంపై విచారణ జరిపిన ఉమ్మడి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎ. వి. శేషసాయి.. తెలంగాణ వైద్య ఆరోగ్యశాఖ ముఖ్యకార్యదర్శి, భారత ఫార్మసీ కౌన్సిల్, కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖలు వివరాలు తెలియజేయాలని పేర్కొన్నారు. ఉద్యోగాల కల్పనపై వారి వైఖరేమిటో స్పష్టం చేయాలన్నారు. విచారణను రెండు వారాలకు వాయిదా వేశారు. పిటిషనర్ తరపు న్యాయవాది దామోదర్‌రెడ్డి వాదనలు వినిపించారు.

సెన్సెక్స్ ▼ 287 **34010**

నిఫ్టీ ▼ 93 **10452**

రూపాయి 64.21 ▼ (ఒక అమెరికా డాలరుకు) 30 పైసలు

బంగారం 30915 ▲ (ముంబయిలో 10 గ్రా. 99.9 స్వచ్ఛత) రూ.లలో 190

వెండి 38710 ▲ ముంబయిలో కిలో రూ.లలో 55

ముడి చమురు 65.04 ▲ (బ్రెంట్ ధర డాలర్లలో)



ప్రధాన ప్రపంచ మార్కెట్లు


సూచీ	ముగింపు	లాభం/నష్టం
డోజోన్స్	25,326	+126
నాస్‌డాక్	7,279	+22
నిక్కీ 225 (జపాన్)	21,720	+255
స్ట్రెయిట్స్ టైమ్స్ (సింగపూర్)	---	---
షాంఘై(చైనా)	---	---
ఎఫ్‌టీఎస్ఈ (బ్రిటన్)	7,295	+60
డాక్స్ (జర్మనీ)	12,452	+106

డోజోన్స్, నాస్‌డాక్ సూచీలు అమెరికా కాలమానం ప్రకారం శుక్రవారం మధ్యాహ్నం 1.00కు (భారత కాలమానం ప్రకారం రాత్రి 11:30 గంటలకు).


విదేశీ మారకపు రేట్లు

(థామస్ కుక్) (రూ.లలో)

కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
అమెరికా డాలరు	58.09	67.36
పౌండ్ స్టెర్లింగ్	81.99	95.10
యూరో	72.77	84.41
జపనీస్ యెన్/100	54.70	63.44
ఆస్ట్రేలియా డాలరు	46.18	53.45
సింగపూర్ డాలరు	44.42	52.61
థాయ్ బాత్/100	185.96	222.42
బహ్రెయిన్ దీనార్	157.32	180.28
కువైట్ దీనార్	176.25	219.41
సౌదీ రియాల్	15.45	18.31
యూఏఈ దిర్హమ్	15.81	18.49
మలేషియా రింగిట్	14.60	17.97
చైనీస్ యువాన్	7.11	11.56



శుక్రవారం నిఫ్టీ కదలికలు



కుట్రపూరిత ఛార్జీలుంటే రూ.50 లక్షల జరిమానా

ట్రాయ్ కొత్త నిబంధనలు

దిల్లీ: భారతీ ఎయిర్‌టెల్, వొడాఫోన్, ఐడియా సెల్యులార్ సంస్థలు రిలయన్స్ జియోపై చేసిన ఆరోపణల నేపథ్యంలో టెలికాం నియంత్రణ సంస్థ ట్రాయ్ కొత్త నిబంధన తీసుకొచ్చింది. మార్కెట్‌లో పోటీదారుల నుంచి పోటీని తగ్గించుకునేందుకు లేదా పోటీదారుల్ని అసలు లేకుండా చేసేందుకు కుట్రపూరితంగా ఛార్జీల్ని నిర్ధరిస్తే సదరు ఆపరేటర్లకు రూ.50 లక్షలదాకా (సర్కిల్‌కు) జరిమానా విధిస్తామని ట్రాయ్ హెచ్చరించింది. గత ఏడాది ఏప్రిల్‌లో జియో కూడా భారతీ ఎయిర్‌టెల్‌పై ట్రాయ్‌కు ఫిర్యాదు చేసింది. టారిఫ్‌ల విషయంలో నిబంధనలు ఉల్లంఘించి ఒకే గ్రూపులో ఉన్నవారికి వేర్వేరుగా ఛార్జీలు వసూలు చేస్తున్నారని అందులో పేర్కొన్న సంగతి తెలిసిందే. దీనికి ట్రాయ్ స్పందిస్తూ 'ఒకే తరహా టారిఫ్‌లో ఉన్న వినియోగదారులందరికీ ఒకే రకమైన సేవలు అందించాల'ని తెలిపింది. మనదేశంలో 22 టెలికాం సర్కిళ్లు ఉన్నాయి. భారతీ ఎయిర్‌టెల్, వొడాఫోన్, ఐడియా, జియో అన్ని సర్కిళ్లలో కార్యకలాపాలు సాగిస్తుండగా, బీఎస్ఎన్ఎల్ 20 సర్కిళ్లు, ఎంటీఎన్ఎల్ 2 సర్కిళ్లు, ఎయిర్‌సెల్ కొన్ని సర్కిళ్లలో కార్యకలాపాలు కొనసాగిస్తున్నాయి.

వెంటాడిన పీఎన్‌బీ భయాలు

• ఆరంభ లాభాలు ఆవిరి • మదుపర్ల లాభాల స్వీకరణ • 287 పాయింట్లు కోల్పోయిన సెన్సెక్స్

ఆరంభ లాభాలను చేజార్చుకున్న సూచీలు.. భారీ నష్టాలు చవిచూశాయి. పీఎన్‌బీ కుంభకోణం భయాలు బ్యాంకింగ్ షేర్లను వెంటాడింది. వాహన, లోహ, యంత్ర పరికరాలు, స్థిరాస్తి షేర్లకు అమ్మకాలు వెల్లువెత్తడం ఇందుకు తోడైంది. నిఫ్టీ 10500 దిగువకు చేరగా, సెన్సెక్స్ 34,000 పాయింట్లను నిలబెట్టుకోగలిగింది. జనవరిలో వాణిజ్య లోటు మూడేళ్ల గరిష్ఠానికి చేరడం సైతం సెంటిమెంట్‌పై ప్రభావం చూపింది. ఆసియా మార్కెట్లలో జపాన్ నిక్కీ రాణించగా, ఐరోపా షేర్లు మెరుగ్గా ట్రేడయ్యాయి. ఇక వారం ప్రాతిపదికన చూస్తే.. సెన్సెక్స్ 5 పాయింట్లు పెరగ్గా, నిఫ్టీ 2.65 పాయింట్లు నష్టపోయింది.

సెన్సెక్ ఉదయం 34411.24 పాయింట్ల వద్ద లాభాల్లోనే ప్రారంభమైంది. అదే జోరును కొనసాగిస్తూ.. 34,508.24 పాయింట్ల వద్ద ఇంట్రాడే గరిష్ఠాన్ని నమోదు చేసింది. అయితే అనంతరం లాభాల స్వీకరణతో నష్టాల్లోకి జారుకున్న సూచీ.. ఏదశలోనూ కోలుకోలేకపోయింది. ఇంట్రాడేలో 33,957.33 పాయింట్ల వద్ద కనిష్ఠానికి పడిపోయిన సెన్సెక్స్, చివరకు 286.71 పాయింట్ల నష్టంతో 34,010.76 దగ్గర స్థిరపడింది. ఇక నిఫ్టీ సైతం 93.20 పాయింట్లు కోల్పోయి 10,452.30 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో ఈ సూచీ 10,434.05- 10,612.90 పాయింట్ల మధ్య కదలాడింది.



3 సెషన్లలో రూ.8,731 కోట్లు: పంజాబ్ నేషనల్ బ్యాంక్ షేరు పతనం కొనసాగింది. ఇంట్రాడేలో 6.03 శాతం కోల్పోయిన షేరు.. రూ.120.60 వద్ద ఇంట్రాడే కనిష్ఠాన్ని తాకింది. చివరకు 2.10 శాతం నష్టంతో రూ.125.65 వద్ద ముగిసింది. గత మూడు సెషన్లలో బ్యాంక్ మార్కెట్ విలువ రూ.8,731.5 కోట్లు తగ్గి రూ.30,477.50 కోట్లకు చేరింది. ఇక గీతాంజలి జెమ్స్ సైతం 20 శాతం కుప్పకూలి రూ.37.55 వద్ద ముగిసింది.

✦ పీఎన్‌బీ కుంభకోణంలో రూ.1900 కోట్లు సంబంధం ఉన్నట్లు వెల్లడించడంతో యూనియన్ బ్యాంక్ షేరు 3 శాతం కోల్పోయి 52 వారాల కనిష్ఠమైన రూ.116.50 తాకింది. బ్యాంక్ ఆఫ్ బరోడా 4.12 శాతం, సిండికేట్ బ్యాంక్ 2.77 శాతం, సెంట్రల్ బ్యాంక్ 2.76 శాతం, ఐడీబీఐ 2.76 శాతం, దేనా బ్యాంక్ 2.72 శాతం, కార్పొరేషన్ బ్యాంక్ 2.50 శాతం చొప్పున డీలాపడ్డాయి.

సెన్సెక్స్ 30 షేర్లలో 25 నష్టాలు చవిచూశాయి. ఎస్‌బీఐ 2.55%, యెస్ బ్యాంక్ 2.52%, ఐసీఐసీఐ బ్యాంక్ 2.31%, భారతీ ఎయిర్‌టెల్ 2.07%, మారుతీ సుజుకీ 2%, అదానీ పోర్ట్స్ 1.70%, టాటా స్టీల్ 1.65%, ఎల్ అండ్ టీ 1.64%, ఇండస్‌ఇండ్ బ్యాంక్ 1.62%, టాటా మోటార్స్ 1.49%, కోల్ ఇండియా 1.42%, పవర్‌గ్రిడ్ 1.34%, రిలయన్స్ ఇండస్ట్రీస్ 1.32%, బజాజ్ ఆటో 1.20% చొప్పున డీలాపడిన వాటిలో ఉన్నాయి. కోటక్ మహీంద్రా బ్యాంక్ 1.04%, ఇన్ఫోసిస్ 0.96%, డాక్టర్ రెడ్డీస్ 0.83%, ఏషియన్ పెయింట్స్ 0.62%లు మాత్రం రాణించాయి. రంగాల వారీ సూచీల్లో వాహన 1.65% నీరసపడింది. లోహ, పీఎస్‌యూ, స్థిరాస్తి, యంత్ర పరికరాలు, చమురు-గ్యాస్, బ్యాంకింగ్ షేర్లు అదే బాటలో నడిచాయి. ఐటీ షేర్లు మాత్రం రాణించాయి.

ఆర్ఐఎల్ చేతికి ఐఎఫ్‌సీ!

• 65 శాతం వాటా కొనుగోలు
• విలువ రూ.1,105 కోట్లు

దిల్లీ: ఇండియన్ ఫిల్మ్ కంబైన్ (ఐఎఫ్‌సీ)లో 65 శాతం వాటాను రూ.1105 కోట్లకు కొనుగోలు చేయనున్నట్లు రిలయన్స్ ఇండస్ట్రీస్ (ఆర్ఐఎల్) వెల్లడించింది. ప్రస్తుతం ముంబయి బాంద్రా కుర్లా కాంప్లెక్స్‌లో 12 ఎకరాల స్థలంలో డ్రైవ్ ఇన్ థియేటర్, హోటల్, రిటైల్ మాల్, క్లబ్‌లను ఐఎఫ్‌సీ నిర్మిస్తోంది. ఐఎఫ్‌సీలో 65 శాతం వాటాను రిలయన్స్ ఇండస్ట్రీస్ అనుబంధ సంస్థ రిలయన్స్ ఇండస్ట్రియల్ ఇన్వెస్ట్‌మెంట్స్ అండ్ హోల్డింగ్స్‌కు కొనుగోలు చేయనుందని ఎక్స్ఛేంజీలకు సమాచారం ఇచ్చింది. ఐఎఫ్‌సీలో 20 శాతం వాటాను జాండర్ గ్రూప్ మారిషస్ విభాగం నుంచి రూ.340 కోట్లకు, 45 శాతం వాటాను ఇతర సంస్థల నుంచి రూ.765 కోట్లకు ఆర్ఐఎల్ కొనుగోలు చేయనుంది. ఐఎఫ్‌సీ మిగిలిన 35 శాతం వాటాను మేకర్ గ్రూప్ అట్టిపెట్టి ఉంచుకోనుంది. ఈ కొనుగోలు మే 31కు పూర్తి కావొచ్చని అంచనా వేస్తున్నారు.

స్మార్ట్‌ఫోన్ కొనండి... రూ.2200 పొందండి!

వినియోగదారులకు జియో కానుక

దిల్లీ: ప్రస్తుతం ఉన్న వినియోగదారులతోపాటు కొత్తగా జియో కుటుంబంలో చేరే వారి కోసం జియో సరికొత్త పథకం (జియో ఫుట్‌బాల్ ఆఫర్) ప్రకటించింది. 22 సంస్థలకు చెందిన (శామ్‌సంగ్, షియోమి, నోకియా, ఇంటెక్స్, హువాయ్, బ్లాక్‌బెర్రీ తదితర కంపెనీలు) ఏదైనా స్మార్ట్ ఫోన్ కొని కొత్తగా జియో కనెక్షన్ తీసుకొని మార్చి 31వ తేదీలోపు రూ.198 లేదా రూ.299తో రీఛార్జి చేయించుకొంటే రూ.50 విలువ చేసే 44 (రూ.2,200) ఓచర్లు వినియోగదారుడి మైజియో ఖాతాలోకి చేరతాయని, వాటిని తరవాత రీఛార్జిలకు వాడుకోవచ్చని కంపెనీ వర్గాలు తెలిపాయి. లైఫ్, మోటొరోలా, మైక్రోమ్యాక్స్, ఆసుస్, పానసోనిక్, ఎల్‌జీ, అల్కాటెల్, కోమియో, జీవీ, సెల్‌కాన్, స్వైప్, జియోక్స్, జెన్, ఐవూమి, సెంట్రిక్ స్మార్ట్‌ఫోన్లపై కూడా ఫుట్‌బాల్ ఆఫర్ వర్తిస్తుందని జియో వెల్లడించింది.

మార్కెట్ కబుర్లు

✦ ఒక్కో షేరు రూ.300.82 చొప్పున మొత్తం 29,25,33,741 షేర్లను ప్రభుత్వానికి జారీ చేయడం ద్వారా రూ.8800 కోట్ల మూలధనాన్ని పొందనున్నట్లు **ఎస్‌బీఐ** ప్రకటించింది.

✦ **హెచ్‌జీ ఇన్‌ఫ్రా ఇంజినీరింగ్** తన పబ్లిక్ ఇష్యూ ధర శ్రేణిని రూ.263-270గా నిర్ణయించింది. ఫిబ్రవరి 26-28 మధ్య వచ్చే ఈ ఇష్యూ ద్వారా రూ.462 కోట్ల నిధులను సమీకరించాలని కంపెనీ భావిస్తోంది.

✦ స్పెక్ట్రమ్, టవర్లు, ఫైబర్, టెలికాం మౌలిక వసుతులు, ఇతర ఆస్తులను నగదీకరించడానికి వాటాదార్ల నుంచి ఆమోదం లభించినట్లు **రిలయన్స్ కమ్యూనికేషన్స్** తెలిపింది. వాటాదార్లు 99.91 శాతం మెజారిటీతో ఇందుకు అనుమతినివ్వడం విశేషం.

✦ ఉత్తరప్రదేశ్‌లో వారణాసి-దాగమాగ్పూర్ ప్రాజెక్టుకు రూ.670.50 కోట్లతో అతి తక్కువ బిడ్ వేసిన సంస్థగా **దిలీప్ బిల్డ్‌కాన్** అవతరించినట్లు ఎన్‌హెచ్ఏఐ ప్రకటించింది.

✦ పంజాబ్‌లో 18 మెగావాట్ల సామర్థ్యంతో ముకేరియన్ హైడ్రో ఎలక్ట్రిక్ ప్రాజెక్ట్(హెచ్ఈపీ)ను ప్రారంభించినట్లు **భెల్** తెలిపింది.

✦ ఆన్‌మొబైల్ సిస్టమ్స్ ఇంక్‌లో తన మొత్తం వాటాను 2.49 మిలియన్ డాలర్లకు **ఇన్ఫోసిస్** విక్రయించింది.

✦ ఐపీఓకు రావడం కోసం **ఫ్లెమింగో ట్రావెల్ రిటైల్** సెబీ వద్ద ముసాయిదా పత్రాలను దాఖలు చేసింది. ఈ ఇష్యూ ద్వారా రూ.2600 కోట్లను సమీకరించాలని ఈ కంపెనీ భావిస్తోంది.

డైరెక్టర్లకు నష్టభయం పెరిగింది

• కఠిన నిబంధనలే కారణం
• బీమాతో రిస్క్ తగ్గించుకోవాలి

ఈనాడు, హైదరాబాద్: కంపెనీల చట్టంలో వచ్చిన మార్పులు, కొత్త దివాలా చట్టం, కఠినంగా మారుతున్న సెబీ నిబంధనలు తదితరాల కారణంగా కంపెనీల బోర్డుల్లో డైరెక్టర్లుగా ఉన్న వారికి నష్టభయం (రిస్క్) పెరిగిపోతోందని, కొన్ని సందర్భాల్లో వ్యక్తిగత ఆస్తులను కూడా జప్తు చేసే పరిస్థితులు తలెత్తుతున్నాయని అంతర్జాతీయ ప్రత్యామ్నాయ వివాద పరిష్కార కేంద్రం, హైదరాబాద్ కార్యాలయం కార్యదర్శి జె.ఎల్.ఎన్.మూర్తి తెలిపారు. కార్పొరేట్ డైరెక్టర్లుగా పని చేయడానికి చాలా మంది భయపడుతున్నారని అన్నారు. కంపెనీల్లోని వాటాదారులు, ఉద్యోగులు, రుణదాతలు, ఖాతాదారులు, పోటీదారులు, ప్రభుత్వ, నియంత్రణ ఏజెన్సీలు మొదలైన అందరికీ కంపెనీలో జరిగే పొరపాట్లు, అవకతవకలు, నిబంధనల ఉల్లంఘన, పనితీరు, రుణాలు తదితరాలకు డైరెక్టర్లు బాధ్యత వహించాల్సి ఉంటుందని వివరించారు. గతంతో పోలిస్తే.. కంపెనీల్లో డైరెక్టర్ల బాధ్యత బాగా పెరిగిందని, అవకతవకలు జరిగినప్పుడు సొంత ఆస్తులు, ఆర్థిక పరంగా గడ్డు పరిస్థితులు ఎదుర్కొనకుండా ఉండాలంటే.. లైయబిలిటీ బీమా తీసుకోవాలని, దీనిపై డైరెక్టర్లలో అవగాహన పెరగాలన్నారు. డైరెక్టర్ల లైయబిలిటీ బీమాపై ఎఫ్‌టాప్సీతో కలిసి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డైరెక్టర్స్ (ఐఓడీ) ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మూర్తి ప్రత్యేక ఉపన్యాసం చేశారు. డైరెక్టర్లు వృత్తిపరమైన నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాల్సి ఉందని, ఇందుకు ఐఓడీ ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తోందని చెప్పారు. కంపెనీల్లో స్వతంత్ర డైరెక్టర్లకు ఎటువంటి వాటా, ఆర్థిక ప్రయోజనాలు ఉండవని.. వారు వాటాదారుల ప్రయోజనాలకు రక్షకులుగా వ్యవహరించాలని ఐఓడీ గౌరవ కార్యదర్శి తుమ్మలపల్లి.శివరావు తెలిపారు. బోర్డు సమావేశాల్లో స్వతంత్ర డైరెక్టర్లు అన్ని అంశాలను పరిశీలించాలని, అప్పుడు కంపెనీల్లో అవకతవకలు జరగడానికి అవకాశాలు తగ్గుతాయన్నారు. మారిన పరిస్థితుల్లో డైరెక్టర్లు ఎదుర్కొనే నష్టభయానికి బీమా తప్పనిసరని వ్యాఖ్యానించారు. కంపెనీలు డైరెక్టర్ల బీమా వ్యయాన్ని భరిస్తున్నాయని చెప్పారు. కార్యక్రమానికి తెలంగాణ న్యాయ విభాగం అసెంబ్లీ వ్యవహారాలు, లీగల్ వ్యవహారాల కార్యదర్శి వి.నిరంజన్‌రావు ముఖ్య అతిథిగా విచ్చేశారు. కంపెనీల డైరెక్టర్లు తమ హక్కులు, బాధ్యతలు, లైయబిలిటీలపై పూర్తి అవగాహనతో ఉండాలన్నారు. ఎఫ్‌టాప్సీ ప్రెసిడెంట్ గౌర శ్రీనివాస్ ప్రారంభోపన్యాసం చేశారు. ప్రతి కంపెనీకి కీలకమైన వ్యక్తి ఉంటారని.. ఇటువంటి వారికి బీమా కల్పించడానికి 'కీమన్' పాలసీని తమ కంపెనీ అందిస్తోందని ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్ ప్రాంతీయ మేనేజరు పి.చంద్రశేఖర్ తెలిపారు. ప్రామాణిక డైరెక్టర్స్ అండ్ ఆఫీసర్స్ (డీ అండ్ ఓ) పాలసీలు మాత్రమే పూర్తి కవరేజీని అందించగలవని యునైటెడ్ ఇన్సూరెన్స్‌కు చెందిన సీమా గౌర్ అన్నారు. నిబంధనల పరంగా కార్పొరేట్ రంగంలో వస్తున్న మార్పులు, బీమా ప్రాముఖ్యంపై న్యాయ సలహాదారు ఎస్.వి.రామకృష్ణ, పి.ఉమేశ్ తదితరులు సదస్సుకు వచ్చిన వారి సందేహాలను తీర్చారు.



సదస్సులో అంతర్జాతీయ ప్రత్యామ్నాయ వివాద పరిష్కార కేంద్రం హైదరాబాద్ కార్యదర్శి జె.ఎల్.ఎన్.మూర్తి (ఎడమ నుంచి రెండో వ్యక్తి). ఐఓడీ గౌరవ కార్యదర్శి శివరావు, తెలంగాణ అసెంబ్లీ వ్యవహారాల కార్యదర్శి వి.నిరంజన్‌రావు, ఎఫ్‌టాప్సీ ప్రెసిడెంట్ గౌర శ్రీనివాస్

జూన్ కల్లా 5జీ ప్రణాళిక

టెలికాం కార్యదర్శి అరుణా సుందరరాజన్

దిల్లీ: 5జీ టెలికాం సేవల కార్యాచరణ ప్రణాళిక (రోడ్‌మ్యాప్)ను జూన్ నాటికి టెలికమ్యూనికేషన్ల శాఖ (డాట్) విడుదల చేయనున్నట్లు టెలికాం కార్యదర్శి అరుణా సుందరరాజన్ పేర్కొన్నారు. పరిశ్రమ సంఘం అసోచామ్ నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ 'కొత్త టెలికాం విధానం-2018లో 5జీ సేవలకు సంబంధించి మంచి స్పందన లభించింది' అని తెలిపారు. టెలికాం విధానం- 2018 ముసాయిదా తుది దశల్లో ఉందని, త్వరలోనే విడుదల కానుందని వివరించారు. మార్చి చివరకు దేశవ్యాప్తంగా 4జీ సేవలు అందుబాటులోకి వస్తాయని అన్నారు. కంపెనీలు 4జీ సేవలను ప్రారంభించడంతో పాటు 5జీ సేవలకు సైతం సిద్ధమవుతున్నాయని పేర్కొన్నారు. కాల్ అంతరాయాల సమస్య గురించి మాట్లాడుతూ ట్రాయ్ తీసుకొచ్చిన కొత్త నియంత్రణ విధానం కింద కఠిన నిబంధనలను కంపెనీ పాటించాల్సి ఉంటుందని సుందరరాజన్ వెల్లడించారు. విమానాల్లో అనుసంధానతకు సంబంధించి అనుమతులు పొందే పనిలో డాట్ ఉందని అన్నారు.

ఐవీఆర్‌సీఎల్ నష్టం రూ.316 కోట్లు


ఈనాడు, హైదరాబాద్: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికానికి ఐవీఆర్‌సీఎల్ నష్టం రూ.315.69 కోట్లకు పెరిగింది. ఏడాది క్రితం ఇదే కాలంలో రూ.249.26 కోట్లు ఉన్నట్లు కంపెనీ తెలిపింది. మొత్తం ఆదాయం రూ.404.44 కోట్ల నుంచి రూ.322.85 కోట్లకు తగ్గింది. 2017, డిసెంబరుతో ముగిసిన తొమ్మిది నెలలకు రూ.1,257.07 కోట్ల ఆదాయంపై రూ.838.78 కోట్ల నష్టాన్ని చవి చూసింది.

అంబుజా సిమెంట్స్



రూ.254.30 వద్ద ప్రారంభమై రూ.254.30 - 261.50 మధ్య కదలాడి క్రితం ముగింపు 253.40తో పోలిస్తే రూ.3.65 (1.44%) లాభంతో రూ.257.05 వద్ద స్థిరపడింది. ఎన్ఎస్ఈలో చేతులు మారిన షేర్లు 48,70,752

ఐషర్ మోటార్స్




రూ.28,400 వద్ద మొదలై రూ.27,151-28,424.95 మధ్య చలించి క్రితం ముగింపు 28,340.45తో పోలిస్తే రూ.1012.30 (3.57%) నష్టంతో రూ.27,328.15 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈలో 49,309 షేర్లు చేతులు మారాయి.

ఎఫ్ఐఐలు, డీఐఐల లావాదేవీలు (రూ.కోట్లలో)

	విదేశీ మదుపర్లు (ఎఫ్ఐఐలు)			దేశీయ మదుపర్లు (డీఐఐలు)		
తేదీ	కొనుగోళ్లు	అమ్మకాలు	నికరం	కొనుగోళ్లు	అమ్మకాలు	నికరం
16/02	3,105	4,171	–1066	3,926	2,798	–1128
15/02	4,272	4512	–240	3,024	2,975	+49
14/02	6,413	7,141	–729	3,546	3,698	–152
12/02	4,345	5,159	–814	3,942	2,599	1343

16న ఫారంగేటు అమ్మకం ధరలు (నెక్)



కోడిగుడ్లు (100కు రూపాయలలో)

హైదరాబాద్	391	వరంగల్	393
చిల్లరగా(ఒక గుడ్డు)	4.50	విశాఖపట్నం	400
బెంగళూరు	405	చెన్నై	415
17వ తేదీకి...		చిత్తూరు	408
విజయవాడ/గోదావరి	395	నమక్కల్	395

ఎన్ఎస్ఈ

శుక్రవారం ముగింపు, క్రితం ముగింపు, ట్రేడింగ్ పరిమాణం (వరుసగా)

నిఫ్టీ 50

ADANI PORT & 405.45 (411.70) 1740283
AMBUJA CEMEN 257.05 (253.40) 4870752
ASIAN PAINTS 1143.85 (1135.45) 734476
AUROBIND PHA 589.30 (592.55) 1814153
AXIS BANK LT 537.85 (543.70) 3910503
BAJAJ AUTO L 3103.90 (3143.50) 132450
BAJAJ FINANC 1675.25 (1677.05) 947685
BHARTI AIRTE 419.70 (428.95) 3968970
BHARTI INFRA 327.55 (331.05) 2397216
BOSCH LTD 19553.60 (19502.45) 5355
BPCL 465.70 (475.05) 2413209
CIPLA 611.10 (605.85) 906025
COAL INDIA L 303.50 (308.10) 1931615
DR. REDDYS 2213.55 (2195.80) 458897
EICHER MOTOR 27328.15 (28340.45) 49309
GAIL 468.30 (475.90) 1364734
HCL TECH 937.10 (939.70) 2849070
HDFC 1815.50 (1829.50) 2368880
HDFC BANK 1878.60 (1881.90) 895880
HERO MOTOCOR 3494.20 (3527.25) 219454
HINDALCO IND 247.65 (251.50) 7629453
HINDUSTAN UN 1352.10 (1358.15) 1091144
HPCL 386.95 (390.90) 1439798
ICICI BANK 321.05 (328.65) 17585994
INDIABULLS H 1272.35 (1312.30) 1437076
INDIAN OIL 375.05 (376.80) 2501186
INDUSINDBANK 1658.90 (1686.15) 1088167
INFOSYS LTD 1128.05 (1114.45) 4944611
ITC 266.45 (268.10) 6164187
KOTAK MAHIND 1050.20 (1042.15) 1655606
LARSEN & TOU 1328.40 (1350.35) 1424576
LUPIN 825.10 (822.30) 589728
M&M 743.75 (749.35) 1042980
MARUTI SUZIK 8836.95 (9020.25) 632659
NTPC LTD 162.80 (163.20) 6117270
ONGC 186.90 (188.30) 4167034
POWER GRID C 195.55 (197.90) 3516874
RELIANCE IND 921.30 (935.65) 4401672
SBI 271.65 (278.70) 30338112
SUN PHARMA 575.25 (575.75) 6640151
TATA CONSULT 2933.05 (2925.85) 1257878
TATA MOTORS 370.75 (375.80) 8545282
TATA STEEL L 689.75 (700.55) 5012760
TECH MAHINDR 584.35 (605.65) 2887255
ULTRATECH 4166.35 (4187.85) 114025
UPL LIMITED 703.60 (716.10) 1123772
VEDANTA LIMI 319.75 (324.40) 9116738
WIPRO 291.00 (292.50) 3078393
YES BANK LTD 311.80 (319.80) 18611798
ZEE ENTERTAI 569.60 (570.90) 1908094

నిఫ్టీ నెక్స్ట్ 50

ABB 1514.65 (1550.50) 50718
ACC 1650.60 (1621.30) 523625
ASHOK LEYLAN 133.95 (137.25) 14941293
AVENUE SUPER 1173.50 (1183.95) 199767
BAJAJ FINSER 5058.25 (5130.35) 88468
BANK OFBAROD 152.40 (159.05) 22647050
BEL 155.70 (156.95) 2515803
BHEL 94.30 (94.65) 6881218
BRITANNIA 4781.95 (4755.75) 82784
CADILA HEALT 414.30 (417.10) 513765
COLGATE PALM 1076.55 (1088.85) 214405
CONTAINER 1317.25 (1326.00) 268316
CUMMINS INDI 849.90 (842.10) 137030
DABUR INDIA 342.75 (339.60) 871481
DLF LIMITED 225.65 (231.15) 6524609
EMAMI LIMITE 1083.40 (1090.30) 89967
GLAXOSMI CON 6535.70 (6405.30) 8784
GLAXOSMI PHA 2438.45 (2448.60) 10415
GLENMARK PHA 521.00 (529.65) 752538
GODREJ CONSU 1030.90 (1026.25) 226858
HAVELLS INDI 504.25 (516.25) 1295373
HINDUSTAN ZI 313.05 (313.40) 2220694
ICICI PRU LI 402.20 (406.70) 412281
IDEA CELLULR 82.05 (83.10) 8872420
INTERGLOBE A 1264.65 (1262.00) 476654
JSW STEEL LT 312.40 (307.80) 5742059
LIC HOUS.FIN 521.40 (528.50) 1400275
MARICO LIMIT 306.75 (309.95) 879423
MCDOWELL 3245.30 (3313.20) 557486
MOTHERSON 326.75 (341.20) 13368026
MRF 71162.55 (72156.25) 5347
NHPC LTD 28.30 (28.65) 5031555
NMDC LTD 131.20 (134.90) 3921831
OIL INDIA 361.30 (362.00) 562678
ORACLE FIN S 4043.50 (4033.90) 22759
P&G HYG&HEAL 9354.85 (9300.65) 1138
PETRONET LNG 248.20 (249.65) 1396833
PIDILITE IND 891.65 (888.30) 891469
PIRAMAL ENTE 2621.10 (2711.00) 112641
PNB 125.55 (128.25) 156691203
POWER FIN CO 107.15 (108.85) 5078197
RURAL ELEC C 141.20 (143.25) 4645551
SAIL 88.40 (92.30) 14791218
SHREE CEMENT 16976.60 (17356.70) 12749
SHRIRAM TRAN 1318.45 (1360.15) 514554
SIEMENS 1267.60 (1259.00) 246916
SUN TV LTD 925.10 (979.55) 1996290
TATA POWER 86.65 (86.25) 3919700
TITAN IND 803.20 (814.85) 1698333
TORRENT PHAR 1423.15 (1420.95) 368088

ఇతర ప్రధాన షేర్లు

ABAN OFFSHOR 173.70 (177.35) 1039243
ADANI ENTERP 207.80 (214.75) 5458989
ADANI POWER 32.35 (33.10) 6906543
ALL BANK 54.85 (54.95) 6356502
AMARA RAJA 815.75 (825.05) 351943
ANANT RAJIND 59.05 (60.30) 882204
ANDHRA BANK 46.60 (46.90) 2402584
APOLLO HOSPI 1141.85 (1207.95) 1146020
APOLLO TYRES 261.30 (272.75) 2417120
APTECH 307.10 (323.40) 703771
BAJAJ ELECT. 505.55 (499.80) 345462
BAJAJ HIND 13.20 (13.40) 1605212
BAJAJ HOLDIN 2738.10 (2749.25) 9992
BALAJI TELE 141.75 (144.20) 43805
BALLARPUR IN 13.75 (14.05) 1188607
BALRAMPUR CH 116.65 (120.20) 1596326
BANK OF MAHA 18.45 (18.75) 1147275
BANK OFINDIA 130.45 (133.35) 6105039
BATA INDIA 700.25 (719.90) 614759
BGR ENERGY S 120.55 (123.65) 64412
BHARAT FORGE 742.25 (752.10) 785849
BHUSHAN STEE 44.95 (46.55) 3465088
BIOCON LTD 606.90 (601.55) 2240692
BOMBAY DYE 274.00 (281.30) 8810992
CANARA BANK 307.45 (310.35) 3199483
CEAT LIMITED 1627.40 (1646.25) 892246
CENTRAL BANK 67.00 (68.90) 300864
CHAMBAL FERT 156.15 (158.30) 267496
CHENNAI PETR 368.30 (378.15) 401716
CITY UNIBANK 173.20 (168.90) 742090
CORPO BANK 33.05 (33.90) 271192
COX & KINGS 244.05 (250.45) 132085
D B REALTY L 55.10 (56.25) 824643
DELTA CORP L 362.60 (377.85) 3468122
DENA BANK 21.35 (21.95) 1843515
DHANALAKBANK 23.75 (24.40) 397519
DIVIS LAB 1045.65 (1048.10) 632838
VDELWEISS CA 261.40 (269.40) 1810229
EID PARRY 321.20 (323.45) 62722
EIH 177.15 (180.00) 69568
ESSAR SHIPPI 26.30 (26.45) 25692
ESTER INDUST 61.70 (63.10) 90468
EXIDE INDUST 211.45 (214.30) 762041
FEDERAL BANK 96.20 (94.65) 10766835
FINOLEX CABL 707.00 (713.00) 155998
G E SHIP LTD 390.10 (397.25) 55233
GAMMON INFRA 3.25 (3.35) 5751660
GATI LIMITED 113.60 (114.95) 615448
GAYATRI PROJ 217.70 (222.80) 491900
GITANJALIGEM 37.45 (46.80) 5616530
GMR INFRASTR 18.30 (18.70) 35450986
GODREJ IND 541.80 (542.60) 236613
GRASIM IND 1100.05 (1103.65) 413853
GUJ ALK&CHEM 790.15 (807.40) 125692
HCL INFOSYS 63.45 (65.40) 6543542
HEXA TECH 333.30 (332.15) 759023
HIMACHAL FUT 28.45 (28.80) 3627771
HOUSING DEV 52.05 (52.25) 9219697
IDBI 61.80 (63.45) 8099023
IDFC 51.75 (52.00) 2385375
IFCI 23.10 (23.40) 8192040
IL&FS TRANS 72.15 (73.55) 231210
IND SWIFTLAB 78.15 (76.40) 138900
INDBULLS REL 221.90 (227.35) 9190821
INDIA CEM 156.30 (155.60) 2537058
INDIAN BANK 336.95 (345.35) 860437
INDO RAMA SY 35.55 (38.15) 185471
INDRAPRASTHA 295.05 (304.20) 1786150
IND-SWIFTLTD 9.50 (9.70) 12500
INGERSOLL-R 759.60 (755.35) 19804
IOB 20.35 (20.70) 894504
IPCA LAB 626.50 (601.05) 311158
IRB INFRA DE 229.95 (227.80) 2007597
J&K BANK 69.55 (69.15) 358950
JAI CORP 162.80 (167.45) 1228529
JAIN IRRIGAT 118.80 (120.05) 6857458
JAYPEE INFRA 14.00 (14.15) 1656532
JAYSHREE TEA 102.85 (105.25) 31967
JET AIRWAYS 739.95 (756.20) 5252159
JINDAL SAW 132.45 (135.55) 1171499
JINDAL STEEL 251.50 (265.35) 13825697
JK LAKSHMI C 420.75 (422.75) 79428
JK PAPER LIM 138.15 (141.15) 439728
JM FINANCIAL 156.45 (156.25) 531287
JP ASSOCIATS 17.35 (17.00) 29986556
JSW ENERGY L 80.10 (80.45) 1650445
JUBILANT FOO 1951.65 (2011.90) 1086108
JUBILANT ORG 931.75 (937.05) 309794
JYOTHY LABS 347.85 (352.60) 30275
JYOTI STRUC 10.25 (10.20) 513910
KARNATA BANK 133.85 (135.05) 1482475

ఘనం (+)

నిఫ్టీ	16న	మార్పు %
AMBUJA CEM	257.05	1.44
INFOSYS	1128.05	1.22
CIPLA	611.10	0.87
DR. REDDYS LAB	2213.55	0.81
KOTAK MAHI BANK	1050.20	0.77
ASIAN PAINTS	1143.85	0.74
LUPIN	825.10	0.34

గ్రహణం (-)

నిఫ్టీ	16న	మార్పు %
EICHER MOTORS	27328.15	-3.57
TECH MAHINDRA	584.35	-3.52
INDIABULLS HSG FIN	1272.35	-3.04
SBI	271.65	-2.53
YES BANK	311.80	-2.50
ICICI BANK	321.05	-2.31
BHARTI AIRTEL	419.70	-2.16

KEC INTL LTD 391.40 (391.90) 2347007
KOLTE PATIL 344.60 (356.40) 169699
KPIT CUMMINS 205.90 (208.20) 2659057
L&TFIN.HOLD 160.55 (166.10) 4903134
LAK VIL BANK 121.60 (122.60) 699159
M & M FINANC 439.30 (454.75) 1229874
MANAPPURAM G 110.05 (109.70) 6588286
MMTC LIMITED 54.95 (56.00) 618242
MPHASIS LTD 862.80 (879.20) 115328
MRPL 118.05 (119.30) 656619
MTNL 22.25 (22.60) 1141174
NAGARJUNA OI 4.55 (3.80) 4462263
NCC LIMITED 125.10 (123.40) 9234393
NETWORK18 FI 49.50 (49.90) 621309
NEULAND LAB 714.10 (711.25) 11341
NIIT LTD 93.05 (96.15) 357846
NIIT TECHNOL 820.30 (825.60) 1264192
OMAXE LTD 228.60 (230.80) 501220
ONMOBILE GLO 51.35 (48.90) 2253609
ORIENT PAPER 38.15 (38.50) 404528
ORIENTALBANK 105.55 (104.75) 4529440
PARSVNATH DE 23.05 (22.95) 693808
PATEL ENGG 75.05 (77.10) 344703
PFIZER 2315.15 (2315.50) 14924
POLARIS SOFT 469.90 (469.95) 112133
POWERTRADING 99.30 (100.00) 2507482
PRAJ IND 92.30 (93.25) 745576
PRISM CEMENT 123.00 (125.35) 785561
PROVOGUE (IN 6.15 (6.10) 138973
PUNJ LLOYD 20.35 (20.85) 1308044
PUNJAB & SIN 39.60 (40.85) 96713
PURAVANKARA 142.50 (142.40) 377973
PVP VENTURES 7.35 (7.65) 465719
PVR LIMITED 1402.30 (1403.90) 121552
RADICO KHAIT 347.85 (357.45) 1305940
RAJESH EXPOR 803.05 (800.95) 135074
RALLIS INDIA 227.20 (227.95) 156535
RAMCO IND 257.55 (259.95) 54938
RAMCO SYS 459.65 (470.20) 60288
RAMKY INFRA 200.25 (205.55) 191721
RAYMOND 929.95 (962.65) 589261
RELIANCE CAP 482.65 (484.65) 6093969
RELIANCE COM 28.35 (27.95) 84858890
RELIANCE INF 452.30 (443.90) 4262795
RELIANCE POW 44.30 (44.75) 7852360
ROLTA INDIA 68.00 (70.95) 1840503
SAGAR CEMENT 1002.95 (993.85) 15368
SAREGAMA 718.40 (740.65) 74029
SHANTHI GEAR 145.95 (149.40) 22974
SHIPPNG CORP 80.10 (80.70) 693983
SHREE RENUKA 15.50 (15.55) 1273438
SINTEX IND 21.85 (22.20) 1835858
SOBHA DEVELO 557.85 (555.30) 138796
SOUTHINDBANK 26.75 (26.95) 6091837
SRS LIMITED 1.15 (1.20) 361702
STERLITE TEC 347.85 (353.90) 1156055
SUJANA METAL 1.45 (1.45) 15267
SUN PHARMA 424.10 (434.90) 154321
SUND FASTNER 545.40 (534.90) 194559
SUZLON ENERG 13.15 (13.20) 16775159
SYND. BANK 59.55 (61.40) 4459917
TATA CHEM 718.65 (719.00) 875430
TATA COFFEE 137.90 (139.50) 237694
TATA COMMUN 640.05 (646.45) 423687
TATA GLOBAL 275.60 (279.05) 1925414
TATA METALIK 813.15 (818.30) 72776
TATA MOT DVR 208.20 (212.80) 1640778
TATA TELESER 6.45 (6.55) 590955
THE INDIAN H 133.20 (134.20) 848112
TORRENT POWE 265.65 (269.55) 432799
TRIVENI ENGG 69.70 (70.10) 558629
TTK PRESTIGE 7020.55 (7047.10) 2083
TV TODAY NET 465.60 (490.35) 103134
TV18 BROADCA 54.90 (56.10) 3898451
TVS MOTOR 654.70 (656.10) 606815
UCO BANK 28.50 (28.75) 509103
UNION BANK 118.35 (120.20) 7817508
UNITECH 7.45 (7.85) 26070888
UNITED BANK 14.85 (14.95) 582439
UNITED BREWE 1010.40 (1040.15) 422993
USHA MARTIN 21.80 (22.75) 859415
VADILAL INDU 892.05 (886.95) 28413
VENKYS 2797.40 (2802.50) 93855
V-GUARD IND 231.80 (226.80) 1708462
VIJAYA BANK 58.55 (58.40) 1167576
VIP 344.65 (347.55) 668731
VOLTAS 584.65 (583.75) 1359810
ZEE LEARN LI 42.20 (44.00) 874676
ZUARI GLOBAL 199.35 (208.75) 118096
ZYDUS WELLNE 1171.35 (1179.05) 4837

ALPHAGEO 818.25 (832.70) 3687
AMAR RAJA BA 814.65 (826.65) 38167
ANDHRA BANK 46.70 (47) 228970
ANDHRA CEMEN 11.25 (11.61) 46195
ANDHRA PAPER 319.80 (331.55) 12410
ANDHRA PETRO 57.80 (59) 65634
ANDHRA SUGAR 487.65 (495.70) 5421
ANJANI PORTL 195.80 (202.60) 710
ASTRA MICROW 104.85 (106.50) 60931
AUROBINDO PH 589.10 (593.45) 200335
AVANTEL SOFT 551.40 (578.80) 9785
AVANTI FEEDS 2344 (2371.50) 7286
AVON ORG 13.95 (13.30) 5755
BALAJI AMIN 649.75 (654.20) 8649
BARTRONICS 13.11 (13.34) 15485
BHAGIRA CHEM 297.90 (304.90) 2640
BHAGYA NAG 46.35 (48.30) 13572
BN RATHI SEC 40.95 (42.85) 10487
BRILLIANT SE 12.25 (12.85) 171828
CONT COFFEE 283.85 (284.60) 2005
COROMAN FERT 526.40 (528.40) 15337
CYBERMATE 3.36 (3.52) 242644
CYIENT LIMIT 608.65 (617.95) 17687
DECCAN CEMEN 588.40 (599) 1317
DIVI'S LAB 1048.65 (1048) 76251
DR REDDY 2212.75 (2194.45) 54369
GATI CORPN 113.50 (114.55) 78581
GAYATRI PROJ 216.95 (223.35) 112629
GMR INFRASTR 18.30 (18.70) 9470592
GOLDST INFRA 192.60 (197.25) 43488

బీఎస్ఈలో రాష్ట్ర కంపెనీలు

GRANULES (I) 117.60 (117.65) 123533
GSS AMERICA 45.80 (43.65) 889024
GVK POWER 17.85 (18.75) 1552435
HBL NIFE POW 56.75 (57.55) 109951
HYD INDUS 1768.30 (1776.45) 1070
ILFS ENGINEE 45.75 (48.15) 18556
INNAREDY COM 3.72 (3.80) 13394
IVRCL INFRAS 4.71 (4.77) 83139
KAKATIYA CEM 298.05 (300.40) 5622
KAVERI SEED 459.25 (472.45) 14995
KCP LTD 128.65 (131.70) 33524
KNR CONSTRUC 314.20 (321.10) 30998
LANCO INDUS 367.60 (374.40) 13907
LANCO INFRAT 1.26 (1.32) 873488
LAURUS LABS 524.75 (525.25) 9851
LOKESH MACH 65.65 (67.75) 17855
MADHUCON PRO 28.50 (28.55) 23405
MIC ELECTRON 7.29 (7.58) 105194
MOLD-TEK.TEC 61.20 (63) 12158
MOLDTK PLA 334.30 (348.95) 5018
NAGARJAGRICH 44.30 (47.10) 27227
NATCO PHARMA 797.65 (787.05) 66716
NAVA BH VENT 146.10 (152.45) 25595
NCC 124.85 (123.40) 895109
NCL IND 241.55 (243.45) 23328
NETTLINX 87.85 (88.40) 19337
NEULAND LAB 713.40 (711.70) 415
OIL COUNTRY 43 (43.90) 3191
PANYAM CEMEN 50.10 (51.20) 64790
PENNER IND 61.05 (62.40) 52496
PITTI LAMIN 88.60 (93) 20361
POKARNA 212.95 (215.80) 4087
PRAJAY ENGS 13.45 (14.15) 46118
PREMIER EXPL 391.45 (396.20) 2415
PRISM CEMENT 123 (125.50) 128521
PRUDENTL PHA 4.55 (4.59) 129354
RAIN INDUSTR 364.25 (376.75) 391256
RAM INFORMAT 39.55 (41.15) 36002
SAGAR CEM 1005.35 (993.55) 4298
SAMKRG PIST 307.85 (307.35) 4496
SATVAH. ISPA 21.95 (23.50) 7888
SMS PHARMA 91.85 (92.70) 4910
SREE RAYAL A 59.45 (61.60) 177197
SRINIVASA SH 60.30 (64.45) 17631
STEEL EXCHAN 33.35 (33.50) 31775
SUJANA METAL 1.36 (1.43) 47643
SUJANA UNIVE 0.98 (0.95) 76397
SURYALAKSH.C 79.55 (81.35) 19421
SUVEN PHARMA 196.10 (197.30) 42434
TAJ GVK HOTE 171.15 (176.45) 7101
TANLA 31.35 (32.35) 70993
VICEROY HOTE 15.75 (15.90) 43411
VIMTA LABS 212.45 (212.85) 4817
VISAKA IND 689.65 (716.05) 14652
VIVIMED LABS 83.25 (84.60) 90155
YBRANT DIGIT 5.58 (5.59) 1153550
ZENTECH 119.80 (122) 44775

✦ రంగంలోకి సెబీ, ఎక్స్ఛేంజీలు

రూ.11,400 కోట్ల కుంభకోణానికి సంబంధించి పంజాబ్ నేషనల్ బ్యాంక్, గీతాంజలి జెమ్స్‌ల ప్రమేయంపై సెబీ దర్యాప్తును ప్రారంభించింది. ట్రేడింగ్ లావాదేవీలను, వెల్లడి వివరాలను పరిశీలిస్తోంది. నీరవ్ మోదీతో సంబంధమున్న అన్ని సంస్థల స్టాక్ మార్కెట్ ట్రేడింగ్ లావాదేవీలను విశ్లేషించే పనిని సెబీ, ఎక్స్ఛేంజీలు మొదలుపెట్టాయి. మరోవైపు మెహుల్ చోక్సీ, ఆయన సంస్థ గీతాంజలి జెమ్స్ ఏమైనా నిబంధనల ఉల్లంఘనకు పాల్పడ్డాయా అనే విషయాన్ని కూడా సెబీ, ఎక్స్ఛేంజీలు దర్యాప్తు చేస్తున్నాయి.

✦ తగిన చర్యలు తీసుకుంటాం: ఆర్‌బీఐ

పీఎన్‌బీలో నియంత్రణ వ్యవస్థల పరిశీలనను ఇప్పటికే ప్రారంభించామని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) తెలిపింది. పరిశీలన అనంతరం తగువిధంగా చర్యలు చేపడతామని పేర్కొంది. మరోవైపు ఇతర బ్యాంకులకు జారీ చేసిన ఎల్‌ఓయూల ప్రకారం అవి ఇచ్చిన రుణాలకు నిధులు సర్దుబాటు చేయాల్సిందిగా ఆదేశాలు ఇచ్చినట్లు వస్తోన్న వార్తలను ఆర్‌బీఐ ఖండించింది.

✦ నేడు బ్యాంకర్ల సంఘం భేటీ

పీఎన్‌బీలో వెలుగుచూసిన రూ.11,400 కోట్ల కుంభకోణంపై చర్చించేందుకు ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్ (ఐబీఏ) నేడు సమావేశం కానుంది. ఇంతకుముందు పీఎన్‌బీకి మేనేజింగ్ డైరెక్టరుగా ఉన్న ఉషా అనంతసుబ్రమణియన్ ప్రస్తుతం ఐబీఏకు ఛైర్‌పర్సన్‌గా వ్యవహరిస్తుండటం గమనార్హం. అలాగే ఈమె అలహాబాద్ బ్యాంక్‌కు ఎండీగా కూడా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. పీఎన్‌బీ కొన్ని ఎల్‌ఓయూలను అలహాబాద్ బ్యాంక్‌కు కూడా జారీ చేసినట్లు తెలుస్తోంది. మరోవైపు ఎలాంటి మోసాలు జరగకుండా వ్యవస్థల పటిష్ఠంపై సమీక్ష నిర్వహించాలని బ్యాంకులకు ఆర్థిక శాఖ సూచించింది. ఒకవేళ ఏమైనా లోపాలు గుర్తిస్తే, తగువిధంగా దిద్దుబాటు చర్యలు చేపట్టాలని తెలిపింది.

✦ ఆడిటర్ల పాత్రపై ఐసీఏఐ కమిటీ ఏర్పాటు

పీఎన్‌బీ రూ.11,400 కోట్ల కుంభకోణంలో ఆడిటర్ల పాత్రపై చార్టెడ్ అకౌంటెంట్ల అత్యున్నత సంఘం ఐసీఏఐ (ద ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టెడ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా) దృష్టి సారించింది. ఇందుకు వివిధ దర్యాప్తు సంస్థల నుంచి సమాచారాన్ని సేకరిస్తోంది. అలాగే కుంభకోణానికి దారితీసిన పరిణామాలు, వ్యవస్థీకృత లోపాలను అధ్యయనం చేసేందుకు కమిటీని కూడా ఏర్పాటు చేసింది. ముఖ్యంగా ఆడిటర్ల తరపున ఏమైనా అవకతవకలు చోటుచేసుకున్నాయా అనే విషయాన్ని పరిశీలించనుంది. పీఎన్‌బీ కుంభకోణం వ్యవహారాన్ని సుమోటో కేసుగా స్వీకరించినట్లు ఐసీఏఐ ప్రెసిడెంట్ నవీన్.ఎన్.డి.గుప్తా తెలిపారు.


రూ.2000 కోట్లు
(అలహాబాద్ బ్యాంక్)

రూ.1360 కోట్లు
(ఎస్‌బీఐ)

పీఎన్‌బీ ఇచ్చిన ఎల్‌ఓయూ (లెటర్ ఆఫ్ అండర్‌టేకింగ్) ఆధారంగా నీరవ్ మోదీకి పై రెండు బ్యాంకులు ఇచ్చిన రుణాలు. 'నీరవ్ అప్పు తిరిగి చెల్లిస్తాడా లేదా అనే విషయంతో మాకు ప్రత్యక్ష సంబంధం ఉండదు. పంజాబ్ నేషనల్ బ్యాంకే ఆ వ్యవహారం చూసుకుంటుంద'ని ఎస్‌బీఐ ఛైర్మన్ రజనీశ్ కుమార్ వెల్లడించారు.

150
డొల్ల కంపెనీలకు నీరవ్‌తో సంబంధం

నీరవ్ మోదీ, అతని సంబంధీకులతో 150 డొల్ల కంపెనీలకు సంబంధం ఉందని ప్రభుత్వ దర్యాప్తులో తేలింది. కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆ మేరకు వెల్లడించింది. దర్యాప్తు సంస్థలు, ఆదాయ పన్ను అధికారుల దర్యాప్తుతో పాటు ఈ మంత్రిత్వ శాఖ కూడా దర్యాప్తు జరుపుతున్న సంగతి తెలిసిందే. వ్యాపార కార్యకలాపాలు పెద్దగా లేనప్పటికీ కేవలం చట్టవ్యతిరేకంగా లావాదేవీలను జరపడం కోసం ఈ డొల్ల కంపెనీలకు ఉపయోగించుకుంటుంటారు.



లక్ష రుణానికీ యక్ష ప్రశ్నలు

- ఖాతా తెరవాలన్నా ఇబ్బందే
- ఇంటి రుణానికీ ఇక్కట్లే!
- బ్యాంకుల నిబంధనలు సామాన్యులకేనా..!

గత 15 ఏళ్లలో దాదాపు రెండున్నర లక్షల మంది రైతన్నలు ఆత్మహత్య చేసుకున్నారు.

వీరిలో చాలామంది ఆత్మహత్యల వెనుక కారణం.. అప్పులే.

2015లో 3000 మంది రైతులు ఆత్యహత్య చేసుకోగా.. వీరిలో 80 శాతం మంది రుణాలు చెల్లించలేక తనువు చాలించినట్లు ఒక అధ్యయనం వెల్లడించింది కూడా. వీళ్లందరి సగటు రుణం రూ.2 లక్షల్లోపే.

మరి నీరవ్ మోదీ విషయానికొస్తే..

రూ.11,000 కోట్లు పైబడిన రుణం. అది కూడా ఓ బ్యాంకును తప్పుదారి పట్టించి.. ఎగ్గొట్టేయడం.. దేశం విడిచిపారిపోవడం..

తలుచుకుంటేనే రక్తం మరిగిపోదూ...

సామాన్యుడి కోణంలో ఆలోచించినప్పుడు నీరవ్ ఉదంతం మాత్రం కచ్చితంగా మన బ్యాంకింగ్ వ్యవస్థ లోటుపాట్లను తెలియజెప్పేదే..

★★★★

మా అబ్బాయికి ఓ జాతీయ బ్యాంకులో ఖాతా ఉంది. హైదరాబాద్‌లో ఉండగా ఆ ఖాతా ప్రారంభించాడు. ఇప్పుడు మేం బెంగళూరు వచ్చేశాం. అక్కడి ఖాతాను బెంగళూరుకు మార్చి యాక్టివేట్ చేయించాలన్నది మా ఉద్దేశం. ఇందు కోసం బ్యాంకు చుట్టూ తిరగడం ఇప్పటికిది పన్నెండోసారి. ఈరోజు కూడా పని పూర్తవుతుందన్న నమ్మకం మాత్రం లేదు. అన్ని డాక్యుమెంట్లూ పట్టుకునే వెళ్లా. దానిమీద మా అబ్బాయి సంతకాలు కూడా ఉన్నాయి.. అయితేనేం.. అయిదుసార్లు తిప్పించుకున్న తర్వాత వాళ్లు చెప్పిన మాట ఏమిటంటే.. మీ అబ్బాయి రావాల్సిందేనని. వాడికి సెలవు దొరకడం లేదు.. అందుకే రాలేకపోతున్నాడు. నేను అతని తండ్రినే. కావాలంటే చూడండి అంటూ ఆధారాలు కూడా చూపించాను. నాకు పాస్‌బుక్, ఏటీఎం కార్డు... ఏదీ ఇవ్వొద్దు. కేవలం ఖాతా యాక్టివేట్ చేయండి చాలు. వీలు చూసుకుని మా అబ్బాయి వచ్చి వాటిని తీసుకెళ్తాడు అని భరోసా ఇచ్చా. పట్టించుకుంటేగా.. పొద్దున వెళితే సాయంత్రం రమ్మంటారు.. సాయంత్రం వెళ్తే.. రేపు రమ్మంటారు. వెళ్లినప్పుడల్లా అరగంట కూర్చోబెడుతున్నారు. మా అబ్బాయి రావాల్సిందేనంటున్నారు.. నేను డబ్బు కాజేసే రకం కానందుకేనేమో ఈ ఇబ్బందులు అనిపిస్తోంది.. నీరవ్ మోదీకి రూ.11,400 కోట్లు ఇచ్చే విషయంలో ఇలాంటి నిబంధనలన్నీ ఏమయ్యాయో...'

- ఓ సగటు ఖాతాదారు ఆవేదన..

అంటే బ్యాంకు అధికారులను నిబంధనలు ఉల్లంఘించమని కాదు. సామాన్యుల విషయంలో ఇంత కచ్చితంగా వ్యవహరించే బ్యాంకులు.. బడాబాబుల విషయానికొచ్చేసరికి.. ఎందుకు నీళ్లొదిలేస్తున్నారన్నది సామాన్యుడి ప్రశ్న. ఓ విజయ్ మాల్యా.. ఓ నీరవ్ మోదీ..నోట్ల రద్దు సమయంలో పెద్ద ఎత్తున దొరికిన కొత్త నగదు నిల్వలు.. వీటి గురించి విన్న సాధారణ ఖాతాదారులకు ఇలాంటి ఆవేదనే కలుగుతుంది... ఆ బాధలో కాస్త నిజం కూడా ఉందనిపిస్తుంది...
ప్రజాస్వామ్య దేశం.. ప్రజలే ప్రభువులు.. సామాన్యులకైనా.. అసామాన్యులకైనా.. నిబంధనలు ఒక్కటే... కానీ, కొంత మందికి ఇందులో కొన్ని సడలింపులు ఉంటున్నాయా..!!

బ్యాంకులో నగదు నిల్వ ఉంటుంది. అందులో నుంచి ఓ రూ.10వేలు తీసుకుందామంటే.. ఎక్కడా కుదరదు.. ఎన్ని ఏటీఎంలకు వెళ్లినా.. డబ్బే దొరకదు. బ్యాంకుకు వెళ్తే.. చాంతాండంత వరసలు. గట్టిగా రూ.20వేలు ఇవ్వాలంటే కూడా పాన్ కావాలి.. ఆధార్ కావాలంటూ ఆరాలు.. అదే.. బ్యాంకుకు కావాల్సిన వ్యక్తి రాగానే.. అడిగిన మొత్తం కట్టలుకట్టలుగా ఇచ్చేస్తుంటారు.. ఇక్కడ వారికి ఏ 'రూలూ' వర్తించదు.

✦ సొంతిల్లు కలను నిజం చేసుకోవాలనుకొనే సగటు వేతన జీవి... గృహ రుణం కోసం వెళ్తాడు.. ఆస్తి విలువలో 80శాతం వరకూ వస్తుందని అనుకుంటారు.. కానీ, క్రెడిట్ స్కోరు.. రుణ చరిత్ర అంటూ మొదటే నిబంధనలు అడ్డుకుంటాయి.. పైగా ఇప్పటికి ఎన్నిసార్లు రుణం కోసం బ్యాంకులను అడిగారు.. ఏళ్ల తరబడి లెక్కలు... ఎప్పుడో ఏళ్ల క్రితం మనం మర్చిపోయిన క్రెడిట్ కార్డుకు రూ.100 బాకీ ఉన్నారు.. కాబట్టి, మీకు ఇప్పుడు రుణం ఇవ్వడం కుదరదు అంటూ.. ఓ వివరణ..

నిబంధనల మేరకు విద్యా రుణాలు దొరకవు.. రూ.4లక్షల్లోపు హామీ అక్కర్లేదని స్పష్టమైన ఉత్తర్వులున్నా.. ఏ బ్యాంకూ దాన్ని పట్టించుకోదు.. తనఖా లేకుంటే అప్పు పుట్టదు. ప్రభుత్వం ప్రకటించిన 'ముద్ర' అప్పు లభించడమూ కష్టమే.. ఏమన్నా అంటే.. 'బ్యాంకుల విచక్షణ', ప్రజల సొమ్ముకు భద్రత కల్పించడమే ప్రధాన లక్ష్యం అంటూ చెబుతుంటారు.. అర్హత లేకున్నా వేల కోట్ల రుణాలను ఇచ్చేప్పుడు ఈ నిబంధనలన్నీ ఎటు వెళ్తాయో బ్యాంకులకే తెలియాలి.

బ్యాంకు నిబంధనల మేరకు ఏదైనా రుణం తీసుకోవాలనుకున్నప్పుడు తనఖా పెట్టిన ఆస్తిని ఒకరు పరిశీలిస్తారు.. మరొకరు ధ్రువీకరిస్తారు. మధ్యలో ఎంతోమంది చేతుల నుంచి ఆ ప్రక్రియ ముందుకు వెళ్తుంది. చివరగా అన్నీ సరిగ్గా ఉన్నాయని తేలితేనే ఓ లక్ష రూపాయల రుణమైనా ఇస్తుంది. కానీ, కావాల్సిన వ్యక్తులు.. బడా పారిశ్రామికవేత్తలు.. కమీషన్లతో సిబ్బంది జేబులు నింపేందుకు వెనకాడని వారి విషయంలో ఈ పరిశీలనలూ.. ఇతర నిబంధనలూ ఓ ప్రహసనంగానే మారిపోతున్నాయన్నది సగటు వ్యక్తి ఆవేదన. ఒకే ఆస్తిపై రెండు బ్యాంకులు రుణాలు ఇవ్వడంలాంటి సంఘటనలు కూడా ఎన్నో..

ఇక సామాన్యుడికే రుణ చరిత్ర, క్రెడిట్ స్కోరులాంటి అడ్డంకులు.. అప్పటికే కోట్ల రూపాయలు బాకీ పడ్డా.. అవేవీ లెక్కలోకి తీసుకోకుండా.. కొత్తగా మరికొన్ని కోట్ల రూపాయలను ముట్టజెబుతూనే ఉంటాయి. ఇక్కడ ఏ స్కోరూ, చరిత్రా పరిశీలన జరగదా? జరిగినా.. బ్యాంకుల విచక్షణ.. అంటే.. కమీషన్లకు కక్కుర్తిపడ్డ ఓ ఉన్నతాధికారి లేదా అతన్ని ప్రభావితం చేసిన రాజకీయ నాయకుడి ఇష్టమేనా? చెప్పడం కష్టమే.

మానవీయ కోణాలను కూడా ప్రస్తుత బ్యాంకింగ్ వ్యవస్థ విస్మరిస్తోంది అనుకోవచ్చు. గతంలో ఏ చిన్న ఇబ్బంది వచ్చినా.. ఎలాంటి మార్పులు చేర్పులు చేయాల్సి వచ్చినా బ్యాంకుకు వెళ్తే సరిపోయేది. యాంత్రీకరణ, డిజిటలీకరణ పెరిగిన నేపథ్యంలో బ్యాంకుకు వెళ్లినా.. వినియోగదారుల సేవాకేంద్రానికి ఫోన్ చేయడం మినహా వేరే మార్గం లేదు. నగదు రహిత బ్యాంకింగ్ వ్యవస్థలో వస్తున్న విప్లవాత్మక మార్పులు సామాన్యులను 'భౌతిక' బ్యాంకింగ్ వ్యవస్థకు దూరం చేస్తున్నాయనే భావించవచ్చు. సిబ్బందిని తగ్గించుకునే ప్రయత్నంలో బ్యాంకులు చేస్తున్న ప్రయత్నాలు.. ఎంతో మంది సాధారణ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తూనే ఉన్నాయనే స్వరాలు గట్టిగానే వినిపిస్తున్నాయి..

ఇతర వ్యాపారాలపై దృష్టి పెట్టి..: ప్రజల నుంచి డిపాజిట్లు స్వీకరించడం.. వాటిని అవసరమైన వారికి రుణంగా ఇచ్చి, వడ్డీ వసూలు చేయడం.. సాధారణంగా బ్యాంకు ప్రాథమిక వ్యాపారం ఇదే.. కానీ, మారుతున్న పరిస్థితుల్లో బ్యాంకు కేవలం ఈ ఒక్కదానితోనే సంతృప్తి చెందడం లేదు.. బ్యాంకస్యూరెన్స్ పేరుతో అందిస్తోన్న బీమా పాలసీల విక్రయాలు బ్యాంకులకు ఇప్పుడు భారీ వ్యాపారం అయ్యింది. కచ్చితంగా ఇన్ని బీమా పాలసీలు అమ్మాల్సిందే అంటూ సిబ్బందికి లక్ష్యాలు విధిస్తున్నారు.. ఇక్కడే అవినీతికి బీజం పడుతోంది.. రూ.5లక్షలకు ఓ పాలసీ తీసుకోండి... రూ.25లక్షల రుణం ఇచ్చేస్తాం అంటూ కొత్త 'ఆఫర్లు' పుట్టుకొస్తున్నాయి. అంటే, బీమా తీసుకొని, తొలి ప్రీమియం చెల్లిస్తే చాలు.. మీ పత్రాలు కాస్త అటూఇటూగా ఉన్నా.. బ్యాంకు పెద్దగా పట్టించుకోదన్న మాట. రుణాల వసూలు కన్నా.. ప్రీమియాల వసూలుపైనే బ్యాంకు దృష్టి ఎక్కువగా పెడుతుండటంతో పారు బాకీలు పేరుకుపోయినా పట్టించుకోవడం లేదు.

రుసుములు వసూలు చేస్తూ...

బ్యాంకు ఖాతాలో కనీస నిల్వ ఉంచాల్సిందే. లేకపోతే రుసుములు భరించాలి.. అతి పెద్ద జాతీయ బ్యాంకు కనీస నిల్వ నిర్వహించని ఖాతాదారుల దగ్గర్నుంచి ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకూ దాదాపు రూ.1,771 కోట్లను రుసుముగా వసూలు చేసింది. మిగతా బ్యాంకులు వసూలు చేసినవీ పెద్ద మొత్తంలోనే ఉంటాయి.

నమ్మకమైన పునాదిపై ఏర్పడిన బ్యాంకింగ్ వ్యవస్థ.. ఇప్పటికే సాధారణ ప్రజల విశ్వాసాన్ని కోల్పోతోందని తాజాగా ఎన్నో ఘటనలు గుర్తు చేస్తున్నాయి. ఇవి మున్ముందూ కొనసాగితే.. బ్యాంకులపై ప్రజలకు ఉండే నమ్మకం పోతే.. ఆర్థిక వ్యవస్థకూ ఇది పెద్ద శరాఘాతమే!

- ఈనాడు, హైదరాబాద్

మేం కట్టే పన్నులు ఇందుకా..



2011 నుంచి రూ.11,400 కోట్ల రుణాలు ఇచ్చుకుంటూ వచ్చారట. ఆ విషయం ఇప్పుడే వీళ్లకు తెలిసిందా? మరి ఆ మధ్యకాలంలో ఏం చేసినట్లు. నాకు అర్థం కాని విషయం ఇదే. మెరిసేవన్నింటిని వజ్రాలుగా అనుకోకూడదని మాత్రం రుజువైంది.

- రిషి కపూర్, బాలీవుడ్ దిగ్గజ నటుడు



'ఇది కుంభకోణం లేదా మోసమని పీఎన్‌బీ ఎలా అంటుంది. హామీ లేకుండా ఎల్‌ఓయూలు ఇవ్వడం.. ఎంత అవివేకమైన పని. మీరు డబ్బులు ఇచ్చారు.. వాళ్లు తీసుకున్నారు. ఇది మోసమా? మీరు ఎలాంటి తెలివి తక్కువ పనులు చేశారో ముందు చెప్పండి? ఆ ధైర్యం మీకుందా?'

- చేతన్ భగత్, రచయిత



'మేం 30.9% ఆదాయపు పన్ను చెల్లిస్తున్నాం. ఏ వస్తువు కొన్నా 18% జీఎస్‌టీ కడుతున్నాం. ఇప్పుడు రూ.11,000 కోట్లతో నీరవ్ మోదీ పారిపోయాడు. మా సీఏ ఏమాత్రం సంతోషంగా లేడు. మేం ఎందుకు పన్ను చెల్లించాలి. వాటిని ఎలాగో మళ్లీ ఎవరోకరు దోచుకొని పారిపోతారేమో కదా'

- రిచా చద్దా, బాలీవుడ్ నటి



పైవాళ్లకు తెలియకుండానే జరిగిందా?

ముంబయిలోని ఒక శాఖలో 1.77 బిలియన్ డాలర్ల మేర మోసపూరిత లావాదేవీలు జరిగాయంటూ.. పీఎన్‌బీ బుధవారం ఎక్స్ఛేంజీలకు తెలిపింది. 10 వాక్యాలు కూడా లేని ఆ ప్రకటన దేశవ్యాప్తంగా సంచలనం రేపింది. కార్పొరేట్ పాలన సరిగ్గా లేకే ఇలా జరిగిందన్నది వాస్తవమేనని యాత్రాయిట్ ఫైనాన్షియల్ సర్వీసెస్ పోర్ట్‌ఫోలియో మేనేజ్‌మెంట్ సేవల అధిపతి అమిత్ కుమార్ అంటున్నారు. 'అయితే ఒక శాఖలోని కేవలం ఒకరిద్దరు జూనియర్ అధికార్లకు మాత్రమే ఈ మోసం గురించి తెలుసంటున్నారు. మిగతా పై అధికారులకెవ్వరికీ తెలియకుండా ఇది జరగడం అసాధ్యమ'ని ఆయన అభిప్రాయపడ్డారు. ఏడేళ్లుగా ఆ ఒక్కడే ఈ కుంభకోణాన్ని ఎవరికీ తెలియకుండా ఎలా చేశాడని విశ్లేషకులు సైతం ప్రశ్నిస్తున్నారు. బ్యాంకు పుస్తకాల్లో సైతం స్విఫ్ట్ లావాదేవీలకు అనుమతుల విషయం కానీ.. చెల్లింపుల విషయం కానీ ప్రస్తావనకు రాలేదంటే.. బ్యాంకు సైబర్ భద్రతపైనా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అదే సమయంలో వచ్చే త్రైమాసికంలో ఈ మోసం వల్ల బ్యాంకులపై ప్రభావం పడొచ్చు. అపుడు పునర్నిర్మాణ పథకం విఫలం కావొచ్చ'ని కుమార్ అంటున్నారు.

మోసగాళ్లను కఠినంగా శిక్షించండి

పరిశ్రమ వర్గాలు

దిల్లీ: పంజాబ్ నేషనల్ బ్యాంకులో కుంభకోణానికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పరిశ్రమ వర్గాలు అంటున్నాయి. అదే సమయంలో ప్రభుత్వ రంగ బ్యాంకుల బలహీనతపైనా ఆందోళనను వ్యక్తం చేశాయి. ఒకటే శాఖ నుంచి ఇంత భారీ స్థాయిలో మోసపూరిత లావాదేవీలు జరగడాన్ని చూస్తే భారతీయ బ్యాంకింగ్ వ్యవస్థ ఎంతో బలహీనంగా ఉందో అర్థం చేసుకోవచ్చని **అసోచామ్** తెలిపింది. ముఖ్యంగా ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో ఇలాంటి పరిస్థితి నెలకొనడం దేశ ఆర్థిక వ్యవస్థకు ప్రమాదంగా భావించాల్సి ఉంటుందని పేర్కొంది. 'డిప్యూటీ మేనేజర్ స్థాయి అధికారి ఒక్కడే తన ఒంటి చేతితో దేశంలోనే రెండో అతిపెద్ద బ్యాంకునే కాదు, మరికొన్ని బ్యాంకులను ఇబ్బందిలోకి నెట్టాడు. ఈ సంస్థల్లో నష్ట నియంత్రణ చర్యలు లోపభూయిష్ఠంగా ఉన్నాయనడానికి ఇదే నిదర్శనమ'ని అభిప్రాయపడింది. 'ఓ వైపు దేశ ఆర్థిక వ్యవస్థ పరిమాణం విస్తరిస్తోంది. అదే సమయంలో బ్యాంకులు, ఇతర రుణ సంస్థలు పరిమాణం పెరుగుతుంది. అందువల్ల ఏదైనా మోసం చోటుచేసుకుంటే తీవ్ర మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుంద'ని వివరించింది. పీఎన్‌బీ వ్యవహారం తర్వాతైనా మనం కళ్లు తెరవాలని సూచించింది. లోపాలను గుర్తించి, సరిదిద్దేలా వ్యవస్థలను పటిష్ఠం చేయల్సిన అవసరం ఉందని పేర్కొంది. చట్టాలకు అనుగుణంగా మోసగాలను శిక్షించాలని **ఫిక్కీ** పేర్కొంది. 'దీర్ఘకాలంగా వ్యవస్థలో ఉన్న బలహీనతలను తాజా కుంభకోణం ఎత్తిచూపుతోంది. పటిష్ఠ బ్యాంకింగ్ వ్యవస్థను సృష్టించాల్సిన అవసరం ఉంది. మోసానికి పాల్పడటాన్ని తీవ్రంగా పరిగణించి, కఠిన చర్యలు తీసుకుంటారని భావిస్తున్నాం. మోసం చేసిన వ్యక్తులు, కంపెనీలపై జాలి పడనక్కర్లేద'ని **సీఐఐ** అధ్యక్షురాలు శోభనా కామినేని పేర్కొన్నారు.

వామ్మో.. ఇన్ని మోసాలా..

- గత అయిదేళ్లలో 8670 బ్యాంకు మోసం కేసులు
- వాటి విలువ రూ.61,200 కోట్లు

పంజాబ్ నేషనల్ బ్యాంక్(పీఎన్‌బీ)లో బయటపడిన మోసం అందరినీ ఆశ్చర్యంలో ముంచెత్తిఉండొచ్చు. సమస్య ఆ బ్యాంక్ వరకే కదా అని అనుకోవచ్చు. కానీ సమస్య తీవ్రత ఇంకా ఎక్కువగా ఉందనేది ఆర్‌బీఐ గణాంకాలు చెబుతున్నాయి.

గత అయిదు ఆర్థిక సంవత్సరాల్లో ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో మొత్తం 8,670 మోసం కేసులు నమోదయ్యాయని తెలుస్తోంది. సమాచార హక్కు చట్టం ద్వారా వార్తా సంస్థ రాయిటర్స్ ఈ వివరాలను పొందింది. ఈ మొత్తం కేసుల్లోని మోసం విలువ రూ.61,200 కోట్లు(9.58 బిలియన్ డాలర్లు) కావడం గమనార్హం. ఇప్పటికే భారత బ్యాంకింగ్ వ్యవస్థను మొండి బకాయిల సమస్య వేధిస్తోంటే.. తాజాగా ఈ మోసాల వల్ల కలిగే నష్టం అంతకుమించిన ఇబ్బందులను తెచ్చిపెడుతోంది. పై గణాంకాలను చూస్తుంటే సమస్య తీవ్రత ఎంతుందో అర్థమవుతుంది. బ్యాంకుల్లో నమోదైన ఈ రుణం మోసం కేసులు స్థిరంగా పెరుగుతూ ఉండడం కూడా ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. గత ఆర్థిక సంవత్సరంలో మొత్తం రూ.17,634 కోట్ల మేర మోసాలు జరిగాయి. 2012-13లో ఇవి రూ.6,357 కోట్లుగా ఉన్నాయి. పీఎన్‌బీకి చెందిన ఒక శాఖ నీరవ్ మోదీకి చెందిన కంపెనీలకు 1.77 బిలియన్ డాలర్ల రుణాలను అక్రమంగా ఇవ్వడం చూస్తే.. ఈ మోసాలు ఇంకా ఇతర బ్యాంకుల్లో కూడా జరిగాయా అన్న ప్రశ్న తలెత్తుతుంది.

మోసాలతో ఇబ్బందే: బ్యాంకుల్లో జరుగుతున్న మోసాలు ఆర్థిక రంగానికి ఇబ్బందిని కలిగించే అంశాల్లో ఒకటని ఆర్‌బీఐ సైతం ఇటీవలి ఆర్థిక స్థిరత్వ నివేదికలో పేర్కొంది. 'చాలా వరకు పెద్ద స్థాయి మోసాలు రుణ ప్రమాణాల్లో ఉన్న లొసుగులను చూపిస్తున్నాయ'ని అప్పట్లో పేర్కొంది. నిధులు ఎక్కడి నుంచి ఎక్కడకు వెళుతున్నాయన్న దానిపై నిరంతర పర్యవేక్షణ ఉండాలి. సాధారణ రుణ పాలనా అంశాల్లోని లోపాలను సవరించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడింది. అందుకే ఇటీవలి కాలంలో నిరర్థక ఆస్తులను దాచిపెట్టుకోవద్దని స్పష్టం చేసింది. మొండి బకాయిల రికవరీకి కఠిన నిబంధనలను తీసుకొచ్చింది. ఈ సమయంలో ఈ మోసం బయటపడడం గమనార్హం. మరో పక్క, ఆర్‌బీఐ సైతం రుణ ఎగవేతదార్లను బయటకు ప్రకటించకుండా ఉందని కొంత మంది విమర్శకులు అంటున్నారు. అయితే అలా ప్రకటించడం వల్ల న్యాయబద్ధ సమస్యలకు తోడు.. ఆ రుణాల వసూలు మరింత సంక్లిష్టమవుతుందని ఆర్‌బీఐ అభిప్రాయం ఉంది.

ఇంకా ఎక్కువ ఉండొచ్చు..

దేశవ్యాప్తంగా బ్యాంకు రుణాల మోసాల పరిమాణం మరింత ఎక్కువగా ఉండొచ్చని ఆర్‌బీఐ అంటోంది. ఆర్‌బీఐకి వచ్చే గణాంకాలు కేవలం రూ. లక్ష ఆ పైన కేసులు మాత్రమే. ఈ కేసుల విషయంలోనూ పీఎన్‌బీ అగ్రస్థానంలో ఉండడం గమనార్హం. మొత్తం రూ.6562 కోట్ల విలువైన 389 కేసులు నమోదయ్యాయని ఆర్‌బీఐ గణాంకాలు చెబుతున్నాయి. ఇక పీఎన్‌బీ తర్వాతి స్థానాల్లో బ్యాంక్ ఆఫ్ బరోడా(4473 కోట్లు.. 389 కేసులు), బ్యాంక్ ఆఫ్ ఇండియా(రూ.4050 కోట్లు.. 231 కేసులు)లున్నాయి. అతిపెద్ద బ్యాంకైన ఎస్‌బీఐలో 1069 రుణ మోసం కేసులు నమోదైనట్లు తెలుస్తోంది. కాగా మొండి రుణాల సమస్యను పరిష్కరిస్తేనే సరిపోదని.. పెద్ద ఎత్తున రుణ జారీ విధానాల్లో సంస్కరణలను తీసుకురావాలని విశ్లేషకులు చెబుతున్నారు. లేదంటే.. అప్పుడు విజయ్ మాల్యా, ఇపుడు నీరవ్ మోదీ వంటి వ్యాపారవేత్తలు ధారాళంగా రుణం పొంది ఉండేవారు కాదని వారు విమర్శిస్తున్నారు.



ఎప్పుడూ ఆఫ్‌లైన్లో వద్దు!

పక్కా మీ మిత్రుడిని!

"టెన్షన్ పడుతున్నారా ఏంది? ఈ దేశ ప్రధానితో మాట్లాడుతున్నామన్న విషయాన్ని కొద్దిసేపు మీరంతా మర్చిపోండి.

నేను మీ స్నేహితుడ్ని... పక్కా మీ మిత్రుడిని... ఒక రకంగా ఈ రోజు పరీక్ష మీకు కాదు... నాకు! చివర్లో పదికి నాకు ఎన్ని మార్కులేస్తారో మీరే వెయ్యండి..!!"

పిల్లల్లో పిల్లాడిలా.. ఓ స్నేహితుడిలా మారిపోయిన ప్రధాని మోదీ.. వారిలో స్ఫూర్తిని నింపారు. పట్టుదలను రగిలించారు. ఆశలను రేకెత్తించారు. ఆత్మీయంగా అనునయించారు. మొత్తానికి... తన అనుభవాన్నంతా రంగరించి.. చదువులు, పరీక్షల కోసమే కాదు.. జీవితానికి అవసరమైన ఎన్నో మెలకువలు చెప్పారు!


పరీక్షల భయాన్ని ఎదుర్కొనేదెలా?

పరీక్షలకు ఎంత ఆత్మవిశ్వాసంతో తయారైనా భయం వీడటం లేదు.. దాన్నెలా ఎదుర్కోవాలన్నది చాలామంది వేస్తున్న ప్రశ్న. ఇది కచ్చితంగా మంచి ప్రశ్నే. మనం తక్కువేం కష్టపడం. మనతోపాటు తల్లిదండ్రులు, టీచర్లు కూడా ఎంతో శ్రమిస్తారు. అయినా భయంగా ఉంటోందంటే ఆత్మవిశ్వాసం పెంచుకోవాలని అర్థం. అది లేకపోతే ఎంత కష్టపడినా ఫలితం ఉండదు. మనం పరీక్షకు కూర్చున్నప్పుడు ఏదో పదం అవసరమవుతుంది. అది ఏ పాఠంలో, ఏ పేజీలో... ఎన్నో పంక్తిలో ఉందో గుర్తుకొస్తుంటుందిగానీ.. ఆ పదం గుర్తుకు రాదు. అవునా...? (అవునంటూ పిల్లలు పెద్దగా చప్పట్లు) వివేకానందులు 'అహం బ్రహ్మాస్మి' అని చెబుతుంటారు. మిమ్మల్ని మీరు తక్కువగా అనుకోవద్దు, నేనే బ్రహ్మరూపం అనుకోండనేవారు. అదే ఆత్మవిశ్వాసాన్ని ప్రేరేపిస్తుంది. ఆయన చెప్పిన మరో గొప్ప మాట... ముక్కోటి దేవతలు మీపై ఆశీర్వచనాలు కురిపించినా... మీలో ఆత్మవిశ్వాసం లేకపోతే నిష్ఫలమే. ఆత్మవిశ్వాసం లేనివారిని దేవతలు కూడా ఏమీ చేయలేరు...

ఆత్మవిశ్వాసం అన్నది మందో, మూలికో కాదు. సుదీర్ఘ ప్రసంగాలు విన్నంత మాత్రాన ఆత్మవిశ్వాసం వస్తుందని చెప్పలేం. ప్రతి క్షణం మనం కష్టాన్ని నమ్ముకోవాలి. ఎప్పుడైనా మూడంతస్తులు ఎక్కాల్సి వస్తే అందరికంటే ముందు ఎక్కినవాడికి ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. ఎక్కలేనివాడికి అప్పటికి రాకపోయినా మరుసటి రోజు మళ్లీ ప్రయత్నిస్తాడు. మనం ప్రయత్నం చేసేకొద్దీ ఆత్మవిశ్వాసం పెరుగుతుంది.

ఇప్పుడే ఓ వార్త నన్ను హత్తుకుంది. ప్రస్తుతం దక్షిణ కొరియాలో శీతాకాల ఒలింపిక్స్ జరుగుతున్నాయి. అందులో కెనెడా యువకుడు మార్క్ కాంస్య పతకం గెలుచుకున్నాడు. నిజానికి అతనికి శిక్షణ సమయంలో 15, 20 గాయాలయ్యాయి. 11 నెల్ల పాటు కోమాలోకి వెళ్లాడు. అయినా కాంస్యం గెలుచుకున్నాడు. అతను తన ఫేస్‌బుక్ పేజీలో- కోమాలో ఉన్న ఫోటో, కాంస్యం అందుకుంటున్న ఫోటో పక్కపక్కనే పెట్టి.. 'ధన్యవాద్ జిందగీ' అని రాసుకున్నాడు. ఎంత పెద్ద ఆత్మవిశ్వాసం!

మనం పరీక్ష రాస్తున్నామనీ, మనకు ఎవరో మార్కులు వేస్తున్నారన్న భావనను మనసులోంచి తీసేయండి. నాకు నేనే నాకు ఎగ్జామినర్ అనుకోండి. నా భవిష్యత్తు నిర్దేశకుడిని నేనే అనుకోండి. అప్పుడు చూడండి. ఆత్మవిశ్వాసం మీదవుతుంది.



చాలామందికి నీటి రుచి తెలిసి ఉండదు.. కారణం గటగటా తాగడమే. అలాకాకుండా నిదానంగా తాగుతూ దాని రుచి ఆస్వాదించండి... దాన్నే శ్రద్ధ అంటారు. మన జీవితాన్ని మనమే మలచుకోవచ్చు.

భావోద్వేగ సమతౌల్యానికి (ఈక్యూ) జీవితంలో పెద్ద పాత్ర ఉంటుంది. అది స్ఫూర్తినిస్తుంది. రిస్క్ తీసుకొనే సామర్థ్యాన్ని పెంచుతుంది. ఓ ఉపాధ్యాయుడు పిల్లల జన్మదినం రోజు తల్లిదండ్రులతో కలిసి ఏదో ఒక అనాథాశ్రమానికో, ఆసుపత్రికో వెళ్లిరావాలన్న షరతు పెట్టాడు. దానివెనుక ఉన్న తర్కమేంటి? అని ఓసారి ఆయన్ను అడిగాను. అందుకు ఆయన సమాధానమిస్తూ పిల్లల ఐక్యూ పెంచడానికి స్కూల్లో నావంతు ప్రయత్నం చేస్తా. కానీ భావోద్వేగ బంధాలు.. ఎమోషనల్ బాండింగ్.. అర్థం కావాలంటే పిల్లలను కష్టాలు, కన్నీళ్లు, ఇబ్బందులున్న చోటికి తీసుకువెళ్లాలన్నారు. దానివల్ల పిల్లలు ఆ బాధలతో సహానుభూతి పొందుతారు. ఇది అందరూ చేయాలి.

ఒకే టైం టేబుల్ 365 రోజులు పనికి రాదు. సమయానుకూలంగా మారాలి. ఒక్కోసారి అనుకోకుండా వేరే పని చేయాల్సి వస్తుంది. అలాంటప్పుడు రెండింటి మధ్య సమయం సర్దుబాటు చేసుకోవాలి తప్పితే... కొత్తగా వచ్చిపడినది చేయాలా? వద్దా? అన్న సంఘర్షణ రాకూడదు.



సచిన్ ఏం చెప్పారు...

ఒకసారి నేను 'మన్ కీ బాత్'లో సచిన్ టెండూల్కర్‌తో మాట్లాడుతుంటే ఓ పిల్లాడి ప్రశ్నకు ఆయనిలా జవాబిచ్చాడు. 'నేను ఆడేటప్పుడు అంతకుముందు ఎలాంటి బాల్ వచ్చింది, దాన్ని కొట్టానా? లేదా? పరుగులు తీశానా లేదా? అన్నది మనసులో పెట్టుకోను... అలాగే తర్వాత బాల్ ఎలా వస్తుంది? దాన్ని ఫోర్ కొట్టాలా? సిక్స్ కొట్టాలా? అన్నదీ ఆలోచించను... అప్పుడు రాబోయే బంతి గురించే ఆలోచిస్తాను... మిగతావన్నీ మరిచిపోతాను' అని చెప్పారు. అది పద్ధతి అంటే. వర్తమానంలో జీవించే అలవాటు చేసుకోవాలి.

ముందు పుస్తకం పెట్టుకొని చదుకుంటున్నా మనం ఆఫ్‌లైన్‌లో ఉంటే ఫలితం ఉండదు. అందువల్ల మనం ఏ పనిచేస్తుంటామో దానిపై పూర్తిగా దృష్టిపెట్టాలి. ఎప్పుడూ ఆన్‌లైన్‌లో ఉండాలి.

డాక్టరో... ఇంజనీరో కావాలనుకునప్పుడు.. అది కాలేకపోతే... నిరాశకు గురవుతారు. 'క్రయింగ్' అనేది 'ట్రయింగ్' కావాలి. ఏడుస్తూ కూర్చోకూడదు. అందువల్ల ఏదో కావాలని కాకుండా ఏదో ఒకటి చేయాలని లక్ష్యంగా పెట్టుకోండి. అది చేయడం మొదలుపెట్టిన తర్వాత మీకు సంతృప్తి కలగడం ప్రారంభమవుతుంది.

తల్లిదండ్రుల ఒత్తిడి తట్టుకునేదెలా?

పరీక్షల్లో 90% మార్కులు సాధించినా తల్లిదండ్రులు సంతృప్తిపడటం లేదు.. 'వాళ్లకు క్లాస్ తీసుకోమని' చాలామంది అడుగుతున్నారు. కానీ మనం తల్లిదండ్రుల ఉద్దేశాన్ని అనుమానించకూడదు. వారిని అర్థం చేసుకోవడానికి ప్రయత్నించాలి. మనం కోసం వాళ్లు జీవితాన్ని అర్పిస్తారు. వాళ్లు మన కోసమే ఆలోచిస్తున్నారు కదా అనుకుంటే వారిని అర్థం చేసుకోవడానికి మనసు తెరుచుకుంటుంది. లేదంటే నాన్న ఆఫీసు నుంచి వచ్చే టైం అయింది కాబట్టి బుక్కు తీసుకొని కూర్చుందాం అనుకుంటాం. అలాంటి వాతావరణం మంచిదికాదు. కొందరు తల్లిదండ్రులు తమ పిల్లల శక్తిసామర్థ్యాలను తెలుసుకోకుండానే తమ ఆశలను, తీరని కోరికలను వారి మీద రుద్దే ప్రయత్నం చేసే మాట వాస్తవమే. ఇప్పుడు చదువు సామాజిక హోదా అయిపోయింది. శుభకార్యాలకు వెళ్లినప్పుడు పిల్లలేం చేస్తున్నారో మాట్లాడుకోవడం తల్లిదండ్రులకు అలవాటైంది. వాళ్ల పిల్లలు అక్కడికెళ్లారు... వీళ్ల పిల్లలు అది చేస్తున్నారు.. నేను మావాడు ఏం చేస్తున్నాడో చెప్పలేని పరిస్థితి దాపురించిందని ఇంటికొచ్చి పెద్దలు బాధపడుతుంటారు. ఆ సమయంలో ఎదురుపడ్డామో చచ్చామే! ఖేల్‌ఖతం!! కాబట్టి మనసువిప్పి మీ ఆలోచనలను తల్లిదండ్రులతో పంచుకోండి. వాళ్లు మంచి మూడ్‌లో ఉన్నప్పుడు చెప్పండి! ఈ మాట మన దేశంలోని పిల్లలకు నేను చెప్పాల్సిన పని లేదనుకోండి.. ఎందుకంటే మన పిల్లలంతా పుట్టుకతోనే పెద్ద రాజకీయ నాయకులు! ఇంట్లో ఏ పని ఎవరితో చెబితే అవుతుందో వాళ్లకు బాగా తెలుసు. ప్రతి ఒక్కరిలో ఏదో ఒక ప్రత్యేకత ఉంటుంది. దాన్ని గుర్తించి తల్లిదండ్రులు ప్రోత్సహిస్తే పిల్లలు ఎంతస్థాయికైనా ఎదుగుతారు. పిల్లలపై ప్రేమ చూపండి... ఒత్తిడి చేయొద్దు. మార్కులు రాకపోతే ప్రపంచం మునిగిపోదు. ఒక పరీక్షే జీవితం అవుతుందా? అబ్దుల్ కలాంను చూడండి. ఆయన తొలుత పైలట్ కావాలనుకొని విఫలమయ్యాడు. అంతమాత్రాన ఆయన జీవితం అయిపోయిందా... గొప్ప శాస్త్రవేత్త కాలేదా? ఉత్తమ రాష్ట్రపతిగా పేరు తెచ్చుకున్నారు.

మనసు లగ్నం ఎలా?

చాలామంది పిల్లలు ఎంత అనుకున్నా చదువుపై మనసుపెట్టలేకపోతుంటారు. నిజానికి శ్రద్ధ పెట్టడం అంటే అదేదో ప్రత్యేక పద్ధతేమో అనుకుంటుంటారు. అదేం కాదు. మీరు ప్రతి రోజూ ఏదో పని శ్రద్ధతో చేసుకుంటూ ఉంటారు. అదేమిటో గుర్తించండి. పాటలు వింటున్నప్పుడు దాని వీడియో కూడా మనసులో మెదలుతుంటుంది. ఫ్రెండ్‌తో ఫోన్లో మాట్లాడుతుంటే.. పాటలూ, చివరికి అమ్మ పిలుపులు కూడా వినపడవు. ఇలా మీరు ఏయే అంశాలపై మనసు పెట్టి పనిచేస్తున్నారో, ఎందుకు చేస్తున్నారో విశ్లేషించుకోండి. అదే కారణాలను అన్నింటికీ అన్వయించుకుంటూ నిదానంగా శ్రద్ధ పెరుగుతూ పోతుంది. కొన్ని మాటలు మనకు పదేళ్ల తర్వాతా గుర్తుంటాయి కదా! దాన్ని బట్టి మనకు జ్ఞాపకశక్తిలో లోపం లేదన్నది సుస్పష్టం. మనసును హత్తుకున్నవాటిని మరిచిపోలేం. మనస్సు, బుద్ధి, శరీరం, హృదయం, ఆత్మ అన్నింటినీ ఒకతాటిపైకి తెచ్చినప్పుడు శ్రద్ధ సాధ్యమవుతుంది. అది మీరు సాధన చెయ్యాలి.




ప్రధాని ప్రసంగ కార్యక్రమాన్ని గుడ్‌గావ్‌లోని ఓ పాఠశాలలో టీవీలో వీక్షిస్తున్న విద్యార్థులు

డీఫోకస్ నేర్వండి!

మీరు దేనిమీదైనా దృష్టి పెట్టాలనుకుంటే.. ఫోకస్ పెట్టాలనుకుంటే ముందు 'డీఫోకస్' ఎలాగో నేర్చుకోండి. పాతవి ఖాళీ కాకపోతే పాత్రలో కొత్తవి పట్టవు. మనం పంచభూతాలతో అనుసంధానమై ఉంటామో అప్పుడు మనలో కొత్త శక్తి వస్తుంది. ఒట్టి కాళ్లతో మట్టిపై పరుగెత్తినప్పుడు కలిగే ఆనందాన్ని అనుభవించండి.

నిరంతరం ఫోకస్ పెట్టాలనుకోవడం పెద్ద తప్పు. అలాచేస్తే గానుగెద్దుకు గంతలు కట్టినట్లు అక్కడే తిరుగుతూ ఉంటుంది. అలాంటి పరిస్థితి మనకొద్దు. మనకు మనం నచ్చినట్లు ఉందాం. సంతోషం కల్గించేది చేద్దాం. మనం డీఫోకస్ కావడం నేర్చుకున్నప్పుడే ఫోకస్ పెట్టడం సాధ్యమవుతుంది. దానివల్లే ఫలితాలు వస్తాయి.



పోలిక పోటీలు మనకెందుకు!

యుద్ధంలో కూడా శత్రువులను మన చోటికి తీసుకొచ్చి చంపాలంటారు! స్నేహితులతో పోటీలకు దిగొద్దు. ఎవరి ఆలోచనలు వారివి.. ఎవరి శక్తిసామర్థ్యాలు, కుటుంబ పరిస్థితులు, కలలు వారివి. ముందు మీ శక్తి మీరు తెలుసుకోండి. దాని ప్రకారం లక్ష్యం నిర్దేశించకోండి. దాన్ని సాధించడానికి అంతా సాయం చేస్తారు. క్రీడల్లో రాణించే వారిని ఎవరైనా డిగ్రీ గురించి అడుగుతారా? వీడికేమీ చదువురాదని తోటి మిత్రులెవరైనా అంటారా? చదువుపెద్దగా రాకపోయినా టెన్నిస్‌తో ప్రపంచస్థాయికి ఎదిగినవారులేరా? అతను తనలోని శక్తిసామర్థ్యాలను గుర్తించి ఆదారిలో వెళ్లడంవల్ల పైకి ఎదిగాడు. కాబట్టి మనల్ని మనం తెలుసుకోవాలి. రెండోది... పోటీకి దిగినప్పుడు ఒత్తిడి ఎదుర్కోవాల్సి వస్తుంది. అప్పుడు మనల్ని మనం చూడకుండా ఎదుటివాడిపై దృష్టిపెడతాం. అతను నాలుగు గంటలు చదువుతున్నాడని తెలిస్తే... నేనూ నాలుగు గంటలు చదవాలనుకుంటాం. మనకు తెలియకుండా అతడే మనకు మార్గదర్శిగా తయారవుతాడు. నిన్నటికంటే ఈ రోజు రెండడుగులు ముందుకెళ్లానా? లేదా? అన్నది డైరీలో రాసుకోండి. అలా ఒకసారి ముందుకెళ్లడం నేర్చిస్తే... మన లోపలి నుంచి శక్తితన్నుకొస్తుంది! అందరూ ప్రతిస్పర్థను వదిలేసి అనుస్పర్థను నేర్చుకోండి.

ఒక పిల్లవాడి ప్రశ్న

మాకు పరీక్షలు మీకు ఎన్నికలు..

వచ్చే ఏడాది మనిద్దరికీ పరీక్షలున్నాయి. నాకు 12వ తరగతి బోర్డు పరీక్ష, మీకు సాధారణ ఎన్నికల పరీక్ష... అందుకు మీరు పూర్తి సిద్ధంగా ఉన్నారా?

"నేను మీ టీచర్ అయి ఉంటే జర్నలిజంలోకి వెళ్లమని చెప్పేవాడ్ని. ఇలా తిప్పితిప్పి ప్రశ్నలు అడిగే శక్తి పాత్రికేయులకే ఉంటుంది. మీరు చదువుతూనే ఉండండి. నేర్చుకోవడానికి ప్రయత్నిస్తూ ఉండండి. చదువుపై పూర్తి దృష్టిపెట్టండి. లోపల విద్యార్థికి ఎంత శక్తి ఉంటుందో అంత శక్తిని పెంచుకోండి. ఇదే జీవన ధర్మంగా చేసుకొని ముందుకెళ్లండి. పరీక్షలు, ఫలితాలు.. మార్కులు.. 'బై ప్రోడక్ట్'లు కావాలి. మీరు మీ పనిచేస్తే వచ్చే ఫలితాలు వస్తాయి. మార్కులను దృష్టిలో పెట్టుకొని పనిచేస్తే మనం చేయాలనుకున్నది చేయలేం. రాజకీయాల్లోనూ నేను ఇదే సిద్ధాంతంతో వెళ్తాను. 125 కోట్ల ప్రజల కోసం నాకున్న శక్తిసామర్థ్యాలు, సమయం, తెలివితేటలు అంకితం చేస్తాను. ప్రతీక్షణం... శరీరంలోని కణ కణం... ప్రజల కోసం ధారపోస్తా. ఎన్నికలు వస్తుంటాయి... పోతుంటాయి... అవంతా బై ప్రోడక్ట్. మీకు సంవత్సరంలో ఒకసారి పరీక్షలు వస్తాయి. మాకు 24 గంటలూ పరీక్షలే. దేశంలో ఏదో ఒక మూల మున్సిపాల్టీలో ఓడిపోతే అదే బ్రేకింగ్ న్యూస్ అవుతుంది. మోదీకి దెబ్బ అంటూ ప్రచారం చేస్తారు. ఇంకోటి... రాజకీయాల్లోకి ఆలస్యంగా వచ్చాను. ప్రస్తుతం రాజకీయాల్లో ఉన్నప్పటికీ మానసికంగా రాజకీయాల్లో లేను. నా గుణంలో అది లేదు. ఏదో ఒకటి చేయడమే నా సహజగుణం. గతంలో జన్‌సంఘ్ పేరుతో ఒక రాజకీయపార్టీ ఉండింది. దాని గుర్తు గోడలపై వేయడానిక్కూడా దాని దగ్గర డబ్బులుండేవి కాదు. గుజరాత్ ఎన్నికల్లో అది 103 అభ్యర్థులను నిలబెట్టింది. అందులో 99 మందికి డిపాజిట్లు పోయాయి. రాజకీయాల్లో డిపాజిట్లు పోవడం చాలా దారుణమైన అంశంగా భావిస్తారు. నలుగురికి డిపాజిట్లు దక్కాయి. ఆ నలుగురి డిపాజిట్ల సొమ్ము వెనక్కురావడంతో జన్‌సంఘ్ వాళ్లు పెద్ద పార్టీ చేసుకున్నారు. నిరాశపడలేదు, మిఠాయిలు పంచుకున్నారు. ఆ ఆలోచన వల్లే అక్కడి నుంచి ఇక్కడి వరకూ రావటం సాధ్యపడింది. ఓటమిని అంగీకరించండి, ప్రయత్నాన్ని వదలొద్దని అటల్‌జీ అనేవారు. ఆ నినాదం ఎంతో ప్రేరణనిస్తుంది. అది ప్రతి ఒక్కరిలో రావాలి. మీ బోర్డు పరీక్షలకు నేను శుభాకాంక్షలు చెబుతున్నా. నా పరీక్షల కోసం 125 కోట్ల ప్రజలు నన్ను ఆశీర్వదిస్తారు. అదే భరోసాతో ముందుకువెళ్తాను. **– ఈనాడు, దిల్లీ**

ఏం ఆధిపత్యం..? ఏం సాధికారత..? ఏం పరాక్రమం..?
అది కూడా దక్షిణాఫ్రికాపై.. పైగా వారి గడ్డపై!
అక్కడ సిరీస్ గెలవడమే గొప్పంటే.. 5-1 ఆధిక్యంతో గెలుపు!
అందులోనూ గెలిచిన ప్రతి మ్యాచ్‌లోనూ తిరుగులేని ఆధిపత్యం!
ప్రత్యర్థికి కొంచెం గౌరవప్రదంగా ఓడే అవకాశమూ లేకుండా చేసి...

ప్రత్యర్థి జట్టు ఒక్క విజయం కోసం ముఖం వాచిపోయేలా చేసి..
కంటితుడుపుగా ఒక మ్యాచ్ గెలిచినా అందులోనూ సంతోషం లేకుండా
చేసి.. పేసర్ల నిలయాల్లో స్పిన్‌తో ప్రత్యర్థి బ్యాట్స్‌మెన్‌ను ఉక్కిరిబిక్కిరి చేసి..
భీకర పేసర్లను చిత్తు కింద కొట్టి.. అన్ని రంగాల్లోనూ పైచేయి సాధించి..
దక్షిణాఫ్రికాలో దక్షిణాఫ్రికాపై సాధించిన ఈ సిరీస్ విజయం

అద్భుతం.. అసాధారణం.. చరిత్రాత్మకం!

చాంపియన్

కోహ్లినూర్

ఏమిటీ ప్రవాహం?

టెస్టు సిరీస్‌లో భారత్ ఓడిపోయి ఉండొచ్చు. కానీ రెండు జట్లలో అత్యధిక పరుగులు (286) చేసిన ఆటగాడు కోహ్లి. బౌలర్ల ఆధిపత్యం సాగిన ఆ సిరీస్‌లో సెంచరీ చేసిన ఏకైక మొనగాడు అతనే. అత్యుత్తమ సగటు (47.66) అతడిదే. అత్యధిక స్కోరూ (153) అతడిదే.

ఇక వన్డే సిరీస్‌లో అతడి జోరు గురించి ఏం చెప్పాలి? 6 మ్యాచ్‌ల్లో 558 పరుగులు.. 186 సగటు.. 99.46 స్ట్రైక్ రేట్.. మొత్తంగా మూడు సెంచరీలు.. ఒక అర్ధసెంచరీ.. మూడు నాటౌట్‌లు. పరుగులు, సగటు, అత్యధిక స్కోరు.. ఇలా ఏది చూసినా అతనే నంబర్‌వన్.

గణాంకాలు ఇలా కనిపిస్తుండగా.. విరాట్ పరుగల ప్రవాహం గురించి ఇంకేమని వర్ణించాలి..? దక్షిణాఫ్రికా లాంటి బలమైన జట్టుపై, అందులోనూ వారి గడ్డపై.. బలమైన పేస్ దళాన్ని ఎదుర్కొంటూ ఇంతటి ఆధిపత్యంతో, సాధికారతతో బ్యాటింగ్ చేయడం ద్వారా తన సామర్థ్యంపై లేశమాత్రమైనా సందేహాల్లేకుండా చేశాడు విరాట్. సెంచూరియన్‌లో రెండో టెస్టులో సహచరులందరూ చేతులెత్తేసినపుడు ఒంటరి పోరాటంతో సాధించిన సెంచరీ అయినా.. తొలి వన్డేలో భారీ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో బాదిన శతకమైనా.. మూడో వన్డేలో ప్రతికూల పరిస్థితుల్లో ఓపిగ్గా ఆడి సాధించిన 160 పరుగుల అజేయ ఇన్నింగ్స్ అయినా.. ఇప్పుడు సఫారీ బౌలింగ్ ఏమాత్రం లెక్క చేయకుండా బాదిన సెంచరీ అయినా.. వేటికవే సాటి. గత రెండు మ్యాచ్‌ల్లోనూ మంచి ఊపుమీదుండగా ఒకసారి చెత్త షాట్ ఆడి, మరోసారి రోహిత్‌తో సమన్వయ లోపంతో రనౌటై అనూహ్య రీతిలో ఔటైపోయిన విరాట్.. సెంచరీ కొట్టి రెండు మ్యాచ్‌లు దాటిపోయేసరికి ఇక ఆగలేకపోయాడు. శుక్రవారం చెలరేగిపోయాడు. మళ్లీ శతక ఆకలి తీర్చేసుకున్నాడు. అతడిని దక్షిణాఫ్రికా బౌలర్లు ఏమాత్రం ఇబ్బంది పెట్టలేకపోయారు. విరాట్ సింగిల్‌తో సరిపెడితే సంతోషించే పరిస్థితి వాళ్లది. అంతలా ఆధిపత్యం చలాయించాడతను. అర్ధసెంచరీ తర్వాత ఆడిన ఒక కవర్ డ్రైవ్.. సెంచరీ ముంగిట కొట్టిన స్ట్రెయిట్ డ్రైవ్.. ఇలా విరాట్ ఆడిన కొన్ని షాట్ల అందం గురించి ఎంత వర్ణించినా తక్కువే. అటు టెస్టుల్లో, ఇటు వన్డేల్లో తిరుగులేని ఆధిపత్యం చలాయించిన విరాట్.. రాబోయే టీ20 సిరీస్‌లోనూ ఇలాగే చెలరేగి తన ఆధిపత్యాన్ని చాటుతాడేమో చూద్దాం.

– ఈనాడు క్రీడావిభాగం



సెంచరీ నంబర్ 35



కోహ్లి 129 నాటౌట్

ఒకే ఒక్కడు

వన్డే చరిత్రలోనే ఒక ద్వైపాక్షిక సిరీస్‌లో 500కు పైగా పరుగులు చేసిన తొలి ఆటగాడిగా కోహ్లి రికార్డు సృష్టించాడు. ప్రస్తుత సిరీస్‌లో అతడి పరుగుల సంఖ్య 558. రోహిత్ శర్మ 2013లో ఆస్ట్రేలియాపై 491 పరుగులతో నెలకొల్పిన రికార్డును అతను అధిగమించాడు.



శార్దూల్ (4/52)

మళ్లీ శతకబాదిన కోహ్లి ● మెరిసిన శార్దూల్
ఆరో వన్డేలోనూ ఘనవిజయం ● సిరీస్ 5-1తో సొంతం

ఒక్క బ్యాట్స్‌మన్.. 6 మ్యాచ్‌ల్లో 558 పరుగులు.. చరిత్రలో ఎన్నడూ చూడని పరుగుల ప్రవాహం! ఇద్దరు స్పిన్నర్లు.. 6 మ్యాచ్‌ల్లో 33 వికెట్లు.. చరిత్రలోనే కాదు, భవిష్యత్తులోనూ అసాధ్యమనిపించే ఘనత! ఈ విజయాల్లో మిగతా ఆటగాళ్ల పాత్ర కూడా ఉన్నప్పటికీ.. విరాట్ బ్యాటింగ్ ఆధిపత్యం, చాహల్-కుల్‌దీప్‌ల స్పిన్ ప్రతాపమే చరిత్రలో నిలిచిపోయే ఈ జైత్రయాత్రలో అత్యంత కీలకం! నామమాత్రమైన చివరి వన్డేలోనూ ఈ ముగ్గురూ తమవంతు పాత్ర పోషిస్తే.. యువ పేసర్ శార్దూల్ ఠాకూర్ కూడా తనదైన ముద్ర వేస్తూ సఫారీ జట్టును దెబ్బ తీశాడు. దీంతో మరో భారీ విజయంతో సిరీస్‌కు ఘనమైన ముగింపునిచ్చింది టీమ్‌ఇండియా. టెస్టుల్లో సఫారీల విజయాన్ని మించేలా వన్డేల్లో నెగ్గిన భారత్.. ఆ పరాభవానికి ఘనంగా ప్రతీకారం తీర్చుకున్నట్లే. ఇక్కడికి లెక్క సమం. ఇక ఈ పర్యటనలో పైచేయి ఎవరిదో తేలేది ఆదివారం ఆరంభమయ్యే పొట్టి క్రికెట్ సమరంలో!

సెంచూరియన్

మ్యాచ్ నామమాత్రమే అయినా తీవ్రత తగ్గించలేదు కోహ్లీసేన. ఐదో వన్డేతోనే సిరీస్ సొంతమైనప్పటికీ.. చివరి వన్డేలోనూ భారత్ జోరు కొనసాగించింది. శుక్రవారం దక్షిణాఫ్రికాను 8 వికెట్ల తేడాతో చిత్తు చేసింది. 205 పరుగుల లక్ష్యాన్ని భారత్ కేవలం 32.1 ఓవర్లలోనే, 2 వికెట్లు మాత్రమే కోల్పోయి అలవోకగా ఛేదించింది. అసాధారణ పరుగుల ప్రవాహాన్ని కొనసాగిస్తూ కెప్టెన్ విరాట్ కోహ్లి (129 నాటౌట్, 96 బంతుల్లో 19×4, 2×6) సిరీస్‌లో మూడో సెంచరీ బాదేసి జట్టుకు భారీ విజయాన్నందించాడు. అంతకుముందు కెరీర్లో మూడో వన్డే మాత్రమే ఆడుతూ శార్దూల్ ఠాకూర్ (4/52) చెలరేగిపోగా.. బుమ్రా (2/24), చాహల్ (2/38) కూడా చక్కటి ప్రదర్శన చేయడంతో దక్షిణాఫ్రికా 46.5 ఓవర్లలో 204 పరుగులకే కుప్పకూలింది. ఆ జట్టులో జొండో (54; 74 బంతుల్లో 3×4, 2×6) టాప్‌స్కోరర్. కోహ్లి 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్'తో పాటు 'మ్యాన్ ఆఫ్ ద సిరీస్' అవార్డును కూడా సొంతం చేసుకున్నాడు.

అతడికి అడ్డేదీ..: సప్త సముద్రాలీదిన వాడికి పిల్ల కాలువే ఎదురొస్తే.. అంటూ ఓ పాటలో పంక్తి ఉంటుంది. విరాట్ ఆడుతున్నపుడు 205 పరుగుల లక్ష్యం అలాంటిదేగా మరి! అసలే భీకర ఫామ్‌లో ఉన్నాడు. ఈ పర్యటనలో ప్రతికూల పరిస్థితులు ఎదురైనపుడూ చెలరేగాడు. పైగా ఛేదన అనగానే అతను రెచ్చిపోతాడు. ఇక 205 పరుగుల స్వల్ప లక్ష్యం నిలిపితే అతడి జోరెలా ఉంటుందో చెప్పేదేముంది? ఆకాశమే హద్దుగా చెలరేగిపోయాడు విరాట్. వరుస వైఫల్యాల నుంచి బయటపడి గత మ్యాచ్‌లో సెంచరీ కొట్టిన రోహిత్ శర్మ (15) తిరిగి పూర్వపు ఫామ్‌లోకి వెళ్లిపోగా.. సిరీస్‌లో చక్కటి ప్రదర్శన చేసిన ధావన్ కూడా విఫలమయ్యాడు. అయినప్పటికీ భారత్‌కు ఎలాంటి ఇబ్బంది లేకపోయింది. తనకంటే నాలుగు ఓవర్ల ముందు నుంచి ఆడుతున్న ధావన్ 18 పరుగులకు వెనుదిరిగేటప్పటికే.. విరాట్ 38 పరుగులు చేశాడంటే అతడెంత దూకుడుగా ఆడాడో అర్థం చేసుకోవచ్చు. ఏ బౌలర్‌నూ వదలకుండా బౌండరీల మోత మోగిస్తూ 36 బంతుల్లోనే అర్ధసెంచరీ, 82 బంతుల్లోనే సెంచరీ పూర్తి చేశాడు విరాట్. 23 ఓవర్లకే అతడి సెంచరీ అయిపోవడం విశేషం. ఆ వందలో 17 ఫోర్లుండటం గమనార్హం. సెంచరీ తర్వాత మరింత జోరు పెంచిన విరాట్ ఇంకో రెండు ఫోర్లు, రెండు కళ్లు చెదిరే సిక్సర్లు బాదాడు. బౌండరీల రూపంలోనే అతను 106 పరుగులు చేయడం విశేషం. ధావన్ ఔటయ్యాక క్రీజులోకి వచ్చిన రహానె (34 నాటౌట్; 50 బంతుల్లో 3×4) మరో ఎండ్‌లో కుదురుగా ఆడుతూ కోహ్లికి చక్కటి సహకారం అందించాడు. విరాట్.. ధావన్‌తో రెండో వికెట్‌కు 61 పరుగులు, రహానెతో అభేద్యమైన మూడో వికెట్‌కు 126 పరుగులు జోడించాడు.

అదే తడబాటు: సిరీస్‌లో భారత బౌలర్ల ధాటికి విలవిలలాడుతూ వచ్చిన దక్షిణాఫ్రికా.. ఈ మ్యాచ్‌లోనూ తడబాటును కొనసాగించింది. నామమాత్రమైన మ్యాచ్ కావడంతో భువనేశ్వర్‌కు విశ్రాంతినిచ్చి యువ పేసర్ శార్దూల్ ఠాకూర్‌కు భారత్ అవకాశమివ్వగా.. అతను చక్కటి ప్రదర్శనతో సఫారీ జట్టును దెబ్బ తీశాడు. శార్దూల్ ఓపెనర్లు ఆమ్లా (10), మార్‌క్రమ్ (24) పది ఓవర్లలోపే పెవిలియన్‌కు పంపేశాడు. 43/2తో ఉన్న దక్షిణాఫ్రికాను డివిలియర్స్ (30), జొండో ఆదుకున్నారు. వీళ్లిద్దరూ కుదురుకోవడం, స్కోరు వంద దాటడంతో.. ఇన్నింగ్స్ గాడిన పడ్డట్లే అనిపించింది. కానీ స్పిన్నర్ చాహల్ ఆ జట్టును గట్టి దెబ్బ తీశాడు. ప్రమాదకరంగా మారుతున్న ఏబీని బోల్తా కొట్టించాడు. ఆపై జొండోను కూడా అతనే ఔట్ చేశాడు. మధ్యలో క్లాసన్ (22)ను బుమ్రా, బెహార్డీన్ (1)ను శార్దూల్, మోరిస్ (4)ను కుల్‌దీప్ పెవిలియన్ చేర్చారు. దీంతో దక్షిణాఫ్రికా ఒక దశలో 151/7తో నిలిచింది. ఈ స్థితిలో ఫెలుక్వాయో (34), మోర్నీ మోర్కెల్ (20) పోరాడటంతో దక్షిణాఫ్రికా 200 దాటగలిగింది. ఈ భాగస్వామ్యం విడిపోయాక ఇన్నింగ్స్ ఎంతోసేపు సాగలేదు.

దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్: మార్‌క్రమ్ (సి) అయ్యర్ (బి) ఠాకూర్ 24; ఆమ్లా (సి) ధోని (బి) ఠాకూర్ 10; డివిలియర్స్ (బి) చాహల్ 30; జొండో (సి) పాండ్య (బి) చాహల్ 54; క్లాసన్ (సి) కోహ్లి (బి) బుమ్రా 22; బెహార్డీన్ (సి) బుమ్రా (బి) ఠాకూర్ 1; మోరిస్ (సి) ధావన్ (బి) కుల్‌దీప్ 4; ఫెలుక్వాయో (సి) అండ్ (బి) ఠాకూర్ 34; మోర్కెల్ (సి) అయ్యర్ (బి) పాండ్య 20; తాహిర్ (సి) కోహ్లి (బి) బుమ్రా 2; ఎంగిడి నాటౌట్ 0; ఎక్స్‌ట్రాలు 3 **మొత్తం:** (46.5 ఓవర్లలో ఆలౌట్) **204**

వికెట్ల పతనం: 1-23, 2-43, 3-105, 4-135, 5-136, 6-142, 7-151, 8-187, 9-192

బౌలింగ్: శార్దూల్ ఠాకూర్ 8.5-0-52-4; బుమ్రా 8-1-24-2; పాండ్య 10-0-39-1; కుల్‌దీప్ 10-0-51-1; చాహల్ 10-0-38-2

భారత్ ఇన్నింగ్స్: ధావన్ (సి) జొండో (బి) ఎంగిడి 18; రోహిత్ (సి) క్లాసన్ (బి) ఎంగిడి 15; కోహ్లి నాటౌట్ 129; రహానె నాటౌట్ 34; ఎక్స్‌ట్రాలు 10 **మొత్తం:** (32.1 ఓవర్లలో 2 వికెట్లకు) **206**

వికెట్ల పతనం: 1-19, 2-80

బౌలింగ్: మోర్నీ మోర్కెల్ 7-0-42-0; ఎంగిడి 8-1-54-2; మోరిస్ 6-0-36-0; ఫెలుక్వాయో 4-0-27-0; తాహిర్ 7.1-0-42-0

"ఈరోజు చాలా చాలా సంతోషంగా ఉన్నా. ఫ్లడ్ లైట్ల వెలుతురులో ఛేదన సులభంగా ఉంటుందని తెలిసే మొదట బౌలింగ్ ఎంచుకున్నా. దక్షిణాఫ్రికా బౌలర్లు షార్ట్ పిచ్ బంతులతో పరీక్ష పెట్టాలని చూశారు. వారి వ్యూహాన్ని తిప్పికొట్టాం. ఈ విజయం నా స్నేహితులు, సన్నిహితులదే. ముఖ్యంగా నా భార్య అనుష్క పర్యటన ఆసాంతం ఎంతో అండగా నిలిచింది. ప్రతి మ్యాచ్‌లోనూ నేనే ముందుండి నడిపించాలని కోరుకుంటా. అదో గొప్ప అనుభూతి. నా కెరీర్ మరో ఎనిమిది, తొమ్మిదేళ్లు ఉంటుందేమో. అందుకే ప్రతిరోజూ పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలని అనుకుంటున్నా. కెప్టెన్‌గా ఉండి జట్టును విజయవంతంగా నడిపించడం నాకో వరం. స్పిన్నర్లు చాహల్, కుల్‌దీప్, ఓపెనర్లు శిఖర్, రోహిత్ కీలక సమయాల్లో సత్తా చాటారు. పర్యటన ఇంకా ముగియలేదు. ఇక మా దృష్టంతా టీ20లపైనే. ఇదే జోరు కొనసాగిస్తాం"

–విరాట్ కోహ్లి

● ఛేదనలో కోహ్లీకిది 21వ సెంచరీ

4 ఈ పర్యటనలో కోహ్లి శతకాలు. వన్డే సిరీస్‌లో మూడు సెంచరీలు చేశాడు.

13 కెప్టెన్‌గా కోహ్లి శతకాలు.

35 వన్డేల్లో కోహ్లి శతకాల సంఖ్య. అత్యధిక శతకాలు సాధించిన సచిన్ (49)కు అతడికి అంతరం 14 సెంచరీలే. టెస్టుల్లో సాధించినవి కలిపితే విరాట్ సెంచరీలు 76. సచిన్ 100 సెంచరీలతో అగ్రస్థానంలో ఉన్నాడు.

లక్ష్యం 244.. కొట్టేశారు

టీ20ల్లో రికార్డు ఛేదన ● కివీస్‌పై ఆసీస్ విజయం



వార్నర్ (59)

244 ఆస్ట్రేలియా ఛేదించిన లక్ష్యం. టీ20ల్లో ఇదే అత్యధిక ఛేదన. 2015లో దక్షిణాఫ్రికాపై వెస్టిండీస్ 232 పరుగుల లక్ష్యాన్ని ఛేదించి నెలకొల్పిన రికార్డు బద్దలైంది.

ఆక్లాండ్: ఒక్క టీ20 మ్యాచ్.. 488 పరుగులు.. 32 సిక్సర్లు.. 33 ఫోర్లు.. ఒక శతకం.. నాలుగు అర్ధశతకాలు.. రెండు సెంచరీ భాగస్వామ్యాలు.. ముక్కోణపు సిరీస్‌లో భాగంగా శుక్రవారం ఆస్ట్రేలియా-న్యూజిలాండ్ టీ20 మ్యాచ్‌లో పరుగుల ప్రవాహం ఎలా సాగిందో చెప్పడానికి ఈ గణాంకాలు చాలు. న్యూజిలాండ్ 20 ఓవర్లలో ఏకంగా 243 పరుగులు చేసి ఔరా అనిపిస్తే.. ఆస్ట్రేలియా అంత స్కోరునూ ఛేదించే చరిత్ర సృష్టించింది. మొదట గప్తిల్ (105; 54 బంతుల్లో 6×4, 9×6), మన్రో (76; 33 బంతుల్లో 6×4, 6×6) చెలరేగిపోవడంతో కివీస్ 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 243 పరుగులు చేసింది. ఐతే భారీ లక్ష్యం ముందున్నా.. ఆరంభం నుంచే 12కు పైగా రన్‌రేట్‌తో పరుగులు చేయాల్సి ఉన్నా ఆసీస్ ఆశలు వదులుకోలేదు. ఓపెనర్లు వార్నర్ (59; 24 బంతుల్లో 4×4, 5×6), షార్ట్ (76; 44 బంతుల్లో 8×4, 3×6) కేవలం 8.3 ఓవర్లలోనే 121 పరుగులు జోడించి మెరుపు ఆరంభాన్నివ్వడంతో ఛేదన తేలికైపోయింది. ఆ తర్వాత మాక్స్‌వెల్ (31; 14 బంతుల్లో 3×4, 2×6), ఫించ్ (36 నాటౌట్; 14 బంతుల్లో 3×4, 3×6) కివీస్ బౌలర్లపై విరుచుకుపడటంతో ఆసీస్ 18.5 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది.

విష్ణు జోడీకి టైటిల్



చెన్నై: చెన్నై ఓపెన్ పురుషుల డబుల్స్ టైటిల్‌ను విష్ణువర్ధన్-బాలాజీ జోడీ కైవసం చేసుకుంది. హోరాహోరీ సాగిన ఫైనల్లో విష్ణు 7-6 (7-5), 5-7, 10-5తో పెట్రోవిచ్ (క్రొయేషియా)-సిమ్ లికెల్ (టర్కీ)పై విజయం సాధించింది. పురుషుల సింగిల్స్‌లో భారత యువ ఆటగాడు యుకి బాంబ్రి చెన్నై ఓపెన్ ఫైనల్లో ప్రవేశించాడు. శుక్రవారం జరిగిన పురుషుల సింగిల్స్ సెమీఫైనల్లో యుకి 7-5, 6-2తో డకీ లీ (కొరియా)ను వరుస సెట్లలో ఓడించాడు.

అఫ్గాన్ అదరహో

- నాలుగో వన్డేలో ఘనవిజయం
- జింబాబ్వేపై సిరీస్ కైవసం

షార్జా: జింబాబ్వేతో టీ20 సిరీస్‌ను క్లీన్ స్వీప్ చేసిన అఫ్గానిస్థాన్.. వన్డేల్లోనూ ఆధిపత్యాన్ని కొనసాగించింది. నాలుగో వన్డేలో 10 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించి ఐదు వన్డేల సిరీస్‌ను మరో మ్యాచ్ మిగిలుండగానే 3-1తో సొంతం చేసుకుంది. 16 ఏళ్ల యువ స్పిన్నర్ ముజీబ్ రెహ్మాన్ (5/50)తో పాటు మహ్మద్ నబి (2/18), రషీద్ ఖాన్ (2/28) కూడా విజృంభించడంతో మొదట జింబాబ్వే 38 ఓవర్లలో 134 పరుగులకే కుప్పకూలింది. ఇర్విన్ (54 నాటౌట్), టేలర్ (30) మినహా ఎవ్వరూ చెప్పుకోదగ్గ స్కోర్లు చేయలేదు. అనంతరం షెజాద్ (75 నాటౌట్; 74 బంతుల్లో 10×4, 3×6), ఇసానుల్లా (51 నాటౌట్; 53 బంతుల్లో 6×4, 2×6) చెలరేగడంతో జింబాబ్వే 21.1 ఓవర్లలోనే ఒక్క వికెట్టూ నష్టపోకుండా లక్ష్యాన్ని ఛేదించింది.

అమ్మాయిల మెరుపుల్

- రాణించిన మిథాలీ, మంధాన
- వరుసగా రెండో టీ20లోనూ భారత్ విజయం



మిథాలీ (76)

ఈస్ట్ లండన్: దక్షిణాఫ్రికా గడ్డపై భారత అమ్మాయిల జోరు కొనసాగుతోంది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' మిథాలీరాజ్ (76 నాటౌట్; 61 బంతుల్లో 8×4), స్మృతి మంధాన (57; 42 బంతుల్లో 4×4, 3×6) మెరుపులతో వరుసగా రెండో టీ20లోనూ 9 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించిన హర్మన్‌ప్రీత్ బృందం ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో 2-0 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. శుక్రవారం మొదట బ్యాటింగ్ దక్షిణాఫ్రికా 7 వికెట్లకు 142 పరుగులు చేసింది. లూస్ (33) టాప్ స్కోరర్. అనుజ పాటిల్ (2/37), పూనమ్ యాదవ్ (2/18) ప్రత్యర్థిని కట్టడి చేశారు. ఛేదనలో భారత్‌కు మిథాలీ, మంధాన మెరుపు ఆరంభాన్నిచ్చారు. ఈ జోడీ విజృంభించి ఆడడంతో భారత్ స్కోరు 13 ఓవర్లలోనే 100 పరుగులు దాటింది. ముఖ్యంగా మెరుపు షాట్లు ఆడిన మంధాన పన్నెండో ఓవర్లో వరుసగా రెండు సిక్స్‌లు బాదింది. మిథాలీ కూడా ధాటిగా ఆడి స్కోరుబోర్డు పరుగులెత్తించింది. ఈ జోడీ తొలి వికెట్‌కు 106 పరుగులు జత చేసి జట్టును విజయపథంలో నడిపించింది. 30 బంతుల్లో 33 పరుగుల చేయాల్సిన స్థితిలో.. హర్మన్‌ప్రీత్ (7 నాటౌట్)తో కలిసి మిథాలీ భారత్‌ను విజయతీరాలకు చేర్చింది. మిథాలీకి ఈ ఫార్మాట్‌లో ఇది వరుసగా నాలుగో అర్ధసెంచరీ కావడం విశేషం. ఆదివారం జొహానెస్‌బర్గ్‌లో మూడో టీ20 జరుగుతుంది.

అభివృద్ధి నిరోధకులుగా ప్రతిపక్షాలు

- రాష్ట్ర ఐటీ, పురపాలకశాఖ మంత్రి కేటీఆర్ ధ్వజం



బండరావిర్యాలలో రెండు పడకల ఇళ్ల శంకుస్థాపన కార్యక్రమంలో మంత్రి కేటీఆర్

తుర్కయాంజాల్, న్యూస్‌టుడే: రాష్ట్రంలోని ప్రతిపక్షాలు అభివృద్ధి నిరోధకులుగా మారారని రాష్ట్ర ఐటీ, పురపాలకశాఖ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు(కేటీఆర్) ధ్వజమెత్తారు. రంగారెడ్డి జిల్లాలో శుక్రవారం ఆయన సుడిగాలి పర్యటన చేశారు. ఆయా ప్రాంతాల్లో వివిధ అభివృద్ధి పనులను ప్రారంభించిన అనంతరం తుర్కయాంజాల్‌లో ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే ఎం.కిషన్‌రెడ్డి, అధ్యక్షతన జరిగిన సభలో భువనగిరి ఎంపీ బూరనర్సయ్యగౌడ్, రాజేంద్రనగర్, మహేశ్వరం ఎమ్మెల్యేలు ప్రకాష్‌గౌడ్, తీగల కృష్ణారెడ్డిలతో కలిసి మంత్రి మాట్లాడారు. సీఎం కేసీఆర్ నేతృత్వంలో రాష్ట్రం అభివృద్ధిపథంలో దూసుకెళ్తూ ఆదర్శంగా నిలుస్తోందన్నారు. కేంద్రం నుంచి ఎవరొచ్చినా రాష్ట్రంలో చేపడుతున్న సంక్షేమ పథకాలను కొనియాడుతుంటే.. ఇక్కడి కాంగ్రెస్ నేతలకు కనిపించకపోవడం బాధాకరమన్నారు. వచ్చే మేనెల నుంచి రైతులకు పెట్టుబడి కోసం ప్రభుత్వం ఎకరాకు రూ.4వేలు అందజేస్తుందన్నారు. దీనికోసం ఏడాదికి రూ.10వేల కోట్లు ఖర్చు చేస్తున్నామని చెప్పారు. 65 ఏళ్లు తెలంగాణకు నీళ్లు, నిధులు, నియామకాలు రాకుండా అడ్డుకున్న కాంగ్రెస్ నేతలు.. నేడు కేసీఆర్ ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారని దుయ్యబట్టారు. కరవుతో అల్లాడే ఇబ్రహీంపట్నం ప్రాంతానికి పాలమూరు-ఎత్తిపోతల ద్వారా నీరందించి సస్యశ్యామలం చేద్దామంటే నల్గొండకు చెందిన కాంగ్రెస్ నాయకులు కేసు వేసి అడ్డుపడుతున్నారన్నారు. కేంద్రం నుంచి నిధులు తీసుకొచ్చి రాష్ట్రాభివృద్ధికి సహకరించాలని భాజపా నాయకులకు మంత్రి సూచించారు. ఇబ్రహీంపట్నం సమీపంలోని కొంగరకలాన్‌కు దుబాయ్‌కు చెందిన ఓ నిర్మాణ సంస్థ రానున్నట్లు ప్రకటించారు. అనంతరం మంత్రి సమక్షంలో వివిధ పార్టీల ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తెరాస తీర్థం పుచ్చుకున్నారు. ఎంపీ బూర నర్సయ్యగౌడ్ మాట్లాడుతూ తెలంగాణ ఎగుమతుల్లో దేశంలోనే అయిదో స్థానంలో నిలిచిందన్నారు. ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి మాట్లాడుతూ ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో ఇప్పటివరకు రూ.857 కోట్ల అభివృద్ధి పనులు చేశామని చెప్పారు.

ఎర్రజొన్న రైతులకు గుర్తింపు కార్డులు

- ఎకరానికి 12 క్వింటాళ్లకు పైగా తెస్తే నిఘా
- మంత్రి హరీశ్‌రావు ఆదేశాలు



ఈనాడు, హైదరాబాద్: మద్దతు ధరకు ఎర్రజొన్నలు అమ్మే రైతులకు తప్పనిసరిగా గుర్తింపు కార్డులు జారీచేయాలని అధికారులకు మంత్రి హరీశ్‌రావు ఆదేశాలు జారీ చేశారు. ఈ పంట కొనుగోలుపై శుక్రవారం జలసౌధలో ఆయన ఉన్నతాధికారులతో సమీక్ష జరిపారు. వ్యవసాయ విస్తరణ అధికారి, మార్కెటింగ్, రెవెన్యూ అధికారితో కూడిన త్రిసభ్య బృందం ప్రతీ రైతును పరిశీలించి గుర్తింపు కార్డు జారీ చేయాలని సూచించారు. అసలైన రైతుల నుంచే పంటను కొనాలని, ఎకరానికి 12 క్వింటాళ్లకు మించి పంటను మార్కెట్‌కు తెచ్చే వారిపై విజిలెన్స్ నిఘా పెట్టాలన్నారు. కొన్న పంటకు డబ్బును రైతు ఖాతాలోనే వేయాలని, దుర్వినియోగం జరగకుండా చూడాలన్నారు. పంట కొనుగోలు, నిల్వ, ఎగుమతి, అమ్మకాలపై ముందుగా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వ్యవసాయ కమిషనర్, మార్కెటింగ్ సంచాలకుడు, నిజామాబాద్ జిల్లా కలెక్టర్, మార్క్‌ఫెడ్ అధికారులతో వెంటనే సమావేశం నిర్వహించాలని మంత్రి ఆదేశించారు. పక్కనున్న కర్ణాటకలో 3.50 లక్షల క్వింటాళ్లు, తెలంగాణలోని పలు శీతల గిడ్డంగుల్లో ఎర్రజొన్నలు పెద్దయెత్తున నిల్వలున్నాయని వాటిని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు తెచ్చి అమ్మకుండా అడ్డుకోవాలని ఆయన సూచించారు. శీతలగిడ్డంగుల్లో ఎక్కడెక్కడ ఎన్ని నిల్వలను వ్యాపారులు పెట్టారనే వివరాలు సేకరించాలని, రైతుల నుంచి తక్కువ ధరకు కొని ఇలా నిల్వ పెట్టారనే సమాచారముందని ఆయన తెలిపారు. ఈ పంట క్రయ విక్రయాల్లో అక్రమాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని హరీశ్‌రావు స్పష్టం చేశారు. మార్కెటింగ్ శాఖలో పరిశోధనా విభాగం ఏర్పాటు చేయాలని ఇతర దేశాల్లో మార్కెటింగ్‌రంగంలో వస్తున్న మార్పులపై అధ్యయనం చేయాలని అధికారులకు సూచించారు. సాగునీటి సరఫరా బాగా పెరగినందున వచ్చే ఏడాది నుంచి పంటలసాగు, దిగుబడులు పెరుగుతాయని, వాటికి ధరలు, కొనుగోలు, నిల్వ వంటి అంశాలపై ఎప్పటికప్పుడు ఆధునాతన పరిజ్ఞానంతో చర్యలు తీసుకోవాలన్నారు. పంటల ధరలపై ముందస్తు సూచనలు ఇచ్చేలా పరిశోధనా విభాగం పనిచేయాలన్నారు.

19 నుంచి కొనుగోలు: ఈ నెల 19 నుంచి ఎర్రజొన్నలను క్వింటాకు రూ.2300 చొప్పున చెల్లించి కొనాలని ఆదేశిస్తూ మార్కెటింగ్ శాఖ శుక్రవారం ఉత్తర్వులు జారీచేసింది. రాష్ట్రంలో 51234 ఎకరాల్లో 87099 టన్నుల దిగుబడి వస్తుందని అంచనా. ఈ రైతులను గుర్తించి కొనుగోలు చేపట్టాలని నిజామాబాద్, నిర్మల్, జగిత్యాల కలెక్టర్లను ఆదేశించింది. పోలీసుల సాయంలో సరిహద్దుల్లో తనిఖీ చేయాలని సూచించింది.



ఒప్పంద పత్రాలతో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమక్షంలో కాలేజ్ నెట్‌వర్క్ సీఈవో గ్రాహం ఈవెన్స్, ఐఎల్ అండ్ ఎఫ్ఎస్ ప్రతినిధి రవి, న్యాక్ డైరెక్టర్ జనరల్ కె.బిక్షపతి

లండన్ కళాశాలతో న్యాక్ ఒప్పందం

ఈనాడు, హైదరాబాద్: నిర్మాణ రంగంలో పని చేసే అన్ని స్థాయుల కార్మికులు, సిబ్బందికి అంతర్జాతీయ ప్రమాణాల మేరకు శిక్షణ ఇచ్చేందుకు తెలంగాణలోని జాతీయ నిర్మాణ అకాడమి (న్యాక్) సన్నాహాలు చేస్తోంది. ఈ రంగంలో వస్తున్న మార్పులు, సాంకేతికతను ఇక్కడివారికి అందించేందుకు లండన్‌లోని నేషనల్ ఓపెన్ కాలేజ్ నెట్‌వర్క్‌తో ఒప్పందం చేసుకుంది. ఈ రెండు సంస్థల మధ్య శుక్రవారం రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమక్షంలో ఓపెన్ కాలేజ్ నెట్‌వర్క్ సీఈవో గ్రాహం ఈవెన్స్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లీజింగ్ అండ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ (ఐఎల్ అండ్ ఎఫ్ఎస్) ప్రతినిధి రవి, న్యాక్ డైరెక్టర్ జనరల్ కె.బిక్షపతి ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు.

భూసేకరణ వేగవంతం చేయాలి

కేంద్రం ఇటీవల మంజూరు చేసిన జాతీయ రహదారుల పనులకు సంబంధించిన భూసేకరణ, అటవీ అనుమతులను వేగవంతం చేయాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కలెక్టర్లను కోరారు. అనుమతులను త్వరితంగా పొందేందుకు అనుసరించాల్సిన విధానాలపై ఆయన కలెక్టర్లు, వివిధ శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం జాతీయ రహదారుల కోసం ఇటీవల రూ. 8,000 కోట్లు మంజూరు చేసింది.

ఆహార కల్తీకి పాల్పడితే పీడీ చట్టం: లక్ష్మారెడ్డి

- హోటళ్లు, కిరాణా దుకాణాల్లో తనిఖీలు

నారాయణగూడ, న్యూస్‌టుడే: ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడే అధికారం ఎవరికీ లేదని, కల్తీలేని ఆహారం, పప్పు దినుసులు అందించాల్సిన బాధ్యత హోటల్ యాజమాన్యాలు, వ్యాపారులపై ఉందని వైద్యారోగ్యశాఖ మంత్రి లక్ష్మారెడ్డి స్పష్టం చేశారు. కల్తీలకు పాల్పడే వారిని ఉపేక్షించబోమని, అలాంటి వాళ్లపై పీడీ చట్టం ప్రయోగించడంతోపాటు..వ్యాపార అనుమతులు రద్దుచేస్తామని హెచ్చరించారు. శుక్రవారం నారాయణగూడలోని పలు హోటళ్లు, కిరాణా దుకాణాలు, బేకరీలలో ఆహార కల్తీ నియంత్రణ అధికారులతో కలిసి మంత్రి తనిఖీలు నిర్వహించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ద్వారా సంచార అహార నాణ్యత తనిఖీ వాహనం అందుబాటులోకి తెచ్చామని, మరో నాలుగు అవసరమని కోరామన్నారు. ప్రతి వ్యాపారి, హోటల్ యజమాని అనుమతి(లైసెన్సు) తీసుకోవాల్సిందేనని సూచించారు. ఆహార పదార్థాలు ఆకర్షణీయంగా ఉండాలనే ఉద్దేశంతో హోటళ్ల యాజమాన్యాలు వాడే రసాయనాలు, రంగులు..క్యాన్సర్, మూత్రపిండాలు, కాలేయ వ్యాధులకు కారణమవుతోందన్నారు. అలాంటి వాటికి స్వస్తి పలకాలని ఆదేశించారు. వంటల్లో వాడే నూనె సురక్షితమైనదై ఉండాలన్నారు. తొలి దశలో తనిఖీల ద్వారా కల్తీలపై అవగాహన కల్పిస్తామని, తీరుమారకపోతే కఠినంగా వ్యవహరిస్తామన్నారు. ఆహార నియంత్రణ విభాగంలో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి ముఖ్యమంత్రి కేసీఆర్ పచ్చజెండా ఊపారన్నారు. హోటళ్లకు కూడా నాణ్యత ఆధారంగా గ్రేడింగ్ ఇవ్వాలనే ఆలోచన ఉందన్నారు.

'రెండు పడకల' ఇళ్లకు తక్కువ ధరకే ఇనుము

- టన్ను రూ.43,660గా ఖరారు
- ఫలించిన మంత్రుల చర్చలు

ఈనాడు, హైదరాబాద్: రెండు పడక గదుల ఇళ్ల పథకం కింద నిర్మించే ఇళ్లకు తక్కువ ధరకు ఇనుము విక్రయించేందుకు స్టీలు కంపెనీల యజమానులు అంగీకరించారని మంత్రులు కేటీఆర్, ఇంద్రకరణ్‌రెడ్డిలు వెల్లడించారు. శుక్రవారం స్టీలు కంపెనీల యజమానులతో మంత్రులు సమావేశమయ్యారు. దేశంలో ఎక్కడా లేని విధంగా నిరుపేదలకు రెండు పడక గదుల ఇళ్లను ప్రభుత్వం నిర్మిస్తోందని, ఇటువంటి కార్యక్రమానికి లాభాపేక్ష లేకుండా ఇనుము ఇవ్వాలని కోరారు. గ్రామీణ ప్రాంతాల్లో లక్ష ఇళ్లకు 1.45 లక్షల టన్నులు, పట్టణాల్లో 60 వేల ఇళ్లకు 1.04 లక్షల టన్నులు, గ్రేటర్ హైదరాబాద్‌లో లక్ష ఇళ్లకు 2.78 లక్షల టన్నులు అవసరమని వివరించారు. చర్చల అనంతరం టన్ను రూ.43,600కు ఇవ్వడానికి యాజమాన్యాలు అంగీకరించాయి. పథకం ప్రారంభించినప్పుడు టన్ను ఇనుము ధర రూ.32,500 ఉండగా. . ప్రస్తుతం జీఎస్టీతో కలిపి రూ.53,100 చేరిందని, రూ.43,660 చొప్పున టన్ను ఇనుము అందించేందుకు యాజమాన్యాలు అంగీకరించడం వల్ల గృహనిర్మాణ శాఖకు రూ.264.60 కోట్ల వరకూ ఆదా అవుతుందని సమావేశం అనంతరం మంత్రులు వివరించారు. యాజమాన్యాలతో పలు దఫాలుగా చర్చించి తక్కువ ధర ఖరారు చేయడంలో కృషి చేసిన గృహనిర్మాణశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి చిత్రా రామచంద్రన్‌ను మంత్రులు అభినందించారు. సమావేశంలో ఆలిండియా స్టీల్ అసోసియేషన్ ఛైర్మన్ సురేష్‌కుమార్ సింఘాల్ తదితరులు పాల్గొన్నారు.

Editor: Ramoji Rao, Printed and Published by him on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Private Limited, and printed at Eenadu Press, Alugunoor, Karimnagar - 505 527, Telangana. Cell: 99590 21802, 99590 21803 RNI No. 52793/92, Regd. No. G/RN/KAR/48/2018-20 Eenadu, Karimnagar. Air surcharge extra. Mumbai, Kolkata, Goa. Re.1-00, Portblair Rs.10.00

విజేత

మీ గురించి మూడు ముక్కల్లో..
నిరాడంబరత్వం, నిజాయతీ, క్రమశిక్షణ





నాన్న కలను నెరవేర్చాను

దక్షిణాఫ్రికాలో విరాట్ కోహ్లి విన్యాసాలే పతాక శీర్షికలవుతున్నాయి. కానీ అక్కడే మరో క్రికెటర్ బ్యాటుతో పరుగుల వరద పారిస్తోంది. స్మృతి మంధాన మామూలుగా చెలరేగలేదు. ప్రపంచకప్‌లో సూపర్ ప్రదర్శనతో అందరినీ ఆకట్టుకున్న ఈ మహారాష్ట్ర అమ్మాయి.. దక్షిణాఫ్రికాపై ఓ సూపర్ శతకం, ఓ భారీ ఇన్నింగ్స్‌తో భారత్ మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్ గెలవడంలో కీలక పాత్ర పోషించింది. మహిళల క్రికెట్లో వేగంగా ఎదుగుతున్న మంధానతో కాసేపు సరదా సంభాషణ.

క్రికెట్‌తో మీ పరిచయం..

అన్న, నాన్న ఆడడం... చూడడంతో క్రికెట్‌తో నా అనుబంధం మొదలైంది. నాలుగైదేళ్ల వయసులో.. క్రికెట్ సాధనకు వెళ్తున్న మా అన్నతో నేను కూడా సరదాగా వెళ్లడం మొదలెట్టా. క్రమంగా నాలో కూడా ఆసక్తి మొదలైంది. నేర్చుకోవడం ప్రారంభించా. బ్యాటింగ్ అంటే ఇష్టం పెరిగింది. ఆసక్తికర విషయమేంటంటే మా అన్న కూడా ఎడమచేతి వాటం బ్యాట్స్‌మనే. అదే నాకు అలవడింది. క్రికెట్లోనే నాది ఎడమచేతి వాటం. మూమూలుగా నాది కుడిచేతి వాటమే. మేమిద్దరం భారత జట్టుకు ఆడాలన్నది మా నాన్న కల. మా అన్న క్రికెట్లో కొనసాగలేదు. నాన్న కలను నెరవేర్చినందుకు నాకు సంతోషంగా ఉంది.

క్రికెట్ అంటే మీకు..

సర్వస్వం. నా జీవితంలో గత 10-15 ఏళ్లలో నేను సాధించిందంతా కేవలం క్రికెట్లోనే. నాకు ఇతర వ్యక్తిగత జీవితమేమీ లేదు. నాకు అంతా క్రికెట్టే.

మైదానంలో మీ చిరస్మరణీయ సందర్భం..

ప్రపంచకప్ ఫైనల్ కోసం మైదానంలో అడుగుపెట్టిన క్షణం. కిక్కిరిసిపోయిన స్టేడియంలో ఆడడం మాకు అదే మొదటిసారి.

ఇష్టమైన ఆహారం..

అన్నీ తింటా. నియమాలేమీ పెట్టుకోను. కానీ భేల్‌పురి నా ఫేవరెట్.

ఖాళీ దొరికితే..

సినిమాలంటే ఇష్టం. ఏ మాత్రం సమయం దొరికినా సినిమా చూస్తా. అర్జిత్ సింగ్ పాటలు వింటా.

మైదానంలో మీరు ఆదర్శంగా భావించే ముగ్గురు..

మా అన్న, మాథ్యూ హేడెన్, సచిన్ తెందుల్కర్

ప్రపంచకప్‌లో మీ ఫేవరెట్ మ్యాచ్..

ఆస్ట్రేలియాతో మేము ఆడిన సెమీఫైనల్. హర్మన్‌ప్రీత్ కౌర్ ఇన్నింగ్స్ నా దృష్టిలో ప్రపంచకప్‌కే హైలైట్

మంధాన గురించి ఇంకా..

- సొంతూరు మహారాష్ట్రలోని సాంగ్లి
- తండ్రి శ్రీనివాస్, అన్న శ్రవణ్..ఇద్దరూ క్రికెటర్లే. శ్రీనివాస్ జిల్లా స్థాయిలో, శ్రవణ్ అండర్-19లో స్థాయిలో ఆడారు
- 12 ఏళ్ల వయసులోనే మహారాష్ట్ర అండర్-19 జట్టుకు ఎంపికైంది
- వెస్ట్‌జోన్ అండర్-19 వన్డే టోర్నీ (2013)లో డబుల్ సెంచరీ (150 బంతుల్లో 224) చేయడం ద్వారా తొలిసారి అందరి దృష్టిని ఆకర్షించింది. అప్పటికి ఆమె వయసు 17 సంవత్సరాలే. రాహుల్ ద్రవిడ్ ఇచ్చిన బ్యాటుతో ఆమె ఈ ద్విశతకం చేయడం విశేషం. ఆ బ్యాటును షోకేస్‌లో భద్రంగా దాచుకుంది.
- 2013లో వన్డేల్లో, 2014లో టెస్టుల్లో అరంగేట్రం చేసింది
- మహిళల బిగ్‌బాష్ లీగ్‌లో బ్రిస్బేన్ హీట్స్‌కు ప్రాతినిధ్యం వహించింది

నయా క్రీడ

మొగుల్స్... గుండె గుబుల్స్




మంచులో స్కేటింగ్ చేసేటప్పుడు నేరుగా దూసుకెళ్లడమే సులభం కాదు. అలాంటిది హర్డిల్స్‌ను దాటుకుంటూ గాల్లోకి అంతెత్తున ఎగురుతూ.. పల్టీలు కొడుతూ.. అటు ఇటూ వంకర టింకర్లు పోతూ స్కేటింగ్ చేయాలంటే!! వినడానికే కష్టంగా ఉంది కదా! అయితే తమకిదేం కొత్త కాదు అన్నట్లు అథ్లెట్లు మంచులో ఈ ఆటను ఆస్వాదిస్తున్నారు. వింటర్ ఒలింపిక్స్‌లో అందరి ఆకర్షిస్తున్న ఆ క్రీడే మొగుల్స్. కాళ్లకు స్కేటింగ్ చక్రాలు.. చేతిలో రెండు కర్రలు.. ఒంటి నిండా రక్షణ కవచాలు... ఏదో సాహస యాత్రకు వెళ్తున్నట్లే ఉంటుంది మొగుల్స్ ఆడుతుంటే. ఎత్తైన ప్రాంతం నుంచి కిందకు దూసుకెళ్లడం.. మధ్యలో ఉండే హర్డిల్స్ మీద నుంచి దూకుతూ గాల్లో పల్టీలు కొట్టడం... అంతే వేగంగా ముందుకెళుతూ అటు ఇటు వంకరగా స్కేటింగ్ చేయడం ఇవన్నీ ఆ ఆటలో భాగం. వేగం, అథ్లెట్ తిరిగే వంపులను బట్టి మార్కులు ఇస్తారు. వింటర్ ఒలింపిక్స్‌లో ఈ ఆటను క్లిష్టమైందిగా చెబుతారు. అథ్లెట్లు గాల్లో తిరిగే టర్నింగ్స్, హర్డిల్ జంపింగ్‌ల మీదే ఎక్కువ మార్కులు స్కోరు చేయాల్సి ఉంటుంది. ఈ ఆట ఆహ్లాదకరంగా ఉంటుందో అంతే ప్రమాదకరం కూడా.

రీప్లే

పిసినారి బాబోయ్!



ఓ బౌలర్ వరుసగా రెండు మూడు ఓవర్లు మెయిడెన్లు వేస్తేనే ఆశ్చర్యంగా చూస్తాం. అలాంటిది ఓ బౌలర్ ఓ టెస్టు మ్యాచ్‌లో వరుసగా 21 మెయిడెన్లు వేశాడంటే నమ్మడం కష్టం. కానీ ఇది నిజం. ఇప్పటికీ నిలిచి ఉన్న ఆ రికార్డును సృష్టించిన బౌలర్ భారతీయుడే. రమేశ్‌చంద్ర గంగారాం బాపు నాద్‌కర్ణి అంటే ఇప్పటివాళ్లకు తెలియకపోవచ్చు. కానీ తన ఎడమచేతి వాటం స్పిన్‌తో 1960ల్లో క్రికెట్ అభిమానులను ఉర్రూతలూగించాడు. బాపు నాద్‌కర్ణిగా సుపరిచితుడైన అతడు.. 1964 జనవరిలో పర్యాటక జట్టు ఇంగ్లాండ్‌తో సిరీస్ తొలి మ్యాచ్‌లో ఈ మెయిడెన్ల రికార్డు సృష్టించాడు. నాద్‌కర్ణి 32-27-5-0తో తొలి ఇన్నింగ్స్‌లో బౌలింగ్‌ను ముగించాడు. ఎకానమీ రేటు 0.15 మాత్రమే. నాద్‌కర్ణి రెండో ఇన్నింగ్స్‌లో 1.0 ఎకానమీ రేటుతో రెండు వికెట్లు పడగొట్టాడు. ఆ మ్యాచ్ డ్రా ముగిసింది.



గాలిని కూడా చీల్చుకుని వెళ్లే వేగం అతడిది. డ్రైవర్ సీటులో అతనుంటే కారుకే కొత్త ఉత్సాహం వస్తుంది. హద్దుల్లేని వేగంతో అది దూసుకెళ్లిపోతుంది. రేసు ఏదైనా.. ట్రాక్ ఎలా ఉన్నా.. ప్రత్యర్థులెవరైనా.. అతడి వేగం అతడిదే! చాలా ఏళ్ల పాటు ఆ వేగాన్నందుకోవడం మిగతా రేసర్లకు సాధ్యపడలేదు! ఎన్ని విజయాలు.. ఎన్ని ఘనతలు.. ఎన్ని రికార్డులు..? రెండు దశాబ్దాలకు పైగా ఉజ్వలంగా సాగిన కెరీర్లో ఎన్నెన్ని మెరుపులు!

కానీ..

అప్పుడు వేగానికి చిరునామాగా ఉన్న అతడు.. ఇప్పుడు నిశ్చలంగా మారిపోయాడు. గేరు మారుస్తూ.. ఎక్సలేటర్ తొక్కుతూ.. ఫార్ములావన్ కారును అలవోకగా నియంత్రిస్తూ.. అనితర సాధ్యమైన వేగంతో అద్భుత విజయాలు సాధించిన అతడు.. ఇప్పుడు లేచి నిలబడనూ లేడు. తన చక్రాల కుర్చీని కదల్చనూ లేడు. జీవం ఉందన్న మాటే కానీ.. ఇప్పుడు అతడీ లోకంలోనే లేడు. నాలుగేళ్లయింది అతను జీవచ్ఛవంగా మారి. అప్పట్నుంచి అతడిని మళ్లీ మామూలు మనిషిగా చూసేందుకు నిరీక్షణ కొనసాగుతూనే ఉంది.

ఇదీ మైకేల్ షుమాకర్ విషాద గాథ!

మా ప్రపంచంలోకి మళ్లీ రావా

1992 ఆగస్టు 30..

అది బెల్జియం గ్రాండ్ ప్రి ఫార్ములావన్ రేసు.. అందరి కళ్లూ గ్రేట్ బ్రిటన్ డ్రైవర్ నిగెల్ మాన్సెల్ మీదే ఉన్నాయి. అంతకుముందు జరిగిన నాలుగు ఎఫ్-1 రేసుల్లో మూడుసార్లు అతనే విజేత. ఈసారి కూడా రేసు అతడిదే అన్నది అంచనా. కానీ రేసు ముగిసేసరికి అందరిలోనూ ఆశ్చర్యం! 23 ఏళ్ల జర్మనీ యువ డ్రైవర్ పోడియంపై నిగెల్‌ను వెనక్కి నెట్టి టైటిల్ ఎగరేసుకుపోయాడు. ఆ ఏడాది ఎఫ్-1 ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో అతడిది మూడో స్థానం. రెండేళ్లు తిరిగేసరికి అతనే ఛాంపియన్. తర్వాతి ఏడాదీ ఛాంపియన్‌షిప్ అతడిదే. 2000-2005 మధ్య వరుసగా ఐదేళ్ల పాటు అతనే ప్రపంచ ఛాంపియన్. ఫార్ములావన్ చరిత్రలోనే ఇలా వరుసగా ఐదేళ్లు ప్రపంచ ఛాంపియన్‌గా నిలిచిన డ్రైవరే లేడు. కెరీర్లో అత్యధిక ఎఫ్-1 రేసు విజయాలు అతడివే. ఒకే సీజన్లో అత్యధిక విజయాలతడివే.. అత్యధికసార్లు పోడియంపై నిలిచింది అతనే. వరుసగా అత్యధిక రేసులు గెలిచిన రేసర్ అతడే. ఇలా గణాంకాల్లో కొలిస్తే అతడికి సాటి వచ్చే రేసర్ ఎఫ్-1 చరిత్రలోనే కనిపించడు. ఇక అతడి డ్రైవింగ్ నైపుణ్యం.. వేగం.. అసాధారణ, ప్రమాదకర పరిస్థితుల్లోనూ అద్భుతంగా కారు నడిపే సామర్థ్యం గురించి ఎఫ్-1 నిపుణులు కథలు కథలుగా చెబుతారు. వందల కోట్ల ప్రైజ్‌మనీ, వేల కోట్ల అదనపు ఆదాయం ఆర్జించి.. అంతకంటే విలువైన అభిమానాన్ని సంపాదించి.. ఫార్ములావన్‌లోనే కాక ప్రపంచ క్రీడా చరిత్రలోనే దిగ్గజాల్లో ఒకడిగా గుర్తింపు తెచ్చుకుని.. ఐదేళ్ల కిందట తనకెంతో ఇష్టమైన ఎఫ్-1 రేసింగ్‌కు టాటా చెప్పాడు మైకేల్.

2013 డిసెంబరు 13..

షుమాకర్‌కు ఎఫ్-1 రేసింగ్ కెరీర్ అయితే.. మంచు పర్వతాల్లో స్కీయింగ్ చేయడం అభిరుచి. స్నేహితులతో, కుటుంబ సభ్యులతో కలిసి అప్పటికే ఎన్నోసార్లు ఈ సరదా తీర్చుకున్నాడు. ఎఫ్-1కు టాటా చెప్పేయడంతో 2013 నుంచి కుటుంబ సభ్యులతో మరింత ఎక్కువ సమయం గడిపే అవకాశం వచ్చిందతడికి. ఆ రోజు తన కొడుకు మిక్ షుమాకర్, మరికొందరు మిత్రులతో కలిసి ఫ్రాన్స్‌లోని ఆల్ప్స్ పర్వతాలకు వెళ్లాడు మైకేల్. ఎప్పట్లాగే ఉత్సాహంగా స్కీయింగ్ చేస్తున్న అతడు.. ఒకచోట అదుపు తప్పాడు. ఎగిరి పడ్డాడు. తల వెళ్లి ఒక బండ రాయికి తగిలింది. హెల్మెట్ ఉన్నప్పటికీ ఆ వేగానికి తల పగిలింది. ఇంకా ఒంట్లో ఎన్నో తీవ్ర గాయాలు. షుమాకర్ స్పృహ కోల్పోయాడు. కాసేపటికే హెలికాప్టర్ వచ్చింది. ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమమని తేలింది. మైకేల్ ప్రాణం కాపాడటానికి వైద్యులు చేయాల్సిన ప్రయత్నమంతా చేశారు. రెండు పెద్ద శస్త్రచికిత్సలు చేశారు. కృత్రిమ కోమాలో ఉంచి అతడికి చికిత్స అందించారు. షుమాకర్ పరిస్థితేంటో తెలియక ప్రపంచవ్యాప్తంగా కోట్లాదిమంది అభిమానులు తల్లడిల్లిపోయారు. ఐతే అతడికి ప్రాణాపాయం తప్పిందని, కానీ షుమాకర్ మామూలు స్థితికి ఎప్పుడొస్తాడో తెలియదని వైద్యులు ప్రకటించారు. నాలుగు నెలల తర్వాత కోమా నుంచి బయటికి వచ్చాడు మైకేల్. ఇంకా కొన్ని నెలల పాటు ఆసుపత్రిలోనే చికిత్స కొనసాగింది.



ఇప్పుడంతా ఆమే..

షుమాకర్ ప్రమాదానికి గురైన కొంత కాలానికి భార్య కారినా అతడి వ్యాపార సామ్రాజ్యాన్ని తన చేతుల్లోకి తీసుకుంది. షుమాకర్ ఆస్తి విలువ దాదాపు రూ.5800 కోట్లని అంచనా. భర్తకు వైద్యంతో పాటు ఇంటి, ఆర్థిక వ్యవహారాలన్నీ ఆమే చూస్తోంది. మైకేల్ కొడుకు నిక్ షుమాకర్ తండ్రి బాటలో రేసింగ్‌లోకే అడుగుపెట్టాడు. అతను ఎఫ్-1 రేసుల్లో పోటీపడుతున్నాడు. షుమాకర్ కూతురు జినా మారియా.. తల్లి వారసత్వాన్ని కొనసాగిస్తూ గుర్రపు పందేల్లోకి దిగింది.

2014 సెప్టెంబరు 9..

దాదాపు పది నెలలు ఆసుపత్రిలోనే ఉన్న షుమాకర్ ఇంటికి చేరుకున్నాడు. కానీ అతనేమీ మామూలు మనిషి కాలేదు. ఇక ఆసుపత్రిలో ఉన్నా ప్రయోజనం లేదని తేలింది. ఇంటిదగ్గరే చికిత్స తీసుకుంటూ, వివిధ రకాల థెరపీలు చేయించుకోమని వైద్యులు సలహా ఇచ్చారు. అప్పట్నుంచి షుమాకర్‌ను కంటికి రెప్పలా కాపాడుకుంటోంది కుటుంబం. అతడికి చికిత్స కొనసాగుతూనే ఉంది. వైద్యులు ఎప్పటికప్పుడు అతడిని పర్యవేక్షిస్తూనే ఉన్నారు. కానీ షుమాకర్ పరిస్థితి మెరుగైనట్లు వార్తలేవీ బయటికి రాలేదు. ప్రమాదం జరిగి నాలుగేళ్లు దాటింది. అతడి పరిస్థితేంటో అధికారికంగా బయటి ప్రపంచానికి తెలియదు. ట్రాక్ మీద మెరుపు వేగంతో దూసుకెళ్తూ.. రేసులో గెలిచి జయజయధ్వానాలు చేస్తూ.. ఎప్పుడూ చిరునవ్వుతూ కనిపించే ఛాంపియన్ ఇప్పుడు జీవచ్ఛవంలా మారి చక్రాల కుర్చీకి పరిమితమై ఎలా మారిపోయాడో.. ఇప్పుడతను ఏ రూపంలో ఉన్నాడో తెలియట్లేదు అభిమానులకు!



2018 ఫిబ్రవరి 17..

షుమాకర్ పక్షవాతానికి గురై, లేచి నిలబడే పరిస్థితిలో లేడు.. అతను చక్రాల కుర్చీకే పరిమితమయ్యాడు.. ఇదీ ఈ రోజుకున్న సమాచారం. ఏమీ మాట్లాడలేని మైకేల్.. మనుషుల్నీ గుర్తించట్లేదట. 24 గంటలూ అతడిని ఓ మనిషి చూసుకుంటూ ఉండాలట. మైకేల్ కుటుంబం అతడి గురించి ఏ సమాచారాన్నీ పంచుకోవడానికి ఇష్టపడట్లేదు. షుమాకర్ ఎప్పటికీ ఒకప్పటి స్థితికి రాలేడంటున్నారట వైద్యులు! అందుకే షుమాకర్ ఇష్టంగా కొనుక్కున్న జెట్ విమానాన్ని, విహారం కోసం కొనుక్కున్న ఓ విలాసవంతమైన ఇంటిని రెండేళ్ల కిందటే అమ్మేసింది అతడి భార్య. ఫార్ములావన్‌లో ఎన్నో ప్రమాదాలు జరుగుతుంటాయి. రేసర్లు తీవ్ర గాయాల పాలవుతుంటారు. ప్రాణాలు కూడా పోతుంటాయి. అందులో రెండు దశాబ్దాలకు పైగా పెద్ద ప్రమాదాలేవీ లేకుండా సాగిపోయిన షుమాకర్.. తాను సరదా కోసం చేసే స్కీయింగ్‌లో అంత పెద్ద ప్రమాదానికి గురై ఈ స్థితికి చేరుకోవడమే వైచిత్రి! తలకు, మెదడుకు తీవ్ర గాయాలై అచేతనంగా మారిన రోగులు నాలుగేళ్ల తర్వాత కోలుకునే అవకాశాలు 30-40 శాతం ఉంటాయంటూ ఇటీవలే వచ్చిన ఒక తాజా అధ్యయనం మైకేల్ అభిమానుల్లో ఆశ రేకెత్తిస్తోంది. షుమాకర్‌ను మెరుగైన చికిత్స కోసం అమెరికాకు తరలిస్తారని, అక్కడి వైద్యులు అత్యుత్తమ చికిత్స అందించగలరని.. త్వరలోనే షుమాకర్ కుటుంబ సభ్యులు ఈ విషయంలో నిర్ణయం తీసుకుంటారని కొన్ని రోజులుగా ప్రచారం జరుగుతోంది. వైద్య చరిత్రలో అప్పుడప్పుడూ కొన్ని అద్భుతాలు జరుగుతుంటాయి. మరి అలాంటి అద్భుతమే జరిగి మైకేల్ ఎప్పటికైనా మళ్లీ మన ప్రపంచంలోకి వస్తాడేమో చూద్దాం!

- తిమ్మాపురం చంద్రశేఖర్ రెడ్డి

ఈనాడు సినిమా


వరుణ్‌తేజ్, చిరంజీవి

మా కుటుంబం గర్వపడుతోంది!

"కొత్త ఆలోచనలతో కూడిన దర్శకులు ప్రవేశిస్తుండడంతో తెలుగు చిత్ర పరిశ్రమ కొత్త పుంతలు తొక్కుతోంది. మన దగ్గర మంచి సినిమాలు రూపొందుతున్నాయని పొరుగు పరిశ్రమలు సైతం మాట్లాడుకొంటున్నాయంటే కారణం అదే" అన్నారు ప్రముఖ కథానాయకుడు చిరంజీవి. ఆయన శుక్రవారం 'తొలి ప్రేమ' చిత్రబృందాన్ని తన నివాసానికి ఆహ్వానించి అభినందించారు. వరుణ్‌తేజ్, రాశీ ఖన్నా జంటగా నటించిన చిత్రమిది. వెంకీ అట్లూరి దర్శకత్వం వహించారు. బి.వి.ఎస్.ఎన్.ప్రసాద్ నిర్మించారు. చిత్రబృందాన్ని శాలువ, పుష్ప గుచ్ఛంతో సన్మానించిన అనంతరం చిరంజీవి మాట్లాడుతూ "ఊళ్లో లేకపోవడంతో సినిమాని ఆలస్యంగా చూశా. నా సోదరుడు కల్యాణ్ నటించిన 'తొలి ప్రేమ' పేరుతోనే వస్తున్న చిత్రం కావడంతో ఎలా ఉంటుందో అని ఆత్రుతగా ఉండేది. చూసిన తర్వాత చాలా తృప్తి కలిగింది. వర్తమాన ప్రేమకథ ఇది. కథ కంటే కూడా సందర్భానుసారం ఆసక్తికరమైన సన్నివేశాలతో ఆద్యంతం వినోదం పంచుతుంది. ఇలాంటి సినిమాని తీయడం దర్శకుడికి ఓ పెద్ద సవాల్. చాలా చక్కగా తెరపై చూపించాడు వెంకీ అట్లూరి. ఈ సినిమా ఇంత తాజాగా ఉందంటే, దర్శకుడి ఆలోచనలే కారణం. ఇలాంటి దర్శకులు పరిశ్రమకి కావాలి. వరుణ్ తేజ్, రాశీ ఖన్నా కొత్త నటులు కాదు. వాళ్లు తెరపై కొత్తగా కనిపించారు. ఈ సినిమాతో వరుణ్ చాలా పరిణితి చెందాడు. సున్నితమైన భావోద్వేగాల్ని చక్కగా పలికించాడు. మనవాడిని తెరపై చూస్తున్నట్టు కాకుండా, ఒక యువకుడిని... అతని ప్రేమ కథనే చూస్తున్న అనుభూతి కలిగింది. మా కుటుంబమంతా గర్వపడేలా మంచి అభినయం ప్రదర్శించాడు వరుణ్. తన ఎత్తుకి డ్యాన్స్‌లు ఎంత వరకు కుదురుతాయో అని లోలోపల అనుమానంగానే ఉంటుంది. ఈ సినిమాకి వచ్చేసరికి తన హావభావాలకి తగ్గట్టుగా డ్యాన్సులు, గ్రేస్ చక్కగా కుదిరాయి. నాగబాబు గర్వపడే సమయమిది. నటుడిగా తనకి ఏదైనా లోటు ఉందంటే, దాన్ని వరుణ్‌తేజ్ ఈ విజయంతో తీర్చాడు. వాళ్ల నాన్నకి మంచి బహుమతి ఈ చిత్రం. తమన్ సంగీతం చాలా బాగా చేశాడు. ప్రతి పాట హుషారుగా ఉంది. జార్జ్ కెమెరా పనితనం చాలా బాగుంది. మా కుటుంబానికి ఇష్టమైన నిర్మాత బి.వి.ఎస్.ఎన్. ప్రసాద్. అనుకొన్న సమయానికే పూర్తయిన ఈ సినిమా నిర్మాణం పరంగా కూడా ట్రెండ్ సెట్టరే" అన్నారు. వరుణ్‌తేజ్ మాట్లాడుతూ "కథానాయకుడు కావాలనే ఆలోచన వచ్చిందంటే దానికి కారణం చిరంజీవి. ఇప్పుడు డాడీ మా సినిమా గురించి చెబుతుంటే చాలా ఆనందంగా ఉంది. చూసిన వాళ్లంతా సినిమా చాలా బాగుందని చెబుతుంటే ఎంతో సంతోషం కలుగుతోంది" అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ "నా చిన్నప్పుడు 'స్టూవర్టుపురం పోలీస్ స్టేషన్' చిత్రీకరణ సమయంలో చిరంజీవిని చూశా. ఇన్నాళ్లకి ఇలా ఆయన పక్కన కూర్చోవడం మాటల్లో చెప్పలేనంత ఆనందం కలుగుతోంది. ఆయనకి మా సినిమా నచ్చడం, మమ్మల్ని పిలిచి అభినందించడం ఎప్పటికీ మరిచిపోలేను" అన్నారు. బి.వి.ఎస్.ఎన్.ప్రసాద్ మాట్లాడుతూ "33 యేళ్ల కిందట మద్రాస్‌లో చిరంజీవి ఇంటికి వెళ్లి కలిశా. ఒక నిర్మాతగా కంటే అభిమానిగానే మా ఇద్దరికీ అనుబంధం. ఆయన కుటుంబంలో రామ్‌చరణ్, పవన్ కల్యాణ్, అల్లు అర్జున్, వరుణ్‌తేజ్‌లతో సినిమాలు చేసే అవకాశం లభించడం, ఆ చిత్రాలు ఘన విజయం సాధించడం ఎంతో సంతోషాన్నిస్తోంది" అన్నారు. తమన్ మాట్లాడుతూ "చిరంజీవి అభిమానిని నేను. ఆయనకి మా సినిమా నచ్చడం ఎంతో తృప్తినిచ్చింది" అన్నారు. ఈ కార్యక్రమంలో బాపినీడు పాల్గొన్నారు.


నేను స్టూల్ ఎక్కాల్సిందే

చిరంజీవి 'తొలిప్రేమ' చిత్రబృందాన్ని అభినందించే క్రమంలో సరదా సన్నివేశం చోటు చేసుకొంది. ఒకొక్కరికీ శాలువా వేసి, పుష్పగుచ్ఛం అందిస్తూ వచ్చిన చిరంజీవి... వరుణ్‌తేజ్ దగ్గరికి రాగానే ఆయన ఎత్తు చూసి 'నీకు శాలువా వేయాలంటే, నేను స్టూల్ ఎక్కాల్సిందే' అనేసరికి అక్కడ నవ్వులు విరిశాయి.

ఎప్పటికీ మారనిది అదే

చిత్రసీమలో ఒక స్థాయికి ఎదిగాక కష్టాలేం ఉంటాయనేవాళ్లు చాలామందే. ఇక స్టార్ అనిపించుకొన్నాక వాళ్లకి తిరుగు ఉండదని భావిస్తుంటారు. సమంత మాత్రం ఆ అభిప్రాయం తప్పు అంటోంది. ఏ స్థాయిలో కష్టాలు ఆ స్థాయిలో తప్పవని చెబుతోందామె. "కథానాయికగా నిలదొక్కుకొనేందుకు పెద్ద పోరాటమే చేశా. వరుసగా విజయాలు అందుకొన్నాక... గుర్తింపు వచ్చాక అందరిలాగే నేనూ ఇక నా ప్రయాణం సాఫీగా సాగుతుందనుకొన్నా. కానీ అది తప్పని తెలియడానికి ఎంతో సమయం పట్టలేదు. ఏం చేసినా... అంతకంతకు పెరిగిపోయే అంచనాలు... కొత్తగా ఏం చేస్తుందనే తీక్షణ పరిశీలన... వీటన్నిటితో చాలాసార్లు ఉక్కిరిబిక్కిరిగా అనిపించేది. అప్పుడే అర్థమైంది... నటిగా ఏ స్థాయికి చేరినా మన పోరాటం మారదని! ఇప్పుడూ అంతే. ఒక కొత్త సినిమా చేస్తున్నానన్నా.. చేసిన సినిమా విడుదలవుతోందన్నా, ఫలితం ఎలా ఉంటుందో? మన పనితీరుపై ఎవరెలా స్పందిస్తారో? అని ఒత్తిడికి గురవుతుంటా. అయితే స్టార్ అనిపించుకొన్నాక సౌలభ్యం ఏంటంటే కథల్ని, టీమ్‌ని ఎంపిక చేసుకొని సినిమాలు చేసే వెసులుబాటు! అంతే... అంతకుమించి నా కష్టంలో మార్పేమీ రాలేద"ని చెప్పుకొచ్చింది సమంత.


సమంత


నాగార్జున

ఇలా చూడలేదు!

నాగార్జున కథానాయకుడిగా రామ్‌గోపాల్ వర్మ దర్శకత్వంలో ఓ చిత్రం తెరకెక్కుతోంది. 'శివ', 'అంతం', 'గోవిందా గోవిందా' తర్వాత ఆ కలయికలో రూపొందుతున్న చిత్రమిది. మైరా శరీన్ కథానాయికగా నటిస్తోంది. ఒక ట్రెండ్ సెట్టర్ చిత్రంగా ఇప్పటికీ గుర్తుచేసుకొనే 'శివ'ని మొదలుపెట్టి శుక్రవారంతో 29 ఏళ్లు పూర్తయ్యాయి. ఆ రోజును మరోసారి గుర్తు చేసుకొంటూ నాగార్జున తన కొత్త చిత్రంలోని స్టిల్స్‌ని ట్విట్టర్ ద్వారా విడుదల చేశారు. "ఆటని మార్చేసిన 'శివ' చిత్రంలాగా మరోసారి అదరగొట్టే సమయమిది" అంటూ నాగ్ ట్వీట్ చేశారు. "25 ఏళ్ల అన్వేషణ తర్వాత నాగార్జున అనే ఓ కొత్త కథానాయకుడు దొరికాడు. ఇంతకు ముందు ఎప్పుడూ చూడని హీరోలాగా సహజ సిద్ధమైన యాక్షన్ సన్నివేశాలు చేస్తున్నాడు" అంటూ రామ్‌గోపాల్ వర్మ ట్వీట్ చేశారు. యాక్షన్ ప్రధానంగా సాగే ఈ చిత్రానికి పలు పేర్లు ప్రచారంలో ఉన్నాయి. ప్రస్తుతం శరవేగంగా చిత్రీకరణ జరుగుతోంది.

'కుంగ్ ఫ్యూరీ'లో ఆర్నాల్డ్



మార్షల్ ఆర్ట్స్ నేపథ్యంగా హాలీవుడ్‌లో తెరకెక్కిన లఘు చిత్రం 'కుంగ్ ఫ్యూరీ'. ఈ సినిమాకి మంచి ప్రేక్షకాదరణ దక్కింది. ఇప్పుడు దీనికి సీక్వెల్‌గా ఓ ఫీచర్ చిత్రం తెరకెక్కుతోంది. విశేషం ఏంటంటే ఇందులో ఓ కీలక పాత్రలో ప్రముఖ హాలీవుడ్ యాక్షన్ హీరో ఆర్నాల్డ్ ష్వార్జ్‌నెగ్గర్ నటించనున్నారు. డేవిడ్ సాండ్‌బర్గ్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న ఈ చిత్రంలో మైఖేల్ ఫాస్‌బెండర్, డేవిడ్ హస్సెల్‌హాఫ్ కీలక పాత్రలో నటించనున్నారు. పోలీస్ అధికారి కుంగ్ ఫ్యూరీ చుట్టూ తిరిగే కథ ఇది. దర్శకుడు సాండ్ బర్గ్ కూడా ఈ చిత్రంలో ఓ కీలక పాత్రలో నటించనున్నారు. ఈ వేసవిలో ఈ చిత్రం సెట్స్‌పైకి వెళ్లనుంది.

పంచ్ డైలాగ్

నారు నాటితే వరి పెరుగుతుంది.
మాట జారితే గొడవ పెరుగుతుంది.

చిత్రం: పెదరాయుడు
- పంపినవారు: కె.కిశోర్ కుమార్, కాకినాడ

చెన్నై చిన్నోడి స్వరాలాపన


జి.వి ప్రకాశ్ కుమార్, రక్షిత

జి.వి ప్రకాశ్ కుమార్ హీరోగా నటిస్తూ స్వరాలందించిన తమిళ చిత్రం 'చెన్నై చిన్నోడు'గా ప్రేక్షకుల ముందుకు వస్తోంది. వీడి లవ్‌లో అన్నీ చిక్కులే.. అనేది ఉపశీర్షిక. వి.జయంత్ కుమార్ తెలుగులోకి అనువదిస్తున్నారు. నిక్కీ గల్రానీ, రక్షిత కథానాయికలు. ఎం.రాజేశ్ దర్శకుడు. ఈ చిత్రంలోని పాటలను హైదరాబాద్‌లో విడుదల చేశారు. తెలంగాణ చలన చిత్ర వాణిజ్య మండలి ఛైర్మన్ ప్రతాని రామకృష్ణ గౌడ్ తొలిసీడిని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ "జీవి ప్రకాశ్ హీరోగా నటిస్తూ మంచి మ్యూజిక్ చేశారు. పాటలు, ట్రైలర్ బాగున్నాయి" అన్నారు. నిర్మాత మాట్లాడుతూ "ఆద్యంతం నవ్వించే కామెడీ ఎంటర్‌టైనర్ ఇది. ప్రకాశ్‌రాజ్ పోలీస్ పాత్ర సినిమాకు ప్రధాన ఆకర్షణ. హీరో జీవా అతిథి పాత్రలో కనిపిస్తారు. పూర్ణచారి మంచి సాహిత్యం అందించార"న్నారు. కార్యక్రమంలో పసుపులేటి రామారావు, సంపత్, సాయి మాధవ్, మౌనికా రెడ్డి, మాల్య కందూరి తదితరులు పాల్గొన్నారు.

గీతోపదేశం

స్నేహబంధము ఎంత మధురము
చెరిగిపోదు తరిగిపోదు జీవితాంతము
ఒకే ఆత్మ ఉంటుంది రెండు శరీరాలలో
ఒకే పాట పలుకుతుంది వేరు వేరు గుండెల్లో

గీతం: స్నేహబంధము ఎంత మధురము...
చిత్రం: స్నేహబంధము, రచన: ఆత్రేయ
- పంపినవారు: ముంగర కృష్ణప్రసాద్, జట్లపాలెం

మీకు నచ్చిన సినిమా పంచ్ డైలాగ్‌లు, పాటల్లోని సందేశాలను మాకు రాసి పంపించండి.

చిరునామా: సినిమా డెస్క్,
ఈనాడు కార్యాలయం,
రామోజీ ఫిలింసిటీ,
హైదరాబాద్ - 501512


కత్రినాకైఫ్

ప్రణాళికలు వేసుకొంటే అంతే సంగతులు!

'టైగర్ జిందా హై' విజయంతో ఉత్సాహంగా దూసుకుపోతోంది బాలీవుడ్ భామ కత్రినా కైఫ్. బాలీవుడ్ స్టార్ హీరోలు సల్మాన్‌ఖాన్, షారుఖ్ ఖాన్, అక్షయ్‌కుమార్... ఇలా అందరితోనూ కలిసి నటించింది. అనుభవమున్న నటులతో కలిసి పనిచేయడం చాలా కలిసొచ్చే అంశమని చెబుతోంది కత్రినా. "నేను చాలా అదృష్టవంతురాల్ని. కెరీర్ తొలినాళ్లలోనే ఎంతో అనుభవమున్న నటులతో కలిసి పనిచేసే అవకాశం దక్కింది. ఇలాంటి అవకాశం అందరికీ రాదు. దీంతో వాళ్ల నుంచి ఎన్నో విషయాలు నేర్చుకోగలిగాను. అనుభవమున్న నటులతో నటించడమే కాదు వాళ్లను దగ్గరగా గమనించినా చాలా విషయాలు వాటంతట అవే వచ్చేస్తాయి" అని చెప్పింది. కత్రినా ఇక్కడి అమ్మాయి కాకపోయినా స్టార్ హీరోయిన్‌గా ఎదిగింది. దీని వెనుక భారీ ప్రణాళిక ఉంటుంది అనుకుంటారు. కానీ ప్రణాళిక వేసుకొని ఉంటే ఎదిగేదాన్ని కాదంటోంది కత్రిన. "జీవితం అలా ఉండాలి... ఇలా ఉండాలి అంటూ ప్రణాళికలు వేసుకోకూడదనే విషయాన్ని ఎప్పుడో నేర్చుకున్నాను. ప్లాన్స్ వేసుకోవడానికే సమయం అంతా కేటాయిస్తే జీవితం అంతే సంగతులు. నిజాయతీగా పనిచేస్తే ఆ దేవుడే అన్నీ చూసుకుంటాడు"అని చెప్పింది కత్రినాకైఫ్.

ఆస్కార్ బరి

శాంతి గీతమా?... యుద్ధ సన్నద్ధమా?


'డార్కెస్ట్ అవర్'

ఈ ఏడాది ఆస్కార్ బరిలో ఆరు నామినేషన్లు సాధించి సత్తా చాటింది బ్రిటిష్ చిత్రం 'డార్కెస్ట్ అవర్'. ఉత్తమ చిత్రం, ఉత్తమ నటుడు సహా ఛాయాగ్రహణం, ప్రొడక్షన్ డిజైన్, కాస్ట్యూమ్ డిజైన్, మేకప్ లాంటి సాంకేతిక విభాగాల్లో ఆస్కార్ పురస్కారం కోసం పోటీపడుతోంది. రెండో ప్రపంచ యుద్ధ సమయంలో బ్రిటన్ ప్రధాని విన్‌స్టన్ చర్చిల్ పోషించిన కీలక భూమిక ఆధారంగా ఈ చిత్రం తెరకెక్కింది. చర్చిల్‌గా ప్రముఖ నటుడు గ్యారీ ఓల్డ్‌మ్యాన్ నటించారు. జో రైట్ ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. గ్యారీ ఓల్డ్‌మ్యాన్‌కు ఆస్కార్ ఖాయమని సినీ విమర్శకులు బలంగా చెబుతున్న నేపథ్యంలో ఆ చిత్ర విశేషాలు చూద్దాం.

రెండో ప్రపంచ యుద్ధ నేపథ్యంలో తెరకెక్కిన రెండు చిత్రాలు ఈసారి ఆస్కార్ ఉత్తమ చిత్రం పురస్కారం కోసం బరిలో నిలిచాయి. అవే క్రిస్టఫర్ నోలన్ తెరకెక్కించిన 'డంకర్క్', బ్రిటిష్ చిత్రం 'డార్కెస్ట్ అవర్'. బాక్సాఫీసు వద్ద 'డార్కెస్ట్ అవర్' ఘన విజయం సాధించడంతో పాటు విమర్శకుల మెప్పు పొందింది. ముఖ్యంగా చర్చిల్ పాత్రలో గ్యారీ ఓల్డ్‌మ్యాన్ నటనకు సర్వత్రా ప్రశంసలు వెల్లువెత్తాయి. తన అభినయంతో గోల్డెన్ గ్లోబ్, స్క్రీన్ యాక్టర్స్ గిల్డ్ పురస్కారాలు గెలుచుకున్నారు ఓల్డ్‌మ్యాన్. బాఫ్టా పురస్కారాల్లో ఈ చిత్రానికి తొమ్మిది నామినేషన్లు దక్కాయి. 30 మిలియన్ డాలర్లతో తెరకెక్కిన ఈ చిత్రానికి 124 మిలియన్ డాలర్లకు పైగా వసూళ్లు వచ్చాయి.

కథేంటి: రెండో ప్రపంచ యుద్ధం సమయంలో అడాల్ఫ్ హిట్లర్ సారథ్యంలోని నాజీ సేనలు యూరప్ దేశాలను భయకంపితులను చేస్తుంటాయి. విస్తరణ కాంక్షతో రగిలిపోతున్న నాజీలు పశ్చిమ యూరప్ వైపు దూసుకొస్తుంటారు. పశ్చిమ యూరప్ భవితవ్యం అందులోని కీలక దేశమైన బ్రిటన్ తీసుకునే నిర్ణయంపై ఆధారపడి ఉంటుంది. అటువంటి క్లిష్ట పరిస్థితుల్లో బ్రిటన్ కొత్త ప్రధానిగా బాధ్యతలు స్వీకరిస్తాడు చర్చిల్. హిట్లర్‌తో శాంతి చర్చలు జరపడమా? లేదా తమ దేశ స్వేచ్ఛా స్వాతంత్ర్యాల కోసం, సిద్ధాంతాల కోసం యుద్ధానికి సన్నద్ధం కావడమా? ఏదో ఒకటి తేల్చుకోవాల్సిన అవసరం చర్చిల్‌కు వస్తుంది. అప్పుడు ఆయన ఎలాంటి నిర్ణయం తీసుకున్నాడు? ఆయన ప్రదర్శించిన రాజనీతి ఎలాంటిది? అన్న విషయాలు 'డార్కెస్ట్ అవర్'లో ఆసక్తికరంగా ఆవిష్కరించారు.

విశేషాలు:
- ఒక ఏడాది పాటు చర్చిల్ గురించి అధ్యయనం చేసి ఓల్డ్‌మ్యాన్ తన పాత్రకు సిద్ధమయ్యాడట. సినిమా చిత్రీకరణ జరిగినన్నాళ్లూ చర్చిల్ పాత్రలో లీనమైపోయాడట. పేకప్ చెప్పాక ఇంటికెళ్లినా చర్చిల్‌లాగే ప్రవర్తించేవాడట. దీని గురించి ఓల్డ్‌మ్యాన్ భార్య గిసెలె 'రోజూ రాత్రి మా ఇంటికి చర్చిల్ వస్తాడు. లేచేసరికి ఓల్డ్‌మ్యాన్‌గా మారిపోయుంటాడు' అని సరదాగా వ్యాఖ్యానించింది.
- 2012లో వచ్చిన 'టింకర్ టైలర్ సోల్జర్ స్పై' చిత్రానికి తొలిసారి ఆస్కార్ ఉత్తమ నటుడి నామినేషన్ అందుకున్నారు ఓల్డ్‌మ్యాన్. అయితే అప్పుడు పురస్కారం దక్కలేదు. ఇప్పుడు 'డార్కెస్ట్ అవర్'తో రెండో నామినేషన్ సాధించాడు. ఈసారి మాత్రం పురస్కారం ఖాయమని విమర్శకులు చెబుతున్నారు.


రక్తహీనతకు బీట్‌రూట్!

మనదేశంలో రక్తహీనత బారిన పడేవారి సంఖ్య డెబ్భైశాతం కన్నా ఎక్కువే ఉంటుంది. శరీరంలో తగినంత ఇనుము లేకపోవడం, పోషకాహారం తీసుకోకపోవడం వంటి కారణాల వల్ల ఈ సమస్య ఎదురవుతుంది. ఎందుకు అని ఆలోచించడం కన్నా.. దాన్నుంచి బయటపడేందుకు ఏం చేయాలనేది చూద్దాం.

బీట్‌రూట్... దీనిలో అధిక మొత్తంలో ఇనుము ఉంటుంది. ఇది హిమోగ్లోబిన్ శాతాన్ని పెంచుతుంది. శరీరంలోని మలినాలను తొలగిస్తుంది. ప్రతిరోజూ బీట్‌రూట్ రసం తాగడం వల్ల మీ శరీరానికి ఎంతోకొంత ఇనుము అందుతుంది. దీన్ని సలాడ్‌గా, ఇతర కూరగాయలతో కూడా కలిపి తీసుకోవచ్చు.



అరటిపండు... ఇందులోనూ పోషకాలు ఎక్కువ. వాటిలో ఇనుము ఒకటి. ప్రతిరోజూ అరటిపండును తేనెతో కలిపి తీసుకుంటే ఎర్రరక్త కణాల సంఖ్య పెరుగుతుంది.



ఖర్జూరాలు... వీటిలో కూడా విటమిన్ సి అధికంగా ఉంటుంది. రాత్రిపూట గ్లాసు వేడిపాలలో రెండుమూడు ఖర్జూరాలను నానబెట్టి ఉదయంపూట పరగడుపునే తాగడం వల్ల మంచి ఫలితం ఉంటుంది.

దానిమ్మ... ఇందులో విటమిన్-సి ఎక్కువ. ఇది ఇనుమును గ్రహించడంలో ముఖ్యపాత్ర పోషిస్తుంది. దాల్చిన చెక్క పొడీ, తేనెతో కలిపి ప్రతిరోజూ ఉదయంపూట దానిమ్మ రసాన్ని తీసుకోవడం వల్ల రక్తంలో హిమోగ్లోబిన్ పరిమాణం పెరుగుతుంది. దానిమ్మను నేరుగా తీసుకున్నా మంచి ఫలితం ఉంటుంది.





ఆకుకూరలు... పాలకూరా, మెంతీ, తోటకూర ... ఇలా ఆకు కూరలన్నింటిలో ఇనుము పుష్కలంగా ఉంటుంది. దీంతోపాటు విటమిన్-బీ12, ఫోలిక్ యాసిడ్, ఇతర శక్తిని ఇచ్చే పోషకాలు ఉంటాయి. ఇవన్నీ రక్తహీనతను తరిమికొడతాయి. కాబట్టి మీ ఆహారంలో ప్రతిరోజూ ఆకుకూరలు ఉండేలా చూసుకోవాలి.

తలస్నానం తప్పటం లేదా...?

కొంతమందికి తలస్నానం చేసిన తరువాతి రోజే జుట్టు జిడ్డుగా మారుతుంటుది. దాంతో రోజూ తలస్నానం చేయాల్సిన పరిస్థితి. కానీ దాని వల్ల జుట్టు పొడిబారొచ్చు. మరెలా అంటారా...



- మాడులో సహజ నూనెలు ఎక్కువగా విడుదల కాకుండా వంటసోడాను ప్రయత్నించి చూడండి. లీటర్ నీళ్లలో రెండు టేబుల్ స్పూన్ల వంటసోడా కలిపాలి. షాంపూతో తలస్నానం చేశాక ఆ నీటిని తలపై పోసుకుని కాసేపు అలా వదిలేయాలి. ఇలా వారానికి రెండు సార్లు చేస్తే ఫలితం ఉంటుంది.
- కలబందలో ఉండే విటమిన్లూ, ఖనిజాలు మాడుపై పేరుకుపోయిన మలినాలు తొలిగిస్తాయి. అప్పుడే తీసిన కలబంద గుజ్జుకు కొన్ని చుక్కల నిమ్మరసం కలపాలి. తలస్నానం చేసేందుకు పదినిమిషాల ముందు ఈ మిశ్రమాన్ని జుట్టుకు పట్టించాలి. సమయం లేదనుకుంటే షాంపూలోనే కలబంద గుజ్జును కలిపి తలస్నానం చేసేయొచ్చు.
- ఓట్స్‌లో కాసిని నీళ్లు కలిపి ముద్దలా చేసి తలకు పట్టించి ఇరవై నిమిషాల తరువాత చల్లని నీళ్లతో కడిగేయాలి. ఇలా వారానికి రెండు సార్లు చేస్తుంటే మార్పు కనిపిస్తుంది. ఓట్స్‌కు మలినాలను ఎక్కువగా పీల్చుకునే తత్వం ఉంటుంది.
- చెంచా చొప్పున సెనగపిండీ, మెంతిపొడిని పావుకప్పు కొబ్బరి పాలలో కలిపి మాడుకు మర్దనా చేయాలి. గంట తరువాత తలస్నానం చేస్తే సరిపోతుంది. ఇలా వారానికి కనీసం ఒక్కసారి చేస్తే మార్పు కనిపించొచ్చు.

కుర్తా... చొక్కా... లెహెంగా... అనార్కలీ... ఇలా ఏవి కుట్టినా.. ఎంతో కొంత వస్త్రం వృథా అయి చెత్తలోకి వెళ్తుంది. ఇంకా చెప్పాలంటే భారత్, చైనా, బంగ్లాదేశ్ కలిపి... దుస్తులు తయారు చేసే కంపెనీలన్నింటి నుంచీ ఏటా దాదాపు 80 బిలియన్ చదరపు మీటర్ల వస్త్రం వృథాగా మారుతోందట. ఇదంతా బయట చెత్త కుప్పలా పేరుకుపోయేదే. ఆ చెత్తనే మళ్లీ డిజైను చేసి ఏకంగా ఒక కొత్త బ్రాండ్ సృష్టించింది కృతీ తుల. అంతేనా... ఆ దుస్తులను ల్యాక్మే ఫ్యాషన్ వీక్‌లోనూ ప్రదర్శించింది. వ్యాపార శిశువుగా ఉన్న తన సంస్థ అక్కడిదాకా చేరడానికి ఆమె చేసిన ప్రయాణం, ప్రయత్నం గురించి వసుంధరతో ఇలా చెప్పుకొచ్చింది.

వృథా నుంచి అదిరే దుస్తులు...

పెద్ద పెద్ద సంస్థలు ప్రింట్లలో చిన్న తప్పులు దొర్లాయనీ, లేదంటే చిన్న రంధ్రాలున్నాయని 0.09 శాతం, కటింగుల్లో తేడాలొచ్చి 16.37 శాతం వస్త్రాన్ని పక్కన పెట్టేస్తాయి. దాంతోపాటే కొత్తగా ఆర్డర్లు రావచ్చని అవసరానికి మించి 5-10 శాతం అదనంగా దుస్తుల్ని సిద్ధం చేసుకుంటారు. ఒకవేళ ఆ ఆర్డరు రాకపోతే అవి నిరుపయోగమే. ఇంతకముందు కొన్ని ప్రింటింగ్ యూనిట్లలో, వస్త్ర పరిశ్రమల్లో ఉద్యోగం చేసినప్పుడు ఇదంతా ప్రత్యక్షంగా చూశా. ఒక షర్ట్ కుట్టాలంటే దీర్ఘచతురస్రాకారంలో ఉన్న ఫ్యాబ్రిక్‌ను ఎంచుకుంటాం. కానీ మనకు కావల్సింది కట్‌షర్ట్. అంటే దాదాపు మొత్తం వస్త్రం పరిమాణంలో ఇరవై శాతం అక్కడే వృథా అవుతుంది. అలాంటి షర్టులు రోజుకు లెక్కలేనన్ని తయారుచేస్తారు. ఇవే నా వ్యాపార ఆలోచనకు ఊతమిచ్చాయి. మాది దిల్లీ. పైగా నా చదువులు కూడా డిజైనింగ్‌కు సంబంధించినవే కావడంతో ఈ రంగంలోకి రావడం సులువైంది. నేను వేసుకున్న ఆ లెక్కలూ, పర్యావరణానికి మేలు చేయాలనే ఆలోచనలు.. నన్ను ఇటువైపు నడిపించాయి.



మళ్లీ చదివా...

ఆలోచన రాగానే సరిపోదు. దాన్ని ఆచరణలో ఎలా పెట్టాలో తెలుసుకోవడం ముఖ్యం. అసలు ఏ కంపెనీలకు వెళ్లాలి...? నా ఆలోచన ఎవరికి చెప్పాలన్న విషయం మొదట్లో నాకొక చిక్కుముడి. 2012లో నేను బ్రాండ్ పేరును డూడ్‌లేజ్‌గా రిజిస్టర్ చేయించా. కానీ.. నా పనులేవీ అంత సులువుగా మొదలుకాలేదు. కంపెనీలకు వెళ్లి.. మీ దగ్గర మిగిలిపోయిన వస్త్రం ఇవ్వమంటే సులువుగా ఇచ్చేయరు కదా.. వాళ్లకి నా ఆలోచన గురించి చెప్పి ఒప్పించడం పెద్ద సమస్యే. కానీ, కొన్ని రోజులకు నా ఆలోచన అర్థమై మంచి స్పందనే వచ్చింది. అయితే, వృథా దుస్తులు సేకరించినా కూడా... ఎలాంటి డిజైన్‌లు తయారు చేయాలీ... అతుకుల బొంతలా కాకుండా ఆధునికంగా, ట్రెండీగా ఉండేలా కనిపించాలంటే ఎలా డిజైను చేయాలి.. ఇలా ఎన్నో రకాలుగా ఆలోచించేదాన్ని. వాటన్నింటికీ పరిష్కారం దొరకడానికి నాకు ఏకంగా రెండు సంవత్సరాలు పట్టింది. ఆ సమయంలో ఖాళీగా ఉండకుండా డిజైనింగ్‌లోనే ఎంఏ పూర్తి చేసేశా. 2014 కల్లా... చిన్న స్థాయి పరిశ్రమల నుంచి వృథాగా ఉన్న వస్త్రాల్ని సేకరించడం మొదలుపెట్టా. ఇప్పుడు మా దగ్గరున్న దుస్తుల్లో తొంభై శాతం అలా సేకరించిన వాటి నుంచి తయారైనవే. ఇక వీటిని మార్కెటింగ్ చేయడం మరో సమస్య. మొదట్లో తక్కువ సంఖ్యలో దుస్తులు తయారుచేయడంతో ప్రత్యేకంగా ఒక దుకాణం అయితే ప్రారంభించలేం. అందుకే దగ్గర్లో ఉన్న బ్రాండ్ స్టోర్లతో ఒప్పందం కుదుర్చుకున్నా. అక్కడ ఒక్కసారి కొనుగోలు చేసిన వాళ్లు... మా బ్రాండ్ దుస్తుల గురించి మళ్లీ అడిగేవారు. దాంతో ఆర్డర్లు ఎక్కువగా రావడం మొదలైంది. ఇలా క్రమంగా చాలా నగరాల్లో బ్రాండ్ స్టోర్లతో ఒప్పందం కుదుర్చుకుని వ్యాపారం విస్తరించా. ఇప్పుడు దేశం మొత్తం దాదాపు నలభై స్టోర్లలో మా దుస్తులు అమ్ముతున్నాం. హైదరాబాద్‌లోనూ అనానిమ్, ఓగాన్, తామర, ది ప్రాజెక్ట్ లాంటి స్టోర్లలో ఇవి అందుబాటులో ఉంటాయి.



వాటినీ ఉపయోగిస్తున్నాం...

మేం సేకరించిన వృథా నుంచి దుస్తులు తయారుచేశాక కూడా చాలా వస్త్రమే వృథా అయ్యేది. దాన్నలా వదిలేస్తే నేను అనుకున్న లక్ష్యం మధ్యలో మిగిలిపోయినట్లే. అందుకే అలా మిగిలిన వాటితో బ్యాగులూ, యాక్సెసరీలూ, స్టేషనరీ తయారుచేస్తున్నాం. ఒక్కటని కాదు.. ఏం చేయడానికి వీలుంటే అది తయారు చేయడమే నా, నాతో పనిచేసే వారి లక్ష్యంగా మారింది. మొదట్లో కేవలం అమ్మాయిల దుస్తులే తయారుచేసేవాళ్లం. ఇప్పుడు అబ్బాయిల కోసం కూడా ప్రత్యేక శ్రేణిని అందుబాటులో ఉంచుతున్నాం. చాలా సంస్థలు పర్యావరణానికి మేలు చేయాలనే ఉద్దేశంతో అనేక మార్గాలు అనుసరిస్తున్నాయి. సహజ రంగులు వాడటం, కాటన్‌కు ప్రత్యామ్నాయాలు కనుక్కోవడం, తొందరగా భూమిలో కలిసిపోయే వస్త్రావిష్కరణలు... ఇలా చాలా చేస్తున్నాయి. పూర్తిగా వృథా అనుకున్న వస్త్రాల ముక్కల నుంచి దుస్తులు తయారుచేస్తున్నది మాత్రం కొందరే. ఇదొక్కటే కాదు అరటీ, వెదురు పీచుతో తయారుచేసిన వస్త్రాన్నే ఎక్కువగా ఉపయోగించడానికి ప్రయత్నిస్తున్నాం.

ఎలా చేస్తామంటే...

మా దగ్గరికి పెద్ద మొత్తంలో ముడిసరుకు వచ్చి చేరుతుంది. వాటి నుంచి కాస్త ఒకే రకం, రంగులో ఉన్న వస్త్రాల్ని ఎంచుకోవడం కష్టమైన పనే. వాటిని ఎంపిక చేశాక ఎలాంటి డిజైను రూపొందించొచ్చనేది చర్చిస్తాం. అవసరమైన వాటికి ఎంబ్రాయిడరీలూ, ప్యాచ్‌లు చేయిస్తాం. మేం తయారు చేసే ఏ రెండు డ్రెస్సులు ఒకే రకంగా ఉండవు. అందుకే నా సంస్థ పేరు డూడ్‌లేజ్ అని ఎంపిక చేశా. మామూలుగా ఏ రెండు డూడుల్స్ ఒకేలా ఉండవు. కానీ వేటి ప్రత్యేకత వాటిదే. ఇదే మేం తయారుచేసే దుస్తులకూ వర్తిస్తుంది. ఆన్‌లైన్‌లోనూ వీటిని అందుబాటులో ఉంచితే ఎక్కువ మందిని చేరుకోవచ్చనే ఆలోచనతో ఈ మధ్యే వెబ్‌సైట్‌ను కూడా ప్రారంభించా. 1400 రూపాయల నుంచి 14000 రూపాయల వరకు యాక్సెసరీలూ, దుస్తులు అందుబాటులో ఉన్నాయి.

మా నాన్న బ్లేజర్‌తో మొదలు...

లాక్మే ఫ్యాషన్ వీక్‌లోనూ మా దుస్తులను ప్రదర్శించే అవకాశం నాకు అనుకోకుండా వచ్చింది. ఆ రోజు ఎప్పటికీ మర్చిపోలేను. నా కష్టానికి వచ్చిన గుర్తింపది. నా ప్రయాణం మా నాన్నకు చాలా ఇష్టమైన ఒక లెదర్ బ్లేజర్‌తో ప్రారంభమైంది. అది ఆయన దాదాపు పది సంవత్సరాల నుంచి జాగ్రత్తగా దాచిపెట్టుకున్నారు. ఇప్పుడాయనకు అది నప్పక.. వేసుకోలేక చాలా బాధ పడేవారు. దాన్ని నేను జాకెట్‌గా మార్చేసి వేసుకున్నా. అదే నేను మార్చిన మొదటి డ్రెస్. భవిష్యత్తులో ఒక వెడ్డింగ్ డ్రెస్ కూడా ఇలా మిగిలిన వస్త్రంతో తయారు చేయాలనేది నా కోరిక..!

– కౌటిక్ ప్రణయశ్రీ, ఈనాడు డిజిటల్



మొక్కల మీద ఇష్టం ఉన్నప్పటికీ, ఎక్కువ సమయం, స్థలం కేటాయించలేని వారికీ, ఓపికా లేనివారికి చక్కని ఎంపిక పెడిలాంథస్. ఇది సక్యులెంట్ జాతికి చెందింది. దీని శాస్త్రీయనామం పెడిలాంథస్ తితైమలాయిడిస్. మొక్క ఆకారాన్ని బట్టి దీన్ని 'డెవిల్స్ బాక్‌బారన్', 'జిగ్‌జాగ్ ప్లాంట్', 'రిక్‌రాక్ ప్లాంట్', 'జాకబ్స్ ల్యాడర్' అని పలు రకాల పేర్లతో పిలుస్తారు. అలాగే పూల ఆకారాన్ని బట్టి దీనికి 'రెడ్ బర్డ్ ఫ్లవర్', పర్షియన్ లేడీ స్లిప్పర్', 'జపనీస్ పాయిన్‌సెట్టియా' అని కూడా పేర్లున్నాయి.

పెరట్లోకి తెచ్చేద్దాం... పెడిలాంథస్!

పెడిలాంథస్‌ను పెంచడం చాలా సులభం. ఇది 2-3 అడుగుల ఎత్తు వరకు పెరుగుతుంది. ఎలాంటి పనికిరాని నేలలోనైనా పెరుగుతుంది. దీని కాండం జిగ్‌జాగ్‌గా ఉంటుంది. పూర్తి ఆకుపచ్చ ఆకులతో కంటే తెలుపు వలిగేషన్ ఉన్న రకాలు అందంగా ఉంటాయి. పూర్తి ఎండ లేకపోయినా ప్రకాశమంతమైన వెలుతురైనా ఉండాలి. వెలుతురు బాగా ఉన్నప్పుడు తెలుపు వలిగేషన్ ఆకుల మీద అందమైన లేత గులాబీ ఛాయ కనిపిస్తుంది. వెలుతురు చక్కగా ఉన్నప్పుడు చిన్న చిన్న ముదురు గులాబీ రంగులో ఉన్న పూలు వస్తాయి. ఇది హమ్మింగ్ పిట్టలకు మంచి ఆకర్షణ.

భిన్న ఛాయలు-విభిన్న రకాలు... వెలుతురు తక్కువైతే పూలు రావడం అరుదు. అయినా ఆకులూ, కొమ్మలు అందంగా ఉండటం, పెంచడం సులువు కావడంతో వరండాల్లో, బాల్కనీల్లో కూడా దీన్ని ఎక్కువగానే పెంచుతారు. పెడిలాంథస్‌లో ఇప్పుడు పొట్టి రకాలూ, వేలాడే తొట్లలో పెంచుకోవడానికి వీలయ్యే రకాలూ, వెలిగేషన్‌లోనే భిన్న ఛాయలున్న రకాలు... ఇలా ఎన్నో వచ్చాయి. వీటిని పెంచుకునేటప్పుడు నీరు నిలవని సారవంతమైన మట్టి మిశ్రమాన్ని ఎంచుకోవడం మంచిది. పెడిలాంథస్‌ను ఇతర సక్యులెంట్ రకాలైన కాలంచో, అలో, యూఫోర్బియా లాంటి మొక్కలతో కలిపి నాటుకుంటే బాగుంటుంది. కుండీల్లోనూ నాటుకుని చుట్టూ తెల్లనిరాళ్లతో నింపినా ఆ అందమే వేరు. దీన్ని రాకరీలోనూ, బోర్డరుగానూ నాటుకోవచ్చు. చిన్నకుండీలోనూ చక్కగా పెంచుకోవచ్చు.



బయోడీజిల్ తయారీలో... ఈ మొక్కకు చీడపీడల భయం లేదు. ఎరువులు కూడా పెద్దగా అవసరం లేదు కానీ కొత్తగా వచ్చిన హైబ్రిడ్ రకాలకు మాత్రం 2-3 నెలలకొకసారి కొద్దిగా 17:17:17 లాంటి సమగ్ర ఎరువును వేస్తూ, 5-6 నెలలకొకసారి మట్టి మిశ్రమంలో కొద్దిగా వర్మికంపోస్టు లేదా పశువుల ఎరువును కలిపితే చాలు. ఇది ఆస్తమా, నోటి అల్సర్లూ, కాలిన గాయాలకు మంచి మందుగా పనిచేస్తుంది. పంటి నొప్పికీ, హెర్నియాకు కూడా బాగా పనిచేస్తుంది. బయోడీజిల్ తయారీలో కూడా దీన్ని వాడతారు.

పెడిలాంథస్ కొమ్మల్నీ లేదా ఆకులను తుంచినప్పుడు పాలు కారతాయి. అవి విషపూరితం కాబట్టి చిన్నపిల్లలూ, పెంపుడు జంతువులు ఉన్నవాళ్లు జాగ్రత్తగా ఉండాలి. పురుగులు కుట్టిన దద్దుర్ల మీద ఈ పాలు రాస్తే వెంటనే ఉపశమనం ఉంటుంది. పెడిలాంథస్‌ను కొమ్మ, శీర్ష కత్తిరింపులను 5-6 అంగుళాల పొడవుతో తీసుకుని పాలు కారడం ఆరిన తరువాత నాటితే సులువుగా వేళ్లూనుకుంటాయి.

– బోడెంపూడి శ్రీదేవి, లాండ్‌స్కేప్ కన్సల్టెంట్

పొట్ట ఉబ్బరం... క్యాన్సర్ సంకేతమా?

మా పిన్ని ఏడాదిగా అన్నం సరిగ్గా తినడం లేదు. దాంతో బరువు తగ్గింది. పైగా పొట్ట ఉబ్బరంగా ఉంటోందని చెబుతోంది. డాక్టర్ దగ్గరకు వెళ్తే.. అల్ట్రాసౌండ్ స్కాన్ చేసి.. పొట్టలో నీరు చేరిందని చెప్పారు. రక్త పరీక్ష కూడా చేసి సీఏ125 స్థాయులు ఎక్కువగా ఉన్నాయన్నారు. తరువాత మరి కొన్ని పరీక్షలు చేసి... అండాశయ క్యాన్సర్ అన్నారు. శస్త్రచికిత్సతో పాటూ మూడుసార్లు కీమోథెరపీ చేయించుకోవాలని చెప్పారు. ఇప్పుడు ఆమె చికిత్స చేయించుకోవడానికి భయపడుతోంది. దీనికి ఏదయినా ప్రత్యామ్నాయం ఉందంటారా...

- ఓ సోదరి

డియర్ వసుంధర



డా॥ గీతానాగశ్రీ
క్యాన్సర్ శస్త్రచికిత్సా నిపుణురాలు

సాధారణంగా అండాశయ క్యాన్సర్‌ని చివరి దశలోనే ఎక్కువగా గుర్తిస్తారు. లక్షణాలు సరిగ్గా కనిపించకపోవడమే ప్రధాన కారణం. ముఖ్యంగా పొట్ట ఉబ్బరం, బరువు తగ్గడం.. లాంటి లక్షణాలను తేలిగ్గా తీసుకోకూడదు. పైగా ఆ సమస్యల్ని అజీర్తి అనుకుని నిర్లక్ష్యం చేయకూడదు. ఎక్కువరోజులు ఆ సమస్యలుంటే వైద్యుల్ని సంప్రదించాలి. మీరు చేసిన పొరపాటు అదే. ఒకవేళ ఈ క్యాన్సర్ మూడూ, నాలుగు దశలకు చేరుకుంటే గనుక...పొత్తికడుపునకూ వ్యాపించి అక్కడ నీరు చేరొచ్చు. మీ పిన్నిగారి సమస్య కూడా అదే. ఏడాదిగా సరైన పోషకాహారం తీసుకోకపోవడం వల్ల నీరు చేరింది. పైగా సీఏ125 స్థాయులు ఎక్కువగా ఉన్నాయనీ అంటున్నారు కాబట్టి... శస్త్ర చికిత్సతోపాటూ కీమోథెరపీ చేయించుకోవాలి. శస్త్రచికిత్సలో భాగంగా వ్యాపించిన క్యాన్సర్ కణుతుల్ని తొలగిస్తారు. పరిస్థితీ, క్యాన్సర్ కణాలను బట్టీ ముందు శస్త్రచికిత్స చేయాలా లేక కీమోథెరపీ తరువాత శస్త్రచికిత్సా అనేది వైద్యులు నిర్ణయిస్తారు. సాధారణంగా అయితే... ముందు శస్త్రచికిత్స చేస్తేనే మంచిది. దశ మారేకొద్దీ సమస్య తీవ్రత ఇంకా పెరుగుతుంది కాబట్టి.. ఆలస్యం కాకుండా వైద్యుల్ని సంప్రదించి, వాళ్లు చెప్పినట్లు చేయడం మంచిది.

బంగారం వెండి 16 న ముగింపు-క్రితం

	హైదరాబాద్		విజయవాడ	
బంగారం(24క్యా)	31,810	31,060	31,500	31,500
ఆర్నమెంట్	29,710	29,055	29,150	29,250
వెండి (కిలో)	39,922	39,900	40,000	40,000
	ప్రొద్దుటూరు		రాజమండ్రి	
బంగారం(24క్యా)	30,140	31,450	31,440	31,250
ఆర్నమెంట్	29,070	29,000	29,400	29,250
వెండి (కిలో)	39,800	40,000	39,300	39,200
	విశాఖపట్నం		తమిళనాడు	
బంగారం(24క్యా)	31,450	31,450	-------	-------
ఆర్నమెంట్	29,250	29,250	2,940	2,925 గ్రా
వెండి (కిలో)	39,900	39,900	41.90	41.80 గ్రా

నాన్న కల... నీట్‌తో సాధించా!

'నువ్వు డాక్టర్ కావాలమ్మా...' అంటూ ఆ తండ్రి ఆశలన్నీ కూతురు మీదే! అందుకే... స్టెతస్కోప్ చేతిలో పట్టుకోవాలని ఆ అమ్మాయి కూడా అనుకుంది. కానీ అది నెరవేరకుండానే... తండ్రి కన్నుమూశాడు. అయినా ఆ ఆశయాన్ని బతికించుకోవాలని రాత్రింబవళ్లూ కష్టపడి చదివింది. దానికి ఫలితమే నీట్‌లో జాతీయ స్థాయి (వైద్య విభాగం)లో పదహారో ర్యాంకు, తెలుగు రాష్ట్రాల్లో మొదటి ర్యాంకుతో నిలబడింది. అలా విజేతగా నిలిచిన ఉమామహేశ్వరి కన్నీటి కష్టం ఆమె మాటల్లోనే!

మాది ఒంగోలు జిల్లా దర్శి. మా అమ్మానాన్నలిద్దరూ ఉపాధ్యాయులు. మేం ముగ్గురం ఆడపిల్లలం. అయినా నాన్న మమ్మల్ని చిన్న చూపు చూడలేదు. మగపిల్లలతో సమానంగా చదివించాలనుకున్నారు. ఎందుకో తెలియదు.. ఎప్పుడూ నాతో 'నువ్వు డాక్టర్ అవ్వాలమ్మా... అది నా కల' అనేవారు. నాన్నకి ఎందుకు అలా అనిపించిందో తెలియదు... కానీ అప్పట్నుంచీ అదే ఆశయంగా మార్చుకున్నా.

ఎమ్‌సెట్‌లో 2వ ర్యాంకు: పదో తరగతి, ఇంటర్‌లో మంచి మార్కులు వచ్చాయి. 2011లో ఉమ్మడి తెలుగు రాష్ట్రంలో ఎంసెట్‌లో రెండో ర్యాంకు తెచ్చుకున్నా. అదే నాన్న చూసిన మొదటి విజయం. ఎంతో సంతోషంగా అనిపించింది. ఆ ఆనందం ఎన్నో రోజులు లేదు. అందరూ అమ్మానాన్నల్ని పొగుడుతుంటే సంతోషంగా అనిపించేది కానీ... అదే సమయంలో నాన్నకి క్యాన్సర్ అని తేలింది. భరించలేనంత బాధ. దురదృష్టం ఏంటంటే.. అప్పటికే సమస్య చివరి దశకు చేరుకుతుంది. ఫలితం లేదని వైద్యులు చెప్పారు. ఇంతలో నాకు ఉస్మానియా వైద్య కళాశాలలో సీటు వచ్చింది. హైదరాబాద్‌లో అక్క దగ్గరకు వచ్చేశా. కాలేజీలో చేరిన పదిరోజులకే నాన్న చనిపోయారు. నామీద ఆ ప్రభావం బాగానే పడిపోయింది. అమ్మ ఒంటరి అయిందనే బాధ ఒకవైపు.. నాన్న నన్ను డాక్టర్‌గా చూడలేకపోయారనే దుఖం మరో వైపు కలచి వేసేవి. ఎంత ప్రయత్నించినా చదవలేకపోయేదాన్ని. మరో వైపు నాన్న అనుకున్న లక్ష్యం నన్ను వెనక అడుగు వేయకుండా చూసేది.



నేను చదవడానికంటే రాయడానికే ప్రాముఖ్యతనిచ్చేదాన్ని. నాకు నేను పరీక్షలు పెట్టుకునేదాన్ని. చదివిన దానిలో తప్పుల్లేకుండా రాసే వరకూ పరీక్షలు పెట్టుకుంటూనే ఉండేదాన్ని. రాసింది మాత్రం బుర్రలో నాటుకుపోయేది. సిలబస్‌ను విడగొట్టి.. ఏ రోజు ఏం చదవాలో ప్రణాళిక వేసుకునేదాన్ని. ఇక నేను కేవలం పుస్తకాల పురుగును కాలేదు. మధ్యలో ఫేస్‌బుక్, నెట్, వాట్సాప్ చూస్తుండేదాన్ని. చాలామంది పరీక్షలు వస్తే వాటికి దూరంగా ఉండాలి అంటారు. అది వాస్తవమే కానీ.. పూర్తిగా పక్కన పెడితే మనసు లాగుతుంది. అందుకే సామాజిక మాధ్యమాల్లో కూడా చదువుకు సంబంధించినవి చూస్తే వినోదం, విజ్ఞానం రెండూ సొంతమవుతాయని నేను భావిస్తా.

మూడేళ్లకి కోలుకున్నా...: బాధలోంచి తేరుకుని బయటకు రావడానికి మూడేళ్లు పట్టింది. ఎంబీబీఎస్ చాలా కష్టమైన చదువే. డిప్రెషన్‌లోంచి బయటకు వచ్చి సబ్జెక్టును మనసుకు ఎక్కించుకుని చదవడానికి నాకు చాలా సమయమే పట్టేది. ఎలాగైతేనేం 74 శాతం మార్కులతో గట్టెక్కా. వైద్య విద్యలో పీజీ చేస్తే నా లక్ష్యం నెరవేరుతుంది. అందుకే పీజీ ప్రవేశ పరీక్ష నీట్ రాయదల్చుకున్నా. అందుకోసం గతేడాది ఏప్రిల్ నుంచి కసరత్తు మొదలుపెట్టా. ఏడు నెలల పాటు శిక్షణ తీసుకున్నా. ఆ తరవాత హైదరాబాద్‌లో ఉండే చదవడం మొదలుపెట్టా. దాదాపు రోజుకు పదిగంటలకు పైనే కష్టపడేదాన్ని. ఉదయం తొమ్మిదికి కూర్చుంటే రాత్రి ఒంటి గంట వరకూ చదువుతూనే ఉండేదాన్ని. మధ్య మధ్యలో విరామం తీసుకునేదాన్ని అనుకోండి. జనవరిలో పరీక్ష జరిగింది. రెండు వారాల క్రితం ఫలితాలను స్కోరు రూపంలో తెలిపారు. ఫిబ్రవరి 15న ర్యాంకులకు సంబంధించి సమాచారం ఇచ్చారు. అప్పుడు తెలిసింది రెండు తెలుగు రాష్ట్రాల్లో మొదటి స్థానం.. జాతీయ స్థాయిలో పదహారో ర్యాంకు అని. నేను పరీక్ష రాసింది తెలంగాణ నుంచి కాబట్టి ఈ విజయం రెండు రాష్ట్రాలది. నాకు చాలా గర్వంగా ఉంది. ఇక నాకు దిల్లీలో చదువుకునే అవకాశం లభిస్తుందనుకుంటున్నా. జనరల్ మెడిసిన్ లేదా రేడియాలజీ సబ్జెక్టుగా తీసుకుని చదవాలనుకుంటున్నా. ఇప్పుడు నా బాధ ఒకటే... ఎంత సాధించినా చూడ్డానికి నాన్న లేరు కదా!

- మానెం శ్రీనివాసరావు, ఈనాడు డిజిటల్ ఒంగోలు

నీళ్లపై 'సైకిల్' ప్రయాణం

వెరైటీ

నీళ్లపై తిరిగే కార్లు, బస్సులు చూశాం. సముద్రాలు, నదులపై దిగే విమానాల గురించి విన్నాం. మరి వీటిల్లో ప్రయాణించాలంటే ఖర్చు చాలా ఎక్కువ. తక్కువ ఖర్చుతో అందరికీ అందుబాటులో ఉండి... నీటిపై నడిచే సైకిల్ ఉంటే ఎంత బాగుంటుంది. హాయిగా చెరువులు, కాలువలు దాటేయొచ్చు. మరి అలాంటి ఆలోచనతోనే ముందుకొచ్చాడో యువకుడు ఫ్రాంకో డార్క్. విద్యార్థులు రోజూ పాఠశాలకు వెళ్లడానికి చెరువులు, కాలువలు దాటాలంటే ఎంత కష్టం? తమ దేశంలో ఇలాంటి పరిస్థితులను గమనించిన ఘనాలోని టాక్‌రాడికి చెందిన ఫ్రాంకో నీటిపై నడిచే సైకిల్‌ను తయారు చేశాడు. 6 నెలలు కష్టపడి రూ.6500 వ్యయం చేసి దీన్ని రూపొందించాడు. బెండ్లు, అల్యూమినియం, చెక్క ఉపయోగించాడు. బెండ్లు సైకిల్‌ను నీటిపై తేలేలా చేస్తే.... రిమ్ముకు ఉండే తెడ్డులాంటి ప్రొపెల్లర్లు వాహనాన్ని ముందుకు కదిలేలా చేస్తాయి. చెరువులు, కుంటలు, కాలువలు ఎదురైనా ఈ సైకిల్ తొక్కుకుంటూ అవతలి గట్టుకు చేరుకోవచ్చు. దీన్ని ఇంకొంచెం మెరుగుపరచాల్సి ఉందని, ఆర్థిక పరిస్థితులు అనుకూలిస్తే... ఇలాంటి సైకిళ్లను మా దేశంలో కష్టపడుతున్న విద్యార్థులందరికీ అందిస్తానని చెబుతున్నాడు ఫ్రాంకో డార్క్. దుస్తులు, పుస్తకాలు మోసుకుంటూ... నీళ్లలో తడుచుకుంటూ ప్రమాదకర పరిస్థితుల మధ్య బడికి వెళ్లే మన దేశంలోని పిల్లలకూ ఇది ఎంతో ఉపయోగం కదూ!







వీరికి సగటు మనిషే ప్రేరణ!

కాలేజీ చదువుల్లో... కార్పొరేటు జాబుల్లో... కుర్రోళ్లకు ఖాళీ సమయం దొరికితే ఏం చేస్తారు? హాయిగా ఐమ్యాక్స్‌కో... గ్రూపుగా హ్యాంగ్ అవుట్స్‌కో వెళ్లడం సహజం! కానీ, ఈ యువకులు అలా కాదు!

పదేళ్లుగా శ్మశానంలో పని చేస్తున్న మహిళలను కలుస్తారు.. రోడ్డు పక్కన బొండాలు అమ్మే తాతతో ముచ్చటిస్తారు... సంద్రంలో చేపలు పట్టే జాలర్లతో అల్లరి చేస్తారు... ఇలా చుట్టూ ఉన్న కామన్ మ్యాన్‌తో దోస్తీ కడతారు.. వారి జీవితాల్లోని ప్రేరణ గ్రహిస్తారు... వారినో సెలబ్రిటీలుగా ప్రపంచానికి పరిచయం చేస్తారు! అయితే, ఏంటి? మేమూ రోజూ చాలా మందిని చూస్తాం అంటారా? మీరు చూసే కోణం వేరు... వీరి కథలు వేరు!!

మరి, 'స్టోరీస్ ఆఫ్ కామన్ మ్యాన్' వెనకున్న స్టోరీని తెలుసుకుంటే... మీరూ భాగస్వాములవ్వొచ్చు!!

శక్తిస్వరూప్...

తాత చేతిలో కొడవలి వణుకుతోంది. అయినా బొండం కొట్టడంలో పట్టుపోలేదు. ముడతల్లో మునిగిన కళ్లలో... మునిపంటి బిగువులో నాకేదో హోప్ కనిపించింది. పుస్తకాల్లో... ప్రముఖుల వ్యాసాల్లో దొరకని 'లైఫ్‌కిక్' ఆ క్షణం దొరికింది. తాత వణికిన చేతులే నా చేత 'స్టోరీస్ ఆఫ్‌కా మన్‌మ్యాన్' రాసేలా చేశాయి. ఎంటెక్ చేశా. మొదట్లో వికీపీడియాకి రాసేవాడిని. పాశ్చాత్య పోకడలకు అతీతంగా ఈ ప్రయత్నం చేశా. దీనికి నాన్న రఘునాథ్ ప్రోత్సాహం మరువలేనిది. నేను ప్రజా సేవకుడిగా మారాలనే సంకల్పం నాన్న పెంపకం నుంచి పుట్టిందే.

ఇష్టం... సగటు మనుషులు

లక్ష్యం... సివిల్స్‌లో విజయం

- కాయా కష్టం చేసి కొడుకుని ఇంజినీరింగ్ జాయిన్ చేస్తారు తల్లిదండ్రులు. ఉన్నత చదువులతో ఉద్ధరిస్తాడనుకుంటే ఒత్తిడిని తట్టుకోలేకపోతున్నానంటూ ఉరేసుకుని చనిపోవడం...
- ఇంట్లో నాన్న ఎన్ని సార్లు తిట్టినా పట్టించుకోని కొలువు చేసే కుర్రకారు. ఆఫీస్‌లో బాస్ తిట్టాడని బెంగపెట్టుకోవడం... తెగ బాధపడిపోవడం...

ఇలా చిన్న చిన్న కారణాలతోనే జీవితాన్ని అంధకారం చేసుకునే వారికి కామన్‌మ్యాన్ జీవితం ఓ పాఠం అవ్వాలని భావించారో ఇద్దరు మిత్రులు... శక్తి స్వరూప్, జాయ్ సోలామాన్. ఎంటెక్ చదువులు ముగించుకుని కొలువుల్లో కొనసాగుతూ నెట్టింట్లో కలిశారు. ఇద్దరి నేపథ్యాలు, లక్ష్యాలు వేరు. కానీ, ఆలోచనలు కలిశాయి. స్వరూప్‌కొచ్చిన ఆలోచనకి జాయ్ తోడయ్యాడు. మరో ఇద్దరు మిత్రులు విహారి, విజయ్‌లు సాంకేతిక సహకారం ఇవ్వడంతో బ్లాగుల్లో మొదలైన ప్రయత్నం ఏడాది కాలంలో వెబ్‌సైట్ నుంచి మొబైల్ ఆప్ వరకూ చేరింది. సోషల్ మీడియాలో వైరల్ అవుతూ ఇతర రాష్ట్రాల విద్యార్థులకూ ఈ 'కామన్‌మ్యాన్' కథలు దగ్గరయ్యాయి. బెంగళూరు నుంచి కృతిక పరప్పా, చెన్నై నుంచి అమ్రిత వర్షిణి, కేరళ నుంచి కృష్ణ కోపిక, పుదుచ్చేరి నుంచి లక్ష్మీ బాలన్.. పలు రాష్ట్రాల నుంచి సగటు మనిషి కథల్ని ప్రపంచానికి చెబుతున్నారు. దాతల నుంచి విరాళాలు సేకరించి అర్హులైనవారికి సాయం అందిస్తూ ఆర్థిక స్థితిని మెరుగుపరుస్తున్నారు. పలు స్వచ్ఛంద సంస్థలు ముందుకొచ్చి సాయం అందిస్తున్నాయి కూడా. వీరి ప్రయాణానికి కొందరు పెద్దలు, ప్రముఖులు ప్రోత్సాహం అందించారు. మైక్రోసాఫ్ట్ సంస్థ యువ పారిశ్రామికవేత్తల్ని ప్రోత్సహించేందుకు నెలకొల్పిన 'బిజ్‌స్పార్క్'ని మెప్పించి సుమారు రూ.3 లక్షల విలువ చేసే అప్లికేషన్ సాఫ్ట్‌వేర్ సపోర్ట్‌ను ఉచితంగా పొందారు.

జాయ్ సోలామాన్

సముద్రం వారికున్న ఏకైక హోప్. ఆటుపోట్ల మధ్య ఒడిసిపట్టి వల విసరడమే తెలుసు వారికి. చేపలెన్ని పడినా ఏ పూటకాపూటే ఆదాయం... ఖర్చు సమం చేస్తారు. ఈ రోజే మనదనే జీవిత సత్యం వారి మాటల్లో చూశా. సోషల్ మీడియా సందడే తెలిసిన నాకు సముద్రపు హోరు లాంటి వారి హుషారులో ఏదో కిక్కుందనిపించింది. ఎంటెక్ చదివా. వ్యాసాలు రాయడం నాకో హాబీ. నేను వృత్తి పరంగా మ్యూజిక్ డైరెక్టర్‌ని. ఇంటర్నేషనల్ స్కూల్‌లో మ్యూజిక్ టీచర్‌గా పని చేస్తున్నా. ప్రత్యేక మ్యూజిక్ ఆల్బమ్స్ చేస్తున్నా. కొన్ని షార్ట్‌ఫిల్మ్‌లకు మ్యూజిక్ అందించా. అలాగే, 'కామన్‌మ్యాన్ స్టోరీస్'కి సంబంధించిన పరిచయ వీడియోకి నేనే మ్యూజిక్ చేశా.

ఇష్టం... మ్యూజిక్, ఫొటోగ్రఫీ, రైటింగ్

లక్ష్యం... మ్యూజిక్ డైరెక్టర్



దేశ వ్యాప్తంగా...

తెలుగు రాష్ట్రాల్లోనే కాకుండా దేశంలోని 20 రాష్ట్రాల్లో 18 మందికి పైనే కామన్‌మ్యాన్ కథల్ని రాస్తున్నారు. అందరూ సోషల్ వేదికల నుంచి స్వచ్ఛందంగా ముందుకొచ్చినవారే. వారాంతంలో ఒకటి లేదా రెండు చొప్పున ఇప్పటికి వెబ్‌సైట్, మొబైల్ ఆప్‌లో 79 కామన్‌మ్యాన్ స్టోరీలను పబ్లిష్ చేశారు. ఇతర రాష్ట్రాల్లో విద్యార్థుల్ని ప్రోత్సహించేలా ఇంటర్న్‌షిప్‌లు చేస్తున్నారు. ఈ మధ్యే 'ఐఐటీ జోధ్‌పూర్ పరివర్తన్ క్లబ్'తో జట్టుకట్టి కామన్‌మ్యాన్‌కి కథల్ని పెంచేందుకు సిద్ధం అవుతున్నారు. మొత్తంగా 22 మంది బృందంగా కలిసి పని చేస్తూ సగటు మనిషిలోని సక్సెస్ ఫార్ములాని చెబుతున్నారు. ముంబయికి చెందిన ఆసరా స్వచ్ఛంద సంస్థ కామన్‌మ్యాన్ కథల్ని తీసుకుని మానసిక ఒత్తిడితో ఉన్నవారికి చూపి ఉపశమనం కలిగిస్తున్నారు. విద్యార్థుల్లో రచనా నైపుణ్యాన్ని పెంపొందించేలా 'లిటరరీ ఫెస్ట్'లను నిర్వహిస్తున్నారు. 'కామన్ స్టోరీస్' పేరుతో పుస్తకాన్ని అందుబాటులో ఉంచారు. అమెజాన్ నుంచి ఈ-పుస్తకాన్ని డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

వెబ్‌సైట్: http://storiesofcommonman.in





తనకోసం తాను ఆలోచించటం సహజం. ఇతరులకోసం ఆలోచించటానికి ఉదాత్తగుణముండాలి.

ఈ కోవలోకి చెందిన కుర్రాడు కార్తీక్ నరాలశెట్టి. రక్తం ఇస్తే ఒకరి ప్రాణం నిలబడుతుంది. దాతల నుంచి రక్తం ఇప్పించగలిగితే ఎంతో మంది ప్రాణాలు నిలుస్తాయని నమ్మాడు. ఎందరి మధ్యో 'రక్త' సంబంధాలు ఏర్పరుస్తున్నాడు ఈ గుంటూరు జిల్లా వేటపాలెం యువకుడు. రెండుసార్లు ఫోర్బ్స్ మ్యాగజైన్ సూపర్ 30 జాబితాలో అంకుర పారిశ్రామిక వేత్తగా అవతరించిన కార్తీక్ ఎందరికో 'ప్రాణ' మిత్రుడయ్యాడు.

నెట్టింట్లో... 'ప్రాణ' మిత్రుడు

అది 2011. బెంగళూరు. 'మా అమ్మాయికి రక్తానికి సంబంధించిన జబ్బు ఉంది. నెలకు 30 మంది రక్తదాతలు కావాలి' ఓ ఆంగ్ల దిన పత్రికలో వచ్చిన వార్త తన మనసును కుదిపేసింది. ఆలోచింపజేసింది. పది మంది స్నేహితులకు ఫోన్ చేశాడు. ఐదుగురు స్పందించారు. ఇంకా పాతికమంది రక్తదాతలు ఎక్కడ దొరుకుతారో తెలియలేదు. చాలా మధన పడ్డాడు. ఇలా ప్రతిరోజూ ఎంత మందికి... ఎన్ని చోట్ల... ఎంత రక్తం అవసరముందో? ఎన్ని ప్రాణాలు రక్తదాతల కోసం ఎదురుచూస్తున్నాయో? అనే ప్రశ్నలు మెదడును చుట్టుముట్టాయి. ప్రశ్నల నుంచే పరిష్కారాలు పుట్టుకొస్తాయి. అప్పుడప్పుడే ఫేస్‌బుక్ ప్రాచుర్యం పొందుతోంది. ఫేస్‌బుక్ చూస్తుండగా మెరిసిందే ఈ పరిష్కారం. ఇందులో శోధించి రక్తదాతలను వెతకొచ్చు అనిపించింది. గ్రూపుల వారీగా ఏ, బీ, ఏబీ, ఓ బ్లడ్‌గ్రూపులతో ఫేస్‌బుక్ ఖాతాలు తెరిచాడు. వందల సంఖ్యలో స్పందించారు. సభ్యులయ్యారు. ఆ పేజీల్లో రక్తం అవసరమని ఎవరైనా మెసేజ్ పెడితే ఎంతో మంది ముందుకొచ్చేవారు. ఇలా బెంగళూరులో అనేక మందికి రక్తం లభించడం సులువైంది.

ఆలోచన ఆకాశమంతైందిలా...

బెంగళూరు నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి రక్తం కోసం ఫేస్‌బుక్ గ్రూపుల్లో వినతులు(రిక్వెస్టులు) వచ్చాయి. శ్రీలంక, బంగ్లాదేశ్, బ్రెజిల్.. లాంటి దేశాలనుంచీ అవే సంక్షిప్త సందేశాలు. దీంతో సమస్య బెంగళూరులోనే కాదు ప్రతిచోటా ఉందని తెలుసుకున్నాడు. ఈ లోపే అతని ఆలోచనకు గుర్తింపు వచ్చింది. ఓ అవార్డూ దక్కింది. ఈ ఆలోచనను మరింత విస్తరించాలనే ఉద్దేశంతో అమెరికా వెళ్లాడు కార్తీక్.. రక్తదాతలను ఒక వేదిక మీదికి తెచ్చే సంస్థను నెలకొల్పాలనే ఆశయాన్ని స్నేహితులకు వివరించాడు. వాళ్లు ప్రోత్సహించారు. అలా 2011లో 'సోషల్ బ్లడ్.ఇంక్' పేరుతో ఓ స్టార్టప్‌ను స్థాపించాడు.

మనసుంటే మార్గం..

తొలుత 'సోషల్ బ్లడ్' పేరుతో డెస్క్‌టాప్ యాప్‌ను క్రియేట్ చేశాడు. ఆ తర్వాత ఆసుపత్రుల వెంట తిరిగాడు. 'ఎవరికైనా రక్తం కావాలంటే.. మా యాప్‌లో రిక్వెస్ట్ చేయవచ్చ'ని అడిగాడు. చాలా వరకు ఆసుపత్రుల్లో రక్తం వ్యాపారమయం కావటంతో వాళ్లు పెద్దగా స్పందించలేదు. కొందరైతే ఆలోచన బావుందని పిలిపించేవారు. ప్రజెంటేషన్ విన్నాక.. 'చూద్దాం' అని చెప్పేవారు. కొందరైతే సొంతంగా ఇలాంటి ప్రోగ్రాం చేయడానికి ప్రయత్నించారు. కార్తీక్ పక్కనుండే డెవలపర్స్‌నూ ఆకర్షించారు. కార్తీక్ ఎక్కడా బెదరలేదు. ఎందరో మనసున్న వాళ్ల కదలికతో బెంగళూరుతో పాటు హైదరాబాద్, ముంబై ప్రాంతాల్లో 'సోషల్‌బ్లడ్' జనంలోకి వెళ్లింది. తర్వాత మొబైల్ యాప్‌ను క్రియేట్ చేశాడు. నగరాల్లో యాప్ త్వరగా సేవలందించింది. హైదరాబాద్‌లోని యశోద ఆసుపత్రిలో.. ఓ మూడేళ్ల చిన్నారికి నాలుగు బాటిళ్ల రక్తం అవసరమని వైద్యులు చెప్పారు. ఆ చిన్నారి నాన్న సోషల్ బ్లడ్ యాప్‌లో రక్తం కావాలని రిక్వెస్ట్ చేశాడు. గంటలోపే ఆ చిన్నారికి రక్తం అందింది. 'నాలుగు బాటిళ్ల రక్తం సాయం చేయమని అడిగితే.. 150 మంది ఫోన్ చేసి రక్తం ఇస్తామన్నారు' అంటూ ఉద్వేగంతో ఫోన్ చేసి కార్తీక్‌కు కృతజ్ఞతలు చెప్పాడా తండ్రి. ఇలాంటిదే మరో సంఘటన మర్చిపోలేనంటారు. ఓ బంగ్లాదేశీ తన భార్యకు ప్రసవ సమయంలో రక్తం అవసరమైంది. తన చిన్నఫోన్‌లో సోషల్ బ్లడ్ యాప్‌లో రిక్వెస్ట్ పంపాడంతే. పదుల సంఖ్యలో ఫోన్స్ వచ్చాయతనికి. తన భార్య, పండంటి బిడ్డను చూసుకుని మురిసిపోయాడట. ఎల్లలు లేని సేవంటే ఇదేనేమో!



అదే మమ్మల్ని నడిపించింది

2013లో సేకరించిన ఫండ్ అయిపోయింది. ఆ సమయంలో నా భార్య జీతంలోంచి డబ్బులు తీసుకుని డెవలపర్స్‌కి జీతం ఇచ్చాను. "కొందరు కాల్ చేసి 'మీ వల్లే నా కూతురు బతికింది. మా నాన్నకు ప్రాణం పోశారు' అంటూ చెబుతారు. అలాంటి మాటలు విన్నప్పుడు ఎన్ని కష్టాలున్నా.. యాప్‌ను ఆపెయ్యకూడదని అనిపించేది. రక్తగ్రహీతల ఆనందమే మమ్మల్ని నడిపించేది. నా ఆలోచన దాదాపు నెరవేరినట్లే. ఇప్పటికే మన దేశంలో ఫేస్‌బుక్ బ్లడ్ డొనేషన్ సేవలకు ఊపిరిపోసింది. త్వరలో బంగ్లాదేశ్‌లో ఈ ఆప్షన్‌ను ప్రారంభించబోతోంది. ఆ తర్వాత బ్రెజిల్.. ఇలా అన్ని దేశాలకూ వెళ్తుంది. ప్రస్తుతం మేం ట్విట్టర్‌తో మనదేశంతో పాటు బ్రెజిల్‌లో బ్లడ్ డొనేషన్ ఆప్షన్‌ను లాంచ్ చేయటానికి మాట్లాడుతున్నాం.. 'సోషల్ బ్లడ్' అనే నా ఆలోచన విశ్వవ్యాప్తం కావటం కంటే ఆనందమేముంటుంది?'

– కార్తీక్ నరాలశెట్టి

ఫేస్‌బుక్ భాగస్వామ్యం

దీన్ని నిత్యం నడపాలంటే భవిష్యత్తులో నిధులు సరిపోకపోవచ్చు. డెవలపర్స్ ఇలాగే ఉంటారని నియమం లేదు. ఈ ఆలోచన రాగానే మళ్లీ పరిష్కారం కావాల్సి వచ్చింది. ఫేస్‌బుక్ ఒక్కటే శరణ్యమనిపించింది. ఈ పెద్ద ప్లాట్‌ఫామ్‌ను ఉపయోగించుకుంటే ఎవరి అవసరం లేకుండా ఈ రక్త సేవ కొనసాగుతుందనిపించింది. ఈ ప్రయత్నంలో భాగంగా భారత్‌లో ఫేస్‌బుక్‌ను మరింత దూకుడుగా జనంలోకి తీసుకెళ్లాలంటే ఏం చేయాలో చెప్పమని ఆ సంస్థ వ్యవస్థాపకులు జుకర్‌బర్గ్ కార్తీక్‌కి ఫోన్ చేశారు. అరగంట మాట్లాడారు. ఆ తర్వాత 2015లో బార్సిలోనాలో జరిగిన వరల్డ్ మొబైల్ కాన్ఫరెన్స్‌కి ఆహ్వానించారు. అక్కడ జుకెన్‌బర్గ్‌తో పాటు ఆ సంస్థ సీనియర్లతో మాట్లాడే అవకాశం వచ్చింది. 'బ్లడ్ డొనేషన్ ఆప్షన్‌ను భారత దేశానికి ఎప్పుడు తీసుకొస్తారు?' అని వారిని ప్రశ్నించాడు. బ్లడ్ డొనేషన్‌కి సంబంధించిన పలు సమస్యలను ప్రస్తావించాడు. ఆ తర్వాత మొత్తానికి 2017 సెప్టెంబర్‌లో 'బ్లడ్ డొనేషన్' ఆప్షన్‌ను ఫేస్‌బుక్ తీసుకొచ్చింది. బ్లడ్ కావాలన్నా, ఇవ్వాలనుకున్నా ఆండ్రాయిడ్ యాప్‌లో ఫేస్‌బుక్ వాడే యూజర్లు ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ తోడ్పాటుతో సులభంగా ఈ ప్రక్రియను పూర్తి చేయవచ్చు.

మూడు లక్షలమందికి..

ఆండ్రాయిడ్ యూజర్లు socialblood ఆప్‌ని గూగుల్ ప్లే నుంచి డౌన్‌లోడ్ చేయాలి. తెరవగానే లొకేషన్ డివైజ్ చెక్ చేసుకుంటుంది. ఆ తర్వాత ఫోన్ నంబర్‌తో లాగిన్ అడుగుతుంది. ఫోన్ నంబర్ టైప్ చేశాక ఓటీపీ వస్తుంది. దాన్ని టైప్ చేస్తే సరి సోషల్‌బ్లడ్ యాప్ డౌన్‌లోడ్ పూర్తి అయినట్లే. యాప్ తెరవగానే కావాల్సిన బ్లడ్‌ను సెలక్ట్ చేసుకోవాలి. ఎంటర్ లొకేషన్‌లో స్థలాన్ని టైప్ చేస్తే సరి.. ఆ ప్రదేశంలోని బ్లడ్ డోనర్ల నంబర్లు కనిపిస్తాయి. హైదరాబాద్, విజయవాడ, బెంగుళూరు, ముంబయి, చెన్నై..లాంటి నగరాల్లో ఈ యాప్‌లో రిజిస్టర్ అయిన వారి సంఖ్య ఎక్కువే. మీరూ సభ్యులై రక్తదాతలుగా మారొచ్చు. ఇప్పటివరకూ మన దేశంలో ఈ యాప్ ద్వారా మెట్రో నగరాల్లోనే మూడు లక్షల మంది రక్తగ్రహీతలున్నారు.



తనే సోల్‌మేట్ అవుతుందా?


మనసులో మాట

ధర్మవరం రైల్వేస్టేషన్ కిక్కిరిసి ఉంది. రైలు వస్తున్నట్లు అనౌన్స్‌మెంట్ ఇచ్చారు. గుంతకల్లు నుంచి తిరుపతికి వెళ్లే ప్యాసింజర్ రైలు అది. నేను ధర్మవరంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదువుతున్నా. వారానికి ఒకసారి ముదిగుబ్బకు వెళ్లేవాణ్ణి. అది నా సొంతూరు. నాలాగే ధర్మవరం నుంచి కదిరికి వెళ్లొచ్చేది ఒక అమ్మాయి. పేరు షక్రుమా. పెద్ద కళ్లు. చెవులకు ఊగే జుంకీలు. చేతులకు వెడల్పాటి రబ్బరు గాజులు. భుజాన మట్టికలరు హ్యాండ్‌బ్యాగు. నవ్వుముఖం ఆమెది. ఆమెను చూసిన అరగంటలో ఇరవైఐదు నిమిషాలు ముఖం మీద చెరగని చిరునవ్వు కనిపించేది. నేనొక రోజు రైలు వస్తూనే.. కిటికీలో చేతిరుమాలు వేశాను. అదే సీట్లో ఆమె కూర్చుంది. నావైపు చూసి నవ్వింది. పరిచయం అయ్యింది. చాలా క్లోజ్ అయ్యాం. ఒక రోజు నాతో ఏదో చెప్పాలని టెన్షన్ పడుతోంది. 'నీళ్లు తాగుతారా' అంటూ బాటిల్ చేతికి ఇచ్చింది. మిగిలిన సగం బాటిల్ నీళ్లు ఆమె తాగింది. ఖాళీ బాటిల్‌ను కిటికీలోంచి విసిరేసింది. అప్పటికి చిన్నేకుంటపల్లి రైల్వేస్టేషన్ దగ్గరుంది రైలు. 'మీ ఫోన్ నెంబర్ ఇస్తారా' అనడిగాను. కనుగుడ్లు ఓ వైపునకు తిప్పి సొట్ట నవ్వు నవ్వింది. ముదిగుబ్బలో రైలు దిగేప్పుడు 'నీకు నా ఫోన్ నెంబర్ కావాలంటే.. అక్కడ పడేసిన ఖాళీ వాటర్ బాటిల్ మీద రాశాను. కావాలంటే వెళ్లి వెతుక్కో' అంది. ఆ కొంటెతనంలో నా పట్ల చిన్న ఇష్టం ఉందని తెలిసింది. కళ్లింతలు చేసుకుని వెళుతున్న రైలు వంకే చూస్తూ ఉండిపోయాను. మరుసటి రోజు ఇంకో రైలుకు వెళ్లి.. చిన్నేకుంటపల్లి రైల్వేస్టేషన్‌లో దిగాను. ఖాళీ ప్లాస్టిక్ బాటిళ్లన్నీ వెతుక్కుంటూ పోయాను. ఒక్కటీ దొరకలేదు. రైల్వేలైన్ కంకర మీద ఒక బాటిల్ పడుంది. దాన్ని తీసుకుని తిప్పి తిప్పి చూశా. బాల్‌పెన్‌తో ఒక చోట.. 'ఐ లవ్ యు రైల్‌మేట్' అని రాసుంది. తను చెప్పినట్లు ఫోన్ నెంబర్ లేదు. కానీ, మనసు లోపల మాత్రం ఇది ఆ అమ్మాయి రాసిందేనన్న నమ్మకం బలంగా ఉంది. మరో ఆదివారం రైలు ఎక్కినప్పుడు అదే బాటిల్‌లో నీళ్లు పోసుకుని వెళ్లాను. 'తాగుతారా..' అంటూ ఇచ్చాను. బాటిల్‌ను చేతికి తీసుకున్న ఆమె.. దాని వంకే తెగ చూసింది. 'ఏంటి ఇలా రాసుకున్నారు' అంది. 'అబ్బే నేను కాదు. నా రైల్‌మేట్ రాసింది..' అన్నాను నవ్వుతూ. తల అటూఇటూ ఊపుతూ.. 'మీరు చాలా తెలివైన వాళ్లు' అంది. ఇద్దరం ఒకేసారి ఫక్కున నవ్వాం. మా ఇద్దరి కళ్లలో ఒకే భావం. ఎన్నో ఏళ్ల నుంచి ఒకరి కోసం మరొకరం పుట్టామేమోనన్న ఫీలింగ్. నాకెంతో మంది క్లాస్‌మేట్‌లు ఉన్నారు. ఫ్రెండ్‌షిప్‌లో సోల్‌మేట్స్ ఉన్నారు. కానీ, మనసులో బెర్తును కన్‌ఫార్మ్ చేసుకున్న రైల్‌మేట్ మాత్రం ఎవరూ లేరు. మా రైలు ప్రయాణం ఇప్పటికైతే ఒక బోగీకి మరో బోగీ పెనవేసుకున్నంత బలంగా ముడిపడింది. ఇంట్లో చెబితే మతాంతర వివాహానికి ఒప్పుకుంటారా? మా ప్రేమ ప్రయాణం ఏ స్టేషన్‌లో ఆగుతుంది? రెడ్ సిగ్నల్ పడుతుందా లేదంటే గ్రీన్ సిగ్నల్‌తో సుఖాంతం అవుతుందా? ఏమీ తెలీదు. అంత వరకు ఈ రైల్‌మేట్‌తోనే నా ప్రయాణం.

– ఎం.నారాయణస్వామి, ముదిగుబ్బ, అనంతపురం జిల్లా



పంచుకుందాం



చీమావతార్

మొండి చీమ–	adamANT
పొగరబోతుచీమ–	arrogANT
వణికించే చీమ–	vibrANT
పుడ్డు పెట్టే చీమ–	restaurANT
బిజినెస్ చీమ–	merchANT
ముఖ్యమైన చీమ–	significANT
ఓపికున్న చీమ–	tolerANT
సరైన చీమ–	relevANT



– అశోక్ కుమార్, హైదరాబాద్